ఈనాడు

విజయవాడ 31-1-2026 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 171
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

87 గ్రూప్-1 పోస్టులకు ఎంపిక జాబితా విడుదల

మరో రెండు పోస్టుల రిజర్వు

ఈనాడు, అమరావతి: గ్రూప్-1 అభ్యర్థుల ఎంపిక జాబితాను ఎట్టకేలకు ఏపీపీఎస్సీ విడుదల చేసింది. హైకోర్టులోని కేసులకు అడ్డంకులు తొలగడంతో శుక్రవారం సాయంత్రం ఎంపిక జాబితాను ప్రకటించింది. మొత్తం 89 పోస్టులకు గాను 87 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక జాబితాను విడుదల చేసింది. క్రీడా కోటాకు సంబంధించి రెండు పోస్టులను రిజర్వు చేయాలని హైకోర్టు ఆదేశించిన (మిగతా 2లో)

రూ.లక్ష క్షీణించిన కిలో వెండి

రూ.21,860 తగ్గిన 10 గ్రాముల బంగారం

2 లో


అనిల్‌కుమార్ సింఘాల్, ధర్మారెడ్డి, బాలాజీలపై

క్రమశిక్షణ చర్యలు తీసుకోండి

ప్రభుత్వానికి లేఖ రాసిన సిట్

సింఘాల్ బదిలీ!

నేడో, రేపో ఉత్తర్వులు



సింఘాల్ ధర్మారెడ్డి బాలాజీ

ఈనాడు, అమరావతి : వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారమై అప్పటి, ఇప్పటి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అప్పటి అదనపు ఈవో ధర్మారెడ్డి, ఫైనాన్షియల్ అడ్వైజర్ అండ్ చీఫ్ ఎకౌంట్స్ ఆఫీసర్ (ఎఫ్ఏ అండ్ సీఏ) బాలాజీలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సిట్ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌ను బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. శని, ఆదివారాల్లో ఉత్తర్వులు వెలువడనున్నాయి. కల్తీ నెయ్యి కేసులో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన సిట్ తాజాగా ప్రభుత్వానికి 14 పేజీల లేఖ రాసింది. అందులోని చివరి పేరాలో కల్తీ నెయ్యి సరఫరాకు సంబంధించి అప్పట్లో ఉన్నతస్థానాల్లో ఉన్న ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. నెయ్యి సరఫరాకు ఉన్న నాణ్యతా ప్రమాణాలను బలహీనపరిచేలా వ్యవహరించారని, నిబంధనల తయారీలో మనసు పెట్టకుండా పనిచేశారని పేర్కొంది. దీనివల్ల నెయ్యి నాణ్యతలోనూ రాజీ జరిగిందని (కాంప్రమైజ్ ఆఫ్ క్వాలిటీ ఆఫ్ ఘీ) తెలిపింది.

కఠిన నిబంధనల్ని సవరించి..

తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యి సరఫరాకు 2019 ముందున్న కఠిన నిబంధనల్ని.. వైకాపా అధికారంలోకి రాగానే మార్చేశారు. టెండర్లలో పాల్గొనే డెయిరీలు పాలు సేకరించాల్సిన అవసరం లేదని, వెన్న సేకరణ, నెయ్యి ఉత్పత్తి సామర్థ్యంతో పనిలేదని సడలించారు. మూడేళ్లపాటు కార్యకలాపాలు నిర్వహించాలనే నిబంధనకు మినహాయింపు ఇచ్చారు. టర్నోవర్ మొత్తాన్ని రూ.250కోట్ల నుంచి రూ.150కోట్లకు తగ్గించారు. ఈ సడలింపుల వల్లే 2019 నుంచి 2024 వరకు 68.17లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా అయింది.

కల్తీ నెయ్యి సరఫరా కేసులో రంగంలోకి ఈడీ

హవాలా చెల్లింపులు, మనీ లాండరింగ్‌పై దృష్టి

సిట్ అధికారుల నుంచి కేసు వివరాలు సేకరణ

ఒకట్రెండు రోజుల్లో ఈసీఐఆర్ నమోదు

3 లో

అరకొర సౌకర్యాలున్న ల్యాబ్ నివేదికే..


సిట్‌కు ప్రామాణికమా?

- పంది కొవ్వు 10% కంటే తక్కువ కలిస్తే గుర్తించలేమని ఎన్‌డీఆర్ఐ ల్యాబ్ స్పష్టీకరణ
- గొడ్డు కొవ్వు, చేపనూనె కల్తీని నిర్ధారించే పరీక్షలు తమ ల్యాబ్‌లో లేవని వెల్లడి
- పంది కొవ్వు, గొడ్డు కొవ్వు, చేప నూనె కలిసి ఉంటాయని ఎన్‌డీడీబీ అనుమానం
- మరిన్ని ల్యాబ్‌లలో అత్యాధునిక విధానాల్లో పరీక్షలు ఎందుకు చేయించలేదు?



ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి వినియోగిస్తున్న నెయ్యిలో కల్తీ జరిగిందని దేశంలోని అత్యంత ప్రామాణిక ల్యాబ్ చాలా స్పష్టంగా పేర్కొంది. దానిలో పంది కొవ్వు, గొడ్డు కొవ్వు, చేప నూనె వంటివి కలిసి ఉండొచ్చని అనుమానం వ్యక్తంచేసింది. సిట్.. ఆ ల్యాబ్ చెప్పిన విషయాల్ని పరిగణనలోకి తీసుకుని లోతైన దర్యాప్తు చేయాల్సింది పోయి, ఇప్పటి వరకు థర్డ్ పార్టీ వాలిడేషనే జరగని, అన్నిరకాల పరీక్షలు చేసే సదుపాయాల్లేని మరో ల్యాబ్ ఇచ్చిన నివేదికను ప్రామాణికంగా తీసుకుంది. ఆ ల్యాబ్ నివేదిక ఆధారంగా ఆ నెయ్యిలో పంది కొవ్వు, గొడ్డు కొవ్వు, చేప నూనె కలిసే అవకాశాలు చాలా తక్కువని తేల్చేయడం విస్మయపరుస్తోంది. ఆ నెయ్యిలో గొడ్డు కొవ్వు, చేప నూనె కలిశాయో లేదో పరీక్షించే వ్యవస్థ తమకు లేదని, తాము చేసిన పీసీఆర్ పరీక్షా విధానంలో నెయ్యిలో పది శాతం లేదా అంతకంటే ఎక్కువ పంది కొవ్వు కలిస్తేనే గుర్తించగలమని ఆ ల్యాబ్ స్పష్టంగా పేర్కొన్నా.. సిట్ దాన్నే ప్రామాణికంగా తీసుకుంది. దీన్నిబట్టే సిట్ దర్యాప్తు లోపభూయిష్టంగా ఉందన్న విమర్శలు వస్తున్నాయి. నెయ్యిలో పంది కొవ్వు, గొడ్డు కొవ్వు వంటివి ఒక్క శాతం కంటే తక్కువ కలిసినా గుర్తించే అత్యాధునిక పరీక్షా విధానాలు (మిగతా 3లో)

సమాజానికి కొంత తిరిగిచ్చినప్పుడే నిజమైన సంతృప్తి



- జన్మభూమికి ప్రవాసాంధ్రుల సేవలు స్ఫూర్తిదాయకం
- పేదలకు నాణ్యమైన వైద్యసేవలే 'సంజీవని' లక్ష్యం
- జీజీహెచ్‌లో ఎంసీహెచ్ భవన ప్రారంభోత్సవంలో సీఎం

ఈనాడు, అమరావతి: 'చాలామంది సంపాదించిందంతా పిల్లలకే ఇవ్వాలనుకుంటారు. ఇవ్వాలి.. అదే సమయంలో కొంతభాగం సమాజానికి కేటాయించాలి. అందులో దొరికే సంతృప్తి మరెందులోనూ రాదు. జన్మభూమిని మరచిపోకుండా ప్రవాసాంధ్రులు చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం. అందుకు నిదర్శనమే జింకానా బృందం చేసిన కృషి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శుక్రవారం ఆయన గుంటూరు జీజీహెచ్‌లో (మిగతా 2లో)

ప్రభుత్వం చేసే మంచి ప్రజలకు చేరాలి

- విధుల్లో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవు
- ఉత్తరాంధ్ర జిల్లాల సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి స్పష్టీకరణ



విశాఖపట్నం(వన్‌టౌన్), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలకు మంచి చేయాలనే తపనతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, దానిని ప్రజలకు చేరువ చేసేలా అధికారులు చిత్తశుద్ధి, జవాబుదారీతనంతో బాధ్యతలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. శుక్రవారం ఆయన విశాఖ కలెక్టరేట్ భవనంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడారు. "విధుల్లో అలసత్వం వహించకుండా, అవినీతికి తావులేకుండా పంచాయతీరాజ్ (మిగతా 2లో)

బీసీల భవనాలన్నీ ఒకేచోట!

- అమరావతిలో జ్యోతిరావు ఫులే స్మృతి వనానికి అనుబంధంగా నిర్మాణం
- సీఎం ఆమోదించాక తుది నిర్ణయం

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో బీసీలకు సంబంధించిన కార్యాలయాలు, సమావేశ మందిరాలు, వినోద కేంద్రాలు, స్టడీ సర్కిల్ తదితర నిర్మాణాలన్నీ ఒకేచోట చేపట్టాలని బీసీ సంక్షేమశాఖ నిర్ణయించింది. ఇప్పటికే జ్యోతిరావు ఫులే స్మృతివనం అమరావతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించినందున దానికి అనుబంధంగా అక్కడే ఇవన్నీ అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు యోచిస్తున్నారు. కార్యాలయాలు, స్మృతివనం అనుబంధంగా ఉంటే.. పర్యవేక్షణ, నిర్వహణ మెరుగ్గా ఉంటుందని, వివిధ పనులపై రాజధానికి వచ్చే బీసీలకు అన్నిసేవలూ ఒకేచోట లభిస్తాయని భావిస్తున్నారు. వచ్చేనెల 4న బీసీ సంక్షేమ శాఖపై నిర్వహించే సమీక్షలో సీఎం చంద్రబాబు ముందు ఈ ప్రతిపాదన పెట్టనున్నారు. ముఖ్యమంత్రి సూచన మేరకు ముందుకెళ్లనున్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయి బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు రాజధానిలో 5 ఎకరాల స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరగా, ఇప్పుడు 10 ఎకరాలకు (మిగతా 2లో)



హంద్రీ-నీవా జలాలకు సారె సమర్పిస్తున్న సీఎం చంద్రబాబు, స్థానిక నేతలు

విద్యార్థులూ.. ఆవిష్కరణలపై దృష్టి పెట్టండి

- కుప్పం పర్యటనలో సీఎం చంద్రబాబు పిలుపు
- అగస్త్య విద్యాచల్ సందర్శన.. పలు ప్రారంభోత్సవాలు
- నేడు పింఛన్ల పంపిణీకి హాజరు

ఈనాడు, చిత్తూరు: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో గణనీయమైన మార్పులు రావాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. విద్యార్థులు ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ఆలోచన విధానాన్ని మెరుగు పరుచుకున్నప్పుడే ఎంచుకున్న రంగంలో రాణించవచ్చన్నారు. సొంత నియోజకవర్గం చిత్తూరు జిల్లా కుప్పంలో మూడు రోజుల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిరోజు శుక్రవారం గుడుపల్లెలోని అగస్త్య విద్యాచల్‌ను సందర్శించారు. ప్రాంగణంలో రూ.3 కోట్లతో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. లెర్నర్స్ ఆక్టివేషన్ ఫెసిలిటీ సెంటర్, ఒబెరాయ్ విజిటర్స్ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఆడిటోరియంలో విద్యార్థుల ముఖ్య భూమికగా అగస్త్య సంస్థ చేపడుతున్న కార్యక్రమాల వీడియోను వీక్షించారు. విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.



సీఎం చంద్రబాబుకు ఉన్నితో తయారుచేసిన బొకేను అందజేస్తున్న విద్యార్థులు బాలాజీ, కార్తిక

● కుప్పంలో హంద్రీ-నీవా జలాలతో నిండిన చెరువుకు సీఎం జలహారతి ఇచ్చారు. కంగుందిలో ‘హెరిటేజ్ విలేజ్- బౌల్డరింగ్ పార్కు’ను ప్రారంభించారు. పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన 32 హోంస్టేలు, 9 టెంట్ అకామిడేషన్లను పరిశీలించారు. పట్టణంలోని ‘స్వర్ణ నవ ఊహ కేంద్రం’ పేరుతో ఏర్పాటు చేసిన కో-వర్కింగ్ స్పేస్ కేంద్రం, ఆదిత్య బిర్లా నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు.

● శనివారం బెగ్గిలిపల్లె పంచాయతీలో సామాజిక పింఛన్లను చంద్రబాబు పంపిణీ చేయనున్నారు. 24 గంటల వ్యవధిలో 5555 ఈ-సైకిళ్లు పంపిణీ చేసిన సందర్భంగా ‘గిన్నిస్ వరల్డ్ రికార్డ్’ ధ్రువపత్రం అందించే కార్యక్రమంలోనూ పాల్గొంటారు. కుప్పంలో రూ.675.24 కోట్లతో ఏర్పాటయ్యే ఏడు నూతన పరిశ్రమలకు ఎంవోయూలు కుదుర్చుకుంటారు.

భావి భారతంపై యువత ఆలోచించాలి

‘అగస్త్య వ్యవస్థాపకుడు రామ్‌జీ రాఘవన్‌తో నాకు 25 ఏళ్లుగా పరిచయం ఉంది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించడానికి మంచి విజ్ఞాన కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చారు. శ్రీహరికోట సమీపంలో స్పేస్ సిటీ ఏర్పాటు చేస్తున్నాం. ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను నెలకొల్పాం. భావి భారతంపై యువత ఆలోచించాలి’ అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

● కంగుందిలో తొమ్మిదో తరగతి విద్యార్థి బాలాజీ, ఏడో తరగతి విద్యార్థిని కార్తిక ఉన్ని వస్తువులను ప్రదర్శించారు. యూట్యూబ్‌లో చూసి తయారీని నేర్చుకున్నట్లు సీఎంకు చెప్పారు. ఆ బొకేను చంద్రబాబుకు ఇవ్వగా.. ఆయన వాటి ధర ఎంత అని అడిగారు. మీకు ఉచితమని పిల్లలు చెప్పగా, ‘మామూలుగా ఎంతకు అమ్ముతావ్’ అని ప్రశ్నించారు. రూ.200 అని చెప్పగా, పిల్లలకు రూ.10 వేలు ఇవ్వాలని ముఖ్యమంత్రి తన సిబ్బందికి సూచించారు.

సమాజానికి కొంత తిరిగిచ్చినప్పుడే నిజమైన సంతృప్తి

(మొదటి పేజీ తరువాయి)

జింకానా బృందం సమకూర్చిన రూ.వంద కోట్లతో నిర్మించిన కాసూరి-జింకానా మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు.

మంచి మిగిలి ఉందని నిరూపించారు

‘సమాజంలో ఇంకా మంచి మిగిలి ఉందనడానికి మీరంతా ఉదాహరణ. చదువుకున్న కాలేజీని గుర్తు పెట్టుకుని 1981లోనే జింకానాను ఏర్పాటు చేసి, ఇంత పెద్ద ఎత్తున సాయం చేస్తున్నారు. రూ.వంద కోట్లతో మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని నిర్మించడం గొప్ప విషయం. మిమ్మల్ని అభినందిస్తున్నా. భవిష్యత్తులోనూ దాని నిర్వహణకు ఇబ్బందులు రాకూడదని కొంత సొమ్ము డిపాజిట్ చేయడం మరో గొప్ప విషయం. సరికొత్త ప్రభుత్వం మరో రూ.27 కోట్లు కేటాయించింది. గుంటూరులో మిలినియం బ్లాక్ విస్తరణకు రూ.16 కోట్లు, విశాఖ ఏయూ మెడికల్ కాలేజీ సెంటినరీ బ్లాక్‌కు రూ.60 కోట్లు, కాకినాడ ఆసుపత్రికి రూ.40 కోట్లు, కర్నూలు మెడికల్ కాలేజీకి రూ.25 కోట్లు లెక్కన అనేకమంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఖర్చు పెడుతున్నారు.

పేదల అభ్యున్నతి కోసమే పీ4

నేను జన్మభూమి కార్యక్రమానికి పిలుపు ఇచ్చినప్పుడు ఎంతోమంది ప్రవాసాంధ్రులు ముందుకొచ్చారు. పేదల అభ్యున్నతికి పీ4 తీసుకొచ్చా. 10.42 లక్షల మందిని 1.02 లక్షల మంది దత్తత తీసుకున్నారు.

జీఎంసీలో చదివిన 8 మందికి పద్మశ్రీలు

గుంటూరు వైద్య కళాశాలలో చదివిన వారిలో 8 మందిని పద్మశ్రీ పురస్కారం వరించింది. సీఎం అబీబుల్లా, సోమరాజు, జీఎస్‌రావు, నాయుడమ్మ, ప్రసాదరావు, నరేంద్రనాథ్, గోపీచంద్, గోపాలకృష్ణ గోఖలే ఆ జాబితాలో ఉండటం గొప్ప విషయం. చదువు అనేది



సీఎం చంద్రబాబుకు జ్ఞాపిక అందిస్తున్న జింకానా అధ్యక్షుడు రామకోటేశ్వరరావు, జింకానా బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఛైర్మన్ త్రిపురనేని రవికుమార్, డాక్టర్ గోపీచంద్

గేమ్ ఛేంజర్. సరైన సమయంలో ఒక వ్యక్తికి చెయ్యి అందించగలిగితే అతను దేనికి ఎలాంటి ఆస్తిగా మారతాడో మనం ఊహించలేం.

మేటి నగరంగా అమరావతి

అమరావతి నూతన గ్రీన్‌ఫీల్డ్ నగరంగా అవతరిస్తోందని కేంద్రప్రభుత్వం తన ఆర్థిక సర్వేలో స్పష్టం చేసింది. కొంతమంది రాజధానికి అంతభూమి ఎందుకు అంటున్నారు. వంద ఎకరాల్లో సచివాలయం కట్టేస్తే చాలని అంటున్నారు. జాతికి గుర్తింపు లభించాలన్నా, అన్ని ప్రాంతాలతో సమానంగా మనం ఉండాలన్నా అభివృద్ధి చెందాలి.

అమెరికాలో సిలికాన్ వ్యాలీ.. ఇండియాలో క్వాంటమ్ వ్యాలీ

ఈ 30 ఏళ్లలో ప్రపంచంలో ఎంతో అభివృద్ధి జరిగింది. అమెరికాలో సిలికాన్ వ్యాలీ ఉంది. ఇండియాలో ఏముందని అడిగే వారికి అమరావతిలో క్వాంటమ్‌వ్యాలీ ఉందన్నదే మన సమాధానం. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీకి శ్రీకారం చుడుతున్నాం. మరో పదేళ్లలో గుంటూరు సహా అమరావతి ప్రాంత రూపురేఖలు ఎలా మారతాయో మీరు చూస్తారు. గుంటూరు, మంగళగిరి, విజయవాడ కార్పొరేషన్లు కలిసిపోతాయి. 182 కిలోమీటర్ల మేర ఔటర్ రింగ్ రోడ్డు వస్తుంది. రెన్యువబుల్ ఎనర్జీ ఉంటుంది. కాలుష్యం మాటే వినబడదు. 1995లో ఐటీని, 2000లో బయోటెక్నాలజీని ప్రమోట్ చేశాం. ఆనాడు జీనోమ్‌వ్యాలీకి భూములు ఇచ్చి ప్రోత్సహించగా. కొవిడ్ కష్టకాలంలో భారత్ బయోటెక్ సంస్థ కొవిడ్ వ్యాక్సిన్‌ను అక్కడి నుంచే తయారు చేసింది.

రాష్ట్రమంతటా సంజీవని

టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చి నాణ్యమైన వైద్యసేవలు ప్రజలకు అందించాలన్నదే సంజీవని ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ప్రజల హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేస్తాం. ఈ ఏడాదే రాష్ట్రమంతటా విస్తరించి రోల్‌మోడల్‌గా మారుస్తాం. డిజిటల్ హెల్త్ రికార్డులు చేయడమే కాకుండా 72 లక్షల మంది రోగుల డేటా తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు రియల్‌టైం మానిటరింగ్ చేస్తున్నాం. త్వరలో ఎయిర్ అంబులెన్సులు వస్తున్నాయి. 2026లోనే డ్రోన్ అంబులెన్సులు తీసుకురావాలనుకుంటున్నాం’ అని సీఎం చంద్రబాబు చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కామినేని శ్రీనివాస్, జింకానా అధ్యక్షుడు రామకోటేశ్వరరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జీజీహెచ్‌లో కాసూరి – జింకానా మాతాశిశు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఎమ్మెల్యే మాధవి, మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్, కలెక్టర్ తమీమ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ

జింకానా సభ్యుల సేవలు అభినందనీయం

మంత్రి సత్యకుమార్ యాదవ్

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: చదువుకున్న కళాశాలకు జింకానా సభ్యులు అంకితభావంతో సేవలు అందించడం అభినందనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. భవనం ప్రారంభోత్సవానికి రావాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని ఆహ్వానించడానికి వెళ్లినప్పుడు జింకానా సభ్యులు రూ.100 కోట్లు ఇచ్చిన విషయాన్ని తెలుసుకుని ఆయన ఆశ్చర్యపోయారన్నారు. 2020లో కొవిడ్ రావడంతో ఎంసీహెచ్ భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయని జింకానా సభ్యులు చెప్పారని, 2019లో రాష్ట్రంలో వైకాపా అనే వైరస్ వచ్చి అభివృద్ధి కుంటుపడిందన్నారు. వైకాపా హయాంలోనే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటాలో 50 శాతం సీట్లు, మిగతా 50 శాతం మేనేజ్‌మెంట్, ఎన్నారైల కోటాలో పూర్తిచేసేందుకు అనుమతులు ఇచ్చిందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ఏప్రిల్ 1 నుంచి సంజీవని పేరుతో ఉచిత వైద్యసేవలు ప్రభుత్వం అందుబాటులోకి తెస్తుందన్నారు.

ప్రభుత్వం చేసే మంచి ప్రజలకు చేరాలి

(మొదటి పేజీ తరువాయి)

శాఖను ప్రభావవంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అధికారులు పని చేయాలి. ఉపాధి హామీ పథకం కింద పల్లెపండగ-1, పల్లెపండగ-2, అడవితల్లి బాట, జలజీవన్ మిషన్ తదితర పథకాల్లో లక్ష్యాలను చేరుకోవాలి. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నా, నిధులు దుర్వినియోగం చేసినా సహించేది లేదు. సోషల్ ఆడిట్‌ను పక్కాగా నిర్వహించాలి. ప్రతి అధికారీ నిబంధనలకు లోబడి పని చేస్తూ, అభివృద్ధి సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించాలి. రాజకీయ సిఫార్సులు, ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గాల్సిన అవసరం లేదు. పంచాయతీరాజ్‌శాఖను బలోపేతం చేసేలా ఒకేసారి పది వేల మందికి పదోన్నతులు కల్పించాం. ఉద్యోగులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటున్నాం. ఉమ్మడి కడప జిల్లాలో ఓ ఎంపీడీవోపై దాడి జరిగితే స్వయంగా వెళ్లి భరోసా కల్పించాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కేంద్ర పెద్దలను ఒప్పించి నిధులు తీసుకొస్తున్నాం. ప్రభుత్వ కష్టానికి ప్రతిఫలం దక్కేలా అధికారులు పని చేయాలి.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్. చిత్రంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్ తదితరులు

గత ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖను నిర్వీర్యం చేసింది

గత ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేసింది. ఆర్థిక క్రమశిక్షణ గాడి తప్పేలా ఇష్టారాజ్యంగా నిధులు దారి మళ్లించింది. జలజీవన్ మిషన్ లక్ష్యాలను నిర్లక్ష్యం చేసింది. దీంతో రూ.4 వేల కోట్లు దుర్వినియోగం అయ్యాయి. కొన్ని పనులు చేసినట్లు దస్త్రాల్లో చూపిస్తున్నా, క్షేత్రస్థాయిలో ఎక్కడా ఫలితాలు కనిపించడం లేదు. ఆయా తప్పుల్ని సరిచేస్తూ కూటమి ప్రభుత్వం సుపరిపాలన దిశగా సాగుతోంది. కొంతమంది అధికారులు ఇప్పటికీ వైకాపా నాయకులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, కూటమి ప్రభుత్వ పాలసీల అమల్లో నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. అలాంటి వారు తీరు మార్చుకోకపోతే, కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుంది” అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

● అనంతరం డిప్యూటీ సీఎం అడిగిన ప్రశ్నకు విశాఖ జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈ సంపత్‌కుమార్ సరిగ్గా జవాబు ఇవ్వలేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఉపాధిహామీ పథకం డైరెక్టర్ షణ్ముఖరావు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌తో పాటు ఆయా శాఖల జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 11 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

ఈనాడు, అమరావతి: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 11 నుంచి ప్రారంభమవుతాయని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ శుక్రవారం ప్రకటించారు. 11న ఉభయ సభలనూ ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. ఆయన ప్రసంగం తర్వాత శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ) సమావేశమవుతుంది. అందులో బడ్జెట్ సమావేశాలకు సంబంధించిన ఎజెండాతోపాటు పనిదినాల సంఖ్యనూ ఖరారు చేస్తారు. ఫిబ్రవరి 14న ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

3న మంత్రివర్గ సమావేశం

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఫిబ్రవరి 3న జరగనుంది. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి.. 2వ తేదీలోగా ప్రతిపాదనలు పంపాలని వివిధ శాఖల ఉన్నతాధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశాలిచ్చారు.

అమరావతిలో బిట్స్ పిలానీ క్యాంపస్

- 70 ఎకరాల్లో ఏర్పాటుకు ఒప్పందం

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రజా రాజధాని అమరావతిలో మరో ప్రతిష్ఠాత్మక సంస్థ ఏర్పాటు కాబోతోంది. ప్రముఖ యూనివర్సిటీ బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్ పిలానీ) త్వరలో తన క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. మందడం, వెంకటపాలెం గ్రామాల రెవెన్యూ పరిధిలో 70.011 ఎకరాల్లో క్యాంపస్ ఏర్పాటుకు శుక్రవారం సీఆర్డీఏతో భూ విక్రయ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. మందడం సబ్ రిజిస్ట్రార్ రాంబాబు సమక్షంలో జరిగిన ఒప్పందంలో ఏపీ సీఆర్డీఏ ఎస్టేట్స్ విభాగ జాయింట్ డైరెక్టర్ వి.డేవిడ్ రాజు, బిట్స్ పిలానీ తరఫున అధీకృత ప్రతినిధిగా డిప్యూటీ రిజిస్ట్రార్ వి.వి.ఎస్.ఎన్.మూర్తి పాల్గొన్నారు.

మొదటి దశలోనే రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి

అమరావతి క్యాంపస్ పనులను 3 దశల్లో చేపట్టనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. మొదటి దశలో రూ.1000 కోట్లతో స్మార్ట్ భవనాలు, కృత్రిమ మేధ ఆధారిత సేవలు, ఆధునిక బోధనా పద్ధతులకు అవసరమైన పర్యావరణహిత నిర్మాణాలతో క్యాంపస్‌ను కొత్తతరం విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. 2027 నుంచి విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేలా పనులు వేగంగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. దశల వారీగా 10 వేల మంది అభ్యసించేలా క్యాంపస్‌ను తీర్చిదిద్దుతామన్నారు.



సీఆర్డీఏ అధికారులతో ఒప్పందం కుదుర్చుకుంటున్న బిట్స్ పిలానీ ప్రతినిధులు

87 గ్రూప్-1 పోస్టులకు ఎంపిక జాబితా విడుదల

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో రెండు పోస్టులను పక్కన పెట్టింది. అవి సహాయ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్, డీఎస్పీ పోస్టులు. కోర్టు ఆదేశాల మేరకు వీటిపై చర్యలు తీసుకుంటుంది. గ్రూప్-1 పోస్టుల భర్తీకి 2023 డిసెంబరు 8న ప్రకటన విడుదల కాగా, 2024 మార్చి 17న ప్రిలిమ్స్, 2025 మేలో మెయిన్స్ నిర్వహించి జూన్‌లో ఫలితాలు విడుదల చేశారు. అనంతరం గతేడాది జూన్ 23 నుంచి జులై 15 వరకు జనరల్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. క్రీడా కోటాకు సంబంధించి ఈ ఏడాది జనవరి 7న ఇంటర్వ్యూలు పూర్తి చేశారు.

పోస్టులు ఇలా..

◆ డిప్యూటీ కలెక్టర్-9 ◆ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్-17 ◆ డీఎస్పీ-25, ◆ డీఎస్పీ (జైళ్లు)-1
◆ డివిజనల్/జిల్లా ఫైర్ సర్వీస్ అధికారి-2
◆ ఆర్టీవో-6, ◆ జిల్లా బీసీ సంక్షేమ అధికారి-1
◆ జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి-3
◆ డిప్యూటీ రిజిస్ట్రార్స్ -6 ◆ పురపాలక కమిషనర్ సెకండ్ గ్రేడ్-3 ◆ సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్-1
◆ సహాయ ట్రెజరీ అధికారి/సహాయ అకౌంటింగ్ అధికారి-3, ◆ జిల్లా ఉపాధి కల్పన అధికారి-4 ◆ సహాయ ఆడిట్ అధికారి-2, ◆ మండలాభివృద్ధి అధికారి-4

ఉగాదికి జాబ్ కేలండర్ విడుదల!

ఈనాడు, అమరావతి: ఉగాదికి జాబ్ కేలండర్ ప్రకటించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వీలైనంత త్వరగా ఉద్యోగాల భర్తీ చేపట్టేలా ప్రణాళిక రూపొందిస్తోంది. ఉగాది నుంచి ఏటా జాబ్ కేలండర్ విడుదల చేయాలని భావిస్తోంది. పకడ్బందీగా ఈ కేలండర్ అమలు చేసేలా విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పర్యవేక్షణ చేస్తున్నారు. ఖాళీల వివరాలను శాఖల వారీగా ప్రభుత్వం సేకరిస్తోంది. వివరాలు వచ్చాక ఆర్థిక శాఖ అనుమతితో కేలండర్ విడుదల చేయనుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించింది. కేవలం 150 రోజుల్లో నియామక ప్రక్రియను పూర్తి చేసింది. 6 వేల కానిస్టేబుల్ పోస్టులనూ ప్రభుత్వం భర్తీ చేసింది. ఇప్పుడు శాఖల వారీగా ఖాళీల జాబితాను సేకరించి, భర్తీ చేపట్టేందుకు కసరత్తు చేస్తోంది.

బీసీల భవనాలన్నీ ఒకేచోట!

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదిస్తున్నారు. పులే స్మృతివనాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ఇతర రాష్ట్రాల్లోని స్మృతివనాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించనున్నారు. ఏప్రిల్ 11న స్మృతివనానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నారు.

బీసీ భవన్- బీసీ కమిషన్

రాష్ట్రంలో వెనుకబడిన తరగతులకు సంబంధించి 57 కార్పొరేషన్లు ఉన్నాయి. 57 మంది ఛైర్మన్లు, 855 మంది డైరెక్టర్లు వీటికి ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ కార్పొరేషన్ కార్యాలయాలన్నీ కలిపి ప్రస్తుతం విజయవాడలోని గొల్లపూడిలో ఉన్నాయి. వీటి అద్దె ఖర్చు ప్రభుత్వానికి భారంగా మారింది. వీటి నిర్వహణ కూడా అంతంతమాత్రమే. ఈ కార్యాలయాలన్నీ బీసీ భవన్ పేరుతో అమరావతికి తరలించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దీంతోపాటు బీసీ కమిషన్ కార్యాలయం, సివిల్ సర్వీసెస్ కోచింగ్ సెంటర్, ఎంజేపీ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రధాన కార్యాలయం ఇక్కడే నిర్మించాలని ఆలోచిస్తున్నారు.

మైస్ విధానంలో వసతులు

మీటింగ్, ఇన్సెంటివ్, కాన్ఫరెన్స్, ఎంటర్‌టైన్‌మెంట్-మైస్(ఎంఐసీఈ) విధానాన్ని అనుసరించి అన్ని వసతులు ఒకేచోట కల్పించనున్నారు. మల్టీపర్పస్‌గా వినియోగించేలా భవనాన్ని నిర్మించనున్నారు. ఉత్సవాల నిర్వహణకు వీలుగా వసతులు సమకూరుస్తారు. బీసీ విద్యార్థులు శిక్షణ తీసుకునేందుకు ప్రత్యేక కేంద్రాన్ని నిర్మిస్తారు. ఓపెన్ యాంఫీ థియేటర్ కూడా అందుబాటులోకి తేనున్నారు. భవనాల డిజైన్ల ఖరారుకు ప్రత్యేక ఏజెన్సీని నియమించనున్నారు.

రూ.లక్ష క్షీణించిన కిలో వెండి

రూ.21,860 తగ్గిన 10 గ్రాముల బంగారం



ఈనాడు వాణిజ్య విభాగం: ఇటీవలి కాలంలో రాకెట్ వేగంతో పెరుగుతూ వచ్చిన బంగారం, వెండి ధరల్లో శుక్రవారం భారీ కుదుపు ఏర్పడింది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) బంగారం ధర ఒక్కరోజులో 594 డాలర్లు (11%) క్షీణించి 4732 డాలర్లకు, వెండి ధర 36 డాలర్లు (32%) పతనమై 78 డాలర్లకు పరిమితం అయ్యాయి. ఫలితంగా రాత్రి 11.55 గంటలకు హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర రూ.21,860 పైగా తగ్గి రూ.1,57,840కు, కిలో వెండి ధర రూ.లక్ష పతనమై రూ.2,99,000 వద్ద స్థిరపడ్డాయి. గురువారం రాత్రి ఈ ముగింపు ధరలు రూ.1,79,700, రూ.3,99,600 కావడం గమనార్హం.

ఎంసీఎక్స్‌లో: కమొడిటీల ట్రేడింగ్ జరిగే మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో 10 గ్రాముల బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.1,80,499 వద్ద ప్రారంభమై, రూ.1,83,493 వద్ద గరిష్ఠస్థాయిని తాకినా, తదుపరి రూ.1,50,849 వద్ద కనిష్ఠస్థాయిని తాకి అక్కడే ముగిసింది. 18% క్షీణించింది. కిలో వెండి మార్చి కాంట్రాక్టు ధర రూ.3,83,898 వద్ద ప్రారంభమై, రూ.3,89,986 వద్ద గరిష్ఠానికి చేరింది. తదుపరి రూ.2,91,922 వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసి, అక్కడే ముగిసింది. ఈ కాంట్రాక్టు 27% నష్టపోయింది.

లాభాల స్వీకరణకు తోడు

కమొడిటీస్ ట్రేడింగ్‌లో పసిడి, వెండి ధరల్లో ఒకరోజు పతనం గత 15 ఏళ్లలో ఇంతలా ఎప్పుడూ లేదని విశ్లేషణలు వస్తున్నాయి. వెండి ధర 27% ఒక్కరోజులో క్షీణించడం 2011 తరవాత ఇప్పుడే బంగారం ధర 15% తగ్గడమూ, ఇంతే.

◆ ఊహించని గరిష్ఠస్థాయులకు చేరిన లోహాల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం ప్రధాన కారణం.

◆ అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్‌గా వార్ష్ నియమితులైన నేపథ్యంలో, కొన్ని కరెన్సీలతో పోలిస్తే డాలర్ బలోపేతం అయ్యింది. ఇది విలువైన లోహాల ట్రేడింగ్‌పై ప్రభావం చూపింది.

గ్రహం అనుగ్రహం


31–1–2026 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, శుక్ల పక్షం
త్రయోదశి: ఉ. 7-42, చతుర్దశి తె. 5-52 తదుపరి పూర్ణిమ
పునర్వసు: రా. 1-47 తదుపరి పుష్యమి
వర్జ్యం: మ. 2-25 నుంచి 3-56 వరకు
అమృత ఘడియలు: రా. 11-31 నుంచి 1-02 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6-37 నుంచి 8-06 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6.37; సూర్యాస్తమయం: సా.5.50

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	15.0	28.0
అనంతపురం	17.4	33.6
కడప	18.0	31.0
విశాఖపట్నం	19.0	30.0
రాజమహేంద్రవరం	19.0	34.0
హైదరాబాద్	19.1	29.2
శ్రీకాకుళం	20.0	30.0
గుంటూరు	20.0	31.0
తాడేపల్లిగూడెం	20.0	32.0
విజయవాడ	20.2	29.4
కర్నూలు	20.2	32.8
నరసాపురం	20.4	31.5
నెల్లూరు	20.8	31.3
సూర్యాపేట	21.5	30.0
ఒంగోలు	21.7	30.4

ఇదీ సంగతి!



ప్రచారమే వద్దన్నారు.. తినొద్దనలేదుగా అమ్మా! ఆర్డర్ పెడుతున్నా..!!

బీపీఎస్‌కి నేరుగా దరఖాస్తు చేయొచ్చు

పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్

ఈనాడు, అమరావతి: అనుమతులు తీసుకోని భవన నిర్మాణాల క్రమబద్ధీకరణ కోసం బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్)లో ప్రజలే నేరుగా సంబంధిత పోర్టల్‌లో దరఖాస్తులు అప్‌లోడ్ చేయొచ్చని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి సాంకేతిక సమస్యలు తలెత్తినా, సందేహాలున్నా సమీప స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ప్లానింగ్ సెక్రటరీలను సంప్రదించొచ్చని సూచించారు. బీపీఎస్ పోర్టల్‌లో దరఖాస్తులు అప్‌లోడ్ చేసేందుకు లైసెన్స్ కలిగిన టెక్నికల్ పర్సన్లు (ఎల్‌టీపీ) కొందరు ప్రజల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ముఖ్య కార్యదర్శి శుక్రవారం ఓ ప్రకటన చేశారు. అవగాహన కలిగినవారు పోర్టల్‌లో దరఖాస్తు చేయడంతోపాటు డెబిట్, క్రెడిట్ కార్డులు, యూపీఐ, నెఫ్ట్, ఆర్టీజీఎస్ ద్వారా ఫీజులు చెల్లించొచ్చని ఆయన సూచించారు.

మార్చి 11లోగా దరఖాస్తు చేసుకోవాలి: 'భవనాల క్రమబద్ధీకరణకు మార్చి 11లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఆ తరువాత అనుమతించే అవకాశం లేదు. పూర్తిగా అనుమతులు లేకుండా చేసిన నిర్మాణాలు, ప్లాన్‌కి విరుద్ధంగా చేసినవి, అనుమతులు లేని అదనపు అంతస్తులు బీపీఎస్‌లో క్రమబద్ధీకరించుకోవచ్చు. 123 పుర, నగరపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 25,480 దరఖాస్తులు వచ్చాయి' అని సురేశ్‌కుమార్ వివరించారు.

22ఏ భూముల సమస్యపై త్వరలో విధాన ప్రకటన

- రైతుల అనుమతితోనే పట్టాదారు పాసుపుస్తకం ముద్రణకు పంపాలి
- మంత్రి అనగాని సత్యప్రసాద్



ఈనాడు, అమరావతి: రైతులు తరచూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా 22ఏ భూముల సమస్యకు పరిష్కారం చూపాలని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఉన్నతాధికారులకు సూచించారు. వీటిపై త్వరలో విధాన ప్రకటన చేయనున్నట్లు వెల్లడించారు. రెవెన్యూ సమస్యలపై శుక్రవారం ఆయన సీసీఎల్ఏ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. 'మంత్రివర్గ ఉపసంఘంలో 22ఏ భూములపై చర్చించాం. ఉన్నతాధికారుల స్థాయిలో దీనిపై ఒక విధానం రూపొందిస్తే తర్వాత ప్రభుత్వస్థాయిలో చర్చించి.. నిర్ణయం తీసుకుంటాం' అని సత్యప్రసాద్ పేర్కొన్నారు. రెవెన్యూ క్లినిక్‌లతో మంచి ఫలితాలు వస్తున్నాయని.. వాటిని మరింత సమర్థంగా నిర్వహించాలని చెప్పారు. 'ఫిబ్రవరి 2 నుంచి పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేపట్టాలి. వాటిలో తప్పులు ఉండటానికి వీల్లేదు. కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చే ముందే భూయజమానులకు వివరాలు చూపించి.. వారి అనుమతితోనే ముద్రణకు పంపాలి. ఒకసారి పుస్తకం ముద్రించాక అందులో తప్పులు ఉండకూడదు' అని స్పష్టం చేశారు.

◆ రీసర్వే సమయంలో గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకూడదని.. రైతుల్ని భాగస్వాములుగా చేయాలని మంత్రి సత్యప్రసాద్ ఆదేశించారు. 'రీసర్వే కాల పరిమితిని 140 రోజులకు పెంచుతూ కొత్త ఎస్‌ఓపీ విడుదల చేశాం. తగినంత సమయం ఇస్తున్నాం. దాని ప్రకారమే రీసర్వే చేయాలి. రైతులు అందుబాటులో లేకుంటే సర్వే వాయిదా వేసి.. వారు వచ్చాకే నిర్వహించాలి' అని నిర్దేశించారు.

29 టిడ్కో సముదాయాల్లో మౌలిక సదుపాయాల పనుల్లో జాప్యం

మళ్లీ టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వ అనుమతి

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 29 పురపాలికల్లోని టిడ్కో గృహ సముదాయాల్లో ఎంఎస్ఆర్ ద్వారకా కావేరి గుత్తేదారు సంస్థ చేపడుతున్న మౌలిక సదుపాయాల పనుల్లో తీవ్ర జాప్యం అవుతోందని ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు ఆ టెండరును రద్దు చేసి మరోసారి టెండర్లు పిలిచేందుకు టిడ్కో సంస్థకు అనుమతిచ్చింది. సదరు గుత్తేదారు సంస్థ 2022 ఏడాదిలో పనులు దక్కించుకుంది. ఇప్పటికీ చాలా చోట్ల పనులు ప్రారంభించలేదు. దీంతో టెండరు రద్దుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది జూన్ నాటికి లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను అప్పగించేందుకు ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది. మౌలిక సదుపాయాలు కల్పిస్తేగానీ లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించలేని పరిస్థితి. దీంతో 2025-26 ఎస్ఓఆర్ రేట్ల ప్రకారం రూ.226 కోట్లతో పనులు చేపట్టేందుకు టెండరు ప్రక్రియ నిర్వహించాలని టిడ్కోను ఆదేశిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు.. ఒకరి సజీవ దహనం

మోదుకూరు (చుండూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఓ వ్యక్తి సజీవ దహనమైన ఘటన బాపట్ల జిల్లా చుండూరు మండలం మోదుకూరులో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బి.శివరామకృష్ణ (55)కు రెండంతస్తుల భవనం ఉంది. ఆయన భార్య పైఅంతస్తులో ఏసీ, ఫ్యాన్ వేసి, కిందకు వచ్చేటప్పుడు వాటిని ఆఫ్ చేశారు. ఆ సమయంలో పెద్ద శబ్దంతో ఏసీ నుంచి పొగలు వచ్చాయి. ఆ విషయాన్ని కింది అంతస్తులో ఉన్న భర్త శివరామకృష్ణకు చెప్పారు. ఆయన ఇంటి ఎదురుగా ఉన్న ఎలక్ట్రీషియన్ రమణను తోడ్కొని పైఅంతస్తుకు వెళ్లారు. దగ్గరకు వేసి ఉన్న తలుపు తీయడంతో ఒక్కసారిగా మంటలు శివరామకృష్ణను తాకాయి. అప్రమత్తమైన ఎలక్ట్రీషియన్ పైఅంతస్తు నుంచి కిందకు దూకడంతో తీవ్ర గాయాలయ్యాయి. శివరామకృష్ణ మంటల్లో చిక్కుకొని సజీవ దహనమయ్యారు.

అరకొర సౌకర్యాలున్న ల్యాబ్ నివేదికే.. సిట్‌కు ప్రామాణికమా?

(మొదటి పేజీ తరువాయి)

అందుబాటులో ఉన్నా, సిట్ వాటిపై ఎందుకు దృష్టి పెట్టలేదన్నది ప్రశ్న. కోట్ల మంది భక్తుల మనోభావాలతో ముడిపడిన అంశమైనందున మరింత కచ్చితత్వం కోసం ఆ శాంపిళ్లను వివిధ ల్యాబ్‌లకు పంపి ఉండాల్సిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్‌డీడీబీ అంత స్పష్టంగా చెప్పినప్పటికీ..

వైకాపా ప్రభుత్వ హయాంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యతపై భక్తుల నుంచి అనేక ఫిర్యాదులు వచ్చాయి. దీంతో 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నెయ్యి శాంపిళ్లను అత్యంత ప్రామాణిక సంస్థ అయిన గుజరాత్‌లోని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) కాఫ్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపింది. నెయ్యిలో కల్తీ జరిగిందని, దానిలో పాలకు సంబంధించినవి కాకుండా ఇతరత్రా కొవ్వులు (ఫారిన్ ఫ్యాట్స్) కలిశాయని ఎన్‌డీడీబీ నిగ్గుతేల్చింది. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నెయ్యిలో ఉండాల్సిన 'ఎస్-విలువ' కంటే పరీక్షించిన నమూనాల్లో హెచ్చుతగ్గులున్నాయని, దానిలో పంది కొవ్వు, గొడ్డు కొవ్వు, చేప నూనె వంటివి కలిపి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేసింది. తితిదే నాలుగు ట్యాంకర్ల నుంచి తీసిన నెయ్యి నమూనాలను పరీక్షలకు పంపగా, ఎన్‌డీడీబీ ఒక్కో నమూనాను ఐదు ఈక్వేషన్స్‌లో పరీక్షించింది. అప్పట్లో ఎన్‌డీడీబీ రిపోర్టులో పేర్కొన్న అంశాలివీ.

ఈక్వేషన్ సంఖ్య	నెయ్యిలో ఉన్న ఎస్-విలువ	ఉండాల్సిన ఎస్-విలువ	ఈ కొవ్వులు కలిసుంటాయని అనుమానం
1.	87.61	98.05- 101.95	చేపనూనె, సోయాబీన్, సన్‌ఫ్లవర్, ఆలివ్, ఆవ, అవిసె, పత్తి గింజల నూనెలు
2.	106.90	99.42 - 100.58	కొబ్బరి, పామ్ కెర్నెల్ ఫ్యాట్
3.	23.22	95.90 - 104.10	గొడ్డు కొవ్వు, పామాయిల్,
4.	116.09	97.96 -102.04	పంది కొవ్వు
5.	20.32	95.68 -104.32	నెయ్యి నాణ్యతకు ప్రామాణికం

మరిన్ని ల్యాబ్‌లకు పంపి పరీక్షించి ఉంటే?

తితిదేకి నెయ్యి పేరుతో సరఫరా అవుతున్న పదార్థం ఎంత ఘోరంగా ఉందో ఎన్‌డీడీబీ నివేదిక చాటింది. అందులోని ఎస్-విలువలను బట్టి పంది కొవ్వు, గొడ్డు కొవ్వు, చేప నూనె కలిసే ఉండొచ్చని అప్పట్లో పలువురు నిపుణులూ పేర్కొన్నారు. దీనిపై లోతైన దర్యాప్తు కోసం సిట్.. అవసరమనుకుంటే ఆ శాంపిళ్లను మరోసారి పరీక్షల కోసం ఎన్‌డీడీబీకి పంపించి, పునఃపరిశీలన చేయించి ఉండాల్సింది. జంతు కొవ్వు కలిసిందో లేదో మరింత కచ్చితత్వంతో చెప్పాలని కోరి ఉండాల్సింది. లేకపోతే ఎన్‌డీడీబీతో సమానమైన, అంతకంటే మెరుగైన మరో సంస్థతో పరీక్షలు చేయించి ఉండాల్సింది. కానీ, అరకొర సౌకర్యాలున్న ఎన్‌డీఆర్ఐ నివేదిక ఆధారంగా.. ఆ నెయ్యిలో పంది కొవ్వు, గొడ్డు కొవ్వు, చేప నూనె కలవనే లేదని ఎలా నిర్ధారణకు వస్తుంది?

తమ పరిమితులను సదరు సంస్థే చెప్పినా..

నెయ్యి శాంపిళ్లను ఎన్‌డీఆర్ఐ అరకొరగానే పరీక్షించిందని ఆ సంస్థ నివేదికను బట్టే అర్థమవుతోంది. సంస్థాగత అవసరాలకు రూపొందించుకున్న మెథడాలజీ ప్రకారం తమ ల్యాబ్‌లో ఆ శాంపిళ్లను పరీక్షించామని, దానికి థర్డ్ పార్టీ వాలిడేషన్ పెండింగ్‌లో ఉందని ఆ సంస్థ పేర్కొంది. తమ ల్యాబ్‌లో ఇప్పటి దాకా వాణిజ్య ప్రాతిపదికన పరీక్షలు చేయలేదని, ప్రత్యేకంగా కోరినందునే ఈ శాంపిళ్లను పరీక్షించామని తెలిపింది. గొడ్డు కొవ్వు, చేప నూనెను పరీక్షించే మెథడాలజీ ప్రస్తుతానికి తమ వద్ద లేదని స్పష్టంగా చెప్పింది. ఆ నెయ్యిలో పంది కొవ్వు ఉందా? అని మాత్రమే పరీక్షించామని, దానిలో పంది కొవ్వు పది లేదా అంతకంటే ఎక్కువ శాతం ఉంటేనే గుర్తించగలమని (లిమిట్ ఆఫ్ డిటెక్షన్) పేర్కొంది.

తుది నిర్ధారణకు ఎలా వస్తారు?

పీసీఆర్ విధానంలో ఆయా జంతువుల నిర్దిష్ట డీఎన్ఏ సీక్వెన్స్‌ల ఆధారంగా పరీక్షించి, నెయ్యిలో పంది, గొడ్డు కొవ్వులు కలిశాయా అన్నది నిర్ధారిస్తారు. కానీ అధిక వేడిపై కాచి నెయ్యి తయారుచేసే క్రమంలో జంతు కొవ్వుల్ని కలిపినా.. డీఎన్ఏ డీగ్రేడ్ కావడం వల్ల కొవ్వు నిర్దిష్ట పరిమాణం కంటే తక్కువ ఉంటే గుర్తించలేరు. అందుకే తితిదే నెయ్యిలో పంది కొవ్వు కలిసిందా, లేదా అన్నది నిర్ధారించుకోవడానికి ఎన్‌డీఆర్ఐ నివేదికను ప్రామాణికంగా తీసుకోవడం సరికాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

◆ నెయ్యిలో ఒక శాతం కంటే తక్కువ పంది, ఇతర జంతువుల కొవ్వు కలిసినా కనిపెట్టేందుకు హైపెర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రొమటోగ్రఫీ (హెచ్‌పీఎల్‌సీ), గ్యాస్ క్రొమటోగ్రఫీ (జీసీ), జీసీ-మాస్ స్పెక్ట్రోమెట్రీ (జీసీ-ఎంఎస్) వంటి అత్యాధునిక పరీక్షా విధానాలు అందుబాటులో ఉన్నాయి.

◆ ఈ విధానాల్లో డీఎన్ఏ సీక్వెన్సింగ్‌కి బదులు ఫ్యాటీ యాసిడ్‌లు, ట్రైగ్లిజరాయిడ్స్, స్టెరోల్స్, స్పెక్ట్రాసిగ్నేచర్స్ ఆధారంగా నెయ్యిలో పంది, ఇతర జంతువుల కొవ్వు కలిసిందా, లేదా అన్నది నిర్ధారిస్తారు.

◆ ఇలాంటి అత్యాధునిక విధానాల్లో పరీక్షించకుండా తితిదేకి సరఫరా చేసిన నెయ్యిలో పంది కొవ్వు, గొడ్డు కొవ్వు, చేపనూనె కలిసే అవకాశం చాలా తక్కువని సిట్ నిర్ధారణకు రావడం విస్తుగొలుపుతోంది.

దక్షిణాసియాకు ప్రధాన ద్వారంగా ఏపీ

- ఆ లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అడుగులు
- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్



సీఎస్ఐఆర్– నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ రీజినల్ సెంటర్ శిలాఫలకం వద్ద కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, హోంమంత్రి అనిత, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు

విశాఖపట్నం (మధురవాడ, సాగర్‌నగర్), న్యూస్‌టుడే: దక్షిణాసియాకు ప్రధాన ద్వారంగా ఏపీని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూ విజ్ఞానశాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ పేర్కొన్నారు. సముద్ర వాణిజ్యానికి కేంద్ర బిందువుగా విశాఖ అవతరించనుందన్నారు. అలాగే అంతర్జాతీయ స్థాయి మారిటైం, సన్‌రైజ్ కోస్టల్ స్టేట్‌గా ఏపీని నిలిపేందుకు కేంద్రం కట్టుబడి ఉందన్నారు. విశాఖపట్నంలోని బీచ్‌రోడ్డులో రాడిసన్‌బ్లూ రిసార్టు ఎదురుగా సీఎస్ఐఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ రీజినల్ సెంటర్‌ను ఆయన శుక్రవారం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జితేంద్రసింగ్ మాట్లాడుతూ.. 4 ఎకరాల్లో రూ.32 కోట్లతో నిర్మించిన ఓషనోగ్రఫీ రీజినల్ సెంటర్ శాస్త్రీయ పరిశోధనల ద్వారా దేశాభివృద్ధికి విశేష సేవలందిస్తుందన్నారు. పదేళ్లుగా నాన్చుడి ధోరణిలో ఉన్న ఈ కేంద్రాన్ని ఎన్డీయే డబుల్ ఇంజిన్ సర్కారు కేవలం ఏడాదిలో పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చిందన్నారు. సముద్ర వనరుల అన్వేషణలో దేశం మరో ముందడుగు వేసిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కళింగపట్నం గ్లోబల్ స్ట్రీట్ ట్రేడ్ సెంటర్ ద్వారా దక్షిణ, తూర్పు ఆసియా దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలోపేతం కానున్నాయని వెల్లడించారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. విశాఖలో సీఎస్ఐఆర్ పరిశోధన సంస్థ ఏర్పాటు రాష్ట్రానికి మరో మైలురాయిగా నిలుస్తుందన్నారు. సముద్ర శాస్త్ర ప్రయాణంలో దేశం కొత్త అధ్యయనానికి ఇది ఆరంభమన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ.. ఏపీలో సీఎస్ఐఆర్ పరిశోధన సంస్థలు మరిన్ని ఏర్పాటు కావాలన్నారు. కార్యక్రమంలో డీఎస్ఐఆర్ అండ్ సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ కార్యదర్శి డాక్టర్ కలైసెల్వి తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదంలో వాడింది నూటికి నూరుశాతం కల్తీ నెయ్యే

- తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు



ఈనాడు డిజిటల్, తిరుపతి: 'వైకాపా ఐదేళ్ల పాలనలో తిరుమల పవిత్రతను మంటగలిపేలా ఘోరమైన అపచారం జరిగింది. కోట్ల మంది హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ శ్రీవారి లడ్డూ ప్రసాదంలో నూటికి నూరుశాతం కల్తీ నెయ్యినే వాడారు. సిట్, ఎన్‌డీడీబీ నివేదికలు ఈ విషయాన్ని స్పష్టంగా చెబుతున్నా.. వైకాపా నేతలు మాత్రం తమకు క్లీన్‌చిట్ వచ్చిందంటూ పచ్చి అబద్ధాలు ఆడుతున్నారు. ఇది భక్తులకు స్లో పాయిజన్ ఇవ్వడమే' అని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో తితిదే పాలకమండలి సభ్యులు పనబాక లక్ష్మి, దివాకర్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, నరేష్‌కుమార్‌తో కలిసి ఛైర్మన్ బీఆర్ నాయుడు మీడియా సమావేశంలో మాట్లాడారు. వైకాపా తీరుపై నిప్పులు చెరిగారు. లడ్డూ ప్రసాదం విషయంలో తమకు క్లీన్‌చిట్ వచ్చిందని వైకాపా నేతలు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. 'కేవలం కమీషన్ల కక్కుర్తితోనే తితిదే నిబంధనలను, టెండర్ల షరతులను వైకాపా ప్రభుత్వం ఇష్టారాజ్యంగా మార్చేసింది. సామర్థ్యం లేని భోలేబాబా డెయిరీకి రూ.250 కోట్ల టెండర్లు కట్టబెట్టారు. తితిదే నుంచి వెళ్లిన బృందం పరిశీలిస్తే అక్కడ ఒక్క ఆవు లేదు. చుక్క పాల ఉత్పత్తి లేదు. మరి 60 లక్షల కిలోల నెయ్యి ఎలా వచ్చింది? రసాయనాలతో కృత్రిమ నెయ్యి తయారు చేసి భక్తుల ప్రాణాలతో చెలగాటమాడారు. సుమారు 20 కోట్ల లడ్డూలను ఈ కల్తీ నెయ్యితోనే తయారు చేసి పంచడం మహా పాపం. మైక్రో డీఎన్ఏ పరీక్ష ఎందుకు చేయలేదు? ఆ పరీక్ష చేయించకుండానే క్లీన్‌చిట్ వచ్చిందని చెప్పుకోవడం సిగ్గుచేటు. దీనిపై సీనియర్ న్యాయవాదులు, శాస్త్రవేత్తలతో చర్చిస్తున్నాం. ఈ అంశంపై కచ్చితంగా కోర్టులో తేల్చుకుంటాం' అని ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టం చేశారు.

జగన్ సహకారం లేకుండానే జరిగిందా?

'మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న ఖాతాలో కోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయి. ఒక ప్రైవేటు వ్యక్తికి ఇన్ని కోట్లు ఎలా వచ్చాయి? దీని వెనుక ఉన్న బడా నేతలెవరు? జగన్‌మోహన్‌రెడ్డి సహకారం లేకుండానే ఇది జరిగిందా? సీబీఐ తన తదుపరి దర్యాప్తులో అసలైన సూత్రధారులను బయటపెట్టాలి. తప్పు చేయకపోతే ముందస్తు బెయిల్ కోసం కోర్టులకు ఎందుకు వెళ్తున్నారు. అబద్ధాలు చెప్పి దేవుడి శిక్షకు గురవుతామనే భయంతోనే కొందరు వైకాపా నేతలు మృత్యుంజయ యాగాలు చేస్తున్నారు. 13 ఏళ్లుగా అక్రమాస్తుల కేసుల్లో కోర్టులు, విచారణలకు హాజరు కాకుండా ఎగ్గొడుతున్న వారా సీబీఐ గురించి మాట్లాడేది? రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారు. ఆ డబ్బుతో అన్ని వ్యవస్థలనూ మేనేజ్ చేస్తున్నారు. అధికారంలో లేకపోయినా సీబీఐని కూడా మేనేజ్ చేయగలరనే ఇలాంటి దారుణాలకు ఒడిగడుతున్నారు. హిందూ ధర్మంపై గత ప్రభుత్వం దాడి చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాకే ఈ పాపాలన్నీ వెలుగులోకి వచ్చాయి. జగన్ సహా వైకాపా ముఠా హిందూ జాతికి బేషరతుగా క్షమాపణ చెప్పాలి' అని ఛైర్మన్ డిమాండ్ చేశారు.

ఎన్‌డీఆర్ఐలో ప్రిన్సిపల్ సైంటిస్టులుగా పనిచేసిన కల్తీ నెయ్యి కేసు నిందితులు

- ఆ సంస్థ ప్రధాన కేంద్రం ఇచ్చిన నివేదికనే పరిగణనలోకి తీసుకున్న సిట్
- నివేదిక ఇచ్చే సమయానికి ఎన్‌డీఆర్ఐలో కీలక స్థానంలో కొనసాగిన ఓ నిందితుడు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా కేసులో కీలక నిందితులైన డెయిరీ ప్లాంట్‌ల తనిఖీ కమిటీ సభ్యులు డా.బత్తుల సురేంద్రనాథ్ (ఏ-35), డా.కులకర్ణి జయరాజు రావు (ఏ-36)... ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐకార్) నేతృత్వంలో పనిచేసే నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌డీఆర్ఐ)కి సంబంధించిన బెంగళూరులోని సదరన్ రీజియన్ స్టేషన్ (ఎస్ఆర్ఎస్)లో సుదీర్ఘకాలం ప్రిన్సిపల్ సైంటిస్టులుగా పనిచేశారు. హరియాణాలోని కర్నాల్‌లో ఈ సంస్థ ప్రధాన కేంద్రముంది. కల్తీ నెయ్యి కేసు దర్యాప్తు చేసిన సిట్ బృందం.. ఈ సంస్థ ప్రధాన కేంద్రం ఇచ్చిన నివేదికనే పరిగణనలోకి తీసుకుంది. ఇదే ఇప్పుడు చర్చనీయాంశమైంది.

ఎన్‌డీఆర్ఐలో కీలక హోదాలో నిందితులు..

◆ నిందితుడైన డా.కులకర్ణి జయరాజు రావు ఐకార్-ఎన్‌డీఆర్ఐ, బెంగళూరులోని ఎస్ఆర్ఎస్‌లో 2009 జనవరి 1 నుంచి ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా పనిచేస్తూ 2025 జూన్ 30న పదవీ విరమణ చేశారు. ఆయన ఎన్‌డీఆర్ఐలో కీలక హోదాలో పనిచేస్తున్న సమయంలోనే.. అంటే 2025 మే 16వ తేదీన కర్నాల్‌లోని ఆ సంస్థ ప్రధాన కేంద్రం ఇచ్చిన నివేదికనే సిట్ పరిగణనలోకి తీసుకోవడం గమనార్హం.

◆ మరో నిందితుడు బత్తుల సురేంద్రనాథ్ 2004 డిసెంబరు 15 నుంచి 2020 ఆగస్టు 31 వరకూ ఐకార్-ఎన్‌డీఆర్ఐ, బెంగళూరు (ఎస్ఆర్ఎస్)లో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా పనిచేశారు. 2020 ఆగస్టు 31న పదవీ విరమణ చేశారు.

ప్లాంట్లు తనిఖీ చేయకుండానే.. అనుకూల నివేదికలు

డెయిరీ నిపుణులైన డా.బత్తుల సురేంద్రనాథ్, డా.కులకర్ణి జయరాజ్‌రావులను వైకాపా హయాంలో తితిదే పాలకమండలి డెయిరీ ప్లాంట్‌ల తనిఖీ కమిటీ సభ్యులుగా నియమించింది. తిరుమలకు నెయ్యి సరఫరా చేయడానికి టెండర్లు వేసిన డెయిరీలకు సంబంధించిన ప్లాంట్లు పరిశీలించి నిజంగా ఆ సంస్థలు అందుకు అర్హమైనవేనా అని నిగ్గుతేల్చి నివేదించాల్సిన వీరు.. డెయిరీ సంస్థల ప్రతినిధులతో కుమ్మక్కై ప్లాంట్లను సరిగ్గా తనిఖీ చేయకుండానే.. వాటికి అర్హతలున్నట్లు తితిదేకు తప్పుడు నివేదికలిచ్చారు. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా కావడానికి ఇదీ ఓ ప్రధాన కారణమేనని సిట్ దర్యాప్తులో తేలింది.

గాంధీ సిద్ధాంతాలను భావితరాలకు అందించాలి

మహాత్మాగాంధీ సందేశ యాత్రలో రఘువీరారెడ్డి



గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రఘువీరారెడ్డి. చిత్రంలో కేవీపీ రామచంద్రరావు తదితరులు

హిందూపురం, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ సిద్ధాంతాలు భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి అన్నారు. తన స్వగ్రామం శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలోని నీలకంఠపురం నుంచి చేపట్టిన మహాత్మాగాంధీ సందేశ యాత్ర 45 కి.మీ. కొనసాగి శుక్రవారం హిందూపురంలోని గాంధీ చౌక్ వద్ద ముగిసింది. రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ' పథకం పేరు మార్చవద్దన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, మాజీ ఏపీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటా సత్యం, రఘువీరారెడ్డి కుటుంబ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సిట్ చెప్పిందంతా సరైందేనని మేమూ అనడం లేదు: సజ్జల

ఈనాడు, అమరావతి: సిట్ ఛార్జ్‌షీట్‌లో ఉన్నదంతా సరైందేనని తాము కూడా అనడం లేదని వైకాపా ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కల్తీ నెయ్యిపై సిట్ విచారణ సరిగా చేయలేదన్నట్లుగా వార్తలొస్తున్నాయని విలేకరులు అడగ్గా.. ఆయన పైవిధంగా స్పందించారు. మీ హయాంలో నెయ్యిలో కల్తీ జరగనేలేదంటారా? అన్న ప్రశ్నకు ఆయన సూటిగా సమాధానమివ్వలేదు. 'మీకూ తెలుసు, అందరికీ తెలుసు. కల్తీ జరిగిందా, జరగలేదా అంటే దానికి ఎవరూ సమాధానం చెప్పలేరు. చంద్రబాబు కూడా చెప్పలేరు. కాబట్టే జంతువుల కొవ్వు కలిసిందని ఎలా చెప్పారని ఆయన్ను ప్రశ్నిస్తున్నాం' అని సజ్జల పేర్కొన్నారు. రసాయనాలు కలిశాయని సిట్ చెప్పింది కదా అని అడగ్గా, 'పామోలిన్, కెర్నెల్ ఆయిల్ లాంటివి కలిపిన నెయ్యితో లడ్డూలు తయారుచేస్తే అవి రెండు రోజులైనా నిల్వ ఉంటాయా అంటే.. సాధ్యం కాదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇంట్లో వంట చేసేవారూ ఇదే చెబుతారు. కానీ, సిట్ అభియోగం మోపింది. కాబట్టి అది కోర్టులో తేలాలి' అని సజ్జల వ్యాఖ్యానించారు.

కల్తీ నెయ్యి సరఫరా కేసులో రంగంలోకి ఈడీ

- హవాలా చెల్లింపులు, మనీ లాండరింగ్‌పై దృష్టి
- సిట్ అధికారుల నుంచి కేసు వివరాలు సేకరణ
- ఒకట్రెండు రోజుల్లో ఈసీఐఆర్ నమోదు

ఈనాడు, అమరావతి, తిరుపతి: వైకాపా హయాంలో ఐదేళ్ల పాటు తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. రూ.235 కోట్ల విలువైన ఈ కుంభకోణంలో హవాలా మార్గాల ద్వారా భారీ మొత్తాల్లో సొమ్ము చేతులు మారినట్లు సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ నిగ్గు తేల్చిన నేపథ్యంలో... అందుకు సంబంధించిన సమగ్ర వివరాలను ఈడీ అధికారులు సిట్ నుంచి తాజాగా తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్, 36 మంది నిందితుల సమాచారం, వారి రిమాండ్ రిపోర్టులు, ఇప్పటివరకూ దాఖలు చేసిన అభియోగ పత్రాలు, వివిధ రాష్ట్రాల్లోని హవాలా ఏజెంట్ల ప్రమేయం, వారి పాత్ర తదితర అంశాలపై సమాచారం తీసుకున్నారు. దాన్ని విశ్లేషించిన ఈడీ బృందాలు..ఈ మొత్తం వ్యవహారంలో భారీ ఎత్తున మనీ లాండరింగ్ జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించాయి. ఒకటి రెండు రోజుల్లో మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్‌ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్) నమోదు చేయనున్నట్లు సమాచారం. ఆ వెంటనే కీలక నిందితులకు నోటీసులిచ్చి విచారించనుంది.

హవాలాలో సొమ్ము ఎవరెవరికి చేరిందో బయటపడే అవకాశం!

◆ 2019-24 మధ్య ఐదేళ్లలో 68.17 లక్షల కిలోల కల్తీ నెయ్యి తయారు చేసి... అందులో 59.71 లక్షల కిలోలను అగ్‌మార్క్ స్పెషల్ గ్రేడ్ ఆవు నెయ్యి ముసుగులో తమ సంస్థతో పాటు వైష్ణవి, ఏఆర్, మాల్‌గంగా డెయిరీల ద్వారా తితిదేకు సరఫరా చేసిన భోలేబాబా డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్‌లు ఈ అక్రమ కార్యకలాపాల కోసం విజయవాడ, చెన్నై, హైదరాబాద్, గుజరాత్, దిల్లీ, గ్వాలియర్ తదితర ప్రాంతాల్లోని పలువురు హవాలా ఏజెంట్ల ద్వారా డబ్బులు చెల్లింపులు, సొత్తు రూటింగ్ చేసినట్లు సిట్ దర్యాప్తులో తేలడంతో.. హవాలా ద్వారా ఎంత మొత్తం చెల్లించారు? సిట్ దర్యాప్తులో తేల్చినది కాకుండా ఇంకా ఎవరికైనా హవాలాలో చెల్లించారా? నాటి పాలకమండలి పెద్దలు, ఉన్నతాధికారులకు ఏమైనా సొత్తు అందిందా అనేది ఈడీ దర్యాప్తులో బట్టబయలయ్యే అవకాశముంది.

◆ తితిదేకు నెయ్యి సరఫరా చేసే టెండరు లభించేలా చేసినందుకు నాటి పాలకమండలి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ కె.చిన్నప్పన్నకు ప్రీమియర్ అగ్రిఫుడ్స్ ఎండీ జగ్‌మోహన్ గుప్తా హవాలా మార్గాల్లో రూ.50 లక్షలు చెల్లించినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. ఆ సొమ్ము మొత్తానికే లావాదేవీలు పరిమితమయ్యాయా? వారి మధ్య ఇంకా హవాలా లావాదేవీలు కొనసాగాయా అన్నది ఈడీ తేల్చే అవకాశముంది.

మళ్లించిన డబ్బు ఏం చేశారు?

కల్తీ నెయ్యి వ్యవహారంలో హవాలాతో పాటు వివిధ మార్గాల్లో వచ్చిన డబ్బు ఏం చేశారు? ఎక్కడికి మళ్లించారు అనేది ఈడీ దర్యాప్తులో తేలే అవకాశముంది. 2019-24 మధ్య కాలంలో ఎక్కడెక్కడ ఆస్తులు కొన్నారు? అందుకు అవసరమైన నగదు ఎక్కడి నుంచి సమకూరింది అనే వివరాల గుట్టు రట్టు చేసే అవకాశముంది. సిట్ విచారణలో బయటకు రాని వారి పేర్లు ఈడీ దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అవకాశముంది.


ఈనాడు

జాతికి సిగ్గుచేటు!

'డాక్టర్లకు నేను బతుకుతానన్న నమ్మకం లేదు. నా తల్లిదండ్రుల వేదన వర్ణ నాతీతం. 37 సుదీర్ఘ సర్జరీల వల్ల విపరీతమైన నొప్పి, అంతులేని నిరాశ, ఒంటరితనం కమ్మేశాయి. తీరా ప్రాణాలతో బయటపడ్డా సమాజం ఎలా చూస్తుందో, అందులో ఎలా నెగ్గుకురావాలో అనే ఆందోళన వేధించేది'- 11 ఏళ్ల వయసులో యాసిడ్ దాడికి గురై, అనంతర కాలంలో ఆత్మస్థైర్యంతో శాస్త్రీయ సంగీతంలో రాణించి, ఇటీవల 'పద్మశ్రీ' పురస్కారానికి ఎంపికైన మంగళా కపూర్ భయంకర అనుభవాలివి. రాక్షసత్వానికి పరాకాష్ఠ వంటి యాసిడ్ దాడుల వల్ల దేశంలో ఎంతోమంది జీవితాలు కల్లోలంలోకి జారి పోతున్నాయి. ఉన్మాదం తలకెక్కి, పచ్చని బతుకులను బుగ్గిచేస్తున్న పిశాచ సంతతికి త్వరితగతిన కఠిన శిక్షలు కరవవుతున్నాయి. ఈ దురవస్థపై సుప్రీంకోర్టు తాజాగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. షహీన్ మాలిక్ అనే యాసిడ్ దాడి బాధితురాలికి 16 ఏళ్లుగా తగిన న్యాయం దక్కకపోవడాన్ని జాతికి సిగ్గుచేటుగా అభివర్ణించిన న్యాయపాలిక- జుగుప్సాకర నేరాలకు పాల్ప డేవారికి గట్టి దండనలు పడేలా చట్టాలను కఠినతరం చేయాలని కేంద్రానికి సూచించింది. యాసిడ్ దాడుల కేసుల్లో దోషుల ఆస్తులను ఎందుకు స్వాధీనం చేసుకోకూడదన్న 'సుప్రీం' ప్రశ్న సైతం సహేతుకమైనదే!

ఎన్సీఆర్బీ లెక్కల ప్రకారం 2014-23 మధ్య దేశవ్యాప్తంగా రెండువేలకు పైగా యాసిడ్ దాడులు నమోదయ్యాయి. సమాజం చిన్నచూపు చూస్తుందనే ఆందోళన, కుటుంబ ఒత్తిళ్లు, ప్రతీకార చర్యల భయంతో చాలామంది నోరు నొక్కేసుకుంటుండటంతో మరెన్నో కేసులు బయటపడటం లేదన్న విశ్లే షణలు వినిపిస్తున్నాయి. పితృస్వామ్య భావజాలాన్ని తలకెక్కించుకున్న కొందరు ప్రబుద్ధులు తమను కాదన్నారన్న కారణంతో యువతులపై ఎక్కు వగా ఇలాంటి హేయ దారుణాలకు పాల్పడుతున్నారు. నిండు జీవితాన్ని నర కప్రాయంగా మార్చే యాసిడ్ దాడులను నివారించేందుకు పుష్కర కాలం కిందటే చట్టాలను పదును తేల్చారు. కానీ, వ్యవస్థాగత లోపాల వల్ల కేసులు ఒక కొలిక్కి రావడంలేదు. అధికారిక లెక్కల ప్రకారం 2023 నాటికి అలాంటి 689 కేసుల్లో విచారణలు పెండింగ్లో పడి ఉన్నాయి. ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ్బెంగాల్, గుజరాత్ వంటి చోట్ల అవి ఎక్కువగా పోగుపడ్డాయి. అప రిష్కృత కేసుల గుట్టను వేగంగా కరిగించాలంటే సుప్రీంకోర్టు సూచించినట్లు, ప్రత్యేక కోర్టులను కొలువుతీర్చాలి. దాంతో పాటు నిస్సహాయ బాధితుల పట్ల సమాజం, అధికార యంత్రాంగం మానవీయతతో వ్యవహరించాలి!

దేశంలో పదికీ పరక్కీ యాసిడ్ విచ్చలవిడిగా దొరుకుతుండటం క్రూర నేరగాళ్లకు కలిసివస్తోంది. న్యాయపాలిక ఆంక్షలు విధించినప్పటికీ చాలాచోట్ల యధేచ్ఛగా ప్రాణాంతక రసాయనాల విక్రయాలు సాగుతున్నాయి. అసలే పుట్టెడు దుఃఖంలో ఉండే యాసిడ్ దాడుల బాధితులకు నష్టపరిహారాలూ సకాలంలో అందడంలేదు. ఇటీవల జరిగిన ఒక అధ్యయనం ప్రకారం, 21 శాతం మందికే పరిహారం దక్కింది. చాలా మంది వైద్య ఖర్చులను సొంతంగా భరించాల్సి వస్తోంది. కౌన్సెలింగ్, పునరావాసమూ మాటలకే పరి మితమవుతున్నాయి. 'కేసును సెటిల్ చేసుకోవాలని దర్యాప్తు అధికారి నాపై ఒత్తిడి తెచ్చారు' అన్న షహీన్ మాటలు- నేరగాళ్లకు వంతపాడే కొందరు పోలీసుల పెడబుద్ధులను పట్టిస్తున్నాయి. అలాంటి వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలి. భావోద్వేగాలపై నియంత్రణ లేనివారు, వివక్షాపూరితమైన ఆలోచనలు కలిగినవారే యాసిడ్ దాడుల వంటి అకృత్యాలకు తెగబడు తుంటారు. చిన్నప్పటి నుంచే నైతిక విలువలు నేర్పుతూ, నేరాల విపరిణా మాలపై విద్యాలయాల్లో అవగాహన కల్పిస్తూ నవతరాన్ని సక్రమంగా తీర్చిదిద్దుకోవడంపై అందరూ దృష్టిపెట్టాలి!



దయ్యాలూ భూతాలూ నిజంగానే ఉంటాయి.
కాకపోతే ఎక్కడో చీకటి తావుల్లో కాదు,
మన మనసులోనే. చేయకూడని పని చేస్తున్నామూ
అంటే అవి మనల్ని ఆడిస్తున్నాయని అర్థం.
వాటిని గెలిస్తే లోకాన్ని గెలవడం కష్టం కాదు.

– స్టీఫెన్ కింగ్, అమెరికన్ రచయిత

సహనం ఒక వరం

ఆధ్యాత్మిక లక్ష్యాలను చేరుకోవాలన్నా, భౌతికమైన కోరికలు తీర్చుకోవాలన్నా మనిషికి సహనం తప్పనిసరి. నిర్దిష్ట లక్ష్యాలను సాధించడానికి భావోద్వేగాలను అదుపులో ఉంచుకుంటూ, నిరంతరం అంకితభావంతో చేసే కృషే- సహనం. అవాంతరాలను ఆత్మస్థైర్యంతో, పట్టుదలతో ఎదుర్కొని; పొగడ్తలకు, విమర్శలకు ప్రాధాన్యమివ్వకుండా చేసే యజ్ఞం అది. ఏ రంగంలోనైనా కోరుకున్న ఫలితాలను సాధించాలంటే సహనం చాలా అవసరం. ప్రపంచ మనుగడంతా సహనశీలతతోనే ముడిపడి ఉంది.

మనిషి సంకుచితత్వం, స్వార్థం, పాపాలు, అతిక్రమణలు, ప్రేమరాహిత్యం... అన్ని టినీ ఈ పుడమి తల్లి భరిస్తోంది. అందుకేనేమో తమిళ కవి, తత్వవేత్త తిరువళ్లు వార్ సహనాన్ని భూమాతతో పోల్చి చెప్పారు. పిల్లలతో తల్లిదండ్రులు, కన్నవారితో పిల్లలు, యజమానులతో కార్మికులు, అధికారులతో ఉద్యోగులు... ఎన్నిటినో భరి స్తారు. సహనం లోపిస్తే కుటుంబ, సంఘ జీవితాలు అస్తవ్యస్తమవుతాయి, హాయి మాయమవుతుంది. ఎంత ప్రతిభ ఉన్నా, అవకాశాలను చేజిక్కించుకుని గొప్పవాడిగా ఎదగడానికి సహనం అవసరం. అది లోపిం చడం వల్ల కలిగిన అనర్థాలకు చరిత్ర, పురాణాలు సాక్ష్యమిస్తాయి. గొప్ప గొప్ప సామ్రాజ్యాలు కూలిపోయాయి, నియంతలు మట్టికరిచారు. అసహనంతో నిండిన మనసు అసూయాద్వేషాలకు నిలయం. శ్రీకృష్ణుడు పాండవులకు సహనం పాటించడంలోని గొప్పతనాన్ని చెబుతూ పని చేస్తూనే చేయ నట్లుండమని, నిజమైన యోగి లక్షణం స్థిత ప్రజ్ఞత అని అంటాడు.



అంతర్యామి

కొన్ని పరిస్థితుల్లో సహనం వేదనను రగిలి స్తుంది. అయినా సంయమనం కోల్పోకూడదు. లక్ష్యసాధనలో ఆటుపోట్లు తప్పవు. కష్టనష్టా లను భరించగలిగే సహనాన్ని బట్టి వ్యక్తిత్వాన్ని అంచనా వేయవచ్చు. ఎదురయ్యే పరి స్థితులు ఎటువంటివైనా సుఖదుఃఖాలు, జయాపజయాలు.. శీతాకాలం వేసవి కాలాల్లా మారిపోయే రుతువుల్లాంటివి. చలించి పోకుండా సహనంతో నేర్చుకోవాలంటాడు గీతలో శ్రీకృష్ణుడు. సహనం లేని దుర్యోధనుడు కురుక్షేత్ర సంగ్రామానికి కారణమైతే, అశోకుడి అసహనం కళింగ యుద్ధంలో లక్షలాది మందిని కడతేర్చింది.

సహనం మానసిక స్వచ్ఛతకు దారిచూపి భగవదనుగ్రహానికి చేరువ చేస్తుంది. విలువైనదేదీ త్వరితగతిన దక్కదు. ఓర్పు ఉంటేనే లక్ష్యసాధనలో ఆటుపోట్లను ఎదుర్కోవచ్చు. సరైన వైఖరి, విశ్వాసం ఉంటే నిస్సహాయ పరిస్థితుల్లోనూ, అల్పమనుకున్న సందర్భాల్లోనూ అత్యద్భుతమైన మార్పులు చోటుచేసుకుంటాయి. పైపైన చూసినపుడు పరిస్థితులు క్లిష్టంగా తోస్తాయి. అవి చక్కబడటానికి ఎంతో నిరీక్షణ అవసరం. దైవంపై విశ్వాసం ఉంచి సహనాన్ని ప్రదర్శిస్తే కొండలను సైతం కదిలించవచ్చు. 'నా వల్ల ఇది సాధ్యప డిందా' అని మనిషి ఆశ్చర్యపోయే పరిస్థితులెన్నింటినో చూస్తూనే ఉంటాం. సహనానికి వివేకం తోడైతే భావోద్వేగాలను నియంత్రించుకోవచ్చు. ఎంత ప్రయాస పడినా సరైన సమయంలో, సరైంది జరిగేంతవరకూ సహనం, నిరీక్షించమనే సలహా ఇస్తూంటుంది. గుడ్డును తగినంత సమయం పొదిగితేనే పిల్ల బయటికొస్తుంది, పగలగొట్టి తీస్తే రాదు. సత్ఫలితాలు కావాలంటే సహనంగా ఉండాల్సిందే.

– మంత్రవాది మహేశ్వర్

సుస్థిర ప్రగతికి నవ పద్దు

భారత ఆర్థిక వ్యవస్థకు ఊతాన్నిచ్చే కేంద్ర బడ్జెట్ను ఫిబ్రవరి ఒకటిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెడుతున్నారు. వరసగా తొమ్మిదో సారి ఆమె కేంద్ర పద్దును పార్లమెంటు ముందుకు తెస్తున్నారు. ఈ సందర్భంగా బడ్జెట్ ఎలా ఉండాలి, ఎలా ఉంటే బాగుంటుందనే ప్రశ్నలు ఉత్పన్నమవడం సహజంగానే ఆసక్తికరం.

అమెరికా అనుసరిస్తున్న సుంకాల విధానం చాలా దేశాల ఆర్థిక వ్యవ స్థలను బలహీన పరుస్తోంది. ఇందుకు మన దేశమూ మినహా యింపు కాదు. అమెరికా సుంకాలతో భారత ఎగుమతులు దెబ్బతి న్నాయి. సంప్రదాయ రంగాలైన వస్త్ర పరిశ్రమ, రత్నాలు, ఆభరణాలు, తోలు వస్తువుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడింది. వివిధ రంగాల్లో నిరుద్యోగిత పెరిగింది. అమెరికా వాణిజ్యంలో లోటు ఏర్ప డింది. వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలతో మన సాగు ఉత్పత్తుల ధరలు పెరిగి, వేరే దేశాలతో పోటీపడలేక పోతున్నాం. రష్యా నుంచి చవకగా చమురు కొనుగోలు చేసుకుని, ఇండియా చాలా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసుకుంది. కానీ, రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై భారీగా సుంకాలు విధిస్తామని అమెరికా హెచ్చరించింది. ఇలాంటి పరిస్థితుల్లో అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని బడ్జెట్ను రూపొందించాల్సి ఉంది. పెరుగుతున్న జనాభా, ప్రపంచ దేశాలు విసురుతున్న ఆర్థిక సవాళ్లను అధిగమించాలంటే మరింత మెరుగైన వృద్ధిరేటును సాధిం చాలి. ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగిం చాలి. ఆత్మనిర్భరత లక్ష్యంగా ముందుకు సాగాలి. వృద్ధిపథాన్ని మరింత బలంగా తీర్చిదిద్ది, ప్రపం చంలో భారత ఆర్థిక స్థానాన్ని బలో పేతం చేయాలి.



దేశంలో ఆర్థిక అసమానతలు పెరు గుతుండటం ఆందోళనకరం. ఇది ఆర్థిక, సామాజిక, రాజకీయ విషమ పరిణామాలకు దారితీస్తుంది. ఎక్కువ జనాభాకు అభివృద్ధి ఫలాలు అందించేందుకు బడ్జెట్లో ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచవ్యాప్తంగా పొంచి ఉన్న ప్రమాదాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. సాంకేతికతను, కృత్రిమ మేధను సక్రమంగా ఉపయోగిం చుకుని కొత్త ఆవిష్కరణల ద్వారా ఉత్పాదకతను పెంచేందుకు దోహ దపడాలి. సమూల మార్పులకన్నా సుస్థిరతకే పెద్దపీట వేయాలి. రిజర్వ్ బ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాటల ప్రకారం ప్రస్తుతం మనం అత్యంత అనుకూలమైన పరిస్థితుల్లో ఉన్నాం. వేగ వంతమైన ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉండటం వంటి అనుకూల పరిస్థితులను బలహీనపరచకూడదు.

సులభతర విధివిధానాలు కావాలి

వ్యవసాయ రంగంలో క్రమబద్ధమైన విధానాన్ని అమలు చేయాలి. సాగు రంగం తక్షణ అవసరాలు, విశాల ఆర్థిక ప్రాధాన్యాల మధ్య సమతౌల్యం నెలకొల్పాలి. ఈ రంగంలో నెలకొన్న ప్రచ్ఛన్న నిరుద్యోగిత సమస్యను వ్యవసాయాధారిత చిన్న, కుటీర పరిశ్రమ లను ప్రోత్సహించడం ద్వారా పరిష్కరించవచ్చు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం ముఖ్యం. దేశంలో దాదాపు ఎనభై శాతంమంది చిన్న రైతులే కావడంతో భూముల ఉత్పాదకత తగ్గి, పెట్టుబడి ఎక్కువ పెట్టాల్సి వస్తోంది. దీంతో సాగు లాభసా టిగా సాగడం లేదు. బడ్జెట్ చిన్న, సన్నకారు రైతులకు ఆదాయం పెంపు హామీ, ఉత్పత్తుల్ని అమ్ముకోవడానికి మార్కెట్లో అవకా శాలను, రుణ సౌకర్యాన్ని కల్పించాలి. ఆధునిక సాగు పద్ధతులను ప్రోత్సహించాలి. సుస్థిర వ్యవసాయ వృద్ధిని సాధించేందుకు ప్రోత్సా హకాలు కల్పించాలి. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో పంట దిగుబడి నష్టం వంటి ఆటుపోట్లను ఎదుర్కొనేందుకు మరిన్ని సంస్కరణలను, ప్రోత్సాహకాలను చేర్చాలి. అమెరికా సుంకాల ధాటికి సాగు రంగం కుదేలవకుండా, రైతన్నలను ఆదుకునేందుకు ప్రాధాన్యమివ్వాలి. వ్యవసాయ రంగంలో సౌరవిద్యుత్తు వినియోగం తదితర అంశాలపై దృష్టి సారించాలి.

దేశంలో ఉద్యోగం చెయ్యగలిగే వయస్కులు ఎక్కువగా ఉండటం సంతోషకరమే. ఇంతమందికి సరైన ఉపాధి కల్పించడమూ పెద్ద సవాలే. కేవలం బడ్జెట్ కేటాయింపులతోనే ఈ సమస్య తీరదు. ఇందుకు సుస్థిర, వేగవంతమైన ఆర్థిక వృద్ధి అవసరం. ఇలాంటి జటిల సమస్యపై బహుముఖ విధానాల్ని అవలంబించాలి. ఉత్పత్తి రంగానికి చేయూత ఇవ్వాలని ప్రభుత్వం దృఢసంకల్పంతో ఉంది. అదే సమయంలో మూలధన వ్యయాన్ని పెంచాలి. కృత్రిమ మేధను అధికంగా ఉపయోగించాలి. ఆధునిక టెక్నాలజీని శాసించేలా నిపుణు లను తయారు చేయాలి. భారతదే శాన్ని ప్రపంచ ఔషధాలయంగా చెబు తారు. బడ్జెట్లో ఈ రంగానికి పన్నుల విరామం ప్రకటించాలి. ముఖ్యంగా పరిశోధన, అభివృద్ధి విభాగంలో ఈ వెసులుబాటు ఇవ్వాలి. పటిష్ఠమైన ట్యాక్స్ క్రెడిట్లు, ఔషధ ఆవిష్కరణల్లో ప్రభుత్వం చేయూత ఇవ్వాలని ఈ రంగం ఆశిస్తోంది. స్టార్టప్లకూ ఆశించిన ప్రోత్సాహకాలు కల్పించాలి. పెట్టుబడులు తేలికగా లభించాలి. అందుకు సులభతరమైన విధివిధా నాలు రూపొందించాలి.

వనరుల కల్పన ముఖ్యం

గత బడ్జెట్ వేతన మిత్రగా పేరొం దింది. ఈసారి కూడా మినహాయిం పులు, తగ్గింపులను కొనసాగించాలి. స్టాండర్డ్ డిడక్షన్ను పెంచవచ్చు. దీర్ఘకాలిక పెట్టుబడి లాభాలపై మినహాయింపు పరిమితిని రెండు లక్షల రూపాయలకు పెంచే అవకాశముంది. ఆరోగ్య బీమాపై పన్ను తగ్గింపులు ఉండాలి. గృహ రుణాల చెల్లింపులపై పన్నులపరంగా కొంత వెసులుబాటు కల్పిం చాలి. మహిళా శిశు సంక్షేమానికి మరిన్ని కేటాయింపులు అవసరం. అంగన్వాడీ, పోషణ, మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య పథకాలపై కేటా యింపులు పెంచి, అవి లబ్ధిదారుల ప్రయోజనాల కోసం సక్రమంగా వినియోగమయ్యేలా చూడాలి. విద్యారంగానికి కేటాయింపుల్లో పరిమా ణాత్మక మార్పులతోపాటు, గుణాత్మక మార్పులు రావాలి. పాఠశాల స్థాయి నుంచే కృత్రిమ మేధలో ఉత్తమ శిక్షణ కల్పించాలి. బడ్జెట్లో సరైన ప్రోత్సాహకాలు లభిస్తే, ఇండియా కృత్రిమ మేధను ఉపయో గించే ముఖ్య కేంద్రంగా అవతరిస్తుంది. వైద్య, ఆరోగ్యరంగాల్లో మౌలిక సదుపాయాలు పెంచాలి. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని విస్తరించాలి. సుస్థిరమైన, పటిష్ఠమైన ఆర్థిక వ్యవస్థను కొనసాగించేందుకు, అన్నిరం గాల్లో కృత్రిమ మేధను వాడేందుకు అవసరమైన వనరుల కల్పన జర గాలి. ఆర్థిక అసమానతలను తగ్గించడమే లక్ష్యంగా, టారిఫ్ గండా లను దృష్టిలో పెట్టుకుని, సుస్థిరమైన, వేగవంతమైన ప్రగతి సాధనకు తాజా బడ్జెట్ బంగారు బాటలు వేస్తుందని ఆశిద్దాం.



డాక్టర్ పి.ఎస్.ఎస్.మూర్తి
మాజీ డైరెక్టర్, ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా

హరీష్ నిస్పృహలో ఉన్నాడు. తనతోటి వాళ్లు చాలామంది ఉద్యోగాల్లో కుదురుకున్నారు. తను ఇంకా పోటీ పరీక్షలు రాస్తూనే ఉన్నాడు. ఒకటి, రెండు ప్రయత్నాలు విఫలమవ డంతో అతడిలో ఉత్సాహం నీరుకారిపోతోంది. ఆత్మవిశ్వాసం అడుగంటుతోంది. టీచింగ్ అంటే తనకి చిన్నప్పటినుంచి ఎంతో ఇష్టం. కాలేజీలో చరిత్ర పాఠాలను కథల్లాగా చెప్పిన మధుసూదన్ సార్ అందుకు స్ఫూర్తి. అందుకే ఎంఏ, బీఈడీ చేశాడు. ప్రభుత్వ టీచర్ ఉద్యోగం సాధించాలన్నది అతడి ఆశయం. కానీ పోటీ చూస్తుంటే అది తనవల్ల కాదే మోననిపిస్తోంది. మరీ నిరాశలో కూరుకుపోతున్నానేమో అనిపించి మధుసూదన్ సార్ని కలవడానికి వెళ్లాడు.

ప్రయత్నం ఆపొద్దు!



పాతికేళ్ల బోధనావృత్తిలో ఎందరో విద్యార్థులను చూసిన ఆయన హరీష్ మానసిక పరి స్థితిని సులభంగా గ్రహిం చారు. అతడిలో ఉత్సాహాన్ని నింపాలని కబుర్లలోకి దింపారు. 'హరీష్... నీకు ప్రతీక్షా తోండ్వాల్కర్ గురించి తెలుసా' అని అడిగారు. తెలి యదన్నాడు హరీష్. 'అదేంటి, పేపర్లో వచ్చింది కదా' అన్నా రాయన. ఖాళీగా ఉండలేక ప్రైవేటు స్కూల్లో టీచరుగా చేరానని, ఖాళీ సమయంలో ప్రిపరేషన్ కొనసాగిస్తున్నానని అందుకే పేపర్లు సరిగ్గా చదవడం లేదని చెప్పాడు హరీష్.

'అయితే నేను చెబుతా విను' అంటూ ప్రతీక్షా తోండ్వా ల్కర్ జీవితకథ చెప్పారాయన.

'ముంబయికి చెందిన ప్రతీక్షది నిరుపేద కుటుంబం. పదిహేడేళ్లకే పెళ్లయింది. పద్దెనిమిదేళ్లకే తల్లయింది. ఇరవయ్యేళ్లు వచ్చాయో లేదో రోడ్డు ప్రమాదంలో భర్త మరణించాడు. కొడుకును పోషించుకోవాలి కాబట్టి భర్త బుక్బైండర్గా పనిచేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయానికి వెళ్లి తనకేమైనా పని చూపమని అడిగింది ప్రతీక్ష. విద్యార్హతలేమీ లేని ఆమెను నెలకు రూ.65 జీతంతో తాత్కాలిక స్వీపర్గా తీసుకున్నారు. నాలుగు దశాబ్దాల క్రితమే అయినా ఆ జీతం దేనికీ సరి పోయేది కాదు. పావలా మిగిలినా కొడుక్కి బిస్కట్లు కొన వచ్చని బస్సు ఒక స్టాప్ ముందే దిగేసి నడుచుకుంటూ వెళ్లేది. ఆఫీసులో ఎవరే పని చెప్పినా చేసి పెట్టేది. అలాంటి పనులు చేయాల్సి వచ్చినందుకు బాధపడినా, చుట్టూ చదువుకున్నవాళ్లను చూసిన ఆమెలో తానూ చదు వుకుని మంచి భవిష్యత్తును సొంతం చేసుకోవాలన్న పట్టు దల పెరిగింది. బంధువులు, బ్యాంకు ఉద్యోగులు ఆమెను ప్రోత్సహించారు. ఒక్కటొక్కటిగా పరీక్షలు పాసవుతూ సైకాలజీలో డిగ్రీ పూర్తిచేసింది. అర్హతలతోపాటే ఆమె ఉద్యోగ స్థాయీ పెరిగింది. స్వీపర్ నుంచి మెసెంజర్గా, తర్వాత క్లర్క్గా, క్లర్క్ నుంచి ట్రైనీ ఆఫీసర్గా ఎదిగి పిల్లాణ్ని చక్కగా చదివించుకుంది. నాలుగేళ్ల క్రితం అసి స్టెంట్ జనరల్ మేనేజర్గా పదోన్నతి సాధించిన సంద ర్భంగా ప్రతీక్ష కథ అందరి దృష్టినీ ఆకర్షించింది. తప్పని సరి పరిస్థితుల్లో స్వీపరుగా చేరిన ఆమె ఆ బ్యాంకులోనే ఏజీఎం స్థాయికి ఎదుగుతానని ఏనాడూ ఊహించలేదు. పట్టుదల, స్వయంకృషి ఆమెను విజేతగా నిలిపాయి. ఆమెకే కాదు, ఆ లక్షణాలు ఉంటే ఎవరైనా విజేతలు అవుతారు. చేయాల్సిందల్లా పట్టు వదలకుండా ప్రయత్నిం చడమే...' చెబుతూ హరీష్ భుజం తట్టారు మధుసూదన్.

– డాక్టర్ సుంకర గోపాలయ్య

అప్పుల కుప్ప అమెరికా!



అమెరికా ప్రపంచంలోనే అగ్రరాజ్యంగా, అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా వెలుగొందుతోంది. కానీ, అప్పులతోనే బండి నడిపిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద అప్పుల కుప్పగా మారింది. నికర రుణగ్రహీతల్లో అగ్రస్థానంలో నిలుస్తోంది. గడచిన సంవత్సర కాలంలో అమెరికా అప్పు రోజుకు 660 కోట్ల డాలర్ల చొప్పున పెరిగింది. మరోవైపు, నికర రుణ దాతల జాబితాలో జర్మనీ, చైనా, జపాన్ అగ్రశ్రేణి దేశాలుగా ఉన్నాయి. నిరుడు రెండో త్రైమాసికం నాటికి వివిధ దేశాల పరిస్థితి ఇదీ...


(ఆధారం: భారత ఆర్థిక సర్వే 2025-26)



లక్షలకోట్ల డాలర్లలో...

నికర రుణదాతలు

జర్మనీ	3.9
చైనా	3.8
జపాన్	3.6
హాంకాంగ్	2.3
నార్వే	1.9
యూరోఏరియా(ఈఏ)	1.7
కెనడా	1.3
స్విట్జర్లాండ్	1.2



నికర రుణగ్రహీతలు

అమెరికా	−26.1
బ్రెజిల్	−1.1
ఫ్రాన్స్	−1.0
స్పెయిన్	−0.8
మెక్సికో	−0.6
యూకే	−0.5
ఆస్ట్రేలియా, గ్రీస్	−0.4
తుర్కియే, పోలాండ్, ఇండియా	−0.3

సాహితీ విమర్శకు దారిదీపం

అభ్యుదయ రచయితగా తెలుగు సాహితీ లోకంలో మంచి గుర్తింపు ఉన్న డాక్టర్ చందు సుబ్బారావు 1946 మే 18న తెనాలి సమీపంలోని చదలవాడ గ్రామంలో జన్మించారు. ప్రగతిశీల సాహి తీవేత్తగా ఎదగడానికి మేనమామ అభ్యుదయ రచయిత బొల్లి ముంత శివరామకృష్ణ రచనలు, వ్యక్తిత్వం స్ఫూర్తినిచ్చాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి భూ భౌతిక శాస్త్రవిభాగంలో 1969లో అధ్యాపకులుగా చేరి ఆచార్యుడిగా, విభాగాధిపతిగా సేవలందించారు. 2006లో ఉద్యోగ విరమణ చేశారు. ఈ ఏడాది జనవరి 29న కన్నుమూశారు. 'బేషరతుగా ప్రశంసించు. పావో పరకో కీర్తి నాశించు ఇస్తారు. ఆనందించు. నిజాన్ని పలకవద్దు. నిప్పులాంటిది, కాలుతుంది' అని విమర్శకుల దుస్థితిని తనదైన బాణీలో ఎత్తి చూపారు.

వర్తమాన తెలుగు సాహితీ విమర్శకుల్లో తనదైన స్థానాన్ని పదిలంగా నిలుపుకొన్న ఉత్తమ విశ్లేషకులు ఆచార్య చందు సుబ్బారావు. సాహిత్య విస్తృత ప్రయోజనాలకు విమర్శ ఉపయోగపడాలన్నది ఆయన అభిప్రాయం. ఉత్తమ విమర్శకుడిగా ఆలోచనాపరులైన సాహితీవేత్తగా గుర్తింపు పొందిన సుబ్బారావు మొన్న గురువారం కీర్తిశేషులయ్యారు.



విమర్శకుడు శత్రువు కాదు

గాంధీ తత్వం, నెహ్రూ రచనలు, రష్యన్, ఆంగ్ల నవలలు, కార్ల్ మార్క్స్ మ్యానిఫెస్టో, భారతభాగవతాలు, శతకాలు వంటివన్నీ చందు అధ్యయన చైతన్యానికి మూలాలు. తొలినాళ్లలో కరుణశ్రీ, మలినాళ్లలో వేమన, గురజాడ, శ్రీశ్రీ, ఆరుద్ర, రాచకొండ, గోపీచంద్... సాహిత్య చైతన్యాన్ని ప్రోదిచేసినవారుగా ఆయన చెప్పే వారు. 1968లో రాసిన 'విష వాయువులై' అనే కథ ఆయన తొలి రచనగా చెబుతారు. కథ, నవల, విమర్శ అనువాద ప్రక్రియల్లో రచ నలు చేశారు. శిలాఖండం సుబ్బారావు కథల సంపుటి, హిమపుత్రి నవలికల సంపుటి, కవి-విమర్శకుడు, సాహిత్యాభినివేశం, చందన చర్చ, నవ్యాలోకనం, శిల్పదృష్టి, సాహిత్యమూ-సైన్సూ వంటివి విమర్శ గ్రంథాలు. తన హృదయంలో శ్రీశ్రీ కవిత్వాన్ని అధిష్ఠాన రూపంగా నిలుపుకొన్న చందు సుబ్బారావు మహాప్రస్థానంలోని కొన్ని కవిత లను ఆంగ్లీకరించారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్ష బాధ్యతలు నిర్వహించి, అరసం కార్యవర్గ సభ్యులుగా చిరకాలంగా ఉంటూ వామపక్ష భావ జాలాన్ని జీర్ణించుకున్న సుబ్బారావు... ఆ కోవ లోని రచయితల రచనలనూ నిర్మాణాత్మకంగా విమర్శించడానికి సంకోచించలేదు. ఏదో వంక పెట్టి ఒక రకం సాహిత్యాన్ని తృణీకరించడం కన్నా, ఆ సాహిత్యం నిర్వహించిన చారిత్రక భూమికను గుర్తించమంటారు. తాపీ ధర్మారావు, రా.రా.లను గౌరవిస్తూనే వారి విమర్శ విధానాలను ఆక్షేపించారు. రచనను సమాజపరం చేయడం విమర్శ కర్తవ్యం. మనిషికి వైద్యుడు ప్రాణదాత అయినట్టే విమర్శకుడు రచయితలకు హితైషి. అందుకే చందు 'కవికి విమర్శకుడు శత్రువు కాదు' అని గట్టిగా చెప్పారు. శిల్పం కొరవడితే వస్తువు ఎంత గొప్పదైనా జనంలోకి వెళ్లదన్నారు. ప్రేమ, శృంగారం స్వల్ప విషయాలు కావని చందువంటి వామపక్ష మేధావి అభిప్రాయపడటం ఒకింత ఆశ్చర్యం కలిగించినా, ఆయన విశ్లేషణకు ముగ్ధులమవుతాం.

వక్తగానూ ప్రసిద్ధులే...


భారతీయ కవితాత్మను చందు సుబ్బారావు పట్టుకున్న తీరు ఆయన విస్తృతమైన అధ్యయన, వివిధ భాషా సాహిత్యాల పరిజ్ఞా నానికి నిదర్శనం. ఆధ్యాత్మిక భౌతిక మానవతావాద హృదయ సంస్కారాల్ని పోగు చేసేది సాహిత్యకళ అని చందు విశ్వాసం. ఆయన గొప్ప వక్త కూడా. ప్రాచీన కావ్యాల్లోని పద్యాలనూ, ఆధునిక వచన కవిత్వాన్నీ, సినిమా పాటలనూ ఉదహరిస్తూ అనర్గళంగా ప్రసంగించే వక్తృత్వ కళ ఆయన సొంతం. ఆంధ్ర ప్రదేశ్ అధికార భాషాసంఘం సభ్యుడిగా విధులు నిర్వహించిన సుబ్బారావును ఆవంత్స సోమసుందర్ పురస్కారం వంటివి ఎన్నో వరించాయి. సాహితీ సమాజానికి భౌతికంగా దూరమైనా ఆయన భావాలు, ప్రతిపాదనలు, విమర్శ ప్రస్థానం విస్మరించలేనివి.

– డాక్టర్ దామెర వేంకట సూర్యారావు

యంగెస్ట్ సైంటిస్ట్.. గగన్!

హాయ్! బుజ్జీ!!

కాసేపు ఖాళీగా కూర్చుంటే చాలు.. 'పెన్సిల్ ఎందుకు ఈ ఆకారంలో ఉంది, వాటర్ బాటిల్ను ఇలా కాకుండా వేరే ఆకారంలో తయారుచేస్తే ఎలా ఉంటుంది? టీవీ రిమోట్లో సెల్స్ పక్కకి పెట్టి తయారుచేస్తే ఎలా ఉంటుంది?' ఇలా బోలెడు ఆలోచనలు చేస్తాం. అలా తనకు వచ్చిన ఆలోచనతోనే అద్భుతాలు సృష్టిస్తున్నాడో నేస్తం..



నాగర్కర్నూల్ జిల్లా బల్మూర్కు చెందిన గౌరమోని గగన్ చంద్ర ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. తనకు చిన్నప్పటి నుంచే ఎలక్ట్రిక్ పరికరాల మీద ఆసక్తి ఎక్కువ. ఇంట్లో ఉన్న చిన్న వస్తువులతో ఏదో ఒక కొత్త ఆవిష్కరణ చేయడానికి ప్రయత్నించేవాడట. అంతేకాకుండా తయారుచేసిన వస్తువులను తన యూట్యూబ్ ఛానెల్లో పోస్ట్ చేస్తుంటాడు. ఒకరోజు గగన్ వాళ్ల నాన్నతో కలిసి ఎలక్ట్రిక్ సైకిల్ కొనడానికి వెళ్తే, రూ.40 వేలు అవుతుందని చెప్పారట. అంత ఖర్చు దేనికి అవుతుందని ఆలోచించి.. దాన్ని తనే తయారుచేయాలని నిర్ణయించుకున్నాడు. అనుకున్నట్లుగానే తక్కువ ఖర్చుతోనే తయారుచేశాడు. అది చూసి స్కూల్లో ఉపాధ్యాయులు దానికి సోలార్ సిస్టమ్ని కూడా జత చేస్తే బాగుంటుందని సలహా ఇచ్చారట. దాంతో 'త్రీ ఇన్ వన్ హైబ్రిడ్ సైకిల్'ని రూపొందించాడు గగన్. దాంట్లో సోలార్ సిస్టమ్, బ్యాటరీ, సాధారణ పెడలింగ్.. మూడూ ఉన్నాయి. సోలార్ సిస్టమ్ ఉంది కాబట్టి పగలు దాన్ని ఉపయోగించుకోవచ్చు. రాత్రుళ్లు బ్యాటరీ సాయంతో నడపొచ్చు. ఈ రెండూ కాదంటే.. పెడల్స్తోనూ తొక్కవచ్చు. ఇది గంటకు 30 కి.మీ. వేగంతో 100 కిలోల వరకు బరువు లాగుతుంది. అంతేకాకుండా జీపీఎస్ నావిగేషన్, గూగుల్ మ్యాప్స్, కాల్స్ చేసుకునే సదుపాయంతో పాటు సెంట్రల్ లాకింగ్ అలారమ్ సిస్టమ్ కూడా ఉన్నాయి. దీని తయారీకి రూ.25వేలు ఖర్చు అయిందట. తెలంగాణలో నిర్వహించిన గ్లోబల్ సమిట్లో ఈ సైకిల్ను ప్రదర్శించడమే కాకుండా జాతీయ స్థాయిలో ఇన్స్పైర్ అవార్డునూ అందుకున్నాడు గగన్. కొత్త ఆవిష్కరణను చేసినందుకు 'యంగ్ సైంటిస్ట్' అవార్డును గెలుచుకున్నాడు. ఆ సైకిల్ ఒకటే కాకుండా ఇంజిన్, ఎలక్ట్రిక్ బ్యాటరీ రెండూ కలిపి వినియోగించేలా ఓ బైక్ని తయారుచేశాడు. దానికి బిగించిన బ్యాటరీ సాయంతో గంటకు 90కి.మీ. వేగంతో 100 కి.మీ. ప్రయాణించవచ్చు. పెట్రోల్ ఇంజిన్తో బైక్ నడుస్తున్నప్పుడే బ్యాటరీ రీఛార్జ్ అవుతుంది. దీని తయారీకి రూ.50 వేలు ఖర్చయింది. త్రీ ఇన్ వన్ పద్ధతిలో కారును కూడా తయారుచేశాడు. భవిష్యత్తులో ఆటోమొబైల్ ఇంజినీరింగ్ చదివి.. తక్కువ ఖర్చులో ప్రజలకు అవసరమయ్యే ఆవిష్కరణలు చేయడమే తన లక్ష్యం అంటున్నాడు మన గగన్.

– నామని నవీన్

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శనివారం జనవరి 31, 2026



క్యూఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సీపీ రాజశేఖరబాబు. వేదికపై డీసీపీలు షిరీన్‌బేగం, కృష్ణకాంత్ పాటిల్, కృష్ణప్రసన్న, కె.జి.వి.సరిత

ప్రయాణికుల భద్రతే లక్ష్యం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ఆటోలకు 'రైడ్ సేఫ్టీ-క్యూఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్ సిస్టం'ను ఏర్పాటు చేశామని పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు పేర్కొన్నారు. దీని ద్వారా నగరంలోని ఆటోల పూర్తి సమాచారం పోలీస్‌శాఖ వద్ద అందుబాటులో ఉంటుందన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్స్‌లో 'రైడ్ సేఫ్టీ-క్యూఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్ సిస్టం' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఆటోకు రెండు క్యూఆర్ కోడ్లు ఉంటాయని, ఒక దాని ద్వారా వెహికల్ రిజిస్ట్రేషన్, పోలీస్ డేటా కోసమని. . రెండో కోడ్ ద్వారా ప్రయాణికుల ఫీడ్‌బ్యాక్ ఇవ్వొచ్చని తెలిపారు. ప్రతి నెలా మంచి సేవలు అందించిన ముగ్గురిని సత్కరిస్తామని తెలిపారు. ఈ విధానంతో ప్రయాణికులకు సురక్ష ప్రయాణం అందించవచ్చని వివరించారు. డీసీపీలు కృష్ణకాంత్ పాటిల్, షిరీన్‌బేగం, తిరుమలేశ్వర్‌రెడ్డి, కె.జి.వి.సరిత, కృష్ణప్రసన్న, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ చాటి... బహుమతులు సాధించి..



'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలు శుక్రవారం నిర్వహించారు. విజయవాడ లబ్బీపేటలోని శ్రీదుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల సెమినార్ హాలు ఇందుకు వేదికైంది. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందించి అభినందించారు. **- న్యూస్‌టుడే, విజయవాడ సిటీ**

విజేతలతో జేసీ ఇలక్కియా, 'ఈనాడు' విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి కిశోర్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యకుమార్

పరిశ్రమకు వైభవం

రూ.42 కోట్లతో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల నిర్మాణం

జగ్గయ్యపేట, మైలవరం, విజయవాడల్లో ఎంఎస్ఎంఈ పార్కులు



విజయవాడలో ఆరంభమైన పనులు

జిల్లాలో నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేసే ప్రయత్నాలు వేగవంతమయ్యాయి. ప్రస్తుతం విజయవాడ మధ్య, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఇప్పటికే స్థల సేకరణ పూర్తయి, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు పనులు ఆరంభించారు. ఈ మూడుచోట్ల కలిపి రూ.42కోట్లతో ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేస్తున్నారు. జగ్గయ్యపేటలో స్థలాల కేటాయింపు, మైలవరం, విజయవాడ సెంట్రల్‌లో.. ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను నిర్మించనున్నారు. వీటిని ఎంఎస్ఎంఈలతో పాటు ప్లగ్ అండ్ ప్లే సంస్థలకు ఇచ్చేలా అన్ని సౌకర్యాలతో నిర్మించనున్నారు. **ఈనాడు, అమరావతి- న్యూస్‌టుడే, జగ్గయ్యపేట**

సిద్ధమవుతున్న లేఔట్.. జగ్గయ్యపేటలో ఎంఎస్ఎంఈ పార్కు కోసం లేఔట్ సిద్ధం చేస్తున్నారు. పది ఎకరాలను చదును చేసి దరఖాస్తు చేసుకున్న పరిశ్రమలకు కేటాయించనున్నారు. ఇక్కడ మౌలిక సౌకర్యాలు కల్పించి ఎంఎస్ఎంఈలకు కేటాయించడమే కాబట్టి.. పెద్దగా సమయం పట్టదు. మొత్తం బడ్జెట్‌లో జగ్గయ్యపేట పార్కు కోసం ఖర్చు కూడా రూ.2-3 కోట్లకు మించి అవ్వదు.

ఈ రెండుచోట్ల ఇలా చేస్తారు.. మైలవరం, విజయవాడ మధ్య నియోజకవర్గంలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను నిర్మించనున్నారు. విజయవాడ మధ్య నియోజకవర్గంలోని వాంబేకాలనీలో ఉన్న ఎక్సెల్ ప్లాంట్‌కు చెందిన ఐదు ఎకరాల స్థలాన్ని దీనికోసం ఎంపిక చేశారు. ఈ స్థలం ఖాళీగా ఉండడంతో ప్రజారోగ్య విభాగం సామగ్రిని డంప్ చేశారు. వాటన్నింటినీ తొలగించే పనులు బుధవారం నుంచి ఆరంభమయ్యాయి. మైలవరంలోనూ ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌నే నిర్మించనున్నారు. దీనికోసం ఆరు ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు.

తొలుత ఒక్కో టవర్ నిర్మాణం.. ఎంఎస్ఎంఈల ఏర్పాటు కోసం మైలవరం, విజయవాడల్లో తొలుత ఒక్కో టవర్ నిర్మించనున్నారు. మిగతా స్థలంలో సెట్‌బ్యాక్, కామన్ ఏరియా, ట్రీట్‌మెంట్ ప్లాంట్ అన్నింటినీ ఏర్పాటు చేస్తారు. ఆ తర్వాత కూడా మరో రెండు టవర్ల నిర్మాణానికి స్థలం ఉంటుంది. ప్రస్తుతం విజయవాడ జక్కంపూడిలోని ఎనకమిక్ టౌన్‌షిప్(జెట్ సిటీ)లో ఎంఎస్ఎంఈ పరిశ్రమల కోసం నిర్మించిన ఐదంతస్తుల ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ తరహాలోనే.. కట్టనున్నారు. ఒక్కో అంతస్తు 21వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. మొత్తం ఐదు కలిపితే 1.26 లక్షల చ.అ. విస్తీర్ణం వస్తుంది.

55 బార్లకు గెజిట్ నోటిఫికేషన్ జారీ

సూర్యారావుపేట: జిల్లాలో 2025-28 సంవత్సరాలకు మిగిలిపోయిన 55 బార్లకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడ పరిధిలో 46, కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో 7, జగ్గయ్యపేట పరిధిలో 1, తిరువూరు పంచాయతీ పరిధిలో 1 చొప్పున ఉన్నాయి. దరఖాస్తులను ఫిబ్రవరి, 4న సాయంత్రం 6 గంటల వరకు స్వీకరిస్తారు. 5వ తేదీ ఉదయం 8 గంటలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీసి కేటాయిస్తారు. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్‌లో oc.hpfsproject.com వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అలాగే మారుతీనగర్‌లోని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖా కార్యాలయంలో నేరుగా దరఖాస్తులు అందించాలని ఆయన కోరారు.

వారిదే హవా.. వామ్మో అనేలా!

- సిట్ చెప్పిన.. ఎవరీ భరత్‌భాయ్ ఠాకూర్?
- కల్తీ నెయ్యి కేసులో విజయవాడలో మూలాలు

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, విద్యాధరపురం

సంచలనం సృష్టించిన కల్తీ నెయ్యి వ్యవహారంలో హవాలా రూపంలో లంచాల సొమ్ము చెల్లింపు మూలాలు విజయవాడలో ఉన్నట్లు సిట్ గుర్తించింది. వైకాపా జమానాలో జరిగిన ఈ వ్యవహారంలో బోలేబాబా డెయిరీ ప్రతినిధులు తమ అక్రమ కార్యకలాపాలకు హవాలా మార్గంలో డబ్బులు చెల్లించినట్లు తేలింది. ఇందులో విజయవాడ వ్యాపారి భరత్‌భాయ్ ఠాకూర్ కీలకమని వెల్లడైంది. ఇది అసలైన పేరా లేదా ఈ పేరుతో చెలామణి అవుతున్నారో తేలాలి. ఈనేపథ్యంలో విజయవాడ పాతబస్తీ కేంద్రంగా పెద్దమొత్తంలో సాగే హవాలా వ్యాపారం చర్చనీయాంశమైంది.



ఏటా రూ.500 కోట్ల లావాదేవీలు...

పాతబస్తీలో హవాలా వ్యాపారులు 50 మంది వరకు ఉన్నారు. వీరిని ఆశ్రయించి పలువురు వ్యవహారాలు సాగిస్తుంటారు. నిత్యం పెద్దమొత్తంలో వీరి ద్వారా హవాలా రూపంలో నగదు చేరవేస్తున్నారు. దిల్లీ, ముంబయి, కోల్‌కతా, హైదరాబాద్, చెన్నై, రాజస్థాన్, బెంగళూరు, రాజమహేంద్రవరం, గుంటూరు, గుడివాడ, కాకినాడ, తదితర ప్రాంతాలకూ వ్యాపారం విస్తరించింది. వీరు నగదు, బంగారం, వెండి, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వంటి ఖరీదైన వస్తువులు బిల్లు లేకుండా చేరవేసి కమీషన్ తీసుకుంటారు. ఏటా రూ.500 కోట్లు హవాలా రూపంలో చేతులు మారుతుందని సమాచారం.

కరెన్సీ నోటు నెంబరు మేరకు...

డబ్బులు, బంగారం, వెండి స్వీకరించే వారికి, చేరవేసే వారికి సంధానకర్త.. కరెన్సీ నోటు నెంబరు మాత్రమే. రూ.10, రూ.20, రూ.50, 100, రూ.500 నోటుపైన నెంబరు ఆధారంగా హవాలా వ్యాపారం జరుగుతోంది. విజయవాడలోని వ్యాపారి, గుజరాత్‌లో ఉన్న వారికి నగదు, బంగారం, వెండి చేరవేయాలంటే ఒక కరెన్సీ నోటు నెంబరు చెబుతాడు. ఆ వ్యాపారి ఏజెంటు వద్దకు వెళ్లి ఆ నోటు నెంబరు చెప్పగానే ముందే నిర్ణయించిన మొత్తం వారికి అందజేస్తాడు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీ, ఆదాయపన్నులు ఉండవు. వ్యాపార లావాదేవీల్లో తేడాలు వచ్చి అధికారులకు సమాచారం వస్తే వెలుగు చూస్తాయి.

అంతా కుమ్మక్కు...

హవాలా వ్యాపారులకు పలువురు నేతలు, పోలీసుల సహకరిస్తున్నారని ప్రచారం ఉంది. బిల్లు లేకుండా బంగారం తరలిస్తున్న రాష్ట్రేతర వ్యాపారి వ్యవహారం ఇటీవల పోలీసుల దృష్టికి వచ్చింది. ఇది వెలుగు చూడకుండా రూ. లక్షల్లో ముడుపులు తీసుకున్నట్లు తెలిసింది. జీఎస్టీ అధికారులు నామమాత్ర కేసులు నమోదు చేసి మామూళ్లు దండుకుంటున్న ఆరోపణలు ఉన్నాయి. రోడ్డు పక్కన చిన్న పాన్ షాపు నడిపే వ్యక్తి సైతం పాతబస్తీలో రూ.2.50 కోట్లు వెచ్చించి ఇల్లు కొనేస్థాయికి ఎదగడం హవాలా వ్యాపార హవాకు నిదర్శనం. నిరుడు వాణిజ్య పన్నుల విభాగంలో చిరుద్యోగి సైతం అనిశా అధికారులకు పట్టుబడటం వెనక వాటాల్లో తేడా రావడమే కారణమనే ప్రచారం జరుగుతోంది.

కమనీయం.. తిరుపతమ్మ రథోత్సవం



పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ వారి రథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. రంగుల ఉత్సవం అనంతరం అమ్మవారి విడిది మండపం నుంచి రథంపై అమ్మవారు, సహదేవతల విగ్రహాలు ఎక్కించిన అనంతరం ఊరేగింపు ప్రారంభమైంది. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యుడు రమేష్‌బాబు, తహసీల్దారు శాంతలక్ష్మి, సీఐలు వెంకటేశ్వర్లు, చవాన్ తదితరులు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు గోపీబాబు, తెదేపా మండల అధ్యక్షుడు వెంకట సీతారామయ్య, ఆలయ మాజీ ఛైర్మన్‌లు చెన్న కేశవరావు, శ్రీనివాసరావు, రఘురామయ్య, తెదేపా జిల్లా అధికార ప్రతినిధి శివరాంప్రసాద్ పాల్గొన్నారు.

ఒక్కో ఖాతాకు రూ.13 వేలు!

కమీషన్ ఆశ చూపించిన రాజస్థాన్ ముఠా

ఈనాడు - అమరావతి: ఒక్కో ఖాతాకు రూ.13 వేలు కమీషన్ ఇస్తామన్న రాజస్థాన్ ముఠా చెప్పిన మాటలు విని.. షారుఖ్ అహ్మద్ కబ్జా గ్యాంగ్‌ను పెట్టేశాడు. ఈ ప్రయత్నంలో 25 ఖాతాలు తెరిపించాడు. అవి రాజస్థాన్ చేరేలోపే పోలీసులు అరెస్టు చేశారు. కొత్తగా వెలుగుచూసిన అద్దె ఖాతాల కేసులో పలు కోణాలు బయటకు వస్తున్నాయి. అక్కడి ముఠా వివరాల కోసం పోలీసులు కూపీ లాగుతున్నారు. ఈ ముఠా కార్యకలాపాలు ఏప్రాంతాలకు విస్తరించాయనే అంశంపై దర్యాప్తు చేపట్టారు.

పెళ్లిలో పరిచయం...

రాజస్థాన్ నుంచి వచ్చిన షారుఖ్ అహ్మద్, మజీద్ కుటుంబాలు విజయవాడలో స్థిరపడ్డాయి. వీరు ఇక్కడ మార్బుల్ బండలు పరిచే పనులు చేస్తుంటారు. ఇటీవల వీరు రాజస్థాన్‌లో ఓ పెళ్లికి వెళ్లగా... వీరికి ఓ ముఠా పరిచయమై వారి ఫోన్ నంబర్లు ఇచ్చింది. క్రికెట్ బెట్టింగ్, సైబర్ లావాదేవీలకు అద్దె ఖాతాలు కావాలనీ.. నెల తర్వాత మూసేయొచ్చనీ.. ఎన్నిఉన్నా తీసుకుని ఒక్కో ఖాతాకు రూ.13 వేలు కమీషన్ ఇస్తామని ముఠా సభ్యులు అజ్జూ, యూనస్, ప్రశాంత్‌లు ఆశ పెట్టారు.

సొంతంగా గ్యాంగ్‌ను పెట్టి

విజయవాడలో స్థానికులతో ఓ గ్యాంగ్‌ను ఏర్పాటు చేసుకున్నాడు.. షారుఖ్. తనకు వచ్చే కమీషన్ నుంచి కొంత ఇస్తానని ఒప్పించి ఖాతాలు తీసుకున్నాడు. దీనికి నాగలక్ష్మి సాయం తీసుకున్నారు. ఈమె పలువురితో ఖాతాలు తెరిపించింది. కోడి పందేల లావాదేవీల నిర్వహణకు ఖాతాలు అవసరమనీ.. కొన్నాళ్లయ్యాక మూసేయొచ్చని నాగలక్ష్మి నమ్మించింది. ఈ ఖాతాలు రాజస్థాన్‌కు చేరవేసేలోపే పోలీసులకు దొరికారు. రాజస్థాన్‌లో వారి ఫోన్ నెంబర్ల ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు.

ప్రకృతి సాగు విస్తీర్ణం పెంపుపై దృష్టి

జిల్లాలో 100 గ్రామాల ఎంపిక

నందిగామ గ్రామీణం, జగ్గయ్యపేట గ్రామీణం, వత్సవాయి, పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

జిల్లాలో ప్రకృతి సేద్యం విస్తీర్ణం పెంచేందుకు కూటమి ప్రభుత్వం గ్రామైక్య సంఘాల సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. నేషనల్ మిషన్ నేచురల్ ఫార్మింగ్(ఎన్ఎంఎన్ఎఫ్)లో భాగంగా ఈ సాగు పెంచేందుకు 100 గ్రామాలను ఎంపిక చేశారు. గ్రామైక్య సంఘాల్లోని మహిళలను ఎంపిక చేసి ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్సుపర్సన్లుగా(ఐసీఆర్పీ) శిక్షణ ఇస్తున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 34 వేల ఎకరాల్లో ప్రకృతి సాగు చేయించాలన్నది లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 22 వేల ఎకరాల్లో సేద్యం చేస్తున్నారు. ఎన్ఎంఎన్ఎఫ్ కింద మరో 10 వేల ఎకరాల్లో అదనంగా సాగు చేయించాలని లక్ష్యం నిర్దేశించారు. ఐసీఆర్పీలుగా ఎంపికచేసి సభ్యులకు మండలాల వారీగా శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే 60 మంది పని చేస్తున్నారు. వరి, మొక్కజొన్న, మిర్చి, కూరగాయ పంటలు, మామిడి తదితర పండ్ల తోటలకు పురుగు మందులు పిచికారీ చేయకుండా కేవలం కషాయాలు పిచికారీ చేసేలా ప్రోత్సహిస్తున్నారు. సాధారణ సేద్యంలో రైతులు పురుగుమందులు, రసాయన ఎరువులు ఉపయోగిస్తారు. దీనివల్ల భూసారం కోల్పోయి నాణ్యమైన దిగుబడి రాకపోగా రైతులకు సాగు ఖర్చులు అధికమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయ విభాగం ఐసీఆర్పీలకు కషాయాల తయారీ, ఘన, ద్రవ జీవామృతం తయారీపై శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే రెడ్డిగూడెం మండలంలో మామిడి తోటలు, పెనుగంచిప్రోలు మండలంలో మిరప తోటలు, మొక్కజొన్న పంటలు ప్రకృతి విధానంలో సాగు చేస్తున్నారు. ఈ విధానంలో అన్నదాతలకు ఖర్చులు తగ్గడంతో పాటు నాణ్యమైన పంట దిగుబడి చేతికొస్తుంది. దీంతో మార్కెట్లో మంచి ధర లభిస్తుంది.



డీపీఎం శంకర్‌నాయక్ సమక్షంలో కషాయాల తయారీపై శిక్షణ ఇస్తున్న ఉద్యోగులు

బయోరిసోర్సు సెంటర్ల ద్వారా కషాయాల విక్రయం

ఇప్పటికే శిక్షణ పొందిన రైతులు, ఐసీఆర్పీలు తయారు చేసిన కషాయాలు, జీవామృతం తదితర ఎరువులను బయోరిసోర్సు సెంటర్ల(బీఆర్సీ) ద్వారా రైతులకు విక్రయిస్తున్నారు. జిల్లాలో 43 బీఆర్సీలు ఏర్పాటు చేసి వీటిని రైతులకు అందుబాటులో ఉంచారు. నందిగామ, పెద్దవరం, పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు, శనగపాడు తదితర గ్రామాల్లో బీఆర్సీలు ఏర్పాటుచేశారు. డీపీఎం వై.శంకర్‌నాయక్ మాట్లాడుతూ జిల్లాలో సేంద్రియ పంటల సాగు విస్తీర్ణం పెంపునకు కృషి చేస్తున్నామని, సేంద్రియ పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ఘనంగా రంగుల మహోత్సవం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: రెండేళ్లకోసారి జరిగే పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మ అమ్మవారి రంగుల మహోత్సవం ఆద్యంతం వైభవంగా కొనసాగింది. ఆలయంలోకి శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారు సహదేవతల విగ్రహాలు శుక్రవారం రాత్రికి చేరడంతో ఉత్సవం ముగిసింది. జగ్గయ్యపేట నుంచి ఈ నెల 28న ఉదయం ఎనిమిది పల్లకీల్లో బయలుదేరిన 11 విగ్రహాలను చిల్లకల్లు, భీమవరం, లింగగూడెం మీదుగా పెనుగంచిప్రోలుకు ఊరేగింపుగా చేరుకున్నాయి. పెనుగంచిప్రోలులో వేలాది మంది భక్తులు అమ్మవారికి ఘన స్వాగతం పలికారు.



మండపంలోకి శ్రీతిరుపతమ్మ, గోపయ్య స్వాములను తీసుకొస్తున్న కమిటీ సభ్యుడు రమేష్‌బాబు, పూజారులు

ప్రతిభ చాటారు.. విజేతలై నిలిచారు!

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సిటీ సెంట్రల్ పాఠశాలలో ఈనాడు, ఈటీవీ ఆధ్వర్యంలో శుక్రవారం రీజినల్ స్థాయి ఈనాడు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, చిత్ర లేఖనం, ఉపన్యాసం, క్విజ్ విభాగాల్లో విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. ఇందులో మొత్తం 96మంది విద్యార్థులు పాల్గొన్నారు. **వ్యాసరచనలో** ఎస్.సీతారామకృష్ణ చేగు విద్యాలయం(10వ తరగతి) బి.వెంకటేశ్వర చేగు విద్యాలయం(9వ తరగతి) ఎం.దీక్షిత విజ్ఞాన్ పాఠశాల(10వ తరగతి). **చిత్రలేఖనంలో** బి.దీక్షిత శ్రీచైతన్య(9వ తరగతి) టి.హాసిని నారాయణ పాఠశాల(9వ తరగతి) వై.నిహారిక సిటీ సెంట్రల్ పాఠశాల (8వ తరగతి). **ఉపన్యాసంలో** ఎస్.కె.ఫర్హాన్‌హుస్సేన్ తపోవన్ విద్యాలయం(9వ తరగతి) సీహెచ్.చరిత్ర తపోవన్ విద్యాలయం(9వ తరగతి) జి.మణికంఠ విజ్ఞాన్ పాఠశాల (8వ తరగతి). **క్విజ్‌లో** ఓ.ధరణి తపోవన్ విద్యాలయం (9వ తరగతి) బి.యస్వంత్ చేగు విద్యాలయం(9వ తరగతి) ఎస్.సాయి నారాయణ పాఠశాల (9వ తరగతి) విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ఎంఈవో చిట్టిబాబు విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. పోటీలకు ప్రధానోపాధ్యాయులు జి.డి.వి.ప్రసాద్, కె.రాము, ఈశ్వరయ్యశెట్టి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.



బహుమతులు సాధించిన విద్యార్థులతో ఎంఈవో చిట్టిబాబు

సమయం వృథా కానివ్వొద్దు

మైలవరం, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో చదువుపైనే దృష్టి కేంద్రీకరించాలని, ఇతర వ్యాపకాలతో సమయాన్ని వృథా చేసుకోవద్దని మండల విద్యాశాఖాధికారి ఎల్.బాలు సూచించారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా శుక్రవారం స్థానిక విజ్ఞాన విద్యాలయ సంఘ భవనంలో మండల స్థాయి పోటీలు నిర్వహించారు. బహుమతి ప్రదానోత్సవ సభలో ఎంఈవో మాట్లాడుతూ ఒకప్పుడు ప్రతిభ చాటాలన్నా కనీస అవకాశాలు లేవని, 'ఈనాడు' ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా అటువంటి పోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు మంచి అవకాశం కలుగుతోందని చెప్పారు. పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులంతా ఉత్సాహం చూపాలని విశ్రాంత ఎంఈవో జడ్.నాగిరెడ్డి కోరారు. పోటీలకు విశ్రాంత ఉపాధ్యాయులు డి.వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం తదితరులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

వ్యాసరచనలో.. : సగ్గుర్తి సాక్షి దావ్యన్(పుల్లూరు హైస్కూల్), ఐ.అనువర్షిణి(వివేకానంద హైస్కూల్), కె.రిషిత కుమార్(గౌతమ్ హైస్కూల్). **చిత్రలేఖనంలో..** : డి.వెంకట సునంద్(గౌతమ్ హైస్కూల్), ఎస్.అభిరామ్(బాలుర జడ్పీ హైస్కూల్), ఎన్.శంకరి(ఎస్ఎస్‌కే హైస్కూల్). **ఉపన్యాస పోటీల్లో..** : కె.రిషిత కుమార్(గౌతమ్ హైస్కూల్), ఎస్కే నాగుల్ షరీఫ్(బాలుర జడ్పీ హైస్కూల్), సీహెచ్.కార్తికేయ(గౌతమ్ హైస్కూల్). **క్విజ్‌లో..** : కె.హర్షిని(గౌతమ్ హైస్కూల్), ఎస్.సాయి సహస్ర(వివేకానంద హైస్కూల్), పి.హేమంత్(ఎస్ఎస్‌కే హైస్కూల్)లు ఆయా విభాగాల్లో వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు.



విజేతలతో ఎంఈవో బాలు, నాగిరెడ్డి, వెంకటేశ్వరరావు

ఎనిమిది రైల్వే విభాగాలకు అవార్డులు

ఈనాడు, అమరావతి: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని ఎనిమిది విభాగాల ఉత్తమ పనితీరుకు ఎఫీషియన్సీ షీల్డ్‌లు వరించాయి. డివిజన్‌కు చెందిన 13 మంది అధికారులు, సిబ్బందికి విశిష్ట రైల్ సేవ పురస్కారాలు దక్కాయి. దక్షిణ మధ్య రైల్వే వార్షికోత్సవాలను సికింద్రాబాద్‌లో గురువారం నిర్వహించారు. ఉత్తమ సేవలు అందించిన డివిజన్లు, విభాగాలకు ఎఫీషియన్సీ షీల్డ్‌లు, ఉద్యోగులకు సేవా పురస్కారాలను అందజేశారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ చేతుల మీదుగా విజయవాడ డీఆర్ఎం మోహిత్ సోనాకియా సహకులతో ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పురస్కారాలు అందుకున్నారు.



జీఎం శ్రీవాస్తవ నుంచి కమర్షియల్ విభాగంలో ఎఫీషియన్సీ షీల్డ్ అందుకుంటున్న డీఆర్ఎం మోహిత్ సోనాకియా, సీనియర్ డీసీఎం ప్రశాంత్‌కుమార్

విశిష్ట సేవా పురస్కారాలు అందుకున్న వారిలో అధికారులు.. దీపేంద్ర మర్కార్(డీఈఈ), కె.తులసీరామ్(డిప్యూటీ సీఈ), బి.వి.ఎస్.ఎస్. మూర్తి(ఏఈఎన్) ఉన్నారు. ఆయా విభాగాల సిబ్బంది.. సీహెచ్.ప్రదీప్ చంద్ర(కమర్షియల్ ఇన్‌స్పెక్టర్), వి.కృష్ణనాయక్(సీనియర్ టెక్నీషియన్-ఈఎంయూ), భాదర్‌షా షేక్(ఎస్ఎస్ఈ), వై.శ్రీనివాసరావు(ఎస్ఎస్ఈ), శ్రీధర్ శ్రీరామ్(టెక్నీషియన్ గ్రేడ్-1), పూజపాటి అరుణ్ రాజ్‌కుమార్(జేఈ), ఎస్.కె.రహమతుల్లా(చీఫ్ హెల్త్ మలేరియా ఇన్‌స్పెక్టర్), నల్లబోలు కృష్ణసాయి(చీఫ్ కంట్రోలర్), ఎస్.రామకృష్ణ(సీనియర్ గూడ్స్ ట్రైన్ మేనేజర్), వి.శ్రీకాంత్(ఎస్ఎస్‌ఈ) తదితరులున్నారు.

ఎఫీషియన్సీ షీల్డ్‌లొచ్చిన విభాగాలు.. కమర్షియల్, ఎలక్ట్రికల్, లోకో షెడ్, సివిల్ ఇంజినీరింగ్, మానవ వనరులు, మెడికల్ రిలీఫ్ వ్యాన్, నూతన ఆవిష్కరణల విభాగంలో ఎఫీషియన్సీ షీల్డ్‌లు వచ్చాయి.

'లడ్డూ కల్తీపై చర్చించే ధైర్యం ఉందా?'

పటమట, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ... కల్తీ నెయ్యి వ్యవహారంపై చర్చించే ధైర్యం మాజీ సీఎం జగన్‌కు ఉంటే అసెంబ్లీకి రావాలని ఆంధ్రప్రదేశ్ సామాజిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య సవాల్ విసిరారు. శుక్రవారం విజయవాడలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాల సేకరణ చేయని కంపెనీల నుంచి నెయ్యి కొనుగోలు చేశారని, నెయ్యిలో కల్తీ జరిగిందని సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తులో బయట పడిందే.. వైకాపా నేతలు మాత్రం నెయ్యిలో జంతువుల కొవ్వు లేదని సిట్ తేల్చిందంటూ దొంగ తిరుగుడు సమాధానాలు చెబుతున్నారని మండిపడ్డారు. వైకాపా నేతలు ఏజెంట్లను నియమించుకొని కల్తీ నెయ్యి సేకరించి రూ. కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. తితిదే మాజీ ఛైర్మన్ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్ప ఖాతాలో సుమారు రూ.5 కోట్లు ఉన్నాయని, విజయవాడ ప్రాంతంలోని వైకాపా నేతల ఖాతాల్లో రూ.కోట్లు ఉన్నాయని ఆరోపించారు. అందులో ఎవరికి ఎంత వాటా వచ్చిందో లెక్కలు తేలాలన్నారు. సిట్ విచారణలో అడ్డంగా దొరికిన నెయ్యి కల్తీ దొంగలు.. కూటమి ప్రభుత్వంపై నిందలు వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ఆస్పత్రుల్లో దివ్యాంగులకు ర్యాంపు సౌకర్యం

ఎన్టీఆర్ కలెక్టరేట్: ఆసుపత్రులకు వచ్చే దివ్యాంగులకు ర్యాంపు సౌకర్యం కల్పించడంతో పాటు, ఉచిత ఆరోగ్య సంరక్షణ చికిత్సలో ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలని కలెక్టర్ జి.లక్ష్మీశ వైద్య శాఖాధికారులను ఆదేశించారు. వీరికి పాఠశాలల్లో ప్రవేశం, సౌకర్యాల కల్పనపై విద్యాశాఖ ఆధ్వర్యంలో నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారంపై నగరంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మేధో వైకల్యం కలిగిన పిల్లల యూడీఐడీ కార్డులను పొందడంలో ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా రుణాలు మంజూరు చేసి, వారి ఆర్థిక ప్రగతికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ బి.కామరాజు, ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇందుమతి, మెప్మా పీడీ పి.ఎం.కృష్ణప్రసాద్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవ నగేశ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -143 రిటైల్ ధర 170 చికెన్ విత్ స్కిన్ - 247 చికెన్ స్కిన్‌లెస్ - 281.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 162, 171, 182 చికెన్ విత్ స్కిన్ - 314 చికెన్ స్కిన్‌లెస్ - 324.

ఇంజినీర్ల ఉద్యోగ విరమణ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఒకే రోజున ఇద్దరు సీనియర్ ఇంజినీర్లు పదవీ విరమణ చేయడం జలవనరుల శాఖకు లోటేనని, ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. రాష్ట్ర జలవనరుల శాఖ పరిపాలన ఈఎన్సీ శ్యామ్ ప్రసాద్, డిప్యూటీ ఈఎన్సీ వీరపత్రాప్‌లు శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా నగరంలోని జలసౌధ భవనంలో మంత్రి వారిని సత్కరించారు. శేష జీవితం ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. శాఖాపరంగా వారి సేవలను వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



పరిపాలన ఈఎన్సీ శ్యామ్‌ప్రసాద్, డిప్యూటీ ఈఎన్సీ వీరపత్రావ్‌లను సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

బాలల సంరక్షణ కేంద్రాల రిజిస్ట్రేషన్‌కు అవకాశం


విద్యాధరపురం, న్యూస్‌టుడే: బాలల సంరక్షణ కేంద్రాల రిజిస్ట్రేషన్‌కు ఫిబ్రవరి 13వ తేదీలోపు నిర్వాహకులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా అదనపు పర్యవేక్షణాధికారి టి.జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లల సంరక్షణ, రక్షణ చట్టం 2015లోని సెక్షన్ 41 కింద కేంద్రాలకు తప్పనిసరి రిజిస్ట్రేషన్ అవసరమని పేర్కొన్నారు. దరఖాస్తు సహా అన్ని కాపీలను జత చేసి విజయవాడ, కబేళా సెంటరు, రోటరీనగర్ సమీపంలోని బాలుర పరిశీలన గృహం ప్రాంగణంలోని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కార్యాలయంలో అందజేయాలని కోరారు. వివరాలకు జిల్లా బాలల పర్యవేక్షణాధికారి జ్యోతి(77803 99779), జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రాజేశ్వరరావు(99480 57583)లను సంప్రదించాలని చెప్పారు

బిల్డింగ్ పీనలైజేషన్‌కు స్వీయ దరఖాస్తులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : బిల్డింగ్ పీనలైజేషన్ పథకం (బీపీఎస్)కు ఇకపై ప్రజలు స్వయంగా దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. లైసెన్స్ టెక్నికల్ పర్సన్ల (ఎల్.టి.పి.) అవసరం లేదని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్.టి.పి.లు అన్యాయమైన పద్ధతులకు పాల్పడుతున్నాయని, దరఖాస్తు చేసే తరుణంలో ప్రజల నుంచి అదనపు మొత్తాన్ని వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలే స్వయంగా దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించినట్టు వివరించారు. వార్డు సచివాలయాల ద్వారా బీపీఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సాంకేతికతను వినియోగించుకుని సాగులో ఎక్కడ ఎరువులు, పురుగుల మందులు వేయాలో గుర్తించి అక్కడి వరకే వేసే అవకాశం ఉందన్నారు. పెనుగంచిప్రోలులో శుక్రవారం సంపూర్ణత అభియాన్ 2.0 కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ, వ్యవసాయ, విద్యాశాఖ స్టాళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పెనుగంచిప్రోలు మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధికారులంతా కలిసికట్టుగా పని చేయాలన్నారు. దేశవ్యాప్తంగా 540 మండలాలు వెనుకబడి ఉండటంతో యాస్పిరేషన్ బ్లాక్‌లుగా గుర్తించారని.. వీటిల్లో పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం ఉన్నాయని తెలిపారు. సంపూర్ణత అభియాన్ 2.0లో ఆరు విభాగాలుగా విభజించి వాటిపైన ప్రత్యేక దృష్టి సారించామన్నారు. చిన్నవయస్సులోనే పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తే ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అన్ని పంచాయతీల్లో పీఎం సూర్యఘర్‌లో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరంతరం కలెక్టర్ పర్యవేక్షణ వల్ల ఆకాంక్షిత బ్లాక్‌లలో అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. ఆర్డీవో బాలకృష్ణ, జడ్పీటీసీ సభ్యురాలు నాగమణి, ఎంపీపీ ఎం.గాంధీ, డీఈవో చంద్రకళ, తహసీల్దార్ శాంతలక్ష్మి, ఎంపీడీవో శ్రీను, సీడీపీవో రుక్సానా సుల్తానాబేగం, జిల్లా వ్యవసాయాధికారిణి విజయకుమారి, పశుసంవర్ధకశాఖ జేడీ హనుమంతరావు, వైస్ ఎంపీపీ వాసు, మాజీ సర్పంచి సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తదితరులు

మద్యం మత్తులో కళాశాల బస్ డ్రైవర్

డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలో 380 పాయింట్లు

పటమట, న్యూస్‌టుడే: మద్యం మత్తులో కళాశాల బస్సు నడుపుతున్న డ్రైవర్‌ను ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్న ఘటన మహానాడు జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కేతనకొండలోని ఓ కళాశాలలో ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చేస్తున్న 30 మంది విద్యార్థులు శుక్రవారం ప్రాక్టికల్స్ నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి కళాశాల బస్సులో వచ్చారు. సాయంత్రం తిరిగి వెళ్తున్న సమయంలో ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మహానాడు జంక్షన్‌కు వస్తున్న బస్సు అడ్డదిడ్డంగా వెళ్తున్న విషయాన్ని ట్రాఫిక్ సిబ్బంది గమనించారు. వెంటనే సీఐ రమేష్‌కు చెప్పారు. ఆయన బస్సు డ్రైవర్ నానికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేయగా.. 380 పాయింట్లు వచ్చాయి. దీంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, బస్సు సీజ్ చేశారు. కళాశాల యాజమాన్యానికి సమాచారం ఇవ్వగా.. మరో బస్సు పంపారు. అందులో విద్యార్థులు వెళ్లారు.



డ్రైవర్‌కు పరీక్ష చేస్తున్న సీఐ రమేష్

బావిలో పడి రైతు దుర్మరణం

జి.కొండూరు: ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి చెందిన సంఘటన జి.కొండూరు పోలీస్ స్టేషన్ పరిధి కవులూరులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. కవులూరుకు చెందిన వాసిరెడ్డి మధు(47) వరికోత యంత్రంతో పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన అతను గురువారం కూడా రాకపోవడంతో, తొలుత కుటుంబ సభ్యులు వరికోత యంత్రం పని మీద బయటకు వెళ్లాడేమోనని అనుకున్నారు. ఈ క్రమంలో ఫోన్ కూడా పని చేయక పోవడంతో శుక్రవారం ఉదయం అనుమానం వచ్చి వెతకడం మొదలెట్టారు. కవులూరు పొలాల్లోని ఓ బావి వద్ద చరవాణి పడి ఉండటం గమనించి బావిలో వెతకగా విగతజీవిగా కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని తమ్ముడు సుధాకర్ ఫిర్యాదు మేరకు జి.కొండూరు ఎస్సై సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


తిరువూరు
• తిరువూరు • మైలవరం

పాఠ్యాంశాల నిపుణులతో సందేహాల నివృత్తి


పెనుగొలనులో ఆన్‌లైన్ తరగతికి హాజరైన పది విద్యార్థులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పది విద్యార్థులకు అమలు చేస్తున్న వంద రోజుల కార్యాచరణలో భాగంగా డీఈవో డి. చంద్రకళ ఆదేశాల మేరకు శుక్రవారం ఏ.బీ గ్రేడ్‌లో ఉన్న షైనింగ్ స్టార్ విద్యార్థులకు 'ఆన్‌లైన్ సబ్జెక్టు ఓరియంటేషన్ క్లాస్' నిర్వహించారు. పాఠ్యాంశాల నిపుణులైన ఉపాధ్యాయులతో ప్రతి పాఠశాలలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



స్పందన : తుమ్మలపాలెం రోడ్డు వెంట ఉన్న పూడిక కుప్పలతో దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను గ్రామ పంచాయతీ కార్యదర్శి వనిత దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆమె పారిశుద్ధ్య సిబ్బందితో వాటిని తీయించి సమస్య పరిష్కరించారు. - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

సామూహిక కామాక్షి, శుభదుర్గ వ్రతాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని గ్రామ దేవత ముత్యాలమ్మ గుడిలో శుక్రవారం భక్త బృందం ఆధ్వర్యంలో సామూహిక శుభ దుర్గా, కామాక్షి వ్రతం నిర్వహించారు. గంపలగూడెం, న్యూస్‌టుడే : నెమలి వేణుగోపాల స్వామి గుడిలో శుక్రవారం అష్టోత్తర శత దీపాలంకరణ సేవ నిర్వహించారు.

నూతన విధానానికి శ్రీకారం.. రైతుల ఆనందం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

ఏటా కూలీల కొరత పెరుగుతున్న నేపథ్యంలో ఎరువులు, పురుగు మందుల పిచికారీకి ప్రభుత్వం డ్రోన్లను అన్నదాతలకు అందుబాటులోకి తెచ్చింది. వీటితో సమయం, డబ్బులు ఆదా అవుతుండటంతో రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రస్తుతం అవి రైతుల ఇంటి ముంగిటకే వచ్చేలా నూతన విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పంట సీజన్లో అవసరానికి సరిపడా పరికరాలు అందుబాటులో లేక కర్షకులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ఉబర్, ఓలా వంటి యాప్‌ల ద్వారా రవాణా వాహనాలను బుక్ చేసుకున్నట్లే.. ఇకపై డ్రోన్లను కూడా యాప్‌లో నమోదు చేసుకుని అద్దెకు తీసుకునే విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది.

అందుబాటులోకి యూకేడీ యాప్


పొలంలో మందు పిచికారీ చేస్తున్న డ్రోన్

సమానంగా పని కల్పించడం

ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రభుత్వం ఎనభై శాతం రాయితీపై 42 డ్రోన్లను అన్నదాతలకు అందించింది. మైలవరం నియోజకవర్గంలో కూడా తొమ్మిది రైతు సంఘాలకు బ్యాంకు రుణాలతో సబ్సిడీపై వీటిని ఇచ్చింది. వీరందరికీ సమానంగా పని కల్పించడంతో పాటు అవసరమైన వారికి సమయానికి వచ్చే విధంగా 'యుబలైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్స్' పేరిట ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వ్యక్తిగతంగా డ్రోన్లు ఉన్న వారితో పాటు, ప్రభుత్వం రాయితీపై డ్రోన్లు కొనుగోలు చేసిన రైతు సంఘాలు కూడా ఈ యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలి. ఈ యాప్ ద్వారా అన్నదాతలు తమ డ్రోన్ల అవసరాలు, సమయం బుక్ చేసుకుంటే వారు సూచించిన సమయానికి రైతు పొలం వద్దకే డ్రోన్ వచ్చేలా కార్యాచరణ రూపొందించారు.

గ్రామాల్లో అవగాహన

ప్లే స్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేయడం ద్వారా ఈ సేవలు పొందవచ్చు. ఈ విషయాలపై గ్రామాల్లో అన్నదాతలకు అవగాహన కల్పించి వారి వివరాలు సైతం నమోదు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయాధికారిణి రజనీ తెలిపారు.

ముందుగానే పింఛన్ల పంపిణీ

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ భరోసా పథకం లబ్ధిదారులకు ఫిబ్రవరి నెలకు సంబంధించిన పింఛన్లు శనివారం ఉదయం నుంచే పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో గంపలగూడెం, విస్సన్నపేట, తిరువూరు, ఎ.కొండూరు మండలాల్లోని 36,674 మంది లబ్ధిదారులకు రూ.15,78,53,500 బ్యాంకులకు జమ చేశారు. పంపిణీదారులు అధికారులు ఆ సొమ్మును శుక్రవారం బ్యాంకుల నుంచి తీసుకున్నారు.


కొండపర్వలో చిన్నరాట్నాలు, శంకరరావు, సిబ్బంది

ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించండి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించండి అంటూ అధికారులు, సిబ్బంది గడపగడపకు ప్రచారం చేపట్టారు. స్వచ్ఛంద ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా కొండపర్వలో ఎంపీడీవో చేకు చిన్నరాట్నాలు, ఎంఈవో- 1 శంకరరావు, సిబ్బందితో కలిసి ప్రజల వద్దకు వెళ్లారు. పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పిస్తే ఒనగూడే ప్రయోజనాలను తల్లిదండ్రులకు తెలిపారు.

జిల్లా స్థాయిలో ప్రతిభ

జి.కొండూరు, న్యూస్‌టుడే : స్థానిక వివేకానంద పాఠశాలలో 9వ తరగతి చదివే సీహెచ్. సాన్వి వ్యాసరచన, డిబేట్‌లో జిల్లా స్థాయిలో గుర్తింపు సాధించినట్లు కరస్పాండెంట్ ఎం. ఈశ్వరరావు జి.కొండూరులో తెలిపారు. విజయవాడ బిషప్ అజరయ్య పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వ్యాసరచన, డిబేట్‌లో ద్వితీయ, తృతీయ స్థానం పొంది కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందుకుంది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఎం. శ్రీనివాసరావు, పలువురు ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

నూరు శాతం ఉత్తీర్ణతకు ప్రణాళిక అమలు


బాలికలకు సూచనలిస్తున్న తిరువూరు ఆర్డీవో మాధురి

గంపలగూడెం, న్యూస్‌టుడే : పెదకొమిర కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని తిరువూరు ఆర్డీవో కె.మాధురి శుక్రవారం సందర్శించారు. పది విద్యార్థుల కోసం విద్యా శాఖ అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళికను సద్వినియోగం చేసుకుని నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. మేడూరులో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో చేపట్టిన గృహ నిర్మాణాలను పరిశీలించి త్వరగా పూర్తిగా చేసుకోవాలని లబ్ధిదారులకు తెలిపారు. తహసీల్దారు వి.రాజకుమారి, ఆర్‌ఐ ఎం.వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి


వైకాపా కౌన్సిలర్ కస్తూరితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పక్కన ఛైర్‌పర్సన్ నిర్మల

తిరువూరు, న్యూస్‌టుడే : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఛైర్‌పర్సన్ కె.నిర్మల అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు హాజరై కౌన్సిల్ సభ్యులతో చర్చించారు. అజెండాలోని మొత్తం 76 అంశాలు కౌన్సిల్ పరిశీలనకు రాగా అన్ని అంశాలపై అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య సుదీర్ఘంగా చర్చ కొనసాగింది. అనంతరం వాటిలో సుమారు రూ.6 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు టెండర్లకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పట్టణంలోని పలు సమస్యలను పరిష్కరించాలని కౌన్సిల్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోజ, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో ఆలోచనా శక్తి మెరుగు


గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో పుష్పలత, ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : కాచవరం మండల పరిషత్తు పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని మండల విద్యా శాఖ అధికారిణి సీహెచ్.పుష్పలత శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలోనే పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల్లో ఆలోచన శక్తి, వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని చెప్పారు. మూలపాడు సీఆర్‌పీ దొంతమాల నాగేశ్వరరావు, హెచ్‌ఎం భవాని, ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించడంలో పంచాయతీల బాధ్యత కీలకం


అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

గొల్లపూడి, న్యూస్‌టుడే : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని మైలవరం శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. గొల్లపూడిలోని తన కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో గ్రామ పంచాయతీల బాధ్యత ఎంతో కీలకం అన్నారు. వేసవి సమీపిస్తున్నందున నీటి సమస్యలు ముందుగానే గుర్తించి ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


ట్రక్ డ్రైవర్లు, క్లీనర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న శివరామాంజనేయులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని ఎన్టీటీపీఎస్ ముఖ్య ఇంజినీరు శివరామాంజనేయులు అన్నారు. జాతీయ భద్రతా మాసోత్సవాల సందర్భంగా ట్రక్ డ్రైవర్లు, క్లీనర్లకు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని ఎన్టీటీపీఎస్ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు సరైన వాహనాలు నడపాలని సూచించారు. వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధికారులు శేఖర్, నాగబాబు, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


మైలవరం: గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


తిరువూరు పోలీస్ స్టేషన్‌లో మౌనం పాటిస్తూ..

గాంధీజీకి ఘన నివాళి

తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. - న్యూస్‌టుడే, బృందం


ఊటుకూరులో వాసవీ క్లబ్ సభ్యులు


పెనుగొలనులో విద్యార్థులు, గ్రామస్థులు


కొండపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..


గొల్లపూడిలో నివాళులర్పిస్తున్న దేవినేని

రోడ్డు పొడిగిస్తే.. రాకపోకలు సుగమం



పినపాక గ్రామంలో ఎస్సీ శ్మశాన వాటికలు రెండు ఉండగా కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక శ్మశాన వాటికకు మాత్రమే సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో మరో శ్మశాన వాటికకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో నానా అవస్థలు పడాల్సి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో 250 మీటర్ల మేర ఆ రహదారిని పొడిగించి తమకు శ్మశాన వాటికకు వెళ్లే మార్గం సుగమమవుతోందని కోరుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆయా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

గ్రామాల్లో ముమ్మరంగా దాళ్వా వరి సాగు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రబీ సీజన్‌లో రెడ్డిగూడెం మండల పరిధిలోని గ్రామాల్లో అన్నదాతలు ముమ్మరంగా దాళ్వా వరి సాగులో నిమగ్నమయ్యారు. ముందుగా ఖరీఫ్‌లో వేసిన వరి నూర్పిడులు చేసిన రైతులు బోర్ల కింద వరినారు పెంచి నాట్లు కొనసాగిస్తున్నారు. మరికొందరు విత్తనాలు చల్లారు. ఈ ఏడాది భారీగా కురిసిన వర్షాలకు తోడు, సాగర్ జలాలు సరఫరా కావడంతో చెరువుల్లో నిండుగా నీరు ఉండి సాగుకు అవకాశం ఏర్పడింది. ఖరీఫ్ కంటే రబీలో వరి సాగు దిగుబడి ఎక్కువ వస్తుందని కర్షకులు చెబుతున్నారు. మద్దులపర్వ, రంగాపురం, నరుకుళ్లపాడు, రెడ్డిగూడెం, కూనపరాజుపర్వ, నాగులూరు, రుద్రవరం, కుదప గ్రామాల్లో వరినాట్లు వేస్తున్నారు. ఇప్పటికే మండలంలో 2,600 ఎకరాల్లో రబీలో వరి సాగు అయినట్లు మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు.

బాబోయ్ కుక్కలు.. జాగ్రత్త పిక్కలు



మేజర్ పంచాయతీ మైలవరంలో కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఏ వీధిలో చూసినా వందల సంఖ్యలో శునకాలు సంచరిస్తున్నాయి. తెల్లవారుజాము నుంచే రహదారులపై సంచరిస్తూ, ఒంటరిగా వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి. కుక్కల నియంత్రణ చర్యలు తీసుకోవాలని ప్రజలు పలు విజ్ఞప్తులు చేస్తున్నా, పంచాయతీ అధికారులు వెనకడుగు వేస్తున్నారు. - న్యూస్‌టుడే, మైలవరం

యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. విస్సన్నపేట ఎస్సై యం. అర్జున్‌రాజు, హైస్కూల్ విద్యార్థులు, హెచ్‌ఎం ఆర్. శోభారాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


కార్యక్రమంలో ఎస్సై అర్జున్‌రాజు, విద్యార్థులు

రంగారావుకు ఘన సత్కారం

గంపలగూడెం, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు గ్రూప్- 2లో ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికైన మిరియాల రంగారావును ఆదర్శంగా తీసుకుని లక్ష్యాలను ఎంచుకుని ఉద్యోగాలు సాధించాలని ఆర్లపాడు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణారావు, ఉపాధ్యాయులు సూచించారు. రంగారావు ఆర్లపాడు పాఠశాల పూర్వ విద్యార్థి కావడంతో అతనిని శుక్రవారం బడిలో సత్కరించి అభినందించారు.

నిధుల కేటాయింపుల్లో కోత విధింపు తగదు


ఎ.కొండూరు : కిడ్నీ బాధితుడి సమస్య తెలుసుకుంటున్న శ్రీనివాసరావు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ఉపాధి హామీ పథకం పేరు మార్పుతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు రావాల్సిన నిధులకు తూట్లు పొడిచిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. కూలీలకు 125 పని దినాలు కల్పిస్తున్నామనే భ్రమ కల్పించి నిధుల కేటాయింపుల్లో కోత విధించిందని ఆరోపించారు. మండలంలోని చైతన్య నగర్‌లో శుక్రవారం సీపీఎం జిల్లా, మండల కార్యదర్శులు డీవీ.కృష్ణ, పి.ఆనందరావు, ఉపాధి కూలీలతో కలిసి మహాత్మా గాంధీ చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు.

తిరువూరు, న్యూస్‌టుడే : పెద్దవరం గ్రామంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం చట్టం అమలుకై నిరసన దీక్ష చేపట్టారు. సంఘ నాయకులు తూము.కృష్ణయ్య, చిలుకూరి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : తాతకుంట్ల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నాగరాజు ప్రజలకు కరపత్రాలు పంచారు. రామకృష్ణ, కుమారి, లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

ఊటుకూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే : ఊటుకూరులో సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో ఉపాధి కూలీలకు పనులు, రాష్ట్రాలకు నిధులు కొరత ఏర్పడి అభివృద్ధి కుంటుపడుతుందన్నారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : సీపీఎం జూపూడి గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కార్మికులు ఆందోళన చేశారు. సీపీఎం మండల శాఖ కార్యదర్శి మహేష్, నాయకులు పాల్గొన్నారు.


పెద్దవరంలో నిరసన దీక్ష చేస్తున్న గ్రామస్థులు


గుంటపల్లి : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


రెడ్డిగూడెం గ్రామ సచివాలయంలో..

కుష్ఠు నివారణలో భాగస్వాములవుదాం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే : వివక్షను అంతం చేద్దాం.. గౌరవాన్ని కాపాడదాం నినాదంతో కుష్ఠుపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ వైద్యురాలు సయ్యద్ ఫరీన్ తెలిపారు. గుంటుపల్లి మండల పరిషత్తు పాఠశాలతో పాటు ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమాలను ఆమె పర్యవేక్షించారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : స్థానిక గ్రామ సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి ఎం.రాణి, పీహెచ్‌సీ డాక్టర్.కీర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : స్పర్శ కార్యక్రమం ద్వారా పక్షం రోజుల పాటు లెప్రసీపై ఇంటింటా సర్వే జరుగుతుందని జిల్లా లెప్రసీ అధికారి భాను నాయక్ తెలిపారు. గంపలగూడెం పీహెచ్‌సీలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వైద్యులు వి.శృతి, భార్గవి, సర్పంచి పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యురాలు రేష్మా, ఉద్యోగులు పాల్గొన్నారు.


గంపలగూడెం ఆరోగ్య కేంద్రంలో..


తిరువూరులో ప్రదర్శన ర్యాలీ

చేపల వ్యాపారుల తొలగింపు వివాదాస్పదం

గొల్లపూడి, న్యూస్‌టుడే : గొల్లపూడి ఎట్కిన్‌సన్ పాఠశాల కూడలి వద్ద చేపల వ్యాపారులను తొలగించడం వివాదాస్పదంగా మారింది. రోడ్డు పక్కన చేపలు విక్రయిస్తున్న వారిని పంచాయతీ సిబ్బంది తొలగించేందుకు రాగా వ్యాపారులు వారితో వాగ్వాదానికి దిగారు. తమను తొలగించడం అన్యాయమన్నారు. సమీపంలోని ఒక భవన యజమాని ఒత్తిడి కారణంగానే తొలగిస్తున్నారంటూ ఆరోపించి తమకు న్యాయం చేయాలని కోరారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి

మైలవరం, న్యూస్‌టుడే : కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు నిరసనగా ఫిబ్రవరి 12న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను కార్మికులంతా విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పిల్లి నరసింహారావు కోరారు. సమ్మెకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం స్థానిక కార్యాలయంలో కార్మికులతో కలిసి ఆవిష్కరించారు.

హామీలు అమలు చేయాలని వినతి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : ఎస్టీయూ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శుక్రవారం రెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్టీయూ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ జె.సుశీలాదేవికి వినతి పత్రం అందజేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను త్వరగా అమలు పరచాలని వారు కోరారు.


జి.కొండూరులో..

జి.కొండూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం పిలుపు మేరకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు తక్షణమే నెరవేర్చాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అనుగ్రహప్రసాద్ డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ విజయ్ కుమార్ వినతిపత్రం అందజేశారు.


తహసీల్దార్ సుశీలాదేవికి వినతి పత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడి మృతి

గంపలగూడెం, న్యూస్‌టుడే : విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొల్లి జయరామ్‌ప్రసాద్‌వర్మ(81) శుక్రవారం మృతి చెందారు. మండలంలో 40 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా ఆయన పని చేశారు. శనివారం ఆయన అంత్యక్రియలు గంపలగూడెంలో నిర్వహిస్తామని బంధువులు తెలిపారు. పలువురు నాయకులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

భూముల ధరల పెంపుపై 47 అభ్యంతరాలు

నేడు కమిటీ సమావేశంలో తుది ఆమోదం

ఈనాడు డిజిటల్ - మచిలీపట్నం

"ఉమ్మడి కృష్ణా జిల్లాలో భూముల విలువల పెంపుపై ప్రతిపాదించిన ధరలపై 47 అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కనిష్ఠంగా 2.3 శాతం నుంచి గరిష్ఠంగా 15 శాతం మేర ధరలు పెంచారు. పెరిగిన రేట్లపై కృష్ణా జిల్లాలో 27, ఎన్టీఆర్‌లో 20 అభ్యంతరాలు వచ్చాయి. మార్కెట్ విలువ కంటే ప్రభుత్వం సూచించిన రేట్లు అధికంగా ఉండటం.. వ్యవసాయ భూములను హౌస్ సైట్స్‌గా చూపడం.. కొన్ని ప్రాంతాల్లో భూముల విలువ పెరగడటంతో రిజిస్ట్రేషన్ ధరలు అధికం.. సమస్యలు లేవనెత్తారు. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని పెంచిన రేట్లలో మార్పులు చేర్పులు చేయనున్నారు."

"నగరాలు, పట్టణాలు.. గ్రామీణ ప్రాంతాలను బట్టి రేట్లు ఖరారు చేయనున్నారు. వాణిజ్య, వ్యవసాయ భూములు హౌస్ సైట్స్‌గా నమోదైన సాంకేతిక సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్ల సమక్షంలో శనివారం వీటిపై సమావేశం జరగనుంది. మార్పులు చేర్పుల తర్వాత ఫిబ్రవరి 1 నుంచి పెరిగిన భూముల రేట్లు అందుబాటులోకి రానున్నాయి. వీటిని ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్లో నమోదు చేయనున్నారు."

నగరాల్లో ప్రతిపాదిత ధరలు

విజయవాడ.. ఎంజీ రోడ్డు ప్రాంతంలో గజం రూ.1.05 లక్షలు ఉండగా రూ.1.20 లక్షలకు.. పటమటలో రూ.49 వేల నుంచి రూ.53 వేలు. . కానూరులో రూ.20-23 వేలుగా పెంచుతూ ప్రతిపాదించారు. సింగ్‌నగర్ రూ.19-21 వేలు.. పాయకాపురం రూ.17-20 వేలు.. సత్యనారాయణపురం, భవానీపురం రూ.33-37 వేలు.. విద్యాధరపురం రూ.28-31వేలు.. తారాపేటలో గజం రూ.1.10 లక్ష ఉండగా.. రూ.1.21 లక్షలకు పెంచారు.

➠ బందరులో నివాస స్థలాల రేట్లు 5-11 శాతం మేర పెంచారు. రెండో వార్డులో రూ.9-10 వేలు.. ఐదో వార్డులో రూ.15-16 వేలు, ఏడో వార్డులో రూ.22-23 వేలు..గజానికి రూ.వెయ్యి పెరిగింది. వాణిజ్య స్థలాలు 4-13.33 శాతం మేర పెరిగాయి. 29వ వార్డులో రూ.12.5-13 వేలు.. 15వ వార్డులో రూ.15-17వేలు.. 17 వార్డులో రూ.17-19 వేలుగా నిర్ణయించారు.

వ్యవసాయ భూములకు ఇలా..

బందరు పరిధిలో గ్రామాలు, జాతీయ రహదారుల పక్కన పొలాల రేట్లు 2.7-11.11శాతం అధికం కానున్నాయి. ఎస్ఎన్ గొల్లపాలెం ఎన్‌హెచ్ పక్కన ఎకరం రూ.76.50 లక్షల నుంచి రూ.85లక్షలకు.. గూడూరు వద్ద జాతీయ రహదారి పక్కన రూ.76.50 లక్షల నుంచి రూ.1.2 కోట్లకు పెంచారు. గూడూరులో మల్లవోలులో ఎకరం రూ.21.50 లక్షల నుంచి రూ.23 లక్షలకు. . ఎస్ఎన్‌గొల్లపాలెంలో రూ.25.50 లక్షల నుంచి రూ.28లక్షలకు పెరిగింది.

అభ్యంతరాలు పరిశీలిస్తున్నాం

భూయజమానులు, ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్నాం. శనివారం జరిగే కమిటీ సమావేశంలో మార్కెట్ విలువ మార్గదర్శక రేట్లపై తుది ఆమోదం లభిస్తుంది. సూచించిన కొత్త మార్గదర్శక ధరలు వచ్చే నెల 1 నుంచి అమలులోకి వస్తాయి

- జీకే మూర్తి, దుర్గాప్రసాద్, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రిజిస్ట్రార్లు

ఒక్కో శిశువుకు రూ.30 వేలు ఇచ్చి కొనుగోలు

ఈనాడు - అమరావతి: రాజస్థాన్ నుంచి తమ ఊరికి పనుల నిమిత్తం వచ్చిన గిరిజన కుటుంబాల్లోని పిల్లలను తీసుకుని అమ్మకానికి పెట్టినట్లు నిందితుడు సతీష్ తెలిపాడు. రెండు రోజుల కస్టడీలో భాగంగా నిందితుడు సతీష్‌ను పోలీసులు శుక్రవారం కస్టడీకి తీసుకున్నారు. సుదీర్ఘంగా సాగిన ఇంటరాగేషన్‌లో పలు వివరాలు వెల్లడించాడు. గుజరాత్‌లోని సబర్‌కంఠ జిల్లా జోతాసన్ గ్రామం. ఈ ఊరికి రాజస్థాన్‌లోని హర గ్రామానికి చెందిన పలు గిరిజన కుటుంబాలు పనుల నిమిత్తం వచ్చాయి. ఈ సందర్భంగా వీరితో సతీష్‌కు పరిచయమైంది. వీరికి ఎక్కువ మంది పిల్లలు ఉండడంతో పోషించలేక తనను సంప్రదించినట్లు విచారణలో వెల్లడించాడు. ఈ కుటుంబాల నుంచి ఒక్కో పసికందుకు నిందితుడు రూ.30 వేలు డబ్బు లిచ్చి తీసుకునేవాడు. కవితకు పిల్లలను చేరవేసేవాడు. ముంబయిలో కవిత పిల్లలను సతీష్‌కు ఇచ్చేది. అతను విజయవాడ, హైదరాబాద్ తీసుకొచ్చి స్థానిక ముఠాలకు అప్పగించేవాడు. విజయవాడకు చెందిన ప్రధాన నిందితురాలు బలగం సరోజిని.. అనిల్ ద్వారా సతీష్‌తో ఫోన్‌లో మాట్లాడేవారని తెలిపాడు. పిల్లలను అమ్మిన తర్వాత వీరికి సరోజిని నుంచి డబ్బులు అందేవని విచారణలో గుర్తించారు.

ఆయేషామీరా కేసులో మెమో దాఖలు

ఈనాడు - అమరావతి: ఆయేషామీరా కేసులో సీబీఐ శుక్రవారం మెమో దాఖలు చేసింది. విజయవాడలో సీబీఐ కేసులు విచారించే ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో సీబీఐ అదనపు ఎస్పీ ఫైల్ చేశారు. నిరుడు జూన్ 20న తుది నివేదిక (ఛార్జిషీట్) దాఖలు చేశామనీ.. నివేదిక ప్రతిని సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు సమర్పించామని తెలిపారు. దీనిపై ప్రొటెస్ట్ పిటిషన్‌ను కూడా ఆయేషామీరా తల్లిదండ్రులు దాఖలు చేయలేదన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని చట్టప్రకారం తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

బౌలర్ల మెరుపులు.. బ్యాటర్ల జోరు

ఉత్సాహంగా ఈఎస్ఎల్ క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు

జిల్లాపరిషత్తు (గుంటూరు), తాడికొండ, న్యూస్‌టుడే: సీనియర్స్ విభాగంలో బౌలర్లు దుమ్ము రేపారు. బ్యాటర్లు చెలరేగారు. జూనియర్స్ విభాగంలో నువ్వా..నేనా అన్నట్లు తలపడ్డారు. విజయం కోసం రెండు జట్లు పోరాడడంతో ఉత్కంఠ నెలకొంది. ఒత్తిడిని అధిగమించి సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ విజయం సాధించింది. గుంటూరు సమీపంలోని మోతడకలో చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో జరుగుతున్న ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు నాలుగో రోజైన శుక్రవారం రసవత్తరంగా సాగాయి.

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: Hero
Digital Partner: ఈనాడు.నెట్ TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్, Mee FM
Organised by: ఈనాడు


సీనియర్స్: హైదరాబాద్ హీరోస్ జట్టు విజయానందం

హైదరాబాద్ హీరోస్ మెరుపు విజయం

సీనియర్స్ విభాగంలో మొదటి మ్యాచ్ సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ (రావుస్ డిగ్రీ- పీజీ కాలేజీ) హైదరాబాద్ హీరోస్ (టీకేఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. హైదరాబాద్ హీరోస్ జట్టు బౌలర్ మధువీర్ ధాటికి సెంట్రల్ ఆంధ్రా బ్యాటర్లు కొద్ది పరుగులకే ఔటయ్యారు. మధువీర్ 3.4 ఓవర్లు వేసి 11 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీసుకున్నాడు. రోహిత్, టైటస్ చెరో 2 వికెట్లు, కార్తికేయ ఒక వికెట్ తీసుకున్నాడు. ఓపెనర్ సందీప్ మాత్రమే 12 పరుగులు చేయగా ఆరుగురు బ్యాటర్లు సున్నాకే ఔట్ కావడం గమనార్హం. 11.4 ఓవర్లలో 39 పరుగులకు ఆలౌట్ కావడంతో సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ ఇన్నింగ్స్ ముగిసింది. అనంతరం 40 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ హీరోస్ 4.1 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 43 పరుగులు చేసి విజయం సాధించింది. 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. బౌలింగ్‌లో 4 వికెట్లు తీసుకుని బ్యాటింగ్‌లో 18 పరుగులు చేసిన మధువీర్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.


సీనియర్స్: గెలుపొందిన తర్వాత రాయలసీమ రాకర్స్ జట్టు సభ్యులు

చెలరేగిన రాయలసీమ రాకర్స్ బ్యాటర్లు

సీనియర్స్ విభాగంలో రెండో మ్యాచ్ రాయలసీమ రాకర్స్ (సికామ్ డిగ్రీ కాలేజీ), తెలంగాణ టైగర్స్ (వాగ్దేవి డిగ్రీ- పీజీ కాలేజీ) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన రాయలసీమ రాకర్స్ బ్యాటింగ్ ఎంచుకుంది. ఆ జట్టు ఓపెనర్లు శశాంక్ 54 బంతుల్లో 82 పరుగులు, లేఖజ్‌రెడ్డి 49 బంతుల్లో 81 పరుగులతో చెలరేగారు. లేఖజ్‌రెడ్డి బౌండరీలు 4, సిక్స్‌లు 6 గ్యాలరీలోకి పంపాడు. నిర్ణీత 20 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 207 పరుగులు చేసింది. అనంతరం 208 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన తెలంగాణ టైగర్స్ బ్యాటర్లు పరుగులు చేసేందుకు ఇబ్బందులు పడ్డారు. ఓపెనర్ వేణు 16 బంతులు ఎదుర్కొని ఒక పరుగు కూడా చేయకపోవడంతో తనంతట తానే రిటైర్డ్ ఔట్‌గా గ్రౌండ్‌ని వదిలి వచ్చాడు. ఆ జట్టు బ్యాటర్లు హరిప్రసాద్ 25 పరుగులు, వైష్ణవ్ 22 పరుగులు చేశారు. పది మందితోనే ఆడారు. ఓ బ్యాటర్ రిటైర్డ్ ఔట్ కావడంతో 8 వికెట్లు పడగానే 17.5 ఓవర్లలో 105 పరుగుల వద్ద ఇన్నింగ్స్ ముగిసింది. 102 పరుగుల తేడాతో రాయలసీమ రాకర్స్ గెలిచింది. రాయలసీమ రాకర్స్ బౌలర్ చరణ్‌జీత్ 2 ఓవర్లు బౌలింగ్ చేసి 5 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీసుకుని తెలంగాణ టైగర్స్ జట్టు ఓటమిలో కీలక పాత్ర పోషించాడు. 81 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్‌లో ఒక వికెట్ తీసుకున్న లేఖజ్‌రెడ్డి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

ఉత్కంఠ పోరులో సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ విజయం


జూనియర్స్: సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ జట్టు విజయ దరహాసం

జూనియర్స్ విభాగంలో మొదటి మ్యాచ్ సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ (ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ), హైదరాబాద్ హీరోస్ (భవన్స్ శ్రీ అరబిందో జూనియర్ కాలేజీ) జట్ల మధ్య ఉత్కంఠగా సాగింది. టాస్ గెలిచిన హైదరాబాద్ హీరోస్ మొదట బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసింది. ఆ జట్టు బ్యాటర్లు వికాస్ 37 పరుగులు, ఆదిత్య 29, హరి 26 పరుగులు చేశారు. 171 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ బ్యాటర్లు మొదటి 10 ఓవర్ల వరకు నిదానంగా బ్యాటింగ్ చేశారు. చివరి 12 బంతుల్లో 24 పరుగులు చేయాల్సి ఉండడంతో ఉత్కంఠ నెలకొంది. ఆ జట్టు బ్యాటర్లు చివరి రెండు ఓవర్లలో బౌండరీలు, సిక్స్‌లు కొట్టడంతో మరో 3 బంతులు ఉండగానే 4 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వైభవ్ 11 బంతులు ఎదుర్కొని 31 పరుగులు చేయడంతో పాటు ఒక వికెట్ సాధించడంతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు ఎంపికయ్యాడు. వైభవ్ బౌండరీలు 4, సిక్స్‌లు 2 కొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. హైదరాబాద్ హీరోస్ బౌలర్ ప్రేమ్ 3.3 ఓవర్లు బౌలింగ్ చేసి 50 పరుగులు ఇచ్చాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్


మధువీర్ లేఖజ్ రెడ్డి వైభవ్

● జూనియర్స్ విభాగంలో రెండో మ్యాచ్ రాయలసీమ రాకర్స్ (శ్రీవిద్య జూనియర్ కాలేజీ), తెలంగాణ టైగర్స్ (ఎస్ఆర్ఆర్ జూనియర్ కాలేజీ) జట్ల మధ్య జరగాల్సి ఉండగా రాయలసీమ రాకర్స్ జట్టు హాజరు కాలేదు. దాంతో తెలంగాణ టైగర్స్‌ని విజేతగా అంపైర్ ప్రకటించారు.


జూనియర్స్: తెలంగాణ టైగర్స్ జట్టు

31న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-1 (జూనియర్స్)	గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-1: రాయలసీమ రాకర్స్ X నార్త్ ఆంధ్రా నింజాస్	మ్యాచ్-1: రాయలసీమ రాకర్స్ X నార్త్ ఆంధ్రా నింజాస్
మ్యాచ్-2: తెలంగాణ టైగర్స్ X హైదరాబాద్ హీరోస్	మ్యాచ్-2: తెలంగాణ టైగర్స్ X హైదరాబాద్ హీరోస్

ఆర్చరీ టోర్నీ నేడు

విజయవాడ క్రీడలు: రాష్ట్ర, ఉమ్మడి కృష్ణా జిల్లా ఆర్చరీ సంఘాలు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31న ఐజీఎంసీ స్టేడియంలోని ఫుట్‌బాల్ ఫీల్డ్‌లో ఖేలో ఇండియా ఎన్‌టీపీసీ అమరావతి సిటీ ఓపెన్ ఆర్చరీ టోర్నీ నిర్వహిస్తామని రాష్ట్ర ఆర్చరీ సంఘం ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బెవర వెంకట రమణ తెలిపారు. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్, అండర్-15, అండర్-13 స్త్రీ, పురుషుల విభాగాల్లో రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్‌లో పోటీలు ఉంటాయన్నారు.

నాన్న నమ్మకమే నా విజయం


రెండో ప్రయత్నంలో డీఎస్పీ ఉద్యోగం

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం


కోదాటి సూర్యతేజ

కృష్ణా జిల్లా మొవ్వ మండలం ఖాజ గ్రామానికి చెందిన కోదాటి సూర్యతేజ రెండో ప్రయత్నంలో డీఎస్పీ ఉద్యోగాన్ని సాధించారు. తండ్రి నమ్మకాన్ని నెలబెట్టుకొని విజయాన్ని అందుకున్నారు. నాన్న నమ్మకాన్ని నిలబెట్టుకున్న ఆ కుమారుడి మాటల్లో... 'నాన్న నాగభూషణం బందరు ఆర్టీసీ డిపోలో కండక్టర్.. అమ్మ రాజ్యలక్ష్మి గృహిణి.. చెల్లి బీటెక్ చదువుతోంది.. నాన్న జీతంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. నేను విజయనగరం జేఎన్‌టీయూలో బీటెక్ చేశాను. ఐఏఎస్ కావాలన్న లక్ష్యంతో 2019 నుంచి పరీక్షలకు సన్నద్ధం అవుతున్నా.. 2022 గ్రూప్-1 నోటిఫికేషన్‌లో ఇంటర్వ్యూలో కొద్ది మార్కుల తేడాతో అర్హత సాధించలేకపోయా.. శరత్‌చంద్ర సార్ నాలో ధైర్యాన్ని నింపారు. నేను వెనుకపడ్డ అంశాల్లో ప్రతిదీ నేర్చుకుంటూ ఒక్కో లోపాన్ని అధిగమిస్తూ వచ్చాను. రెండో ప్రయత్నంలో గ్రూప్-1 ఫలితాల్లో డీఎస్పీ పోస్టు దక్కింది. నాన్నకు గుండె ఆపరేషన్ అయినా మాకోసం ఎంతో కష్టపడ్డారు. నేను అనుకున్నది సాధిస్తానని నాకంటే ఆయనే ఎక్కువగా నమ్మారు. ఆయన నమ్మకమే నన్ను విజయం వైపు నడిపించింది. నాన్న నమ్మకాన్ని నిలబెట్టినందుకు చెప్పలేనంత ఆనందంగా ఉంది' అని కోదాటి సూర్యతేజ చెప్పుకొచ్చారు.

గ్రూపు-1, 2 పరీక్షల్లో సత్తా



భవానీపురం, న్యూస్‌టుడే: విజయవాడలోని అయోధ్యనగర్‌కు చెందిన పొలిశెట్టి రిషిత గ్రూప్-1, 2 పరీక్షల్లో సత్తా చాటారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో గత నాలుగేళ్లుగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఆమె తండ్రి పొలిశెట్టి కమలకిషోర్ విజయవాడ నగరపాలక సంస్థలో బిల్లు కలెక్టర్‌గా పని చేస్తున్నారు. తల్లి రోజారాణి గృహిణి. ఐఏఎస్ కావాలనే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. మూడు సార్లు ప్రిలిమ్స్‌లో క్వాలిఫై కాలేదు. అయినప్పటికీ నిరాశ చెందకుండా గ్రూపు-1, 2 పరీక్షలను రాశారు. ఇటీవల విడుదలైన గ్రూప్-2 పరీక్షా ఫలితాల్లో లేబర్ అధికారిగా ఎంపికయ్యారు. శుక్రవారం విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్‌గా నియమితులయ్యారు. ప్రతి రోజు ఎనిమిది గంటల పాటు కష్టపడి చదవడం వల్లనే గ్రూప్-1, 2 రెండు పరీక్షల్లోనూ విజయం సాధించినట్లు పొలిశెట్టి రిషిత 'న్యూస్‌టుడే'కి తెలిపారు.

దుర్గగుడి ఈఈ రాంబాబు బదిలీ

ఇంద్రకీలాద్రి: దుర్గగుడి ఈఈ రాంబాబును డిప్యుటేషన్‌పై సింహాచలం దేవస్థానానికి బదిలీ చేశారు. దుర్గగుడిలో చేపట్టిన అభివృద్ధి పనులను ఈఈ కోటేశ్వరరావు, డీఈ రవీంద్ర పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం.

పోటీతత్వం అలవర్చుకుంటేనే భవిత

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఇలక్కియా. వేదికపై కళాశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యకుమార్, 'ఈనాడు' విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్‌కే కిశోర్ కుమార్


పోటీలకు హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలు శుక్రవారం నిర్వహించారు. విజయవాడ లబ్బీపేటలోని శ్రీదుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల సెమినార్ హాలులో నిర్వహించిన పోటీలకు ముఖ్యఅతిథిగా ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా హాజరై మాట్లాడారు. పోటీతత్వాన్ని అలవర్చుకుంటేనే విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానానికి ఎదుగుతారని అన్నారు. గతంతో పోల్చుకుంటే విద్యార్థుల తల్లిదండ్రుల ఆలోచన విధానాల్లో మార్పు వస్తోందని, చదువుకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో తమ పిల్లలు ప్రతిభ కనబరచాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. వారి ఆకాంక్షలకు తగినట్లు వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా బహుముఖ ప్రతిభ చూపాలనే లక్ష్యంతో 'ఈనాడు' పోటీలు నిర్వహించి ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థినులు కష్టపడి చదివి ప్రతిభ కనబరుస్తున్నారని, ఆ స్థాయిలో కొలువులు మాత్రం సాధించలేకపోతున్నారని, వివాహాలు, చదువు మధ్యలో ఆపేయడం అందుకు కారణమని పేర్కొన్నారు. 'ఈనాడు' విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్‌కే కిశోర్ కుమార్ మాట్లాడుతూ.. పాఠకులకు నాణ్యమైన వార్తలు అందించడంతో పాటు విద్యార్థులు బహుముఖ రంగాల్లో రాణిస్తే.. ఉజ్వల భవిష్యత్తు ఉంటుందనే లక్ష్యంతో ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వివిధ స్థాయిల్లో నిర్వహించిన పోటీల్లో 6,500 మంది విద్యార్థులు పాల్గొన్నారని, పోటీని తట్టుకొని జిల్లా స్థాయికి వచ్చి విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపల్ వి.వి.సుబ్రహ్మణ్యకుమార్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఓ లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలని కోరారు. జయాపజయాలను సమానంగా స్వీకరించి పోటీలో పాల్గొనాలని సూచించారు. అపజయం పాలైనప్పుడు కుంగిపోకుండా.. లోపాలను సరిదిద్దుకొనే ప్రయత్నం చేస్తే విజయాలు సొంతమవుతాయని తెలిపారు. విజేతలకు ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు.

నాలుగు విభాగాల్లో..

ఉమ్మడి కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం, అవనిగడ్డ, గుడివాడ, గన్నవరం, విస్సన్నపేట, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట, పెనమలూరు, విజయవాడలోని 25 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ప్రతి కళాశాల నుంచి వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్ విభాగాల్లో ముగ్గురు చొప్పున జిల్లా స్థాయి పోటీలకు వచ్చారు.

విజేతలు వీరే...


★ వ్యాసరచన : ఎన్.చంద్రిక బాయి (స్టార్ జూనియర్ కళాశాల, మచిలీపట్నం) ప్రథమ, ఎ.దీప్తి (ఎస్.వి.ఎల్.క్రాంతి జూనియర్ కళాశాల, అవనిగడ్డ) ద్వితీయ, కె.హిమన్విత (ఎస్.వి.ఎల్.క్రాంతి జూనియర్ కళాశాల, అవనిగడ్డ) తృతీయ స్థానంలో నిలిచారు. ★ చిత్రలేఖనం : వి.లేఖ (స్టార్ జూనియర్ కళాశాల, మచిలీపట్నం), ఎం.శ్రావ్యలత (శ్రీకృష్ణవేణి జూనియర్ కళాశాల, కానూరు), బి.వెంకటకృష్ణ (వికాస్ జూనియర్ కళాశాల, విస్సన్నపేట) తొలి మూడు స్థానాలు సాధించారు. ★ ఉపన్యాసం : కె.సాయిశ్రీనివాస్ (శ్రీఅక్షర జూనియర్ కళాశాల, నందిగామ), వి.నాగ రోహిత్ రామ్ (స్టార్ జూనియర్ కళాశాల, మచిలీపట్నం), బి.భువన సిరి (ఆర్.కె.జూనియర్ కళాశాల, మచిలీపట్నం) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. ★ క్విజ్ : జి.సాంబశివ (శ్రీఅక్షర జూనియర్ కళాశాల, నందిగామ), ఎస్‌కే అక్బర్ (శ్రీ అక్షర జూనియర్ కళాశాల, నందిగామ), లోకేశ్ (వికాస్ జూనియర్ కళాశాల, విస్సన్నపేట) వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

ఆత్మవిశ్వాసం పెరిగింది




వేదికలపై మాట్లాడాలనేది నా కోరిక. భయం వల్ల పాల్గొనలేకపోయేదానిని. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు మా కళాశాలలో జరగ్గా.. ఉపన్యాస విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచాను. వివిధ స్థాయిల్లో సత్తా చాటాను. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం ఆనందంగా ఉంది. నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. - కె.సాయిశ్రీనివాస్, శ్రీఅక్షర జూనియర్ కళాశాల

ప్రతిభను వెలికితీస్తున్నారు..



పాఠశాల స్థాయి నుంచే 'ఈనాడు' పత్రిక, గ్రంథాలయంలో పుస్తకాలు చదవడం నాకు అలవాటు. ఫలితంగా జనరల్ నాలెడ్జి, కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాను. అందుకే జిల్లా స్థాయి క్విజ్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచాను. 'ఈనాడు-ఈటీవీ' పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో బహుముఖ ప్రతిభను వెలికితీసేందుకు ప్రయత్నించడం సంతోషంగా ఉంది. - జి.సాంబశివ, శ్రీఅక్షర జూనియర్ కళాశాల

అన్ని అంశాలపై అవగాహన



వ్యాసరచన పోటీకి ఏ అంశాన్ని ఇచ్చినా క్షుణ్ణంగా రాయాలి. అందుకు వివిధ పుస్తకాలు చదివాను. అంతర్జాలంలో వెతికి అవగాహన పెంచుకున్నాను. 'ఈనాడు' పోటీల్లో పాల్గొనడం వల్లే అన్ని అంశాలు నేర్చుకోగలిగాను. ప్రథమ స్థానంలో నిలవడం గర్వంగా ఉంది. ఈ పోటీలను స్ఫూర్తిగా తీసుకొని మరిన్ని పోటీలకు హాజరై విజేతగా నిలుస్తా. - ఎన్.చంద్రిక బాయి, స్టార్ జూనియర్ కళాశాల

అనుకున్నది సాధించా...



బాల్యం నుంచి చిత్రలేఖనం అంటే ఆసక్తి. తొలిసారిగా 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో కళాశాలలో నిర్వహించిన పోటీలో పాల్గొని విజేతగా నిలిచాను. జిల్లా స్థాయి పోటీలోనూ విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. అందుకు అనుగుణంగా సాధన చేశాను. అనుకున్నది సాధించాను. వివిధ చిత్రాలు వేయడం వల్ల సృజన, నైపుణ్యాలు మెరుగుపడ్డాయి. - వి.లేఖ, స్టార్ జూనియర్ కళాశాల

ఏఐవైఎఫ్ రణభేరి ఉద్రిక్తం



ర్యాలీలో పాల్గొన్న ఈశ్వరయ్య, మహేశ్వర్, సమాఖ్య నాయకులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : శాసన సభ సమావేశాల్లోనే నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఇచ్చిన అల్టిమేటంతో విజయవాడ ధర్నాచౌక్ ప్రాంగణం ఉద్రిక్తంగా మారింది. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ భృతి, 20లక్షలకు పైగా ఉద్యోగాలు ప్రకటించకపోతే ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని నేతలు హెచ్చరించారు. శుక్రవారం విజయవాడ ధర్నాచౌక్‌లో ఆంధ్రప్రదేశ్ యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 'నిరుద్యోగ రణభేరి' కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి ఏఐవైఎఫ్ నాయకులు, నిరుద్యోగ యువత, వలంటీర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తొలుత చాకలి ఐలమ్మ విగ్రహం నుంచి ధర్నా చౌక్ వరకు మహా ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. యువగళం పాదయాత్రలో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని, నిరుద్యోగ యువత అధైర్యపడాల్సిన అవసరం లేదని చెప్పారని గుర్తు చేశారు. యువజన, నిరుద్యోగుల హక్కుల సాధన కోసం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుఖిబిందర్ మహేశ్వర్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువత రోడ్డెక్కాల్సిన పరిస్థితి కల్పించారని మండిపడ్డారు. బిహార్, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల్లోనూ నిరుద్యోగం తాండవిస్తోందన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయకపోతే.. భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యుగంధర్, పరుచూరి రాజేంద్రబాబు మాట్లాడుతూ. . రెండేళ్లపాటు జాబ్ క్యాలెండరు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అనంతరం మళ్లీ లెనిన్ సెంటర్ వరకు భారీ ప్రదర్శనగా బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. ఈక్రమంలో పోలీసులు, సమాఖ్య నాయకుల మధ్య తోపులాటలు చోటుచేసుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు లంకా గోవిందరాజులు, వై.బాబీ, కొంగర శ్రీనివాసులు, కోన శ్రీనివాసరావు, పోతుల ప్రభాకర్, షేక్ సుభాని, వై.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శిరస్త్రాణం ధరించుకో.. ప్రాణం దక్కించుకో..


ద్విచక్ర వాహనాల ప్రదర్శనలో సీపీ రాజశేఖరబాబు, డీసీపీలు షిరీన్‌బేగం, కృష్ణకాంత్ పాటిల్, తిరుమలేశ్వర్‌రెడ్డి, సరిత, కృష్ణప్రసన్న తదితరులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లాలో 2025లో రోడ్డు ప్రమాదాల్లో 374 మంది మరణించారని గత ఏడాది కన్నా 80 మరణాలు తగ్గినా.. వాటిని మరింతగా కట్టడి చేయాల్సిన అవసరం ఉందని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. మృతుల్లో 209 మంది ద్విచక్రవాహన చోదకులే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శిరస్త్రాణాలు ధరించి ఉంటే.. వారి ప్రాణాలు దక్కేవని పేర్కొన్నారు. ప్రమాదాలపై వాహనచోదకుల్లో అవగాహన కల్పించేందుకు రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలో ద్విచక్రవాహనాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ జిల్లాలో 70 నుంచి 75 శాతం మంది శిరస్త్రాణం ధరిస్తున్నారని.. ఇది 95 నుంచి 100 శాతానికి పెరగాలన్నారు. వెనుక కూర్చున్న వారు సైతం శిరస్త్రాణం ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ ఎక్కువ మంది చనిపోతున్నట్లు గుర్తించామని.. దీన్ని కట్టడి చేసేందుకు రాత్రి 7 గంటల నుంచి తనిఖీలను ఉద్ధృతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం సీపీ రాజశేఖరబాబు, డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు ప్రజలు దాదాపు 300 మంది శిరస్త్రాణం ధరించి నగరంలో ద్విచక్రవాహన ప్రదర్శన నిర్వహించారు.

ఉన్నత విద్యకు వెళ్లి.. అమెరికాలో మృతి



వంశీకృష్ణ (పాతచిత్రం)

గొల్లపూడి, న్యూస్‌టుడే : హార్ట్‌ఎటాక్‌తో అమెరికాలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఇది. వివరాలిలా ఉన్నాయి. విజయవాడ గ్రామీణ మండలం గొల్లపూడికి చెందిన సూరపనేని గిరిధర్ వంశీకృష్ణ(36) పదేళ్ల కిందట చదువుకోవడానికి అమెరికా వెళ్లి అక్కడే ఉంటున్నారు. కొన్నాళ్ల పాటు అమెరికాలో హోటల్‌ను నిర్వహించి, ప్రస్తుతం అక్కడే ఉద్యోగం చేస్తున్నారు. తల్లిదండ్రులు సూరపనేని నరేంద్ర, రత్నకుమారి దంపతులు వ్యవసాయ పనులు నిర్వహిస్తు గొల్లపూడిలోనే ఉంటున్నారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా హార్ట్‌ఎటాక్ రావడంతో వంశీకృష్ణ చనిపోయినట్లు సన్నిహితుల ద్వారా తల్లిదండ్రులకు గురువారం రాత్రి తెలిసింది. దీంతో వారు ఆందోళనకు గురయ్యి కొద్దిసేపటి తర్వాత తేరుకుని కుమారుడి భౌతికకాయాన్ని తానా సభ్యుల ద్వారా ఇండియాకు రప్పించేందుకు ప్రయత్నం చేశారు. అయితే...పది రోజులకు పైగా సమయం పట్టే అవకాశం ఉండటంతో అమెరికాలోనే కుమారుడి అంత్యక్రియలు జరిపించేందుకు గొల్లపూడి నుంచి తల్లిదండ్రులు బయలుదేరి వెళ్లారు. గిరిధర్ వంశీకృష్ణ మృతితో స్థానికంగా విషాదం నెలకొంది.

వసుంధర

vasundhara@eenadu.in

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వరసగా తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రికార్డు సృష్టించనున్నారు. 7.4 శాతం వృద్ధి అంచనాతో, ప్రపంచ భౌగోళిక అనిశ్చితుల మధ్య వస్తోన్న ఈ బడ్జెట్‌కి మరో ప్రత్యేకత ఉంది. దీని రూపకల్పనలో నిర్మలమ్మతో పాటు తొలిసారిగా మరో శక్తిమంతమైన మహిళా ఉన్నారు. ఆమె ఐఏఎస్ అధికారిణి అనురాధ ఠాకుర్.


అనురాధ

బడ్జెట్‌లో 'ఆమె'

గతేడాది ఆర్థిక మంత్రిత్వ శాఖలో అజయ్ సేథ్ స్థానంలో ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా నియమితులయ్యారు అనురాధ ఠాకుర్. దేశ బడ్జెట్‌ను రూపొందించే ఈ కీలక విభాగానికి అధిపతిగా ఉన్న తొలి మహిళ. దీన్ని భారత పరిపాలనా చరిత్రలో కీలకమైన ఘట్టంగా అభివర్ణిస్తున్నారంతా. ఒకప్పుడు ఈ పదవిని అలంకరించిన వాళ్లలో డా. మన్మోహన్ సింగ్, మోంటెక్ సింగ్ అహ్లువాలియా వంటి ప్రముఖ వ్యక్తులూ ఉన్నారు. సెబీ బోర్డులో పార్ట్ టైమ్ ఎక్స్-అఫీషియో సభ్యులుగా, ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డులో డైరెక్టర్‌గానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారీమె.

ఈమెది బిహార్. దిల్లీ విశ్వవిద్యాలయం నుంచి సైకాలజీలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ తరవాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో డెవలప్‌మెంట్ ఎకనామిక్స్‌పై సర్టిఫికెట్ కోర్సు చేశారు. 1994లో హిమాచల్‌ప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారిణిగా ఎంపికయ్యారు. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్(ఎస్ఎఫ్ఐఓ) డైరెక్టర్‌గానూ, ఆర్థిక వ్యవహారాల విభాగంలో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీలోనూ పనిచేశారు. మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్‌లో అడిషనల్ సెక్రటరీగా తన బాధ్యతల్ని సమర్థంగా నిర్వహించారు. కార్పొరేట్ నేరాలు, మోసాలకు సంబంధించి కీలకమైన కేసులెన్నో శోధించారు. 3ఐ(ఇంక్వైరీ, ఇన్‌స్పెక్షన్, ఇంటారాగేషన్) క్యాంపెయిన్‌ను పక్కాగా అమలుచేశారు అనురాధ. ముఖ్యంగా ఈమె కార్పొరేట్ అఫైర్స్ చూసినప్పుడు సిబ్బంది సంఖ్యను పెంచి కేసుల పెండింగ్‌ను తగ్గించారు. ఈ విభాగాన్ని పర్యవేక్షిస్తూనే పీఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌కి నాయకత్వం వహించారు. భారత బాండ్ ఈటీఎఫ్‌ను ప్రారంభించడం, ఎయిర్ ఇండియా పెట్టుబడుల ఉపసంహరణలోనూ కీలకపాత్ర పోషించారీమె. ఇండియన్ కార్పొరేట్ లా సర్వీస్ అకాడమీతో సహా అనేక సంస్థల్ని బలోపేతం చేయడానికి కృషిచేశారు అనురాధ.

ఆ సుగుణాలే...

ఈమె నిత్య విద్యార్థిని. ఏ కాస్త తీరిక దొరికినా ఆర్థిక, ప్రజా పాలనకు సంబంధించిన పుస్తకాలే చదువుతుంటారట. కష్టపడే స్వభావం, కచ్చితత్వం, సంయమనం, పనులు పూర్తిచేయడంలో కనబరిచే అద్భుతమైన నైపుణ్యాలు... ఇవే ఆమెను దేశ ఆర్థిక నిర్ణయ ప్రక్రియల్లో భాగస్వామి అయ్యేలా చేశాయి.

వనరుల కేటాయింపు, ఆర్థిక లోటు, అప్పు, ప్రాధాన్యతల్ని నిర్ణయించడం, జీడీపీని ఎలా పెంచాలి, పెట్టుబడులను ఆకర్షించడం, మూలధన మార్కెట్ల విస్తరణ, ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణ, ప్రభుత్వ రుణ ప్రణాళికలు, అంతర్జాతీయ రేటింగ్స్ ఎంగేజ్‌మెంట్... వంటి అనేక అంశాలను సమీక్షించి రూపొందించే ఈ ఏడాది బడ్జెట్‌లో ఈమె కీలకంగా వ్యవహరించనున్నారు. అంతేకాదు, ఓ మహిళా ఆర్థిక మంత్రి, మరో మహిళా ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి నాయకత్వంలో వస్తోన్న తొలి బడ్జెట్. ఇది మనదేశ ఆర్థిక ఇంజిన్‌ను ప్రగతిపథంలో దూసుకెళ్లేలా చేస్తుందని ఆశిద్దాం!

నొప్పుల్ని తగ్గించే... శూల్పాశాసనం



ఆటలాడటంవల్ల వచ్చే నొప్పులను తొలగించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందీ ఆసనం. ఆకలి పెరగడానికీ ఆహారం జీర్ణం కావడానికీ తోడ్పడుతుంది.

చేసే విధానం: ముందుగా యోగా మ్యాట్‌పైన ప్రశాంతంగా కూర్చోండి. తర్వాత ఒక కాలిని నేరుగా పక్కకు చాచండి. రెండో కాలిని మడిచి మోకాలి దగ్గర ఉంచండి. మడిచిన కాలి వైపుగా శరీరాన్ని కొంచెం వంచి రెండు చేతుల్ని వెనక్కి తిప్పి కాలితోపాటు శరీరాన్ని లాక్ చేసి పట్టుకోండి. ఈ సమయంలో కుడి చేయి పిడికిలి బిగించి ఎడమచేత్తో కుడి మణికట్టును పట్టుకోవాలి. ఆపై శ్వాస తీసుకుంటూ పైవైపుగా తలను తిప్పి చూడండి. ఇలా 12-15 సెకన్లు ఉండే ప్రయత్నం చేయండి. తర్వాత విశ్రాంతి పొంది మరోవైపు ఆసనాన్ని పునరావృతం చేయండి.

జాగ్రత్తలు: తుంటి, వెన్ను సర్జరీలు అయినవాళ్లు చేయొద్దు. గర్భిణులు డాక్టర్ సలహాతో చేయాలి.

ఉపయోగాలు: ఆహారం: నీటిని ఎక్కువగా తీసుకోవాలి. తగినంత ప్రొటీన్ అందేలా చూసుకోవాలి. తృణధాన్యాలు, గింజలు, శనగలు ఎక్కువగా తీసుకోవాలి.

- శిరీష, యోగ గురు

పర్వతంపైకి వెళ్లేకొద్దీ చలిగాలులు ఈడ్చి కొడుతున్నాయి. ఆక్సిజన్ అందక ఊపిరి తీసుకోవడమే కష్టంగా ఉంది. అడుగు సాగడం లేదు. అయినా వెనకడుగు వేయలేదు. ఎలాగైనా లక్ష్యాన్ని చేరుకోవాలి. ఒంట్లోని శక్తినంతా కూడదీసుకున్నారు. 6962 మీటర్ల ఎత్తైన అకోంకాగ్వా శిఖరంపైకి చేరి త్రివర్ణ పతాకాన్ని నిలిపారు... ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారిణి ఎస్.భరణి. తన పర్వతారోహణ ప్రయాణాన్ని 'వసుంధర'తో పంచుకున్నారిలా..!



సివిల్స్ తర్వాత శిఖరాలే లక్ష్యంగా..!



మాది తమిళనాడులోని కోయంబత్తూరు. 2020లో ఐఎఫ్ఎస్‌గా ఎంపికయ్యా. ఆంధ్రప్రదేశ్ క్యాడర్. ప్రస్తుతం రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ(స్పోర్ట్స్ అథారిటీ)కి వైస్ ఛాన్సలర్, ఎండీగా; ఏపీ యువజన సేవల శాఖ(యూత్ సర్వీసెస్)కు కమిషనర్‌గా అదనపు బాధ్యతల్లో ఉన్నా. నాన్న మాజీ సైన్యాధికారి, అమ్మ రిటైర్డ్ టీచర్. సేవ, సాహసం.. విషయంలో వాళ్లే నాకు స్ఫూర్తి. చిన్నప్పుడు ఉదయాన్నే నాన్నతోపాటు పరుగెత్తేదాన్ని. ఆ అలవాటే శారీరక దృఢత్వాన్నీ మానసిక ధైర్యాన్నీ ఇచ్చింది. విశ్వవిద్యాలయంలో ఎన్‌సీసీ క్యాడెట్‌ని కావడంతో ఆత్మవిశ్వాసంతోపాటు నాయకత్వ లక్షణాల్నీ పెంపొందించుకున్నా.

ఐఎఫ్ఎస్‌గా ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నాక జీవితంలో మరో ఉన్నతమైన లక్ష్యాన్ని పెట్టుకోవాలనుకున్నా. ఆ క్రమంలో పర్వతారోహణపై ఆసక్తి కలిగింది. డార్జిలింగ్‌లోని హిమాలయన్ మౌంటెనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి ప్రాథమిక శిక్షణ తీసుకున్నా. దేశంలోని కొన్ని పర్వతాల్ని అధిరోహించా. ప్రస్తుతం ప్రపంచంలోని ఏడు ఖండాల్లోని అత్యంత ఎత్తైన పర్వతాలను(సెవెన్ సమ్మిట్స్) అధిరోహించాలనుకున్నా. ఆఫ్రికాలోని మౌంట్ కిలిమంజారోతో ప్రారంభించా. తర్వాత ఐరోపాలోని మౌంట్ ఎల్‌బ్రస్‌ను అధిరోహించా. తాజాగా దక్షిణ అమెరికా, అర్జెంటీనాలో ఉన్న అకోంకాగ్వా పర్వతాన్ని అధిరోహించా. ఆసియా వెలుపల ఉన్న ఎత్తైన పర్వతాల్లో ఇదొకటి. దీన్ని అధిరోహించడం ఎంతో సంతృప్తిని కలిగించింది.

భయాల్ని అధిగమించి...

6,962 మీటర్ల ఎత్తయిన 'అకోంకాగ్వా' ఎక్కడానికి ముందు కొన్ని భయాలుండేవి. పర్వతారోహణకు శరీరం సహకరిస్తుందా అని సందేహించా. ఎందుకంటే పర్వతంపైకి ఎంతో బరువుతో వెళ్లాలి. రోజుల తరబడి ప్రయాణం... శారీరకంగా, మానసికంగా అలసిపోతుంటాం. ఇలా అన్ని కోణాల్లోనూ ఆలోచించాక నన్ను నేను సిద్ధం చేసుకున్నా. ఓ సవాల్‌గా తీసుకున్నా. అలాగే ఎక్కేటప్పుడు 'నువ్వు చేయగలవు. ముందుకు సాగాలి.. ముందుకు సాగాలి' అని నాకు నేను చెప్పుకుంటూ వెళ్లా. ఆరు వేల మీటర్లు చేరుతున్నామనగా... మొదలైంది అసలు పరీక్ష. చలి గాలులు, గాల్లో ఆక్సిజన్ శాతం తగ్గిపోయి ఊపిరి అందలేదు. శరీరమంతా నిస్సత్తువ ఆవరించింది. క్రమంగా ఆలోచించే శక్తినీ కోల్పోతున్నాననే భయం కలిగింది. అప్పటికే మా బృందంలో ఒక పర్వతారోహకుడు మానసికంగా సిద్ధంగా లేక స్పృహ కోల్పోయాడు. దాంతో లోలోపల కాస్త భయంగా అనిపించినా లక్ష్యం మీదే దృష్టిపెట్టా. అయితే అనుభవజ్ఞులైన గైడ్లు వెంట ఉండటంతో ధైర్యంగా అనిపించేది. అలా మొత్తమ్మీద జనవరి 11న బయలుదేరి 20వ తేదీ ఉదయానికి శిఖరాన్ని అధిరోహించా. శారీరక, మానసిక సంసిద్ధతతో పాటు బృంద ఐక్యతా పర్వతారోహణలో ఎంతో కీలకం. అలాగే ఎక్కడానికి అవసరమైన శారీరక దృఢత్వానికి శిక్షణా ముఖ్యమే. అందులో భాగంగా నడక, పరుగు, ఈత, కార్డియో వ్యాయామాలన్నీ చేశా. విజయవాడ చుట్టుపక్కల కొండల్లో అప్‌హిల్ వాకింగ్ సాధన చేశా. ఇంట్లోనే చిన్న జిమ్ ఏర్పాటుచేసుకున్నా. బ్యాక్‌ప్యాక్‌తో బరువులు మోస్తూ నడక, పరుగు సాధన చేశా. శిక్షణలో భాగంగా రాత్రివేళ కూడా సాధన చేసేదాన్ని.

తదుపరి లక్ష్యాలు

సెవెన్ సమ్మిట్స్‌లో తదుపరి లక్ష్యం భారత్, నేపాల్‌ల్లో ఉన్న అత్యంత ఎత్తైన పర్వతాలే. అందుకు అవసరమైన శిక్షణా తీసుకుంటా. ఆంధ్రప్రదేశ్‌లో అడ్వెంచర్ స్పోర్ట్స్‌ని అభివృద్ధి చేయాలన్నది నా కల. వీటితో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, మానసిక బలం పెరుగుతాయి. ఇవి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేలా చేస్తాయి. పర్వతారోహణలో వాతావరణ మార్పుల్ని తట్టుకుంటూ ఇబ్బందుల్ని అధిగమిస్తూ ఒక్కో అడుగు వేసుకుంటూ వెళ్లాలి. అప్పుడే శిఖరాన్ని చేరుకుంటాం. జీవితంలోనూ అంతే! ఏ పని చేయాలనుకున్నా- ఒక్కో అడుగు ముందుకు వేయండి. అదే మిమ్మల్ని ఉన్నతంగా నిలుపుతుంది.

- సుతారపు సోమశేఖర్, హైదరాబాద్



నెలరోజులు ఆగగలరా?

అక్కో చెల్లో ఈ డ్రెస్ బాగుంది కదా అని ఫొటోలో రీలో పంపిస్తారు. చూసి బాగుంది అనేసి ఊరుకుంటామా? అబ్బే... చకచకా ఆర్డర్ పెట్టేస్తాం. ఏమీ తోచక సోషల్ మీడియా తెరుస్తామా... కళ్లను ఆకర్షిస్తూ ఎన్నెన్ని కనిపిస్తాయో! ఓ కొత్త వస్తువు, నగ, చీర... అరె బాగుందే అని మాట నోరు దాటకముందే కార్ట్‌లోకి వెళ్లిపోతుంది. ఆన్‌లైన్ ఉందిగా అని కొనేయడం... నెల ఆఖరికి వచ్చేసరికి ఖాతాలో చిల్లరే మిగిలిందని వాపోవడం. మనలో చాలామందికి పరిచయమే కదూ!

దీనికి అడ్డుకట్ట వేయాలనుకుంటున్నారా? అయితే '30 రోజుల వెయిటింగ్ రూల్'ని ప్రయత్నించమంటున్నారు నెటిజన్లు. అంటే ఏం లేదు... ఒక వస్తువు బాగా నచ్చిందనుకోండి. వెంటనే కొనేయొద్దు. నెల రోజులు సమయం పెట్టుకుని వేచి చూడాలట. ఆ తరవాతా అది అవసరం అనిపిస్తేనే కొనాలట. ఏ వస్తువైనా కొన్నాక వాడితే పర్లేదు. కానీ చాలావరకూ అవసరమై కొనట్లేదట. ఆఫర్ అయిపోతుందనో... ఎప్పటికైనా అవసరం అవుతుందనో కొంటున్నామట. కాబట్టే, ఇల్లంతా వస్తువులతో నిండిపోతుంది. ఎలాగైనా కట్టడి చేయాల్సిందే అనుకుంటాం. తీరా ఆకర్షణలు చుట్టుముట్టేస్తోంటే వాటి మాయలో పడిపోతాం. ఇలా నెలరోజుల రూల్ పెట్టుకోవడం వల్ల కొనాలన్న ఆతృత, ఆసక్తి పోతాయి. ఇంకేం కొనం. అలాగని అన్నింటికీ ఇదే రూల్ అని పాటించకండి. కొన్ని అత్యవసరాలు ఉంటాయి. అలాంటప్పుడు మాత్రం దీన్ని పక్కన పెట్టేయొచ్చు. బాగుంది కదూ... ప్రయత్నించండి మరి.

మీకు తెలుసా!

ఏకరూప కవలల్లో కూడా అరుదుగా జుట్టు, కళ్లు వేరువేరు రంగుల్లో ఉంటుంటాయి. ఫలదీకరణ అండం రెండుగా విడిపోయాక జన్యువుల్లో మార్పులు జరగడం వల్ల మెలనిన్ ఉత్పత్తిలో వ్యత్యాసాలు ఏర్పడటమే దీనికి కారణం అంటున్నాయి అధ్యయనాలు.





ఉద్యోగిని ఎంపిక... టోటెనే నంట!

ఆన్‌లైన్ పేమెంట్లే ఉండనీ... ఫోన్ తప్ప వేరే అవసరమే లేకపోనీ... ప్రతి అమ్మాయి చేతిలో చిన్నదో పెద్దదో బ్యాగు ఉండాల్సిందే. అదీ మనకి ఒక ఆభరణమే! కాబట్టే... దాన్ని మాత్రం వదలం. పైగా ఏ క్షణం ఏ అవసరం వస్తుందోనని దానిలో మనదైన ఓ కిట్‌నీ సర్దేసి ఉంచుకుంటాం. ఇక ఉద్యోగినుల సంగతి వేరే చెప్పాలా? ల్యాప్‌టాప్, ట్యాబ్, ఛార్జర్, ముఖ్యమైన పత్రాలు, చిరుతిళ్లు... ఎంత పెద్ద జాబితా ఉంటుందో! ఏ ఒక్కటి మర్చిపోయినా పని, రోజు గజిబిజిగా మారిపోయినట్లే అనిపిస్తుంది. అందుకే ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకుని మరీ సర్దుకుంటూ ఉంటారు. అలాగని కుక్కేసుకుని వెళ్లలేరు కదా! ఒకటి తీస్తే నాలుగు పడిపోయేలా... ఒక దాని కోసం బ్యాగంతా వంపేసేలా పరిస్థితి ఉంటే అది మరింత చిరాకు. ప్రతిదీ ఆర్గనైజ్‌డ్‌గా ఓ పద్ధతిలో ఉండాలనుకునే వాళ్లకి ఇదసలే నచ్చదు. కాబట్టే, ఉద్యోగినుల ఎంపిక ఒకటే అవుతోంది. అదే... టోటె! చక్కగా విశాలంగా ఉంటుంది. చివరి నిమిషంలో ఏది తీసేయాలబ్బా అన్న సందేహం అక్కర్లేదు. చక్కగా కావాల్సినవన్నీ పద్ధతిగా సర్దేసుకోవచ్చు... అంత విశాలం దీని సొంతం. అంతేనా, టీమ్‌తో స్నాక్స్‌కో లంచ్‌కో బయటికి వెళతాం. ఆ కొద్దిసమయంలో ఏ స్కార్ఫో, టాపో నచ్చింది. కొనేసి బ్యాగులో పెట్టేసుకోవచ్చు. సాయంత్రం ఇంటికెళ్తూ కొన్న సరకులను సర్దేసుకోవచ్చు. ఒకటీ రెండు రోజుల టూర్‌కి ప్రత్యేకంగా వేరే బ్యాగు అవసరమే ఉండదు. అదనపు సరంజామా అవసరం లేకుండా ఒక్కదానితోనే వెళ్లిపోవచ్చన్నమాట. పైగా స్టైల్‌గా! ఇన్ని సౌకర్యాలున్నప్పుడు మనసు పారేసుకోకుండా ఉంటారా? కాబట్టే, నేటి ఉద్యోగినుల ఎంపిక టోటెనే అవుతోంది అంటున్నారు ఫ్యాషనిస్టులు. మినిమల్, లగ్జరీ, ఎకో ఫ్రెండ్లీ... అంటూ ఆప్షన్లూ బోలెడే! ఇంకేం నచ్చింది ఎంచేసుకుంటున్నారు. ఆఫీసులో తమదైన స్టైల్ స్టేట్‌మెంట్‌తో మెరిసిపోతున్నారు. మీరూ ఇలాంటి దాని కోసమే వెతుకుతున్నారా? ఇంకేం ప్రయత్నించండి టోటె. ఇంతకీ ఏ మెటీరియల్‌కి మీ ఓటు మరి?



అమ్మాయిల గది అందంగా!

టీనేజ్ అమ్మాయిలు తమకంటూ ఓ ప్రత్యేక ప్రపంచం ఉండాలని కోరుకుంటారు. అందుకు అనుగుణంగా వారి గదినీ సిద్ధం చేయండి. ఈ మార్పులు సౌకర్యాన్నీ, స్టైల్‌నే కాదు... ఒత్తిడినీ తగ్గిస్తాయి అంటారు ఇంటీరియర్ నిపుణులు. అవేంటంటారా?

- సాఫ్ట్‌పింక్, లావెండర్, మింట్ గ్రీన్ కలర్స్ టీనేజీ గర్ల్స్ రూమ్‌కి చక్కని ఎంపిక. ఓ వైపు రంగు వేసినా... మరో వైపు ఫ్లోరల్ వాల్‌పేపర్‌నో, గర్లీ మోటివేషనల్ స్టిక్కర్స్‌నో అతికించి చూడండి. ఈ రంగుల్లానే వారి మనసూ ప్రశాంతంగా ఉంటుంది
- కోజీ అట్మాస్ఫియర్ కోసం ఫెయిరీ లైట్స్, స్ట్రింగ్ లైట్స్... అలంకరిస్తే రూమ్ డ్రీమీగానూ ఉంటుంది. అలానే మంచం మీద సాఫ్ట్ పిల్లోస్, ఫ్లఫీ బ్లాంకెట్స్, కలర్‌ఫుల్ బెడ్ షీట్స్‌తో బోహో స్టైల్‌లో తీర్చిదిద్దండి. అది వారికెంతగానో నచ్చేస్తుంది. ఇలా మీరు తన మనసుకి మరింత దగ్గర కావొచ్చు.
- గదిలోనే ఓ మంచి స్టడీ టేబుల్, కంఫర్టబుల్ చైర్, పెద్ద మిర్రర్‌తో వానిటీ సెట్ చేయండి. షెల్ఫ్ ఏర్పాటు చేసి తన ఇష్టాలకు అనుగుణంగా కొన్ని పుస్తకాలను కొని పెట్టండి. ఇవి ఆమెకు చక్కటి అభిరుచిని అలవరుస్తాయి. అలానే, గది మూలల్లో ఇండోర్ ప్లాంట్స్, నచ్చినవి రాసుకోవడానికీ, మెచ్చినవి అతికించడానికి వాల్‌కీ ఏర్పాటు చేస్తే సరి. తనలోని సృజన వెలికి తీసేందుకు ఓ చక్కటి మార్గమిది. అయితే, ఇదంతా మినిమల్‌గా సిద్ధం చేయండి. ట్రెండ్‌నీ ఫాలో కావాలిగా మరి.



చట్టాల గురించి అవగాహన పెంచుకుందాం...

హింస/వేధింపులను అడ్డుకుందాం!

ఈనాడు వెబినార్!

ఈనాడు వసుంధర

01.02.2026 (ఆదివారం) ఉ.11:00 - మ.12:30

మనకోసం ఎన్ని చట్టాలు ఉన్నా... గృహ హింస, లైంగిక వేధింపులు తప్పడం లేదు. ఆస్తిహక్కు గురించి పూర్తి అవగాహన ఉన్నవాళ్లూ అంతంతమాత్రమే. ఇవన్నీ మన విజయాన్ని అడ్డుకుంటున్నాయి. శారీరకంగా, మానసికంగా కుంగదీస్తున్నాయి. సమస్య వస్తే తక్షణ పరిష్కారం కోసం ఎక్కడికి వెళ్లాలో, ఎవరిని సంప్రదించాలో నేటికీ చాలామందికి తెలియదు. మౌనంగా బాధపడటం తప్ప... ధైర్యం చేసి కోర్టు మెట్లు ఎక్కే మహిళల సంఖ్యా తక్కువే.

అందుకే... ఈనాడు వసుంధర కుటుంబం- తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్తంగా నిర్వహించే ఉచిత వెబినార్‌లో పాల్గొందాం. మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు చేపట్టిన చర్యలు, హక్కులు... వంటి అనేక అంశాల గురించి 01.02.2026 (ఆదివారం) నాడు ప్రముఖ న్యాయ నిపుణులు, పోలీస్ అధికారులు అందించే విలువైన సమాచారాన్ని తెలుసుకుందాం. మనల్ని మనం రక్షించుకుందాం. శక్తిమంతమైన మహిళగా ఎదుగుదాం.

వెబినార్‌లో పాల్గొనడానికి క్యూఆర్ కోడ్ స్కాన్ లేదా వెబ్ లింక్ ఓపెన్ చేయండి.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా https://hov.to/2df2d074 వెబ్‌లింకు ఓపెన్ చేయండి. జూమ్ ఐడీ: 956 2822 7145 పాస్‌కోడ్: 917259 తోనూ జాయిన్ కావొచ్చు.

ఈ వెబినార్ యూట్యూబ్ లైవ్ కోసం స్కాన్ చేయండి.

కాంథా... వేలమందికి ఉపాధి!

చిన్నప్పుడు అమ్మతో కలిసి సరదాగా సూదీ దారంతో నేర్చుకున్న కాంథా ఎంబ్రాయిడరీని పెద్దయ్యాక వృత్తిగా మార్చుకున్నారు. మూడు దశాబ్దాలుగా వేలమంది మహిళలకి ఈ కుట్టునునేర్పిస్తూ, జీవనోపాధితోపాటు ఆర్థిక స్వాతంత్ర్యాన్నీ కల్పిస్తున్నారు తృప్తి ముఖర్జీ. ఈ ప్రయాణంలో ఆమె ఎన్నో అవార్డులూ అందుకున్నారు. తాజాగా ఆ జాబితాలో పద్మశ్రీ కూడా చేరింది. ఆమె గురించి తెలియాలంటే...



'కళలతోనే మహిళలకు సాధికారత కల్పించాలనేదే నా లక్ష్యం...' అంటారు తృప్తి ముఖర్జీ. కాంథా ఎంబ్రాయిడరీ... పశ్చిమబెంగాల్‌తోపాటు తూర్పు రాష్ట్రాల్లోని స్త్రీలు దీన్ని కుడుతుంటారు. అయితే ఆధునిక ఫ్యాషన్ ప్రపంచంలో ఈ కళ అంతరించిపోతోంది. అందుకే దాని మూలాలు కాపాడాలనుకున్నా అంటారు తృప్తి. దాంతో ప్రస్తుత ఫ్యాషన్ వస్త్రాలకు కాంథాను జత చేసి విదేశీ వేదికలపై ప్రదర్శనలిస్తున్నారు. ఇందుకు ముఖర్జీ నక్షి కాంథా క్రియేషన్స్ పేరుతో ఒక సంస్థను ఏర్పాటుచేశారు. బీర్భూమ్ జిల్లాలోని సూరిలో పుట్టిపెరిగారు తృప్తి. 'సాధారణ దుస్తుల్ని కూడా ప్రత్యేకంగా చూపించే సంప్రదాయ హస్త కళల్లో ఇది కూడా ఒకటి. ఇది బెంగాలీ జానపదం నుంచి పుట్టిన పురాతన హస్త కళ. దీన్ని చిన్నప్పుడు అమ్మ సూదీ దారంతో భలే కుట్టేది. అది చూసి సరదాగా నేనూ నేర్చుకున్నా కానీ, అదే ఇప్పుడు నా వృత్తిగా మారిపోయింది. ఫ్యాషన్ ట్రెండ్స్ పెరిగేకొద్దీ శతాబ్దాల చరిత్ర ఉన్న ఈ కళను ఎవరూ పట్టించుకోవడం లేదు. అందుకే ఈతరానికి సరిపడేలా చుడీదార్, చీర, ధోతీ, కుర్తాలపై దీన్ని కుట్టిస్తున్నా. దీనికోసం బీర్భూమ్‌లోని దాదాపు ప్రతి గ్రామానికి వెళ్లి మహిళలకు శిక్షణ ఇచ్చా. వాళ్లూ అంతే ఉత్సాహంతో నేర్చుకున్నారు. ప్రస్తుతం ఇరవైవేలమంది మహిళలకు ఈ కళతో ఉపాధి దొరుకుతోంది. అందుకే ముఖర్జీ నక్షి కాంథా క్రియేషన్స్‌తో మన దేశంతోపాటు విదేశాల్లోనూ పలు ప్రదర్శనలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. సుభాష్ చంద్రబోస్, మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటాలతోపాటు, రామసేతు వంటి నిర్మాణాలను కూడా బట్టలపై డిజైన్ చేస్తాం. ఇవి దిల్లీలో ప్రదర్శించినప్పుడు ప్రధాని ప్రశంసలూ అందుకున్నా' అంటారు తృప్తి. కాంథాని సంరక్షించడంలో ఆమె చేసిన కృషికి గతంలో జాతీయ అవార్డుతోపాటు శిల్పగురు గౌరవాన్నీ దక్కించుకున్నారు. తాజాగా పద్మశ్రీకి ఎంపికయ్యారీమె.


తృప్తి

చాంపియన్స్

మెరుపులతో ముగిస్తారా?

సిరీస్ ఇప్పటికే సొంతమైనా సరే.. ఇది నామమాత్రమైన పోరే అయినా.. ఎంతో కీలకమే! ఇంకో వారంలో సొంతగడ్డపై టీ20 ప్రపంచ కప్ మొదలు కాబోతుండగా.. చివరగా ఆడే మ్యాచ్‌లో ఘన విజయం సాధించి మెగా టోర్నీలో అడుగు పెట్టడం టీమ్‌ఇండియాకు ఎంతో అవసరం. జట్టు గత మ్యాచ్ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని సిరీస్‌కు మెరుపు ముగింపునివ్వాలని అభిమానులు ఆశిస్తున్నారు.

● కివీస్‌తో చివరి టీ20 నేడు ● ప్రపంచకప్ ముంగిట ఇదే ఆఖరి పోరు | రాత్రి 7 నుంచి



మిచెల్



సంజు శాంసన్

● తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ మైదానంలో పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. స్పిన్నర్లకూ అవకాశముంటుంది. టాస్ గెలిచిన జట్టు బౌలింగే ఎంచుకోవచ్చు. ఇక్కడ భారత్ 4 టీ20లు ఆడి మూడు నెగ్గింది. ఒక మ్యాచ్ ఓడింది.

తిరువనంతపురం

హ్యాట్రిక్ విజయాలతో జోరుమీదున్న టీమ్‌ఇండియాకు నాలుగో టీ20లో గట్టి షాకే ఇచ్చింది కివీస్. ఆ మ్యాచ్‌లో ఏకంగా 50 పరుగుల తేడాతో ఓడిన నేపథ్యంలో శనివారం చివరి మ్యాచ్‌లో భారత్ ఎలా ఆడుతుందన్నది ఆసక్తికరం. ఇంకో ఓటమి ఎదురైతే ప్రపంచకప్ ముంగిట జట్టు ఆత్మవిశ్వాసానికి గట్టి దెబ్బే అవుతుంది. కాబట్టి సూర్యకుమార్ సేన ఈ మ్యాచ్‌లో గెలిచి తీరాల్సిందే.

ఉత్సాహంగా కివీస్: నాలుగో టీ20లో ఇటు బ్యాటుతో, అటు బంతితో చక్కటి ప్రదర్శనతో భారత్‌పై ఘనవిజయం సాధించిన కివీస్.. మరోసారి అలాంటి ప్రదర్శనే చేసి సిరీస్‌ను గౌరవప్రదంగా ముగించాలని చూస్తోంది. గత మ్యాచ్‌లో కివీస్ బ్యాటర్లు.. భారత బౌలర్లపై ఎదురుదాడి చేసి ఫలితం రాబట్టారు. వచ్చిన బ్యాటర్ వచ్చినట్లే బాదుతూ పోవడంతో భారత్ ముందు 216 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. ఓపెనర్లు సీఫర్ట్, కాన్వేలతో పాటు మిచెల్, ఫిలిప్స్ మంచి ఊపుమీదున్నారు. భారత బౌలర్లు ఈ నలుగురినీ కట్టడి చేయడం మీదే జట్టు విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. గత మ్యాచ్‌లో బుమ్రా సహా బౌలర్లందరూ ధారాళంగా పరుగులిచ్చేశారు. మరి శనివారం బౌలర్ల ప్రదర్శన ఎలా సాగుతుందో చూడాలి. కివీస్ బౌలర్లలో హెన్రీ, శాంట్నర్‌ల నుంచి భారత బ్యాటర్లకు ముప్పు పొంచి ఉంది.

సొంతగడ్డపై అయినా..: ఈ సిరీస్ ఆరంభం నుంచి భారత్‌కు అతి పెద్ద ఆందోళనగా మారింది సంజు శాంసన్ ఫామే. ఈ మ్యాచ్‌లో అయినా అతడు పుంజుకుంటాడేమో అని అభిమానులు ఎదురు చూస్తున్నారు కానీ.. అతను ఎంతకీ జోరందుకోవట్లేదు. గత మ్యాచ్‌లో ఇన్నింగ్స్‌ను బాగానే ఆరంభించినా పెద్ద స్కోరు చేయలేకపోయాడు. చివరి టీ20 జరగబోతోంది తన సొంత నగరమైన తిరువనంతపురంలో కావడంతో ఓ పెద్ద ఇన్నింగ్స్ ఆడడానికి ఇంతకంటే మంచి వేదిక మరొకటి ఉండదు. ఒక మ్యాచ్‌లో మెరుపులు మెరిపించి మరో మ్యాచ్‌లో విఫలమవుతున్న మరో ఓపెనర్ అభిషేక్ శర్మ కూడా నిలకడ అందుకోవాల్సి ఉంది. విశాఖలో సంచలన ఇన్నింగ్స్ ఆడిన శివమ్ దూబెపై ఈ మ్యాచ్‌లో అందరి కళ్లూ నిలిచి ఉన్నాయి. రింకు కూడా మంచి ఊపులోనే ఉన్నాడు. ఆ మ్యాచ్‌లో తుది జట్టుకు దూరమైన ఇషాన్ కిషన్.. చివరి టీ20లో ఆడే అవకాశముంది.



శుక్రవారం తిరువనంతపురం శ్రీ పద్మనాభస్వామి ఆలయంలో సూర్యకుమార్

భలే గెలిచారు

ఫైనల్‌కు జకోవిచ్, అల్కరాస్ ● పోరాడి ఓడిన సినర్, జ్వెరెవ్



జకోవిచ్

● జకోవిచ్ చివరగా 2024 వింబుల్డన్‌లో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడాడు. ఆ తర్వాత అయిదు టోర్నీల్లోనూ అతను సెమీస్‌లోనే ఓటమి పాలయ్యాడు.

టెన్నిస్ ప్రియులకు శుక్రవారం పండుగ రోజే. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నలుగురు మేటి ఆటగాళ్ల మధ్య రెండు అద్భుత పోరాటాలు వారికి కనువిందు చేశాయి. ముందుగా అలెగ్జాండర్ జ్వెరెవ్, కార్లోస్ అల్కరాస్.. తర్వాత యానిక్ సినర్, నొవాక్ జకోవిచ్ కోర్టులో కొదమసింహాల్లా తలపడ్డారు. ఇరువైపులా ఆటగాళ్లు అత్యుత్తమ ఆటను ప్రదర్శించడంతో రెండింట్లోనూ ఆట అయిదు సెట్లకు దారి తీసింది. రెండు మ్యాచ్‌లకు కలిపి దాదాపు పది గంటల సమయం పట్టింది. చివరికి అల్కరాస్, జకోవిచ్ పైచేయి సాధించి టైటిల్ పోరుకు దూసుకెళ్లారు. నిరుడు ఫైనల్లో తలపడ్డ సినర్, జ్వెరెవ్ నిరాశతో నిష్క్రమించారు.



అల్కరాస్

మెల్‌బోర్న్

తన గ్రాండ్‌స్లామ్ ఖజానాకు ఇంకొక్క టైటిల్ జమ చేసి ఆల్‌టైమ్ రికార్డును సొంతం చేసుకోవాలని ప్రయత్నిస్తున్న నొవాక్ జకోవిచ్.. అయిదు గ్రాండ్‌స్లామ్‌ల తర్వాత మళ్లీ ఫైనల్‌కు చేరాడు. తాను రికార్డు స్థాయిలో పది టైటిళ్లు సాధించిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండేళ్ల విరామం తర్వాత తుది పోరుకు అర్హత సాధించాడు. శుక్రవారం ప్రపంచ నంబర్ 2, రెండో సీడ్ యానిక్ సినర్ (ఇటలీ) నుంచి కఠిన సవాలు ఎదురైనప్పటికీ తగ్గని ఈ నాలుగో సీడ్ ఆటగాడు.. అయిదు సెట్ల హోరాహోరీ పోరులో 3-6, 6-3, 4-6, 6-4, 6-4తో అద్భుత విజయం సాధించాడు. ఈ మ్యాచ్ 4 గంటల 12 నిమిషాల పాటు సాగింది. అంచనాలకు తగ్గట్లే తొలి సెట్ సినర్ సొంతమైంది. మూడు సెట్లు అయ్యేసరికి 2-1తో అతను ఆధిక్యంలో నిలిచాడు. కానీ చివరి రెండు సెట్లలో జకోవిచ్ గొప్ప పట్టుదలను ప్రదర్శించి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. నిర్ణయాత్మక చివరి సెట్‌లో 3-3తో స్కోరు సమమైంది. ఏడో గేమ్‌లో విజృంభించి ఆడిన జకోవిచ్ బ్రేక్ పాయింట్ సాధించాడు. స్కోరు సమం చేయడానికి సినర్ గట్టిగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పదో గేమ్‌లో జకోవిచ్ జోరు కొనసాగిస్తూ.. 40-15తో మ్యాచ్ పాయింట్ మీదికి వచ్చాడు. సినర్ పుంజుకుని సెట్‌ను డ్యూస్‌కు మళ్లించినా.. ఒత్తిడిని అధిగమిస్తూ జకోవిచ్ సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. మ్యాచ్‌లో జకోవిచ్ 12 ఏస్‌లు మాత్రమే వేయగా.. సినర్ 26 ఏస్‌లు కొట్టడం విశేషం.

అద్భుతం.. ఆ పోరాటం: ఉదయం తొలి సెమీస్ ఇంకా హోరాహోరీగా సాగింది. ఏకంగా 5 గంటల 26 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) 6-4, 7-6 (7-5), 6-7 (3-7), 6-7 (4-7), 7-5తో మూడో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ)ను ఓడించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లో ఇదే అత్యంత సుదీర్ఘంగా సాగిన మ్యాచ్. తొలి సెట్లో దూకుడుగా ఆడిన అల్కరాస్ తొమ్మిదో గేమ్‌లో సులువుగా బ్రేక్ సాధించి పైచేయి సాధించాడు. కానీ రెండో గేమ్‌లో జ్వెరెవ్ నుంచి గట్టి ప్రతిఘటనే ఎదురైంది. ఆరో గేమ్‌లో సర్వీస్ కోల్పోయిన అల్కరాస్.. తొమ్మిదో గేమ్‌లో బ్రేక్‌సాధించి స్కోరు సమం చేశాడు. టైబ్రేక్ కూడా హోరాహోరీగా సాగినప్పటికీ.. చివర్లో జ్వెరెవ్ తడబడి సెట్‌ను కోల్పోయాడు. 0-2తో వెనుకబడ్డాక పుంజుకోవడం జర్మనీ ఆటగాడికి కష్టమే అనుకుంటే.. టైబ్రేక్‌లో ధాటిగా ఆడి సెట్ గెలిచాడు. నాలుగో సెట్ కూడా ఇలాగే సాగింది. ఇద్దరూ సర్వీస్‌ను కోల్పోకపోవడంతో టైబ్రేక్ అనివార్యమైంది. అక్కడ ఇద్దరూ నువ్వానేనా అన్నట్లు తలపడినప్పటికీ.. ఆఖర్లో జ్వెరెవ్ పైచేయి సాధించాడు. నిర్ణయాత్మక చివరి సెట్ ఆరంభంలోనే జ్వెరెవ్ బ్రేక్ సాధించడంతో మ్యాచ్ అతడిదే అనుకున్నారంతా. కానీ అల్కరాస్ పట్టు వదల్లేదు. రెండుసార్లు త్రుటిలో బ్రేక్ అవకాశాన్ని కోల్పోయిన అల్కరాస్.. పదో గేమ్‌లో స్కోరు సమం చేయగలిగాడు. అదే ఊపులో మరోసారి జ్వెరెవ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి మ్యాచ్‌ను ఎగరేసుకుపోయాడు. మ్యాచ్‌లో అల్కరాస్ 12 ఏస్‌లు సంధిస్తే.. జ్వెరెవ్ 17 ఏస్‌లు కొట్టాడు. విన్నర్లలో 78-56తో స్పెయిన్ ఆటగాడు పైచేయి సాధించాడు.

● జకోవిచ్, అల్కరాస్ ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో తలపడబోతుండడం ఇదే తొలిసారి. వీళ్లిద్దరూ ఇంతకుముందు 2023, 2024 వింబుల్డన్ తుదిపోరులో ఢీకొన్నారు. రెండుసార్లూ అల్కరాసే విజేతగా నిలిచాడు.

మిక్స్‌డ్ టైటిల్.. 37 ఏళ్ల తర్వాత



ఒలీవియా, పీర్స్

ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను ఒలీవియా గడెకి, జాన్ పీర్స్ జోడీ సొంతం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో ఈ ఆస్ట్రేలియా ద్వయం 4-6, 6-3, 10-8తో క్రిస్టినా, గినార్డ్ (ఫ్రాన్స్) జంటను ఓడించింది. ఒలీవియా, పీర్స్ జోడీకి వరుసగా ఇది రెండో ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ టైటిల్. ఒక జోడీ ఈ టైటిల్‌ను నిలబెట్టుకోవడం 37 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. 1988, 1989లో పగ్, నవోత్నా ద్వయం వరుసగా రెండుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ టైటిల్ గెలిచింది.

సబలెంకా X రిబకినా

నేడు మహిళల ఫైనల్ | మ॥ 2 నుంచి



సబలెంకా



రిబకినా

ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. 2023 ఫైనల్ ప్రత్యర్థులు అరీనా సబలెంకా (బెలారస్), ఎలీనా రిబకినా (కజకిస్థాన్) మరోసారి టైటిల్ కోసం అమీతుమీ తేల్చుకోబోతున్నారు. చివరి పోరులో సబలెంకానే విజయం సాధించింది. ఇప్పటికే రెండుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గిన ఆమె.. మూడో టైటిల్‌పై కన్నేసింది. మరోవైపు ఒక్క వింబుల్డన్ టైటిల్ మాత్రమే గెలిచి, రెండుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ఓటమి పాలైన రిబకినా.. ఈసారి మాత్రం ట్రోఫీని వదలకూడదన్న పట్టుదలతో ఉంది.

అభిరథ్, హిమతేజ శతకాలు

ఈనాడు, హైదరాబాద్: రంజీ ట్రోఫీలో అభిరథ్‌రెడ్డి (121; 186 బంతుల్లో 16×4, 1×6), కొడిమెల హిమతేజ (125 బ్యాటింగ్; 207 బంతుల్లో 13×4) అదరగొట్టారు. జింఖానా మైదానంలో చత్తీస్‌గఢ్‌తో జరుగుతున్న ఎలీట్ గ్రూపు-డి మ్యాచ్‌లో అభిరథ్, హిమతేజ సెంచరీలతో సత్తాచాటడంతో హైదరాబాద్‌కు ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 56/0తో శుక్రవారం ఉదయం ఆట కొనసాగించిన హైదరాబాద్.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 105 ఓవర్లలో 4 వికెట్లకు 415 పరుగులు సాధించింది. అభిరథ్, హిమతేజ మూడో వికెట్‌కు 147 పరుగులు జోడించి జట్టు భారీ స్కోరుకు బాటలు వేశారు. అమన్‌రావు (52; 79 బంతుల్లో 8×4, 1×6), ప్రజ్ఞయ్‌రెడ్డి (52 బ్యాటింగ్; 66 బంతుల్లో 8×4, 1×6) అర్ధ సెంచరీలతో మెరిశారు. రెండ్రోజుల ఆట మిగిలివున్న ఈ మ్యాచ్‌లో ప్రస్తుతం హైదరాబాద్ 132 పరుగుల ఆధిక్యంతో ఉంది. చత్తీస్‌గఢ్ తొలి ఇన్నింగ్స్‌లో 283 పరుగులకు ఆలౌటైంది.


ఆంధ్ర 267/5

● జ్ఞానేశ్వర్ 87 బ్యాటింగ్ ● నాగాలాండ్‌తో రంజీ

దీమాపూర్: నాగాలాండ్‌తో రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర మెరుగ్గా ఆడుతోంది. శుక్రవారం రెండో రోజు ఆట చివరికి 5 వికెట్లు కోల్పోయి 267 పరుగులు చేసింది. ఆంధ్ర 99 పరుగులు వెనుకబడి ఉంది. జ్ఞానేశ్వర్ (87 బ్యాటింగ్) ఆకట్టుకున్నాడు. అభిషేక్ రెడ్డి (51), కరణ్ షిందే (51) అర్ధసెంచరీలతో రాణించారు. జ్ఞానేశ్వర్, శశికాంత్ (31 బ్యాటింగ్) అభేద్యమైన ఆరో వికెట్‌కు 68 పరుగులు జోడించారు. ప్రత్యర్థి బౌలర్లలో వీనో (4/45) విజృంభించాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోర్ 322/6తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన నాగాలాండ్ 366 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ చేతన్ బిష్త్ (189) ద్విశతకం చేజార్చుకున్నాడు.

గుజరాత్.. రైట్ రైట్

ముంబయిపై విజయంతో ఎలిమినేటర్‌కు అర్హత



వేర్‌హామ్ 44 నాటౌట్

వడోదర: డబ్ల్యూపీఎల్-4లో గుజరాత్ జెయింట్స్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఈ సీజన్లో తన చివరి మ్యాచ్‌ను ముంబయి ఇండియన్స్‌తో ఆడిన ఆ జట్టు.. 11 పరుగుల తేడాతో నెగ్గి మంగళవారం జరిగే ఎలిమినేటర్‌కు అర్హత సాధించింది. 8 మ్యాచ్‌ల్లో 5 విజయాలతో ఆ జట్టు 10 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ముంబయికి కూడా ఇదే చివరి మ్యాచ్. ఆ జట్టు 6 పాయింట్లకు పరిమితమైంది. ఎలిమినేటర్‌లో రెండో బెర్తు కోసం ముంబయితో పాటు దిల్లీ (6), యూపీ (4) మధ్య పోటీ నెలకొంది. ఆదివారం దిల్లీ, యూపీ తలపడతాయి. డీసీ గెలిస్తే ఆ జట్టే రెండో ఎలిమినేటర్‌కు అర్హత సాధిస్తుంది. ముంబయి, యూపీ నిష్క్రమిస్తాయి. యూపీ గెలిస్తే మూడు జట్ల పాయింట్లు సమమవుతాయి. నెట్‌రన్‌రేట్‌లో ముందున్న జట్టు ముందంజ వేస్తుంది. ప్రస్తుతానికి ముంబయే నెట్‌రన్‌రేట్‌లో మెరుగ్గా ఉంది. యూపీ భారీ విజయం సాధిస్తే తప్ప.. ముంబయే ఎలిమినేటర్‌కు అర్హత సాధించవచ్చు.

శుక్రవారం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో మొదట గుజరాత్ 4 వికెట్లకు 167 పరుగులు సాధించింది. ఆష్లీ గార్డ్‌నర్ (46; 28 బంతుల్లో 7×4, 1×6), జార్జియా వేర్‌హామ్ (44 నాటౌట్; 26 బంతుల్లో 4×4, 2×6) మెరుపు ఇన్నింగ్స్‌లతో జట్టుకు మెరుగైన స్కోరునందించారు. అనుష్క శర్మ (33; 31 బంతుల్లో 4×4, 1×6), సోఫీ డివైన్ (25; 21 బంతుల్లో 3×4) కూడా ఉపయుక్తమైన ఇన్నింగ్స్‌లు ఆడారు. ముంబయి బౌలర్లలో అమేలియా కెర్ (2/26), షబ్నిమ్ ఇస్మాయిల్ (1/29) సత్తా చాటారు. ఛేదనలో ముంబయి తడబడింది. ఈ సీజన్లో సూపర్ ఫామ్‌లో ఉన్న సోఫీ డివైన్ (4-1-23-2) మరోసారి గొప్పగా బౌలింగ్ చేసి ముంబయికి బ్రేకులేసింది. ఆమెతో పాటు జార్జియా వేర్‌హామ్ (2/26) కూడా రాణించడంతో 13 ఓవర్లకు 86/4తో ముంబయి ఓటమి బాటలో సాగింది. అయితే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (82 నాటౌట్; 48 బంతుల్లో 8×4, 4×6) అద్భుత పోరాటంతో జట్టులో ఆశలు రేపింది. కానీ సాధించాల్సిన రన్‌రేట్ బాగా పెరిగిపోవడంతో ఆమె ప్రయత్నం ఫలించలేదు. చివరి ఓవర్లో 26 పరుగులు అవసరం కాగా.. 1, 3 బంతులకు సిక్సర్లు బాదినప్పటికీ.. చివరి 3 బంతుల్లో 2 పరుగులే రావడంతో ముంబయికి ఓటమి తప్పలేదు.



హర్మన్‌ప్రీత్ గార్డ్‌నర్

గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్: బెత్ మూనీ (సి) సజన (బి) షబ్నిమ్ 5; సోఫీ డివైన్ (సి) అమేలియా (బి) నాట్ సీవర్ 25; అనుష్క (సి) షబ్నిమ్ (బి) అమేలియా 33; ఆష్లీ గార్డ్‌నర్ (స్టంప్డ్) రహిల (బి) అమేలియా 46; జార్జియా వేర్‌హామ్ నాటౌట్ 44; భారతీ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం:** (20 ఓవర్లలో 4 వికెట్లకు) **167**

వికెట్ల పతనం: 1-121, 2-69, 3-71, 4-142

బౌలింగ్: షబ్నిమ్ ఇస్మాయిల్ 4-0-29-1; నాట్ సీవర్ 4-0-36-1; వైష్ణవి 2-0-21-0; అమన్‌జ్యోత్ 2-0-13-0; అమేలియా కెర్ 4-0-26-2; హేలీ మాథ్యూస్ 4-0-40-0

ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్: సజన (సి) భారతీ (బి) కశ్వీ 26; హేలీ మాథ్యూస్ (బి) సోఫీ డివైన్ 6; నాట్ సీవర్ (సి) అనుష్క (బి) సోఫీ డివైన్ 2; హర్మన్‌ప్రీత్ నాటౌట్ 82; అమేలియా (సి) బెత్ మూనీ (బి) జార్జియా 20; అమన్‌జ్యోత్ (స్టంప్డ్) బెత్‌మూనీ (బి) రాజేశ్వరి 13; సంస్కృతి ఎల్బీ (బి) జార్జియా 0; పూనమ్ (సి) అండ్ (బి) ఆష్లీ గార్డ్‌నర్ 2; రహిల నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 4 **మొత్తం:** (20 ఓవర్లలో 7 వికెట్లకు) **156; వికెట్ల పతనం:** 1-23, 2-33, 3-37, 4-82, 5-126, 6-127, 7-155; **బౌలింగ్:** రేణుక సింగ్ 2-0-11-0; కశ్వీ గౌతమ్ 2-0-12-1; రాజేశ్వరి గైక్వాడ్ 4-0-46-1; సోఫీ డివైన్ 4-1-23-2; జార్జియా వేర్‌హామ్ 4-0-26-2; ఆష్లీ గార్డ్‌నర్ 3-0-26-1; తనూజ కన్వర్ 1-0-11-0

నేనే విశ్రాంతి కోరా



మన్‌ప్రీత్ సింగ్

దిల్లీ: ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ సన్నాహక శిబిరానికి ఎంపిక చేసిన 33 మంది ఆటగాళ్ల జాబితా నుంచి తనను దూరం పెట్టడంపై భారత హాకీ మాజీ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ స్పందించాడు. హాకీ ఇండియా (హెచ్ఐ)ను తానే విశ్రాంతి కోరినట్లు వెల్లడించాడు. క్రమశిక్షణ ఉల్లంఘనల కారణంగానే ఎంపిక చేయలేదనే ఊహాగానాలను అతడు ఖండించాడు. నిరుడు డిసెంబరులో దక్షిణాఫ్రికా పర్యటన సందర్భంగా సహచర ఆటగాడికి నిషేధిత ఉత్ప్రేరకం కలిగిన బబుల్‌గమ్‌ను ఇచ్చారన్న ఆరోపణల కారణంగా మన్‌ప్రీత్‌తో పాటు దిల్‌ప్రీత్ సింగ్, గోల్‌కీపర్ కృష్ణన్ బహదూర్‌లపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా హెచ్ఐ వారికి ప్రాబబుల్స్‌లో చోటివ్వలేదని వార్తలొచ్చాయి. మన్‌ప్రీత్‌పై వేటు వేయడాన్ని తప్పుపట్టిన చీఫ్ కోచ్ క్రెయిగ్ ఫుల్టన్ రాజీనామాకు సిద్ధమయ్యాడని ఊహాగానాలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో మన్‌ప్రీత్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వివరణ ఇచ్చాడు. ''కుటుంబంతో గడపడానికి నేనే విశ్రాంతి కోరాను. క్రమశిక్షణ చర్యల వార్తలు అవాస్తవం. పారిస్ ఒలింపిక్స్ తర్వాత వరుసగా టోర్నీల్లో పాల్గొంటున్నా. దీంతో నాపై ఒత్తిడి ఎక్కువైంది. గత ఏడాది నా భార్య ఆడబిడ్డకు జన్మనిచ్చింది. హాకీ ఇండియా లీగ్ అనంతరం నాకు విశ్రాంతి చాలా అవసరమని నా కోచ్ సలహా ఇచ్చాడు. ఈ సమయం నేను మానసికంగా తిరిగి ఉపశమనం పొందడానికి తోడ్పడుతుంది'' అని చెప్పాడు.

పి.టి.ఉష భర్త శ్రీనివాసన్ మృతి



కోజికోడ్ (కేరళ): భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు, దిగ్గజ అథ్లెట్ పి.టి.ఉష భర్త వి.శ్రీనివాసన్ (67) మృతి చెందారు. శుక్రవారం తెల్లవారుజామున తన నివాసంలో శ్రీనివాసన్ కుప్పకూలినట్లు కుటుంబ వర్గాలు తెలిపాయి. వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లినా ఆయనను కాపాడుకోలేకపోయారు. ఉషతో మాట్లాడిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. ఆమె భర్త మృతి పట్ల సంతాపం తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ మాజీ ఉద్యోగి శ్రీనివాసన్.. ఉష క్రీడా, రాజకీయ జీవితంలో ఆమె వెన్నంటి నిలిచారు. వీరిద్దరికి ఒక కుమారుడు ఉన్నాడు.

దంచేసిన డికాక్

● వందో టీ20లో సెంచరీ
● విండీస్‌తో సిరీస్ సఫారీల సొంతం



డికాక్ 115

సెంచూరియన్: క్వింటన్ డికాక్ తన వందో టీ20లో విధ్వంసం సృష్టించాడు. వెస్టిండీస్‌తో రెండో టీ20లో 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' డికాక్ (115; 49 బంతుల్లో 6×4, 10×6) అద్భుత సెంచరీ సాధించడంతో 222 పరుగుల భారీ లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 15 బంతులు మిగిలుండగానే ఛేదించింది. మూడు టీ20ల సిరీస్‌ను ఆ జట్టు మరో మ్యాచ్ ఉండగానే.. 2-0తో గెలుచుకుంది. రికిల్‌టన్ (77 నాటౌట్; 36 బంతుల్లో 9×4, 3×6) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. డికాక్, రికెల్‌టన్ కలిసి రెండో వికెట్‌కు 162 పరుగులు జోడించారు. 21 బంతుల్లో 50 పరుగులు చేసిన డికాక్.. మరో 22 బంతుల్లో సెంచరీని చేరుకున్నాడు. అకీల్ హోసేన్ రెండు వికెట్లు తీశాడు. మొదట వెస్టిండీస్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 221 పరుగులు చేసింది. హెట్‌మయర్ (75; 42 బంతుల్లో 8×4, 3×6) మెరుపు అర్ధశతకం సాధించాడు. బ్రెండన్ కింగ్ (49), రూథర్‌ఫోర్డ్ (57) చక్కటి సహకారం అందించారు. కేశవ్ మహరాజ్ (2/22) మెరుగ్గా బౌలింగ్ చేశాడు. మూడో టీ20 శనివారం జరుగుతుంది.

అమెరికా కెప్టెన్‌గా మోనాంక్



మోనాంక్ పటేల్

దుబాయ్: టీ20 ప్రపంచకప్‌లో పాల్గొనే అమెరికా జట్టుకు మోనాంక్ పటేల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఫిబ్రవరి 7న భారత్, శ్రీలంకలో ప్రారంభమయ్యే పొట్టి కప్పు కోసం 15 మంది ఆటగాళ్లతో శుక్రవారం అమెరికా జట్టును ప్రకటించారు. గత కప్‌లో బరిలో దిగిన 10 మంది ఆటగాళ్లకు ఈసారి కూడా అవకాశం లభించింది.

అమెరికా జట్టు: మోనాంక్ పటేల్ (కెప్టెన్), జెస్సీ సింగ్ (వైస్ కెప్టెన్), ఆండ్రీస్ గౌస్, షెహాన్ జయసూర్య, మిలింద్ కుమార్, షయాన్ జహంగీర్, సాయి తేజ ముక్కామల, సంజయ్ కృష్ణమూర్తి, హర్మీత్ సింగ్, నోస్తుష్ కెంజిగే, షాడ్లీ వాన్ షాల్క్‌విక్, సౌరభ్ నేత్రావల్కర్, అలీ ఖాన్, మహ్మద్ మోసిన్, శుభమ్ రంజానె

నితిన్ మేనన్ నాలుగోసారి

దుబాయ్: నితిన్ మేనన్ తన కెరీర్‌లో నాలుగోసారి టీ20 ప్రపంచకప్‌లో అంపైర్‌గా వ్యవహరించబోతున్నాడు. ఫిబ్రవరి 7న ఆరంభమయ్యే ఈ టోర్నీలో విధులు నిర్వర్తించే అంపైర్లు, రిఫరీల వివరాలను ఐసీసీ వెల్లడించింది. భారత్ నుంచి నితిన్, మదనగోపాల్, అనంత పద్మనాభన్ ఎంపికయ్యారు. అనంత పద్మనాభన్‌కు ఇదే తొలి ఐసీసీ టోర్నీ కాగా.. మదనగోపాల్‌కు అంపైర్‌గా ఇది రెండో టీ20 ప్రపంచకప్. ఐసీసీ ఎలైట్ ప్యానెల్‌లో ఉన్న ఏకైక భారత అంపైర్ మేనన్ గతంలో 2021, 2022, 2024 టీ20 ప్రపంచకప్‌లలోనూ అంపైర్‌గా ఉన్నాడు. శనివారం భారత్, న్యూజిలాండ్ మధ్య అయిదో టీ20తో కెరీర్‌లో అతడు 150వ మ్యాచ్ పూర్తి చేసుకోనున్నాడు.

సెమీఫైనల్లో దేవిక

థాయ్‌లాండ్ మాస్టర్స్

బ్యాంకాక్: భారత షట్లర్ దేవిక సిహాగ్ అదరగొట్టింది. థాయ్‌లాండ్ మాస్టర్స్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీ సెమీఫైనల్లో అడుగు పెట్టింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో దేవిక 21-19, 21-18తో టాప్ సీడ్ సుపనిద (థాయ్‌లాండ్)పై విజయం సాధించింది. సెమీస్‌లో ఆమె.. యు సూన్ (చైనీస్ తైపీ)తో తలపడనుంది.

శ్మశానవాటిక దారి మూసివేత
నడిరోడ్డుపై అంత్యక్రియలు



బిహార్‌లోని వైశాలి జిల్లాలో ఓ వృద్ధురాలి మృతదేహానికి నడిరోడ్డుపై అంత్యక్రియలు చేశారు. గోరౌల్ థానా పరిధిలోని సోంధో వసదేవ్ గ్రామానికి చెందిన రూన్నీదేవి (91) చనిపోయారు. గ్రామస్థులు ఆమె మృతదేహాన్ని తీసుకువెళుతుండగా శ్మశానవాటికకు వెళ్లే దారిలో ఉన్న పొలాల యజమానులు అడ్డుకున్నారు. శ్మశానవాటికకు ఉన్న ఆనవాయితీ దారి కాగా, ఆక్రమణలతో మూసివేశారు. దీంతో గ్రామస్తులు కోపాలయం ముందున్న రోడ్డుపైనే చితిని పేర్చి, అక్కడే అంత్యక్రియలు పూర్తిచేసి తమ నిరసన తెలిపారు. ఇలాంటి ఘటనలు గతంలోనూ పలుమార్లు జరిగాయని, భూముల యజమానులు పదే పదే అడ్డుకుంటున్నారని గ్రామస్థులు తెలిపారు. శ్మశానవాటిక భూమి ప్రభుత్వ ఆస్తి అని, దారిని అడ్డుకునేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బీడీవో పంకజ్‌కుమార్ నిగమ్ స్పష్టం చేశారు.

అయిదేళ్ల బుడ్డోడు..
5 వాయిద్యాల్లో ఘనుడు



త్రిశాంత్ శర్మ.. అయిదేళ్ల ఈ బాలుడు 5 రకాల సంగీత పరికరాలు వాయించే సామర్థ్యంతోపాటు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యంతో అబ్బురపరుస్తున్నాడు. అద్భుతమైన తన ప్రతిభతో ఇప్పటికే అయిదు స్వర్ణాలు సహా ఏడు పతకాలు గెలుచుకున్నాడు. బిహార్‌లోని సమస్తిపూర్‌కు చెందిన హేమంత్ ప్రసాద్‌శర్మ గత నాలుగేళ్లుగా వారణాసిలో స్థిరపడ్డారు. వీరి కుమారుడు త్రిశాంత్ తన వయసున్న మిగతా పిల్లలు ఆడుకునే వేళ తబలా, పియానో, డ్రమ్స్, కాంగో, జంబో డ్రమ్ ప్రతిభను సాధన చేస్తాడు. పియానోపై జనగణమన వాయిస్తాడు. మరోవైపు మార్షల్ ఆర్ట్స్‌లోనూ బ్లాక్ బెల్ట్ సాధనకు కృషి చేస్తున్నాడు. త్రిశాంత్‌కు చిన్న వయసు నుంచే సంగీతమంటే ఇష్టం ఉండటంతో నేర్పించామని తల్లిదండ్రులు తెలిపారు.

నేను భాజపాకు అనుకూలం కాదు: థరూర్



తిరువనంతపురం: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నిజాయతీ గల నాయకుడని, దేశంలో నెలకొన్న మతతత్వం వంటి పలు అంశాలపై ఆయనది బలమైన స్వరమని తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ ప్రశంసలు కురిపించారు. దేశంలోని మతతత్వం, ద్వేషం, విభజన రాజకీయాలపై నిరంతరం మాట్లాడే రాహుల్‌ను అందరూ ఇష్టపడతారు.. ఇందులో ఎలాంటి భిన్నాభిప్రాయం ఏమీ లేదన్నారు. శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌పై వచ్చిన తప్పుడు వ్యాఖ్యలతో తాను ఎన్నడూ ఏకీభవించలేదని స్పష్టం చేశారు. పార్టీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీలతో దిల్లీలో సమావేశమై తన అభిప్రాయాలు పంచుకున్న అనంతరం శశి థరూర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కొన్ని అంశాలపై తన వైఖరిని భాజపాకు అనుకూలంగా ఉందని మీడియా ప్రచారం చేసిందని.. తాను మటుకు ఆయా అంశాలను ప్రభుత్వానికి, భారత్‌కు అనుకూలంగా ఉన్నట్టు భావిస్తానని శశి థరూర్ వివరణ ఇచ్చారు. పార్లమెంటులో తాను ఎప్పుడూ పార్టీతోనే నిలబడ్డానని, ఇందులో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీని వీడనని స్పష్టంగా చెప్పగలరా? అని మీడియా ప్రశ్నించగా.. "నేను కాంగ్రెస్‌లోనే ఉంటానని, ఎక్కడికీ వెళ్లనని చెప్పగలను. కేరళ ఎన్నికల ప్రచారంలోనూ పాల్గొని యూడీఎఫ్ విజయానికి కృషి చేస్తా" అన్నారు.

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా
సునేత్ర!

- నేడు ప్రమాణం చేసే అవకాశం
- పునరేకీకరణ దిశగా ఎన్సీపీ చీలిక వర్గాల కసరత్తు?



ముంబయి: అజిత్ పవార్ సతీమణి సునేత్రా పవార్ మహారాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్యమంత్రి కానున్నారు. ఆమె శనివారం పదవీ స్వీకార ప్రమాణం చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. "ముంబయిలో శనివారం పార్టీ శాసనసభ్యుల సమావేశంలో సునేత్రను శాసనసభాపక్ష నాయకురాలిగా ఎన్నుకుంటాం" అని ఎన్సీపీ నాయకుడొకరు తెలిపారు. సాయంత్రానికల్లా ఆమె ఉపముఖ్యమంత్రిగా పదవీ స్వీకార ప్రమాణం చేస్తారని ఆయన పేర్కొన్నారు. మరోవైపు మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ ఆకస్మిక మృతి నేపథ్యంలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) చీలిక వర్గాల పునరేకీకరణను గురించిన ఊహాగానాలు ఊపందుకున్నాయి. చీలిక వర్గాల కలయికకు కసరత్తు జరుగుతున్న విషయం వాస్తవమేనని, ఇందుకు సంబంధించి అజిత్ పవార్ జీవించి ఉండగానే ప్రారంభమైన చర్చలు కీలక దశకు చేరుకున్నాయని అభిజ్ఞవర్గాలు పేర్కొన్నాయి. పుణె, చించ్వాడ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇరు వర్గాలు కలిసి పోటీ చేశాయి కూడా. రెండు చీలిక వర్గాలను విలీనం చేసే ఉద్దేశంతో గత కొంతకాలంగా అజిత్ పవార్ తన బాబాయి శరద్ పవార్‌తో అనేకమార్లు భేటీ అయ్యారని సమాచారం. శరద్ పవార్ వర్గానికి చెందిన సుప్రియా సూలే, జయంత్ పాటిల్‌తో కూడా చర్చలు జరిగాయి. భాజపా సీనియర్ నేతలకు ఈ పరిణామాల సమాచారం తెలుసునని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. చీలిక వర్గాల పునరేకీకరణ జరిగితే వ్యవస్థాపక నాయకుడైన శరద్ పవార్ సహజంగానే కేంద్ర స్థానాన్ని ఆక్రమించి పార్టీ శ్రేణులకు మార్గదర్శకత్వం చేసే అవకాశం ఉంది. సునేత్ర ఉపముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరిస్తే పునరేకీకరణ ప్రక్రియకు విఘాతం కలుగుతుందా? అప్పుడు విలీనం కోరుకుంటున్న నాయకుల వైఖరి ఎలా ఉంటుంది? అన్నది వేచి చూడాల్సిందే. సునేత్రా పవార్‌ను పార్టీ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకోవడంలో ఎలాంటి అడ్డంకులు లేవని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రఫుల్ పటేల్ శుక్రవారం స్పష్టం చేశారు. మరోవైపు రాష్ట్ర ఆర్థిక మంత్రిత్వ శాఖను నిర్వహించిన అజిత్ పవార్ మృతిచెందిన నేపథ్యంలో వచ్చే నెల శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ 2026-27 బడ్జెట్ సమర్పించే అవకాశాలున్నాయి.

విచారణ ప్రారంభించిన సీఐడీ

బారామతిలో ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణానికి దారితీసిన విమాన ప్రమాద ఘటనపై మహారాష్ట్ర నేర పరిశోధన విభాగం (సీఐడీ) విచారణ ప్రారంభించింది.

యుద్ధమైనా.. చర్చలైనా

దేనికైనా సిద్ధమే • ఇరాన్ స్పష్టీకరణ

ఇస్తాంబుల్: అమెరికాతో ఉద్రిక్తతల నివారణ కోసం సంప్రదింపుల్లో పాల్గొనేందుకు తమ దేశం సిద్ధంగా ఉందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ శుక్రవారం ప్రకటించారు. సంప్రదింపులతోపాటు యుద్ధానికీ తాము సిద్ధమేనని ఆయన స్పష్టం చేశారు. తుర్కియే నాయకత్వంతో సంప్రదింపులు జరిపేందుకు ఇస్తాంబుల్ వచ్చిన అరాఘ్చీ.. ఆ దేశ విదేశాంగ మంత్రి హకన్ ఫిదన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. అమెరికాతో కలవాలన్న ప్రణాళికేదీ తమ పరిశీలనలో లేదని ఆయన అన్నారు. మరోవైపు ఇరాన్‌లో సైనిక జోక్యాన్ని తుర్కియే వ్యతిరేకిస్తోంది. ఇరాన్‌పై దాడి ప్రాంతీయ అస్థిరతకు దారి తీస్తుందని స్పష్టం చేస్తోంది. 'సమస్యల పరిష్కారానికి సైనిక చర్యలు చేపట్టడం మాకు సమ్మతం కాదు. సైనిక చర్య ఫలవంతమవుతుందని మేము భావించడం లేదు'' అని తుర్కియే విదేశాంగ మంత్రి అన్నారు. అంతకు ముందు తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య సంప్రదింపులకు మధ్యవర్తిత్వం వహిస్తానని ఆయన ప్రతిపాదించారు.




అబ్బాస్ అరాఘ్చీ

ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు

ఇరాన్ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి ఇస్కందర్ మోమినీపై అమెరికా శుక్రవారం ఆంక్షలు విధించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించిన నిరసనకారులపై మోమినీ ఆదేశాల మేరకు భద్రతా సిబ్బంది దమనకాండకు పాల్పడ్డారని ట్రంప్ యంత్రాంగం పేర్కొంది. మోమినీతో పాటు.. ఇరాన్ పారిశ్రామిక బాబక్ జంజానీ సహా 18 మంది వ్యక్తులు, కొన్ని సంస్థలపై ఆంక్షలు విధించినట్లు ఆర్థిక శాఖ పేర్కొంది.

నెలసరి పరిశుభ్రత ప్రాథమిక హక్కే

- విద్యా సంస్థల ప్రాంగణాల్లో శుభ్రమైన టాయిలెట్లు ఉండాలి
- సరైన వసతులు కల్పించని యాజమాన్యాలపై చర్యలు తప్పవు
- సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు



దిల్లీ: చదువుకునే అవకాశం అందరికీ కల్పించే విద్యాహక్కు, లింగసమానత్వ హక్కు, జీవన హక్కు కోవలోనే... మహిళలు, బాలికలకు నెలసరి శుభ్రత కూడా ప్రాథమిక హక్కేనంటూ సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఈ క్రమంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, పాఠశాలలకు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం శుక్రవారం పలు ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలల్లో విద్యార్థినులకు పర్యావరణహితమైన రుతు రుమాళ్లు (శానిటరీ న్యాప్కిన్స్)ను ఉచితంగా అందించాలని తెలిపింది. అందరికీ కనీస పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని, శుభ్రమైన టాయిలెట్లను బాలికలకు, బాలురకు, దివ్యాంగులకు విడివిడిగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేస్తూ 126 పేజీల తీర్పు వెలువరించింది. 'ఈ తీర్పు న్యాయ వ్యవస్థలో భాగమైన వారి కోసం మాత్రమే కాదు. సహాయం అడిగేందుకు సంకోచించే విద్యార్థినులు, నిధుల కొరత కారణంగా సహాయం చేయలేని స్థితిలో ఉన్న ఉపాధ్యాయుల కోసం కూడా' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు ఈ ఆదేశాలను పాటించేలా స్పష్టం చేసింది. బాలబాలికలకు వేర్వేరుగా టాయిలెట్లు ఏర్పాటు చేయకపోతే ప్రైవేటు పాఠశాలల గుర్తింపు కోల్పోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. రుతుక్రమ ఆరోగ్య హక్కు, రాజ్యాంగంలోని అధికరణం 21 కిందకు వచ్చే జీవన హక్కులో భాగమని వ్యాఖ్యానించింది. బాలికలకు సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల వారి చదువు, ఆరోగ్యం, గౌరవం దెబ్బతింటాయని, ఇది సమానత్వ హక్కును కూడా విచ్ఛిన్నం చేస్తుందని న్యాయస్థానం అభిప్రాయపడింది. టాయిలెట్లను ఏర్పాటు చేయడంలో, ఉచిత నాప్కిన్లు అందించడంలో రాష్ట్రాలు విఫలమైతే వాటినే జవాబుదారుగా నిలబెడతామని స్పష్టం చేసింది.

పురుషులనూ చైతన్యపరచాలి...

విద్యాప్రాంగణాలు కేవలం బాలికలు, మహిళా టీచర్లకే పరిమితం కావని వాటిల్లో బాలురు, పురుష ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఉంటారని ధర్మాసనం పేర్కొంది. అందువల్ల బాలికల రుతుక్రమ సమస్యలను అర్థం చేసుకునేలా, ఆయా సందర్భాల్లో గౌరవప్రదంగా, సున్నితంగా స్పందించేలా వారందరినీ చైతన్యపరచాలని అభిప్రాయపడింది. మనుషుల శారీరక ధర్మాలపై బాలురకు అవగాహన కల్పించాలని తెలిపింది.

50 శాతం సుంకాలు విధిస్తా

- కెనడాను హెచ్చరించిన ట్రంప్
- క్యూబాకు చమురు సరఫరా చేసే దేశాలపైనా ఆగ్రహం

వాషింగ్టన్: అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన బెదిరింపు ధోరణి కొనసాగిస్తూనే ఉన్నారు. తమ దేశంలోకి దిగుమతయ్యే కెనడాకు చెందిన అన్ని విమానాలపై 50 శాతం సుంకాలు విధిస్తానని గురువారం హెచ్చరించారు. అమెరికా విమాన తయారీ సంస్థ గల్ఫ్‌స్ట్రీమ్ తయారు చేస్తున్న విమానాలకు కెనడా సర్టిఫికేషన్ ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ధోరణి కొనసాగితే తాము సుంకాలు విధించడమే కాకుండా కెనడా సంస్థలు తయారు చేసే విమానాలకూ సర్టిఫికేషన్ నిలిపివేస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో పోస్టు పెట్టారు. క్యూబాపైనా ట్రంప్ ఆర్థిక ఒత్తిడి పెంచుతున్నారు. ఆ కరీబియన్ దేశానికి చమురు సరఫరా చేసే ఏ దేశంపైనైనా అదనపు సుంకాలు విధించేలా కార్యనిర్వాహక ఉత్తర్వుపై గురువారం సంతకం చేశారు. క్యూబా ప్రభుత్వం అమెరికా జాతీయ భద్రతకు ముప్పుగా మారిందని ట్రంప్ పేర్కొన్నారు. ఇప్పటివరకు క్యూబాకు చమురు సరఫరాలో మెక్సికో కీలక పాత్ర పోషించింది. అయితే ఇటీవల మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ క్యూబాకు చమురు సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.



పిల్లలు రోజూ చెమటపట్టేలా ఆడటం అవసరం

మీ పిల్లలు ఒకట్రెండు రోజులు పుస్తకాలు అస్సలు పట్టుకోకపోయినా పర్లేదు, కానీ వాళ్లు ప్రతిరోజూ చెమట పట్టేలా ఆడటం చాలా అవసరం. తల్లిదండ్రులుగా ఆ అవకాశాన్ని వారికి కల్పించడం మీ బాధ్యత.

– శ్రీకాంత్ మిరియాల, సైకియాట్రిస్ట్

మీ భార్య అందంగా ఉందని పదవి ఇచ్చా

మంత్రి నియామకంపై ట్రంప్ వ్యాఖ్య!



ఇంటర్నెట్ డెస్క్: అమెరికా అంతర్గతవ్యవహారాల మంత్రిగా డగ్ బర్గమ్ నియామకంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. బర్గమ్ భార్య చాలా అందంగా ఉందని, అందుకే ఆయనకు మంత్రి పదవి ఇచ్చినట్లు ట్రంప్ తెలిపారు. ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో బర్గమ్, ఆయన సతీమణి అక్కడే ఉండటం గమనార్హం. మాదకద్రవ్యాల కట్టడి లక్ష్యంగా ఓ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుపై ట్రంప్ గురువారం సంతకం చేశారు. అనంతరం ఓవల్ ఆఫీసులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "బర్గమ్, అతని భార్య క్యాథరిన్ గుర్రపు స్వారీ చేస్తున్న వీడియో చూశా. అందులో ఆమె చాలా ఆకర్షణీయంగా కనిపించారు. ఆ కారణంతోనే డగ్‌కు పదవి ఇచ్చా. బర్గమ్ విజయం వెనుక ఆయన భార్య పాత్ర కీలకంగానే ఉండి ఉంటుంది'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

జాతిపితకు దేశం ఘననివాళి




దిల్లీలోని రాజ్‌ఘాట్‌లో శుక్రవారం మహాత్మాగాంధీ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, స్పీకర్ ఓం బిర్లా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, మనోహర్‌లాల్ ఖట్టర్ తదితరులు

దిల్లీ: మహాత్మాగాంధీ 78వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం యావద్దేశం ఆయనను స్మరించుకుంది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ.. జాతిపితకు నివాళులర్పించారు. దిల్లీలోని రాజ్‌ఘాట్‌కు చేరుకొని గాంధీజీ స్మారకస్థలి వద్ద అంజలి ఘటించారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు మరికొందరు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాత్ముడి సేవలను స్మరించుకున్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు మహాత్ముడికి ఘననివాళి అర్పించారు. సుప్రీంకోర్టు, దిల్లీ హైకోర్టు ప్రాంగణాల్లో రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. 1948 జనవరి 30 గాంధీ మరణించిన రోజును ఏటా అమరవీరుల దినోత్సవంగా జరుపుకొంటున్న విషయం తెలిసిందే.

మహాత్మాగాంధీ ఆలోచనా విధానాన్ని ద్వేషంతో తుడిచిపెట్టలేరు: రాహుల్

దిల్లీ: మహాత్మాగాంధీ ఒక వ్యక్తి మాత్రమే కాదని, ఒక ఆలోచనా ధారగా కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. సామ్రాజ్య దురహంకారం, ద్వేష భావజాలాలు బాపు ఆలోచనలను తుడిచిపెట్టేందుకు పలు సందర్భాల్లో విఫల యత్నాలు చేశాయన్నారు. జాతిపిత వర్ధంతి సందర్భంగా శుక్రవారం రాహుల్ 'ఎక్స్' ద్వారా ఆయనకు నివాళులు అర్పించారు. మహాత్ముడిని అమరత్వం గల భారతదేశపు ఆత్మగా అభివర్ణించారు. మన దేశానికి స్వాతంత్ర్యంతోపాటు అధికార బలం కంటే సత్యానికి ఉన్న విలువ గొప్పదనే ప్రాథమిక సూత్రాన్ని జాతిపిత అందించారన్నారు. తీస్ జనవరి మార్గ్‌లోని గాంధీ స్మృతి వద్ద సైతం రాహుల్ పుష్పాంజలి ఘటించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ సహా పలువురు కాంగ్రెస్ నేతలు మహాత్ముడికి నివాళులు అర్పించారు.

గాంధీ పేరుతో చట్టం మోదీకి నచ్చదు: మహాత్మాగాంధీ పేరుతో ముడిపడిన ఎంజీనరేగా చట్టం ఎక్కువకాలం కొనసాగడం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి నచ్చదని కాంగ్రెస్ పార్టీ శుక్రవారం విరుచుకుపడింది. ఎంజీనరేగా రద్దును నిరసిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యాలయం నుంచి చేపట్టిన 'ఎంజీనరేగా బచావో సంగ్రామ్ యాత్ర'లో పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ వ్యాఖ్య చేశారు. గాంధీ స్మృతి వరకు కాంగ్రెస్ సీనియర్ నేతలు నిర్వహించ తలపెట్టిన ప్రదర్శనను పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు.



గాంధీ స్మృతి వద్ద నివాళులర్పిస్తున్న రాహుల్ గాంధీ



హిమాచల్‌ప్రదేశ్‌లో ఇటీవల కురుస్తున్న మంచు పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఈ క్రమంలో హిమంతో కూడిన పర్వతాల రమణీయతను గగనతలం నుంచి వీక్షించి ఆనందానుభూతులను పొందేందుకు మనాలీ సమీపంలో శుక్రవారం హాట్ ఎయిర్ బెలూన్లలో పర్యాటకులు ఇలా విహరిస్తున్నారు.

సమన్యాయమే మా ప్రభుత్వ విధానం: భాజపా

దిల్లీ: విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) కొత్తగా తీసుకొచ్చిన సమానత్వపు నిబంధనల వివాదంపై స్పందించేందుకు భాజపా నిరాకరించింది. ప్రస్తుతం ఈ అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్న నేపథ్యంలో దానిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేమని పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు, జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది శుక్రవారం ఇక్కడ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. "అందరికీ న్యాయం చేసేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఎవరికీ అన్యాయం జరగకుండా చూడాలనేదే పార్టీ నిర్ణయం. యూజీసీ సమానత్వపు నిబంధనలపై ప్రస్తుతం సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున ఇప్పుడు దానిపై మేం మాట్లాడటం సబబు కాదు" అని పేర్కొన్నారు.

మణిపుర్‌లో రాష్ట్రపతి పాలనపై అనిశ్చితి

దిల్లీ: కల్లోల మణిపుర్‌లో రాష్ట్రపతి పాలన కొనసాగిస్తారా లేక ప్రజా ప్రభుత్వాన్ని పునరుద్ధరిస్తారా అన్న దానిపై అనిశ్చితి కొనసాగుతోంది. రాష్ట్రపతి పాలన విధించి ఏడాది కావస్తున్నా అధికార భాజపా అక్కడ తీసుకోబోయే చర్యపై ఎలాంటి ప్రకటనా చేయడం లేదు. గతేడాది ఫిబ్రవరి 13న రాష్ట్రపతి పాలన విధించిన నాటి నుంచీ 60 మంది సభ్యులు కలిగిన మణిపుర్ రాష్ట్ర శాసనసభ సుప్తచేతనావస్థలో ఉంది. ఆ రాష్ట్రంలో కుకి, మైతేయి తెగల మధ్య సాగిన తీవ్ర ఘర్షణల నేపథ్యంలో రాష్ట్రపతి పాలన విధించిన సంగతి తెలిసిందే. రాజకీయ అనిశ్చితి పరిష్కారానికి కుకి, మైతేయి తెగలకు చెందిన పలువురు పార్టీ ఎమ్మెల్యేలతో భాజపా ఈశాన్య రాష్ట్రాల సమన్వయకర్త సంబిత్ పాత్రా పలుసార్లు భేటీ అయ్యారు. రెండు తెగలకూ చెందిన శాసనసభ్యులతో చర్చలు జరిపారు.

కువైట్-దిల్లీ విమానానికి బాంబు బెదిరింపు

అహ్మదాబాద్: బాంబు బెదిరింపు కారణంగా కువైట్ నుంచి దిల్లీకి వస్తున్న ఇండిగో విమానాన్ని గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు మళ్లించారు. 180 మంది ప్రయాణికులున్న ఈ విమానం అహ్మదాబాద్ విమానాశ్రయంలో శుక్రవారం ఉదయం 6.40 గంటలకు సురక్షితంగా దిగింది. ఎయిర్‌క్రాఫ్ట్‌లో బాంబు ఉందంటూ రాసిన కాగితం అందులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి కంటపడింది. ఆ విషయాన్ని సిబ్బందికి తెలియజేయగా, వారు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను అప్రమత్తం చేశారు. వారి ఆదేశాల మేరకు అహ్మదాబాద్ మళ్లించారు. అక్కడ ప్రయాణికులను దించి, విమానంలో తనిఖీలు చేపట్టారు. అయితే ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లేవని అధికారులు పేర్కొన్నారు.

ఇక సమాచార హక్కునూ చంపుతారా?

- ఆర్థిక సర్వే తీరుపై ఖర్గే ధ్వజం



దిల్లీ: సమాచార హక్కు చట్టాన్ని (ఆర్టీఐ) పునః పరిశీలించాలని ఆర్థిక సర్వే పిలుపునిచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వ తీరుపై శుక్రవారం మండిపడ్డారు. ఎంజీనరేగా (మహాత్మాగాంధీ ఉపాధిహామీ చట్టం)ను చంపేశారు, ఇక ఆర్టీఐ వంతా? అని నిలదీశారు. సమాచార హక్కు చట్టాన్ని ఒక పద్ధతి ప్రకారం బలహీనపరుస్తున్న మోదీ సర్కారు సత్యాన్వేషకులను శిక్షించే భయానక వాతావరణం సృష్టిస్తోందని 'ఎక్స్' ద్వారా ఆయన ధ్వజమెత్తారు. 2014 నుంచి ఇప్పటిదాకా వందమందికి పైగా ఆర్టీఐ కార్యకర్తలు హత్యకు గురయ్యారని వెల్లడించారు. "ఈ చట్టం కింద సమాచార వెల్లడి నిలిపివేతకు 'మంత్రుల వీటో'ను సూచించిన ఆర్థిక సర్వే ప్రభుత్వ రికార్డులకు ప్రజల పరిశీలన నుంచి రక్షణ కల్పించే యోచన చేస్తోంది. 2025 నాటికి ఆర్టీఐకి సంబంధించి 26,000 పెండింగు కేసులు ఉన్నాయి. ఈ చట్టానికి స్వతంత్ర కాపలాదారులుగా ఉన్న అధికారులను లొంగదీసుకునే ప్రయత్నాలను 2019 నుంచే ప్రారంభించారు" అని ఖర్గే నిరసన వ్యక్తం చేశారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ - 2023 ఆర్టీఐలోని ప్రజా ప్రయోజన నిబంధనను తుడిచిపెట్టిందన్నారు. ఆర్టీఐలో కీలకమైన చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ పోస్టును గత 11 ఏళ్లలో ఏడు సార్లు కావాలనే ఖాళీగా పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ సర్కారు 2014లో ఆమోదం తెలిపిన విజిల్ బ్లోయర్స్ రక్షణ చట్టాన్ని భాజపా సర్కారు ఇప్పటిదాకా అమలు చేయలేదని ఖర్గే గుర్తు చేశారు.

భారత్ నుంచి అమెరికా నేతలకు అందిన కానుకలివే

- జాబితా విడుదల చేసిన అగ్రరాజ్యం



బైడెన్ దంపతులతో ప్రధాని మోదీ(పాత చిత్రం)

న్యూయార్క్: ప్రధాని నరేంద్ర మోదీ సహా భారత అధికారులు అమెరికా నేతలకు బహుకరించిన వస్తువుల వివరాలను తాజాగా ఆ దేశ విదేశాంగ శాఖ విడుదల చేసింది. 2024 ఏడాదికి గానూ విదేశీ ప్రభుత్వాల నుంచి తమ అధికారులు అందుకున్న బహుమతుల వివరాలను జాబితాలో చేరుస్తున్నట్లు చీఫ్ ఆఫ్ ప్రొటోకాల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఇందులో ప్రత్యక్ష బహుమతులనే కాకుండా ప్రయాణ గిఫ్టులను కూడా చేర్చారు. 2023లో భారత్‌లో జరిగిన జీ20 సమావేశం సందర్భంగా దిల్లీకి వచ్చిన అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు మోదీ బహుకరించిన 'గంధపుచెక్కతో చేసిన ఒక పెట్టె, స్కార్ఫ్, కుంకుమ పువ్వు, టీ పొడి ఉన్న చెక్క పెట్టె, ది టెన్ ప్రిన్సిపల్ ఉపనిషద్స్ అనువాద పుస్తకా'లను జాతీయ ఆర్కైవ్స్(ఎన్ఏఆర్ఏ)కు తరలించారు. పాడయ్యే వస్తువులు అయిన కుంకుమ పువ్వు, టీ పొడిని స్టేట్స్ సీక్రెట్ సర్వీస్ విధానాలకు అనుగుణంగా పారవేసినట్లు జాబితా పేర్కొంది. కాగా ఈ బహుమతుల విలువ రూ.51,640గా తెలిపింది. 2024 జులై 16న బైడెన్‌కు మోదీ బహూకరించిన 'స్టెర్లింగ్ సిల్వర్ మెటల్ ట్రైన్ సెట్', మాజీ ప్రథమ మహిళ జిల్ బైడెన్‌కు అందజేసిన కశ్మీర్ పాష్మినా షాల్, మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు ఇచ్చిన 'లార్డ్ కృష్ణ రాస్ లీలా సిల్వర్ బాక్స్'లను ఎన్ఏఆర్ఏలో భద్రపరిచినట్లు విదేశాంగశాఖ తెలిపింది. భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమెరికా మాజీ రక్షణ కార్యదర్శి లాయిడ్ ఆస్టిన్‌కు బహుమతిగా ఇచ్చిన 'నటరాజ కాంస్య విగ్రహం', భారత జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ అప్పటి అమెరికా జాతీయ భద్రతా వ్యవహారాల అధ్యక్షుడి సహాయకుడు జాకబ్‌కు ఇచ్చిన బహుమతులు గురించిన వివరాలను కూడా ఈ జాబితాలో ప్రస్తావించారు.

ఒలింపిక్ క్రీడాకారుడి తల్లిని హిప్నటైజ్ చేసి.. బంగారం చోరీ



పూనమ్‌తో మాట్లాడుతున్న దుండగులు ★ సురాజ్ పన్వర్

ఈటీవీ భారత్: ఓ ఒలింపిక్ క్రీడాకారుడి తల్లిని హిప్నటైజ్ చేసి.. దాదాపు రూ.5లక్షల విలువైన బంగారం, నగదు చోరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉత్తరాఖండ్‌లోని దేహ్రాదూన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒలింపిక్ క్రీడాకారుడు సురాజ్ పన్వర్ తల్లి పూనమ్ పన్వర్ ఈ నెల 28న తన ఇంటి నుంచి ఆఫీస్‌కు వెళ్తుండగా చంద్రబానీ చౌక్ సమీపంలో ఓ వ్యక్తి ఆమె వద్దకు వచ్చి మాటలు కలిపాడు. వీరు కొంత దూరం నడిచిన తర్వాత మరో వ్యక్తి వారికి తోడయ్యాడు. తనకు క్షుద్ర శక్తులపై పట్టు ఉందని అతడు వారిని నమ్మించాడు. అనంతరం దుండగులిద్దరూ పూనమ్‌ను ఓ చెట్టు కిందకు తీసుకువెళ్లి, ఆమె వద్ద ఉన్న ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఉత్తరాఖండ్‌కు చెందిన సూరజ్ పన్వర్ 2018లో జరిగిన సమ్మర్ యూత్ ఒలింపిక్స్‌లో 20 కిలోమీటర్ల రేస్ వాక్‌లో రజత పతకంతో మెరిశారు.

వెనెజువెలా అధ్యక్షురాలితో మోదీ ఫోన్ సంభాషణ

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రానున్న కాలంలో ద్వైపాక్షిక సంబంధాలను కొత్త పుంతలు తొక్కించేందుకు ఇరువురు నేతలూ అంగీకరించారు. వెనెజువెలాలో అధ్యక్షుడు నికొలాస్ మదురోను అమెరికా నిర్బంధించిన అనంతరం పగ్గాలు చేపట్టిన రోడ్రిగ్జ్ మోదీ సంభాషించడం ఇదే ప్రథమం. "వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ మాట్లాడాను. ద్వైపాక్షిక సంబంధాలను మరింత సుదృఢం, విస్తృతం చేసేందుకు ఇరువురం అంగీకరించాం'' అని మోదీ తన సోషల్ మీడియా సందేశంలో పేర్కొన్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, డిజిటల్ టెక్నాలజీ, వైద్యం, వ్యవసాయ రంగాల్లో భాగస్వామ్యాన్ని ఇనుమడింపజేసేందుకు నేతలిద్దరూ అంగీకరించినట్టు ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. దక్షిణార్ధగోళంలోని వర్ధమాన దేశాలు పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని ఇద్దరూ గుర్తించారని ప్రకటన వెల్లడించింది.

మూడు కాంస్య విగ్రహాలను భారత్‌కు తిరిగివ్వనున్న అమెరికా

న్యూయార్క్: దేవాలయాల నుంచి అక్రమంగా తొలగించిన మూడు పురాతన కాంస్య విగ్రహాలను భారత్‌కు అమెరికా తిరిగి అప్పగించనుంది. ఈ విషయాన్ని వాషింగ్టన్ డి.సి. లోని 'ది స్మిత్సోనియన్ నేషనల్ మ్యూజియం ఆఫ్ ఆసియన్ ఆర్ట్' ఓ ప్రకటనలో పేర్కొంది. చోళుల కాలానికి చెందిన 12వ శతాబ్దపు 'శివ నటరాజ', 'సోమస్కందా', విజయనగర కాలానికి చెందిన 16వ శతాబ్దపు 'సెయింట్ సుందరార్, పార్వతి' కాంస్య విగ్రహాలను తిరిగి భారత్‌కు అందించనున్నట్లు తెలిపింది.

తెరుచుకోనున్న రఫా క్రాసింగ్

జెరూసలెం: గాజా, ఈజిప్టుల మధ్య సరిహద్దుకు ఇరువైపులా రాకపోకలు సాగించేందుకు రఫా క్రాసింగ్‌ను తిరిగి తెరవనున్నట్లు ఇజ్రాయెల్ శుక్రవారం ప్రకటించింది. ఈ పరిణామం ట్రంప్ ప్రతిపాదించిన కాల్పుల విరమణ ప్రణాళిక అమలు దిశగా కీలక ముందడుగు కానుందని పరిశీలకులు భావిస్తున్నారు. గాజాలో మానవీయ సహాయాన్ని పర్యవేక్షిస్తున్న ఇజ్రాయెలీ సైనిక సంస్థ కోఆర్డినేటర్ ఆఫ్ గవర్నమెంట్ యాక్టివిటీస్ ఇన్ ద టెరిటరీస్ (సీవోజీఏటీ) సంస్థ ఈ మేరకు ప్రకటన వెలువరించింది. గాజాను బాహ్య ప్రపంచంతో కలిపే ప్రధాన మార్గమైన రఫా క్రాసింగ్‌లో రానున్న ఆదివారం నుంచి వ్యక్తుల పరిమిత రాకపోకల్ని అనుమతిస్తామని ఆ సంస్థ తెలియజేసింది. ఈ మార్గాన్ని త్వరలో తెరుస్తారని ఇప్పటికే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, గాజా పరిపాలక మండలికి అధినేతగా ఎంపికైన అలీ షాత్‌లు ఇటీవలే ప్రకటించారు.

చదువే కాదు, నైతిక విలువలూ ముఖ్యం

పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలి

- కష్టాల్లో అండగా నిలబడటమంటే.. పవన్ కల్యాణ్ ఉదాహరణ
- కాకినాడ జేఎన్టీయూలో మంత్రి నారా లోకేశ్
- విద్యార్థులతో ముఖాముఖి.. అభివృద్ధి పనులు ప్రారంభం


'హలో లోకేశ్' కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

ఈనాడు, కాకినాడ: మనం ఏం చదువుకున్నామన్నది కాదు, ఏం నేర్చుకున్నాం, ఏది అనుసరిస్తున్నామన్నదే ముఖ్యమని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. తానెప్పుడూ కళాశాలకు దుమ్ము కొట్టలేదని, 90 శాతం హాజరు కలిగి ఉండగా, బ్రాహ్మణి 100 శాతం తరగతులకు హాజరైనట్లు చెప్పారు. కాకినాడ జేఎన్టీయూలో శుక్రవారం 'హలో లోకేశ్' పేరుతో నిర్వహించిన ముఖాముఖిలో విద్యార్థుల ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో రావాల్సిన మార్పులు, విద్యార్థులు అందిపుచ్చుకోవాల్సిన నైపుణ్యాలు, వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. 'సోషల్ మీడియా కంటే పుస్తక పఠనంపై దృష్టిపెట్టండి. మా అబ్బాయి దేవాన్ష్ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకున్నాడు వాటితోనే ఎక్కువగా గడుపుతున్నాడు. 13 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియాకు దూరంగా ఉంచేలా ఇటీవల క్యాబినెట్ భేటీలో చర్చించాం. తదుపరి భేటీలో సంబంధిత కంపెనీలను పిలిచి మాట్లాడతామ'ని వెల్లడించారు. 'మనం ఆనందంగా ఉన్నప్పుడు చుట్టూ చేరేవారు గొప్పవాళ్లు కాదు. కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలిచేవారే గొప్పవాళ్లు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఎప్పటికీ మరిచిపోలేను. చంద్రబాబును రాజమహేంద్రవరం జైలులో పెట్టినప్పుడు ఆయన చెప్పిన ధైర్యం ఎంతో విలువైంది. మీరు కూడా నైతిక విలువలకు కట్టుబడి ఉండాలి. అమ్మకు చెప్పలేని పని ఎప్పుడూ చేయకూడదని నాగాంటి కోటేశ్వరరావు చెప్పిన మాటకు మనమంతా కట్టుబడి ఉండాల'ని లోకేశ్ పిలుపునిచ్చారు.

ఓటమి నుంచే నేర్చుకోవాలి

'ఫెయిల్(ఎఫ్‌ఏఐఎల్) అంటే ఫస్ట్ ఎటెంప్ట్ ఇన్ లెర్నింగ్ అని తెలుసుకోవాలి. ఓడిపోతే దిగులు చెందొద్దు. సీఎం చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌గా మూడు సార్లు ఫెయిల్ అయ్యారు. తర్వాతే 'హెరిటేజ్'తో విజయం సాధించారు. నేను మంగళగిరిలో 5 వేల ఓట్ల తేడాతో ఓడిపోయాను. మొదటి రోజు బాధనిపించింది. రెండో రోజు నుంచే కసిగా పనిచేశా. తర్వాతి ఎన్నికల్లో రాష్ట్రంలోనే మూడో అత్యధిక మెజార్టీతో గెలిచాను' అని లోకేశ్ గుర్తుచేసుకున్నారు.

బోధన సిబ్బంది నియామకం

వైకాపా హయాంలో 'ఒక తరగతికి ఒక టీచర్' పాలసీతో కేవలం 3 శాతం పాఠశాలల్లోనే ఉండేది. అన్ని తరగతుల పిల్లలను ఒకచోట కూర్చోబెట్టి పాఠాలు చెప్పేవారు. మేమొచ్చాక 30 శాతం పాఠశాలల్లో 'ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడు' విధానం పాటిస్తున్నాం. విశ్వవిద్యాలయాల్లో 4 వేల ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి న్యాయపరమైన చిక్కులతో జాప్యమవుతోంది. వాటిని పరిష్కరిస్తాం. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కళాశాలల ఖాతాలకు జమ చేస్తాం. ఫీజుల కోసం పిల్లలపై ఒత్తిడి తెస్తే ఒప్పుకోం. మహిళలకు ఉచిత బస్సులతో విద్యార్థుల రవాణాకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిసింది. ఈ సమస్యను పరిష్కరిస్తాం' అని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఎన్టీయూకే వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, ఎంపీ సానా సతీశ్‌బాబు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, సత్యప్రభ, ఆదిరెడ్డి వాసు, నేతలు సుజయకృష్ణ రంగారావు, జ్యోతుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

■ జేఎన్టీయూకేలో రూ.10 కోట్ల రూసా నిధులతో నందనం పేరుతో నిర్మించిన పీజీ బాయ్స్ హాస్టల్ భవనాన్ని, క్యాంపస్‌లో యూనివర్సిటీ నిధులు రూ.21 కోట్లతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రెయిన్లను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. అనంతరం జేఎన్టీయూ అనుబంధ కళాశాలలు ప్రదర్శించిన 20 స్టాళ్లను పరిశీలించారు.


జేఎన్టీయూ పీజీ బాయ్స్ హాస్టల్ భవనం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేశ్. చిత్రంలో వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, ఎంపీ సానా సతీష్‌బాబు, ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యేలు సత్యప్రభ, దివ్య, ఎమ్మెల్సీ రాజశేఖరం తదితరులు

పరిశ్రమలు పరిశోధనలకు నిధులివ్వాలి

విద్యార్థుల ప్రశ్నలకు లోకేశ్ జవాబులు

'పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉన్నత విద్య కరికులమ్‌లో మార్పులు చేస్తున్నాం. కోర్సు పూర్తి కాగానే విద్యార్థులు ఉద్యోగాలు సాధించడమే లక్ష్యం. కంపెనీలు సీఎస్ఆర్ తరహాలో విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు నిధులు సమకూర్చాలి. ఇటీవల దావోస్‌లో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఇదే చెప్పా' అని మంత్రి లోకేశ్ చెప్పారు. విద్యార్థుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. బీటెక్ విద్యార్థిని ప్రాప్తి సంధానకర్తగా వ్యవహరించారు.

ప్రశ్న: యూపీలో కుంభమేళా బాగా జరిగింది. గోదావరి పుష్కరాలను ఎలా చేయబోతున్నారు.?: –ఐశ్వర్య, మెకానికల్

మంత్రి: కుంభమేళాలో హాజరైన డిజిటల్ ట్విన్స్‌తో అనుసంధానించారు. గోదావరి పుష్కరాలకు సివిల్ పనులు మొదలుపెట్టాం. పుష్కర ఘాట్లలో రద్దీ నిర్వహణ, సౌకర్యాలపై జేఎన్టీయూ ద్వారా ప్రాజెక్టు తయారు చేయాలని వీసీకి సూచిస్తున్నాం.

ప్రశ్న: ఇంజినీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలు సాధించేందుకు కౌశలం ప్రోగ్రాం ఎలా ఉపయోగపడుతుంది? – ఆలయశ్రీ

మంత్రి: రాష్ట్రంలో నైపుణ్య గణన చేస్తున్నాం. 75 వేల మందిని స్క్రీనింగ్ చేశాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 22 రంగాల్లో 755 కంపెనీలు ఏపీకి వచ్చాయి. ఆర్సెలార్ మిత్తల్, గూగుల్, రిలయన్స్, రెన్యువబుల్ ఎనర్జీ వంటి భారీ ప్రాజెక్టులు సాకారం అవుతున్నాయి. సంక్షేమం, ఉద్యోగ కల్పనే మా ప్రభుత్వ ప్రాధాన్యాలు.

ప్రశ్న: దావోస్ సమిట్‌లో చర్చలే ఉంటాయా? పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు చేసుకుంటారా?: –శ్రావ్య

మంత్రి: మన ప్రత్యేకతలు, అనుకూలతలను వివరించడానికి దావోస్ అద్భుత చర్చా వేదిక. గతేడాది కాగ్నిజెంట్ సీఈవో రవిని కలిసి ఏపీకి రమ్మన్నాం. 11 నెలల్లో విశాఖలో ఆ సంస్థ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించింది. 1995 నుంచి రాష్ట్రం తరఫున దావోస్‌కు హాజరవుతున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చాక 4 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయి. వాటిలో 80 శాతం స్థానికులకు వచ్చాయి. మా ఎజెండా 20 లక్షల ఉద్యోగాలు కల్పించడం.


కోరమాండల్ ఆసుపత్రి ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేశ్, చిత్రంలో ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎంపీ సానా సతీష్, ఎమ్మెల్యేలు కొండబాబు, కర్రి పద్మశ్రీ, ఏఎంఎం ఫౌండేషన్ ప్రతినిధి ఎంఏ అలగప్పన్

కూటమిలో విభేదాలకు వైకాపా విశ్వప్రయత్నాలు

వాటిని ఐక్యంగా ఎదుర్కొందాం: మంత్రి లోకేశ్

ఈనాడు, కాకినాడ: 'కోడికత్తి, బాబాయి హత్య, గులకరాయి ఘటనలు చూశాం. కల్తీ నెయ్యి, కల్తీ మద్యంలకు పాల్పడింది వైకాపానే. అయినా తెదేపాపై నెపం వేస్తోంది. ఈ విషయంలో జగన్ అద్భుత నటుడు. వారి డ్రామాలపై మనమంతా అప్రమత్తంగా ఉండాలి' అని పార్టీ శ్రేణులకు తెదేపా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. శుక్రవారం కాకినాడ శివారు పనసపాడులో జరిగిన కాకినాడ గ్రామీణ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కూటమిలో విభేదాలు సృష్టించేందుకు వైకాపా తీవ్రంగా యత్నిస్తోంది. దీన్ని మూడు పార్టీలూ కలిసి ఎదుర్కోవాలి' అని సూచించారు.

తిరుమల లడ్డూపై వైకాపా డ్రామాలు: 'శ్రీవారి లడ్డూకు కల్తీ నెయ్యి సరఫరాపై వాస్తవాలు జనానికి తెలియాలి. 2019 వరకు నాణ్యమైన నెయ్యిని కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ నుంచి కొనేవారు. వైకాపా అధికారంలోకి వచ్చాక చిన్న చిన్న కంపెనీలకు ఆర్డర్లు ఇచ్చేందుకు టెండర్ నిబంధనలు మార్చారు. 2022లో నమూనాలు పరీక్షిస్తే ఫెయిల్ అయ్యాయి. ఆ నివేదికను తొక్కిపెట్టారు. లడ్డూలో నాణ్యతలేమిపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడే చెప్పాం. సామాజిక మాధ్యమాల్లో చాలామంది వీడియోలు పెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొన్ని నమూనాలను పరీక్షించగా జంతు కొవ్వు కలిసిందని, వెజిటబుల్ ఆయిల్ ఉందని తేలింది. మొన్నటి ఛార్జిషీట్‌లోనూ 35వ పేజీలో చాలా స్పష్టంగా సీబీఐ చెప్పింది. వైకాపా ఇప్పుడు కొత్త డ్రామా ఆడుతోంద'ని లోకేశ్ మండిపడ్డారు.

తోట చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం: 'మెడపై కత్తిపెట్టినా జై చంద్రబాబు, జై తెలుగుదేశం అని నినదించి ప్రాణాలు కోల్పోయిన తోట చంద్రయ్య మనకు స్ఫూర్తి. అతని కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేలా అసెంబ్లీలో బిల్లు పెట్టి నెగ్గించాం. కౌన్సిల్‌లో వైకాపా నేతలు అడ్డుకున్నారు. వచ్చే సమావేశాల్లో అక్కడా బిల్లు పాస్ చేసి, అతనికి ఉద్యోగం ఇప్పించే బాధ్యత తీసుకుంటా' అని లోకేశ్ హామీ ఇచ్చారు. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ద్వారా 8 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని, కోరమాండల్ విస్తరణతో మరో 8 వేల మందికి అదనంగా ఉపాధి లభిస్తుందని చెప్పారు. వలసపాకలలో రూ.32 కోట్లు వెచ్చించి 60 పడకలతో నిర్మించిన కోరమాండల్ ఆసుపత్రి నూతన భవనాన్ని మంత్రి లోకేశ్ ప్రారంభించారు.

కాకాణికి రూ.53.33 కోట్ల జరిమానా!

అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా గ్రావెల్ తవ్వకాలు

- కూటమి ప్రభుత్వం వచ్చాక గుర్తింపు
- తాజాగా మాజీ మంత్రితో సహా వైకాపా నాయకులకు నోటీసులు

ఈనాడు, నెల్లూరు: మాజీ మంత్రి, వైకాపా నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి మైనింగ్ శాఖ నోటీసులు జారీ చేసింది. అక్రమంగా గ్రావెల్‌ను తరలించినందుకు రూ.53.33 కోట్ల జరిమానా చెల్లించాలని ఆయనతో పాటు మరికొంత మంది వైకాపా నాయకులకు పంపిన నోటీసుల్లో పేర్కొంది. వైకాపా ప్రభుత్వ హయాంలో సర్వేపల్లి నియోజకవర్గంలో గ్రావెల్‌ను పెద్దఎత్తున అక్రమంగా తరలించారు. దీనిపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చినా.. అప్పట్లో అధికారులు స్పందించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 నవంబరులో విజిలెన్స్, మైనింగ్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా విచారణ చేశాయి. వెంకటాచలం మండలంలోని పలు ప్రాంతాల్లో ఎంతమేర గ్రావెల్‌ను అక్రమంగా తరలించారన్నది సాంకేతికత సాయంలో అధికారులు లెక్కించారు. ఈదగాలి ప్రాంతంలో 9,07,796 క్యూబిక్ మీటర్లు, రామదాసు కండ్రిక ప్రాంతంలో 52,697 క్యూబిక్ మీటర్ల మేర అక్రమంగా తవ్వినట్లు తేల్చారు.

కాకాణి ప్రమేయంతోనే దోపిడీ

గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిగిన ప్రాంతంలో స్థానికులను విచారించిన అధికారులు కాకాణి ప్రమేయంతోనే ఈ దోపిడీ జరిగినట్లు గుర్తించారు. ఈదగాలి గ్రామంలో వైకాపా నాయకులు వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, రఘునాథన్‌రెడ్డిలు, రామదాసుకండ్రిగలో వైకాపా నాయకులు మందల వెంకటశేషయ్య, షేక్ షాజహాన్‌లు అప్పటి మంత్రి కాకాణి సహకారంతో అక్రమంగా గ్రావెల్‌ను తరలించినట్లు గుర్తించారు. ఈ నివేదికను విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి పంపగా.. విజిలెన్స్ డీజీ పరిశీలించి, చర్యలు తీసుకోవాలని మైనింగ్ శాఖకు పంపారు. దీని ఆధారంగా గతేడాది నవంబరులో కాకాణితో పాటు.. వైకాపా నాయకులకు మైనింగ్ శాఖ డీడీ శ్రీనివాసరావు షోకాజు నోటీసులు జారీ చేశారు. అనంతరం డిమాండ్ నోటీసులు ఇచ్చారు. వీటిపై వైకాపా నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. అక్రమ తవ్వకాలపై మరోసారి విచారణ జరపాలంటూ మైనింగ్ అధికారులను హైకోర్టు ఆదేశించినట్లు సమాచారం.

పోడియాన్ని చుట్టుముట్టి.. మైక్ విరగ్గొట్టి..!

జీవీఎంసీ కౌన్సిల్‌లో వైకాపా సభ్యుల దురుసు ప్రవర్తన


మేయర్ పోడియంను చుట్టుముట్టిన వైకాపా కార్పొరేటర్లు

విశాఖపట్నం (కార్పొరేషన్), న్యూస్‌టుడే : మహా విశాఖ నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ఉద్రిక్తత నెలకొంది. వైకాపాకు చెందిన కార్పొరేటర్లు విచక్షణారహితంగా ప్రవర్తించి, తెదేపా కార్పొరేటర్లపై దాడి చేశారు. శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి 54.79 ఎకరాలు కేటాయించే అంశాన్ని ప్రస్తావించినప్పుడు వైకాపా సభ్యులంతా వ్యతిరేకించారు. మేయర్ పోడియాన్ని చుట్టుముట్టి, గీతం వర్సిటీకి భూములు కేటాయించవద్దని నినాదాలు చేస్తూ అక్కడే బైఠాయించారు. ఎజెండాలోని అంశాలను చదువుతుండగా అడ్డుకుని, మైక్ విరగ్గొట్టారు. ఇదేమిటని కొందరు కూటమి కార్పొరేటర్లు ప్రశ్నించగా, వైకాపా కార్పొరేటర్లు ఇష్టానుసారంగా కేకలు వేశారు. ఆ సమయంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. వైకాపాకు చెందిన అల్లు శంకర్రావు, బాణాల శ్రీనివాసరావు, కటుమూరి సతీష్, బల్ల లక్ష్మణరావు పిడిగుద్దులతో దాడి చేశారు. దీంతో తెదేపా కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావులకు గాయాలయ్యాయి. వైకాపా సభ్యులూ స్వల్పంగా గాయపడ్డారు. ఆ సమయంలో మేయర్ సూచనలతో పోలీసులు కౌన్సిల్ హాల్లోకి వచ్చి ఆందోళన చేసిన వైకాపా సభ్యుల్ని బయటకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత ఎజెండాలో పొందుపరిచిన అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

పోలవరంలో రూ.247 కోట్ల అదనపు పని మేఘాకే

జలవనరుల శాఖ ఆదేశాలు

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టులో ప్రధాన డ్యాం, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్ ఇతర అనుబంధ పనులకు అవసరమైన రాయిని సమీప డంప్‌ల నుంచి సమీకరించుకోవడంతో పాటు 902 కొండ నుంచి తవ్వి తీసుకునే అదనపు పనిని మేఘా సంస్థకే అప్పగించారు. ఈ పని విలువ రూ.247.12 కోట్లుగా లెక్కించారు. వీటిని మేఘా సంస్థకే అదనపు పనిగా అప్పగిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం పనులను ఎల్ఎస్ (లంప్సమ్ విధానం) పద్ధతిలో మేఘా కంపెనీ 2019 నవంబరు నుంచి చేస్తోంది. స్పిల్ వే, స్పిల్ ఛానల్, కాఫర్ డ్యాంలు, గ్యాప్-1, గ్యాప్-2 ప్రధాన డ్యాంలు, బట్రస్ డ్యాం పనులు కొన్ని పూర్తవ్వగా, మరికొన్ని కొనసాగుతున్నాయి. ఈ పనులకు ఇంకా రాయి కావాల్సి ఉంది. ప్రధాన డ్యాంలకు, బట్రస్ డ్యాంకు కలిపి 71.63 లక్షల క్యూబిక్ మీటర్ల రాయి అవసరం కాగా, ఇందులో 34.32 లక్షల క్యూబిక్ మీటర్లు సమీకరించుకోవాల్సి ఉందని సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ అంచనా వేసింది. సమీపంలోని 902 కొండను తవ్వి తీసుకోవాలని నిర్ణయించారు. ఈ ప్రకారం.. తాజా ఆదేశాలు వెలువడ్డాయి.

■ పోలవరం ప్రధాన డ్యాంలో ఎడమ వైపు నేవిగేషన్ టన్నెల్, శాడిల్ డ్యాం, కేవల్, అఫ్‌టేక్ రెగ్యులేటర్ నిర్మాణానికి సంబంధించి 66వ ప్యాకేజీలో అదనపు పని పరిమాణం అవసరమైంది. దీనివల్ల రూ.4.49 కోట్లు అదనంగా ఖర్చవుతుందని లెక్కించారు. ఆ మేరకు అదనపు నిధులు మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.

ఎజెండా సమర్పణకు మరో వారం గడువు

పోలవరం-బనకచర్ల అనుసంధానం మదింపు వద్దన్న తెలంగాణ

- సనేమిరా అన్న ఏపీ
- గడువు పేరుతో మదింపు ఆలస్యం చేయవద్దని వినతి
- జలవివాదాల కమిటీ తొలి భేటీలో నీటి వాటాలపై ఆసక్తికర చర్చలు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారం కోసం వేసిన కమిటీ తొలి భేటీలో ఎజెండాకు తుది రూపు రాలేదు. ఎజెండా అంశాలను ఏపీ ముందే సమర్పించగా తెలంగాణ మరో వారం సమయం కావాలని కోరింది. దీంతో ఎజెండా సమర్పణకు వారం గడువు ఇవ్వాలని కమిటీ ఛైర్మన్ నిర్ణయించారు. దిల్లీలోని సేవాభవన్‌లో ఉన్న కేంద్ర జలసంఘం సమావేశ హాలులో ఉభయ తెలుగు రాష్ట్రాల జల వివాదాల కమిటీ తొలి భేటీ శుక్రవారం జరిగింది. కమిటీ ఛైర్మన్ అనుపమ ప్రసాద్ నేతృత్వం వహించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జలవనరులశాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం చీఫ్ ఇంజినీరు సుగుణాకరరావు హాజరయ్యారు. తెలంగాణ నుంచి నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఇంజినీర్ ఇన్ చీఫ్, కృష్ణా బోర్డు ఛైర్మన్ బిశ్వాస్, గోదావరి బోర్డు ఎస్ఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర జలసంఘం నుంచి వివిధ విభాగాల చీఫ్ ఇంజినీర్లు హాజరయ్యారు. పోలవరం, నల్లమలసాగర్ అనుసంధానం సహా రెండు రాష్ట్రాలకు సంబంధించి కృష్ణా, గోదావరి జలాలకు సంబంధించిన అంశాలపై చర్చలు జరిగాయి.

భేటీలో తీసుకున్న నిర్ణయాలు

■ వారం రోజుల్లో రెండు రాష్ట్రాలూ ఎజెండా అంశాలు సమర్పించాలి. ఏపీ ఇప్పటికే సమర్పించిన ఎజెండా మార్చుకోవచ్చు. తర్వాత ఎజెండా ప్రతిపాదనలను కమిటీ ఛైర్మన్ రెండు రాష్ట్రాలకూ పంపుతారు. ఆ ఎజెండా అంశాలపై ఉభయ రాష్ట్రాలూ 15 రోజుల్లోగా తమ అభిప్రాయాలు నివేదించాలి.

■ పోలవరం-బనకచర్ల (ప్రస్తుతం నల్లమలసాగర్) అనుసంధానంపై కేంద్ర జలసంఘం ఛైర్మన్ సమావేశం ప్రారంభంలోనే ప్రజంటేషన్ ఇచ్చారు. ట్రైబ్యునల్ నీటి కేటాయింపులు, ఇతర అంశాలను వివరించారు. ఏపీ సమర్పించిన ఎజెండా అంశాలు సైతం అందులో పేర్కొంటూ, కేంద్ర జలసంఘం వద్ద ఉన్న సమాచారాన్నీ ప్రస్తావించారు.

■ కృష్ణాబోర్డు ఛైర్మన్ బిశ్వాస్ ప్రజంటేషన్ ఇస్తూ ఇంకా తమకు ప్రాజెక్టులు అప్పజెప్పనందున ఏమీ చేయలేకపోతున్నామన్నారు. రూల్ ఆఫ్ కర్వ్ తేలలేదని, 18 టెలీమెట్రీ స్టేషన్ల సమాచారం ఆధారంగానూ ఏమీ చేయలేకపోతున్నామని తెలిపారు.

■ తెలంగాణ ఎజెండా అంశాలు ఏమిటని కమిటీ ఛైర్మన్ ప్రశ్నించగా.. పోలవరం-బనకచర్ల అనుసంధానంపై మదింపు చేయకూడదని తాము కేంద్ర జలసంఘానికి లేఖ ఇచ్చామని, ఎజెండాలో అది కూడా ఉండకూడదని పేర్కొన్నామని తెలంగాణ నీటి పారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా చెప్పారు. ఆ అంశం ఉంటే సమావేశానికే రాకూడదనుకున్నామని అన్నారు. వరద జలాలు ఉపయోగించుకుంటామని ఏపీ చెబుతోందని, అసలు వరద జలాలపై ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వరు కదా అని రాహుల్ బొజ్జా ప్రశ్నించారు. ఇలా అనుమతులు ఇచ్చిన దాఖలాలు ఎక్కడైనా ఉన్నాయా అని తెలంగాణ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ ప్రశ్నించారు. కేంద్ర జలసంఘం సీఈ మాట్లాడుతూ వరద జలాలు అనేది అసలు ఉండదు. 75శాతం విశ్వసనీయ జలాల లోపు లేదా అది దాటి మాత్రమే పరిగణనలోకి వస్తుందని చెప్పారు. అది 65శాతం వద్దా, లేక సగటు జలాల వద్దా అన్నది చూడాలి తప్ప వరద జలాలు అన్నది లేదని వివరణ ఇచ్చారు.

కేంద్ర జలసంఘం ఎలా అనుమతులు ఇస్తుంది?

'ఒక వైపుగోదావరి నదిపై తెలంగాణ కొత్తగా నిర్మిస్తున్న ప్రాజెక్టులకు కేంద్ర జలసంఘం అనుమతులు ఇస్తోంది. మరో వైపు ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకు అభ్యంతరాలు ఎందుకు వ్యక్తం చేస్తోంది' అని ఏపీ ప్రశ్నించింది. ట్రైబ్యునల్ చేయాల్సిన పనిని కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజినీరు ఏ హోదాలో చేస్తారని అడిగింది. గోదావరిలో కొత్త ట్రైబ్యునల్ ఏర్పాటు కన్నా రెండు రాష్ట్రాలు కలిసి చర్చించుకుని ఒక అంగీకారానికి రావచ్చు కదా అని కమిటీ ఛైర్మన్ అనుపమ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. రెండు రాష్ట్రాల అధికారులూ చర్చలకు సమ్మతమే అని పేర్కొన్నారు.

75శాతం సక్సెస్ రేటు కీలకం: ఏపీ

ఏ ప్రాజెక్టు నిర్మించినా 75 శాతం ఫలితం ఇస్తుందా లేదా అన్నదే ముఖ్యమని ఏపీ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని మళ్లించి నిల్వ చేసుకుని 75 శాతం ఫలితం ఇచ్చేలా ఒక ప్రాజెక్టు నిర్మించుకుంటే తప్పేమిటని ప్రశ్నించారు. ఏపీ జలవనరులశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి జోక్యం చేసుకుని వృథా జలాలు వినియోగించుకుంటే జాతికి ఉపయోగమే కదా అని అన్నారు. తెలంగాణ తన వాటా నీటిని వాడుకున్న తర్వాత దిగువకు వచ్చే నీటినే తాము మళ్లించేదని పేర్కొన్నారు. 'కృష్ణాలో ఆ నీటిని పోసి మళ్లిస్తున్నారు.. ఈ నీటిలో ఎగువ రాష్ట్రంగా మాకు వాటా ఉంటుంది..ఇస్తారా' అని రాహుల్ బొజ్జా ప్రశ్నించారు. కృష్ణా పరీవాహక ప్రాంతంలో ఆ నీటిని వాడటం లేదని, అందువల్ల వాటా ప్రసక్తి రాదని ఏపీ సలహాదారు చెప్పారు. వరద జలాల వినియోగానికి ఏపీ ఏవైనా మార్గదర్శకాలు తయారు చేస్తే తామూ ఆ నీటిని వినియోగించుకుంటామని తెలంగాణ అధికారులు అన్నారు. దిగువ రాష్ట్రంగా ఏపీ ఆ నీటిని వాడుకుంటే ఎవరూ నష్టపోరు. ఎగువ రాష్ట్రాలు అలా వాడుకోలేవని అన్నారు. తదుపరి భేటీ వరకు పోలవరం-బనకచర్ల (ప్రస్తుతం పోలవరం నల్లమలసాగర్ అనుసంధానంగా మార్పు) అనుసంధానం మదింపుపై ముందుకు వెళ్లవద్దని తెలంగాణ కోరింది. ఆ విషయాన్ని అధికారికంగా నోట్ చేయాలని డిమాండ్ చేసింది. ఇందుకు ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ప్రీఫీజిబిలిటీ నివేదికకు అనుమతి కోసమే కదా ఇబ్బంది ఏముందని ఏపీ ప్రశ్నించింది.

కృష్ణాలో చెరి సగం వాడుకుందాం: తెలంగాణ

కృష్ణా ట్రైబ్యునల్ అంశాలు తేలేవరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న నీటిలో చెరి సగం వాడుకుందామని రాహుల్ బొజ్జా అన్నారు. ఏపీ, తెలంగాణలకు 66:33 నిష్పత్తిలో నీటి పంపకాలతో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని అన్నారు.

అధికారుల అండతో ఆ ముగ్గురికీ ప్రవేశం

ఎమ్మెల్సీల కనుసన్నల్లోనే రెచ్చిపోయిన కార్పొరేటర్లు


కూటమి, వైకాపా సభ్యుల వాగ్వాదం, ముందు వరుసలో కూర్చొన్న ఎమ్మెల్సీలు బొత్స సత్యనారాయణ, కల్యాణి

విశాఖపట్నం(కార్పొరేషన్), న్యూస్‌టుడే : మహావిశాఖ నగరపాలక సంస్థ అధికారుల్లో కొందరు నేటికీ వైకాపా నాయకులతో అంటకాగుతున్నారు. శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి వైకాపా ఎమ్మెల్సీలు బొత్స సత్యనారాయణ, కుంభా రవిబాబు, వరుదు కల్యాణి హాజరయ్యారు. బొత్స సత్యనారాయణకు చీపురుపల్లిలో, వరుదు కల్యాణికి అనకాపల్లి జిల్లా చోడవరంలో, కుంభా రవిబాబుకు శృంగవరపుకోటలో ఓటు హక్కు ఉంది. వారికి జీవీఎంసీ కౌన్సిల్‌తో ఎలాంటి సంబంధమూ లేదు. అయినా.. జీవీఎంసీ కౌన్సిల్ హాల్లోకి ప్రవేశించి, ముందు వరుసలో కూర్చొన్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్టు వదిలేశారు. వారి అండ చూసుకునే వైకాపా కార్పొరేటర్లు రెచ్చిపోయారు.

■ అనర్హులను కౌన్సిల్ హాల్లోకి పంపడంపై పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ అంశంపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ వివరణ కోరగా.. . ఆ ముగ్గురికీ ప్రవేశం లేదని స్పష్టం చేశారు. అయితే సభ్యుల ఆందోళనల నేపథ్యంలో వారి రాకను గమనించలేదని కమిషనర్ పేర్కొన్నారు.



మీవి కాని రోజుల్లోనూ నిబ్బరంగా ఉండండి

మనకు మంచి జరిగిన రోజున ఆనందం కలిగినట్లే, చెడు జరిగినప్పుడు బాధపడటమూ సహజమే. భావోద్వేగాలకు అతీతంగా ఉండటానికి మనం రోబోలం కాదు. కానీ అలాంటి క్లిష్టమైన దశలు మీ లక్ష్యసాధన ప్రయత్నాలను ప్రభావితం చేయకుండా చూసుకోండి. అప్పటివరకూ మీరు సాధించిన పురోగతిని, మున్ముందు మీరు అందుకోబోయే విజయాల్ని గుర్తుచేసుకొని ముందుకు సాగండి. మనవి కాని రోజుల్లోనూ నిబ్బరంగా ఉంటూ ప్రస్థానాన్ని ఆపకపోవడమే అసలైన విజయం.

– గౌర్ గోపాల్ దాస్, ఆధ్యాత్మికవేత్త

వనమంతా నిండు జాతర పున్నమి

మేడారంలో తల్లులకు ఎత్తు బంగారం సమర్పణ

ఈనాడు, మేడారం: నిండు జాతర కళతో మేడారం వనమంతా పున్నమిని తలపించేలా వెలుగులీనుతోంది. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి చేరిన తర్వాతి రోజును నిండు జాతరగా పిలవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో శుక్రవారం తల్లులను దర్శించుకునేందుకు భక్తులు భారీగా వరుస కట్టారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షల మంది ప్రజలు ఆర్టీసీ బస్సులు, సొంత వాహనాల్లో మేడారానికి చేరుకున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల నుంచి ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. భక్తులు ఎత్తు బంగారాన్ని ముట్టజెప్పడంలో పోటీ పడ్డారు. ఒడి బియ్యం, పసుపు, కుంకుమలను తల్లులకు సమర్పించారు.

నేటితో ముగియనున్న జాతర : మేడారం మహాజాతర శనివారం సమ్మక్క వనప్రవేశం ఘట్టంతో ముగియనుంది. సాయంత్రం 4 గంటల తర్వాత ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. బుధవారం సారలమ్మ ఆగమనంతో ప్రారంభమైన జాతరకు గత మూడు రోజుల్లో 80 లక్షల మంది భక్తులు వచ్చి ఉంటారని అంచనా వేస్తున్నారు. చివరి రోజున భక్తుల రాక పెద్దసంఖ్యలో ఉంటుందని చెబుతున్నారు.


మేడారంలో విద్యుత్తు వెలుగుల్లో తళుకులీనుతున్న సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలు, జాతర మైదానం

పులివెందుల అభివృద్ధిలో అవినీతి!

- ఏడు గుత్తేదారు కంపెనీలపై క్రిమినల్ కేసులు
- 200 మంది ఇంజినీరింగ్ అధికారులపై అభియోగాలు
- రాష్ట్ర ప్రభుత్వానికి విజిలెన్స్ నివేదిక

ఈనాడు, కడప: పులివెందుల ప్రాంత అభివృద్ధి సంస్థ (పాడా) పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అక్రమాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బయట పెట్టింది. కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు చేపట్టిన విచారణ నివేదిక ఇటీవల సర్కారుకు అందింది. జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా నియోజకవర్గంలో దాదాపు రూ.వెయ్యి కోట్లతో 5 వేల పనులు చేపట్టారు. ఇందులో భారీ అక్రమాలు వెలుగుచూశాయి. ఐదు వేల పనుల్లో 2,400 వరకు నామినేషన్‌పై నేతలకు కట్టబెట్టగా.. మరో 2,600 వరకు టెండరు విధానం కింద గుత్తేదారులకు అప్పగించినట్లు విజిలెన్స్ తేల్చింది. మొత్తం 12 ఏజెన్సీలు పనులు చేపట్టగా, ఏడు కంపెనీలు బోగస్‌వని గుర్తించింది. ఇలా పనులు ఇవ్వడంలో పది మంది ఈఈలు, ఎస్ఈల హస్తం ఉన్నట్లు తేలింది. బోగస్ గుత్తేదారు కంపెనీలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విజిలెన్స్ సిఫార్సు చేసింది. పాడా కింద



పులివెందుల సమీపంలోని బ్రాహ్మణపల్లె వద్ద పాడా నిధులతో నిర్మించి, నిరుపయోగంగా ఉన్న అరటి ప్రాసెసింగ్ యూనిట్

వివిధ శాఖలకు చెందిన 14 ఇంజినీరింగ్ విభాగాలు పనులు చేపట్టాయి. అక్రమాల్లో ఈ విభాగాల ఇంజినీరింగ్ అధికారుల పాత్ర ఉన్నట్లు గుర్తించింది. అర్హత లేని కంపెనీలకు పనులు కట్టబెట్టడం, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, నాసిరకం సామగ్రి వినియోగించడం, రహదారులకు ప్రామాణిక మందంలో లేయర్లు వేయకుండానే బిల్లులు పొందడం, పనులు పూర్తిచేసినట్లు బిల్లులు పెట్టడం, పనుల్లో అసలు ఖర్చు కన్నా ఎక్కువ మొత్తాలకు బిల్లులు సమర్పణ, ల్యాబ్ పరీక్షలు జరగకుండానే నాణ్యత సర్టిఫికెట్లు జారీ చేయడం లాంటి అక్రమాలు విచారణలో వెలుగుచూశాయి. కొన్నిచోట్ల పనులు చేయకుండానే బిల్లులు పెట్టినట్లు వెలుగుచూసింది. ఈ అక్రమాల్లో వివిధ విభాగాలకు చెందిన 200 మంది ఇంజినీరింగ్ అధికారుల పాత్ర ఉన్నట్లు విజిలెన్స్ గుర్తించింది. వీరందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ ప్రతిపాదించింది.

లీజు రద్దు నోటీసులు మాకు వర్తించవు!

- ఏ కారణంతో రద్దు చేయాలనుకుంటున్నారో చెప్పండి
- నోట్ ఫైల్ వివరాలు ఇవ్వండి
- ప్రభుత్వ తాఖీదుపై లేనిపోని వాదనలకు దిగిన భారతి సిమెంట్

ఈనాడు, అమరావతి: కేంద్ర గనుల శాఖ వేలం ద్వారానే లీజులు పొందాలంటూ నిబంధన తీసుకొచ్చే ముందు దరఖాస్తు విధానంలో వైకాపా ప్రభుత్వంలో రెండు లీజులు దక్కించుకున్న వైఎస్ జగన్ సతీమణి భారతి డైరెక్టర్‌గా ఉన్న భారతి సిమెంట్ లేనిపోని వాదనలు చేసింది. మీ లీజు ఎందుకు రద్దుచేయకూడదో వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వం తాఖీదు ఇస్తే.. అందుకు సమాధానం ఇవ్వకుండా ప్రభుత్వానికి, గనుల శాఖకు అనేక ప్రశ్నలతో భారతి సిమెంట్ యాజమాన్యం లేఖ రాయడం గమనార్హం. ఈ వివరాలు తాజాగా బయటకు వచ్చాయి. వైఎస్సార్ కడప జిల్లా కమలాపురం మండలంలో 509.18 ఎకరాలు, ఎర్రగుంట్ల మండలంలో 235.56 ఎకరాల్లో సున్నపురాయి లీజుల మంజూరు కోసం భారతి సిమెంట్ సంస్థ దరఖాస్తులు 2008 నుంచి పెండింగ్‌లో ఉండగా.. 2015లో కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధన తెచ్చింది. ఇకపై ఈ-వేలం ద్వారానే మేజర్ మినరల్స్ లీజులు కేటాయించాలని, దరఖాస్తుల ఆధారంగా లీజులు ఇవ్వకూడదని నిబంధనలు తెచ్చింది. భారతి సిమెంట్ కోర్టును ఆశ్రయించి తర్వాత జగన్ ప్రభుత్వ హయాంలో 2024 ఫిబ్రవరిలో ఈ రెండు లీజులు మంజూరు చేయించుకుంది. భారతి సిమెంట్ రెండు లీజులతోపాటు ఇదే విధానంలో అసోసియేట్ సిమెంట్ కంపెనీ (ప్రస్తుతం అదానీ సిమెంట్స్), రామ్‌కో సిమెంట్స్‌కు లీజులు ఎలా కేటాయించారని కేంద్ర గనులశాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీంతో ప్రభుత్వం ఈ నాలుగు కంపెనీలకు లీజులు ఎందుకు రద్దుచేయకూడదో వివరణ ఇవ్వాలంటూ గతేడాది డిసెంబరు 11న నోటీసులు ఇచ్చి.. 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని కోరింది.

నోట్‌ఫైల్‌తో సహా అన్నీ ఇవ్వాలంట..

ప్రభుత్వం ఇచ్చిన నోటీసులపై స్పందించి ఏసీసీ, రామ్‌కో సిమెంట్స్ వివరణలు ఇచ్చాయి. భారతి సిమెంట్ మాత్రం వివరణ ఇవ్వకుండా ప్రభుత్వానికి అనేక ఎదురు ప్రశ్నలు వేస్తూ జనవరి 5న లేఖ రాసింది. అందులో 'ఏ కారణంతో లీజులు రద్దుచేస్తారో తెలియజేయాలి, దానికి సంబంధించిన డాక్యుమెంట్లు ఇవ్వాలి.. సంబంధిత నోట్ ఫైల్ అందజేయాలని.. ప్రభుత్వంతో గనులశాఖ డైరెక్టర్ జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఇవ్వాలని కోరింది. తమకు 2015లో నిబంధనలు వచ్చే నాటికే అన్ని అనుమతులూ ఉన్నాయని, లీజు ఇవ్వడంలో జాప్యం జరిగిందని పేర్కొంది. ఆ తర్వాత గత ప్రభుత్వం న్యాయపరంగా అన్ని అంశాలను పరిశీలించి.. వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఇటువంటి కేసులను పరిగణనలోకి తీసుకుని లీజులు మంజూరు చేసిందని తెలిపింది. ఇప్పుడు లీజులు రద్దుచేసే ఉద్దేశంతో తాఖీదులు ఇచ్చినట్లుందని పేర్కొంది. ఈ నోటీసులు వెనక్కి తీసుకోవాలని ఆ లేఖలో కోరింది.

లీజుల రద్దుకు సిఫార్సు

వివరణ ఇమ్మంటే అనేక ప్రశ్నలతో లేఖ ఇచ్చిన భారతి సిమెంట్ అభ్యర్థనను ప్రభుత్వం, గనుల శాఖ పరిగణనలోకి తీసుకోలేదు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ లీజులు పొందడం ఉల్లంఘనేనని గనులశాఖ స్పష్టం చేస్తూ.. రెండు వారాల కిందటే ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. దీంతో భారతి సిమెంట్ రెండు లీజులతోపాటు, రామ్‌కో, ఏసీసీ కంపెనీలకు చెందిన నాలుగు సున్నపురాయి లీజులను రద్దు చేస్తూ త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిసింది.

బండితోనే బాధ్యత తీరిపోలేదు.. శిరస్త్రాణమూ కొనివ్వాలిగా..!

- హెల్మెట్ ధరించని యువకుడి తల్లితో మాట్లాడిన మంత్రి సవిత

పెనుకొండ, న్యూస్‌టుడే: 'కుమారుడికి ఖరీదైన బండి కొనివ్వగానే మన బాధ్యత అయిపోదు. వాహనం నడిపేటప్పుడు రోజూ శిరస్త్రాణం పెట్టుకునేలా చొరవచూపాలి. లేకపోతే మనం చిన్నవి అనుకునే అజాగ్రత్తలే కుటుంబాల్లో విషాదాన్ని నింపుతాయి' అని మంత్రి సవిత ఓ యువకుడి తల్లికి సున్నితంగా చెప్పి, అప్రమత్తం చేశారు. శుక్రవారం శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని 44వ జాతీయ రహదారి కూడలిలో రహదారి భద్రతా దినోత్సవాల్లో భాగంగా ద్విచక్ర వాహన ర్యాలీ తీశారు. ఇందులో జిల్లా అధికారులతో కలిసి మంత్రి శిరస్త్రాణంపై అవగాహన కల్పించారు. సవిత బుల్లెట్ నడుపుతూ ర్యాలీకి వచ్చినవారిని ఉత్సాహపరిచారు. ఈ క్రమంలో సోమందేపల్లికి చెందిన సాయి హెల్మెట్ లేకుండా కొత్త బైక్ నడుపుతూ మంత్రి కంటపడ్డాడు. వెంటనే సవిత అతన్ని ఆపి, శిరస్త్రాణం ఎక్కడ అని ప్రశ్నించారు. అక్కడి నుంచే అతని తల్లికి ఫోన్ చేయించి హెల్మెట్‌పై ఆమెకూ అవగాహన కల్పించారు. ఎంత ఖరీదైన ద్విచక్రవాహనం కొనుగోలు చేసినా శిరస్త్రాణం తప్పనిసరి అని తెలిపారు. శిరస్త్రాణం ధరించి వాహనాలు నడుపుతున్న వారికి పూలు ఇచ్చి అభినందనలు తెలిపారు. కొందరికి శిరస్త్రాణాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీశ్‌కుమార్, డీటీవో కరుణసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీలో ద్విచక్రవాహనం నడుపుతున్న మంత్రి సవిత



యువకుడి తల్లితో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి సవిత. చిత్రంలో ఎస్పీ సతీష్‌కుమార్

వనానికే వన్నె.. మయూరం!



వైఎస్సార్ కడప జిల్లాలో విస్తరించిన లంకమల అభయారణ్యం నెమళ్లకు స్వర్గధామం. ఇక్కడ మయూరాలు స్వేచ్ఛగా గుంపులుగా సంచరిస్తుంటాయి. కడప-నెల్లూరు రహదారికి రెండువైపులా ఈ అడవి ఉంది. గిరులు, పచ్చని చెట్లతో హరిత శోభతో ప్రకాశిస్తుంది. అందులో తీరొక్క వర్ణాలతో మయూరాలు మెరిసిపోతూ.. సాయం వేళల్లో కనువిందు చేస్తాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో రహదారి రెండు వైపులా కనిపించే మయూరాలను చూసేందుకు రెండు కళ్లుచాలవు. సిద్దవటం రేంజి మద్దూరు బీట్ సరాఫ్‌దిన్నె సమీపంలో బట్ట గెనుపుమాను కుంటలో నీళ్లు తాగుతున్న నెమలిని చిత్రంలో చూడొచ్చు. 1963 జనవరి 31న మయూరాన్ని జాతీయపక్షిగా ప్రకటించారు. – న్యూస్‌టుడే, ఒంటిమిట్ట



కొట్టుకుంటున్న యువకులు ● గాయాలపై పసుపు రాస్తున్న మహిళ ● ఆలింగనం చేసుకుంటున్న యువకులు

కొట్టుకోవడమే పండగ!

జట్టి పరబ్(గొడవ పండగ) ఇది బోండా గిరిజనుల ప్రత్యేక పండగ. వాతలు తేలేలా కొట్టుకోవడమే దీని ప్రత్యేకత. ఇలా చేస్తే యువకుల్లో సోదరభావం పెంపొందుతుందని గిరిజనులు భావిస్తారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని బోండాఘాటీలో ఆంద్రహాల్ గ్రామంలో శుక్రవారం దీన్ని నిర్వహించారు. ఆకులు తీసేసిన ఈత కొమ్మలను నాలుగు రోజుల పాటు పేడలో నానబెట్టి వాటితో యువకులు ఒకరినొకరు కొట్టుకుంటారు. ఈ క్రమంలో యువకుల వీపుపై గాయలైతే మహిళలు వచ్చి పసుపు లేపనం పూశారు. ఆ తర్వాత కొట్టుకున్న వారంతా ఆలింగనం, కరచాలనం చేసుకున్నారు. – ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే

బీఈడీ మెథడాలజీ మార్పునకు రూ.3 వేలు

ఈనాడు, అమరావతి: బీఈడీ ప్రవేశాల్లో మెథడాలజీ మార్పునకు రూ.3 వేల చొప్పున అపరాధ రుసుము విధిస్తూ ఉన్నత విద్యామండలి ఆదేశాలు జారీ చేసింది. ఒక్కో విద్యార్థికి ఈ మొత్తాన్ని చెల్లించాలని సూచించింది. కన్వీనర్ కోటా కౌన్సెలింగ్‌లో పాల్గొన్న కళాశాలలు, న్యాయస్థానం ఆదేశాలతో యాజమాన్య కోటాలో చేరిన విద్యార్థులకు ఇది వర్తిస్తుందని పేర్కొంది.

జెన్‌కోలో 27 మందికి కారుణ్య నియామకాలు

- పత్రాలు అందించిన మంత్రి గొట్టిపాటి

ఈనాడు, అమరావతి: కారుణ్య నియామకాల్లోనూ విద్యార్హత ఆధారంగా జూనియర్ ఇంజినీర్ కేడర్‌ను భర్తీ చేసేలా కొత్త విధానాన్ని విద్యుత్ శాఖలో అమలు చేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. గత వైకాపా ప్రభుత్వం విద్యార్హతతో సంబంధం లేకుండా.. అందరికీ జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలే ఇచ్చిందని తెలిపారు. శుక్రవారం సచివాలయంలోని ఛాంబర్‌లో జెన్‌కోలో 27 మందికి కారుణ్య నియామక పత్రాలను సీఎస్ విజయానంద్‌తో కలిసి ఆయన అందించారు. మంత్రి మాట్లాడుతూ.. 'డిస్కంలు, ట్రాన్స్‌కో, జెన్‌కోలో కారుణ్య నియామకాల ద్వారా ఇప్పటి వరకు 500 మందికి పైగా బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించింది. ఇక మీదట ప్రతి మూడు నెలలకోసారి విద్యుత్ సంస్థల్లో కారుణ్య నియామకాలు చేపడతాం' అని పేర్కొన్నారు. విజయానంద్ మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగుల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.



కారుణ్య నియామక పత్రం అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్. చిత్రంలో సీఎస్ విజయానంద్ తదితరులు

పొట్లతో పోటీకి సొరకాయ సై!



ఏలూరు జిల్లా భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన పులవర్తి అన్నమ్మ, ప్రసాద్ ఇంటి పెరట్లో కాసిన సొరకాయ ఏకంగా నాలుగున్నర అడుగుల పొడవుంది. 'సాధారణంగా సొరకాయలు రెండడుగుల వరకు పెరుగుతాయి. నేల స్వభావం, మంచి పోషకాలు అందిస్తే ఇలా పెరుగుతాయి' అని ఏడీఏ సీహెచ్ ఉషారాజకుమారి తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ నుంచి తెచ్చిన విత్తనాలను వేయగా ఈ పాదు పెరిగినట్లు ప్రసాద్ తెలిపారు. – న్యూస్‌టుడే, భీమడోలు

దగదర్తి ఇన్‌ఛార్జి తహసీల్దారు నివాసంలో అనిశా సోదాలు

- ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు గుర్తింపు
- బహిరంగ మార్కెట్‌లో వాటి విలువ రూ.10 కోట్లుగా అంచనా

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని దగదర్తి ఇన్‌ఛార్జి తహసీల్దారుగా పనిచేస్తున్న పాలకృష్ణ ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించినట్లు అవినీతి నిరోధక శాఖ(అనిశా) గుర్తించింది. ఈ మేరకు నెల్లూరు అనిశా ఇన్‌ఛార్జి డీఎస్పీ రామకృష్ణుడు పర్యవేక్షణలో అధికారులు శుక్రవారం ఆయన ఇంటితో పాటు స్నేహితుల ఇళ్లల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. నెల్లూరు తెలుగు గంగ కాలనీ సమీపంలోని విజయలక్ష్మీనగర్‌లో గల పాలకృష్ణ ఇంటితో పాటు స్నేహితుల ఇళ్లు, బుచ్చిరెడ్డిపాలెంలోని అతని సోదరుడి నివాసం, దగదర్తిలోని తహసీల్దారు కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. నెల్లూరు తెలుగు గంగ సమీపంలో జీ ప్లస్ త్రీ భవనం, చేజర్ల మండలంలో 5.59 ఎకరాల వ్యవసాయ భూమి, పొదలకూరు మండలం తోడేరు గ్రామంలో 31.48 చదరపు గజాల ఇంటి స్థలం, ఒక స్కూల్ వ్యాన్, ద్విచక్రవాహనం, ఇంట్లో రూ.లక్ష నగదు, 395 గ్రాముల బంగారు ఆభరణాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దగదర్తి విమానాశ్రయ భూముల వ్యవహారంలోనూ పలు ఆరోపణలు ఉండటంతో ఆ దిశగా అధికారులు విచారిస్తున్నారు. ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.2.5 కోట్లుగా, బహిరంగ మార్కెట్‌లో రూ.10 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. ఉదయం ఆరు గంటలకు ప్రారంభమైన సోదాలు రాత్రి వరకు కొనసాగాయి.



పాలకృష్ణను విచారిస్తున్న అనిశా ఇన్‌ఛార్జి డీఎస్పీ రామకృష్ణుడు



పాలకృష్ణకు చెందిన మూడంతస్తుల భవనం

2017లో డిప్యూటీ తహసీల్దారుగా..

పాలకృష్ణ స్వస్థలం నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెం. 2009లో డీఎస్సీ ద్వారా స్కూల్ అసిస్టెంట్‌గా చేరారు. 2017లో ఏపీపీఎస్సీ ద్వారా డిప్యూటీ తహసీల్దారుగా ఎంపికయ్యారు. గతంలో సైదాపురంలో పనిచేస్తున్న సమయంలో కూడా ఆయనపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. 2022 జులైలో అనిశా అధికారులు విచారించినా.. డిపార్ట్‌మెంట్ విచారణ పెండింగ్‌లో ఉంది. 2024 నవంబరులో బదిలీపై దగదర్తికి వచ్చారు. సోదాల అనంతరం పాలకృష్ణను కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు.



కొండకర్ల ఆవలో బోటు షికారు చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, సభాపతి అయ్యన్నపాత్రుడు, ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు విజయ్‌కుమార్, రమేష్‌బాబు, కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి ఉత్సవాలకు శ్రీకారం

హాజరైన మంత్రులు దుర్గేష్, అనిత, రవీంద్ర, స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఈనాడు డిజిటల్ అనకాపల్లి, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లాగా ఏర్పడిన తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న 'అనకాపల్లి ఉత్సవం' శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. జిల్లాలోని అచ్యుతాపురం మండలం కొండకర్ల ఆవ, అనకాపల్లి, పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం ప్రాంతాల్లో రెండురోజుల పాటు వేర్వేరుగా జరిగే ఈ ఉత్సవాలను.. శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత, ఎక్సైజ్ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నో విశిష్టతలు ఉన్నాయని వాటిని ప్రపంచానికి తెలియజేయడానికి ఈ ఉత్సవాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. వైకాపా పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని... అది మరిచిపోయేలా వారాంతంలో కుటుంబంతో సహా ఆనందంగా గడపాలనే లక్ష్యంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొండకర్ల ఆవలో నేతలు, అధికారులు బోటు షికారు చేశారు. ఫుడ్ స్టాల్స్, సంప్రదాయ వంటలు, ఏటికొప్పాక బొమ్మల ప్రదర్శనను తిలకించారు. అనకాపల్లి బెల్లం మార్కెట్‌లో కడియం, బెంగళూరు, పశ్చిమ బెంగాల్ నుంచి తీసుకొచ్చిన పూలతో ఫ్లవర్‌షో ఏర్పాటు చేశారు. ముత్యాలమ్మపాలెం బీచ్‌లో గీతామాధురి, అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో గాయని సునీతల గీతాలాపనలు అలరించాయి. కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్, కలెక్టర్ విజయకృష్ణన్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ తేజ్‌భరత్ తదితరులు పాల్గొన్నారు.

నాకు బెయిల్ రాకుండా ఎందుకు అడ్డుకుంటున్నారు?

- మాకూ సమయం వస్తుంది.. నేను చెప్పానని మీ బాస్‌లకు చెప్పండి
- ఏసీబీ కోర్టు ప్రాంగణంలో సిట్ అధికారులతో రాజ్ కెసిరెడ్డి!
- ఎవరు చేసిన దానికి వారు అనుభవించక తప్పదు: చెవిరెడ్డి



కోర్టుకు హాజరవుతున్న రాజ్ కెసిరెడ్డి, అనిల్ చోక్రా, ధనుంజయరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: 'నాకు బెయిల్ రాకుండా మీరు వ్యక్తిగతంగా తీసుకున్నట్లు కనబడుతోంది. లేకపోతే నాకు ఎందుకు రాదు? ముప్పిడి అవినాష్‌రెడ్డి భారత్‌కు వచ్చే వరకు నాకు బెయిల్ రాకుండా అడ్డుకుంటారా? అతను రాకపోతే నన్ను జైల్లోనే ఉంచుతారా? మహా అయితే ఇంకో ఏడాది ఉంచుతారు. అంతకంటే ఏం చేస్తారు? మాకూ సమయం వస్తుంది. అందరికీ కుటుంబాలు ఉన్నాయి. ఈ సంగతి నేను చెప్పానని మీ బాస్‌లకు చెప్పండి' అని మద్యం కుంభకోణం కేసులో నిందితుడు రాజ్ కెసిరెడ్డి సిట్ అధికారులపై బెదిరింపు ధోరణిలో మాట్లాడినట్లు తెలిసింది. శుక్రవారం విజయవాడలోని ఏసీబీ కోర్టుకు రాజ్ కెసిరెడ్డిని తీసుకురాగా అక్కడి ప్రాంగణంలో ఈ వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ఇదే కేసులో హైకోర్టు బెయిల్ ఇవ్వడంతో గురువారం రాత్రి కారాగారం నుంచి వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విడుదలయ్యారు. శుక్రవారం ఏసీబీ కోర్టు వాయిదాకు వచ్చిన చెవిరెడ్డి సైతం ఇదే రీతిలో వ్యాఖ్యలు చేసినట్లు తెలిసింది. 'నన్ను అనవసరంగా కేసులో ఇరికించారు. అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుంది. నన్ను ఒక్కడినే కాదు.. నా వద్ద పనిచేసే వారి కడుపు కూడా కొట్టారు. ఎవరు చేసిన దానికి వారు అనుభవించక తప్పదు. ఎవరూ దీనికి అతీతులు కారు' అని మాట్లాడినట్లు సమాచారం. కోర్టు ప్రాంగణంలో కేసు గురించి మాట్లాడొద్దని గతంలో చెవిరెడ్డిని రెండుసార్లు న్యాయాధికారి మందలించారు. అయినా తీరుమార్చుకోకపోవడం గమనార్హం.

రిమాండ్ పొడిగింపు

మద్యం కుంభకోణం కేసులో నిందితులకు విధించిన రిమాండ్ గడువు శుక్రవారంతో ముగియనుండడంతో సిట్ అధికారులు వారిని విజయవాడలోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టారు. రాజ్ కెసిరెడ్డి, అనిల్ చోక్రా, రోనక్ కుమార్, బాలాజీ కుమార్ యాదవ్ తదితరులకు రిమాండ్ పొడిగించాలని ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాది కోర్టులో మెమో దాఖలు చేశారు. వచ్చే నెల 13 వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయాధికారి భాస్కరరావు ఉత్తర్వులిచ్చారు. బెయిల్‌పై ఉన్న వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి కోర్టుకు హాజరుకాలేదు. మధ్యంతర బెయిల్‌పై ఉన్న నిందితుడు నవీన్‌కృష్ణ కూడా హాజరుకాలేదు. రిమాండ్ పొడిగింపు తర్వాత నిందితులను విజయవాడ, గుంటూరు కారాగారాలకు తరలించారు.

● మద్యం కేసు పురోగతిపై న్యాయాధికారి..దర్యాప్తు అధికారిని ప్రశ్నించారు. నిందితులకు సంబంధించి కొన్ని ఆస్తులను గుర్తించామని, వాటని విశ్లేషిస్తున్నామని ఐవో శ్రీహరి సమాధానమిచ్చారు. ఇంకా కొంత సమాచారం రావాల్సి ఉందన్నారు. ఆస్తుల ఎటాచ్‌మెంట్‌కు లేఖలు రాయాల్సి ఉందని దర్యాప్తు అధికారి కోర్టుకు తెలిపారు.

ఐటీ సోదాలు జరుగుతుండగా కాన్ఫిడెంట్ గ్రూప్ ఛైర్మన్ ఆత్మహత్య

- తుపాకీతో ఛాతీలో కాల్చుకొని బలవన్మరణం
- బెంగళూరులో ఘటన



సీజే రాయ్

ఈనాడు, బెంగళూరు: కర్ణాటకకు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ కాన్ఫిడెంట్ గ్రూప్.. ఫౌండర్, ఛైర్మన్, రియాల్టీ షోల నిర్వాహకుడు, సినీ నిర్మాత డాక్టర్ సీజే రాయ్ (57) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నారు. బెంగళూరులోని సంస్థ ప్రధాన కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో తన లైసెన్స్‌డ్ తుపాకీతో ఛాతీలో కాల్చుకున్నారు. సిబ్బంది ఆయన్ను చికిత్స నిమిత్తం 'నారాయణ హృదయాలయ'కు తరలించగా. . అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సీజే రాయ్‌కు భార్య లిని రాయ్, కుమారుడు రోహిత్, కుమార్తె రియా ఉన్నారు. ప్రస్తుతం వీరంతా విదేశాల్లో ఉన్నారని పోలీసులు తెలిపారు. అశోక్‌నగర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. గత డిసెంబరు నుంచి సీజే రాయ్‌కు చెందిన సంస్థ కార్యాలయాల్లో ఐటీ, ఈడీ సోదాలు జరుగుతున్నాయి. బెంగళూరులోని కార్యాలయాల్లో మూడు రోజులుగా కేరళకు చెందిన ఐటీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు కూడా బెంగళూరులోని ప్రధాన కార్యాలయంలో పది మంది వరకు ఐటీ అధికారులు తనిఖీలు చేశారు. వీరు ఉన్న సమయంలోనే తన గదిలోకి వెళ్లిన సీజే రాయ్ ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.

తన విలాస జీవితంపై పోస్టులు

కేరళకు చెందిన సీజే రాయ్ ఫ్రాన్స్, స్విట్జర్లాండ్‌ల్లో ఉన్నత విద్య అభ్యసించిన అనంతరం బెంగళూరులోని పలు ఐటీ కంపెనీల్లో పనిచేశారు. 2006లో కాన్ఫిడెంట్ గ్రూప్ స్థాపించారు. ఈ గ్రూప్ ద్వారా ప్రముఖంగా స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారు. కర్ణాటక, కేరళతో పాటు అమెరికా, అరబ్ దేశాల్లోనూ ఈ సంస్థ వ్యాపారాలు చేస్తోంది. విజయవంతమైన వ్యాపారిగానే కాకుండా సామాజిక మాధ్యమాల్లోనూ ఆయన తన విలాస జీవితంపై ప్రచారం చేసుకునే వారు. సామాజిక కార్యక్రమాలతోనూ పేరొందారు. ప్రస్తుతం ఆయన వద్ద 12 రోల్స్‌రాయిస్‌తో పాటు మరో ఐదు ఖరీదైన కార్లున్నాయి.

కోకోకి ధర నిర్ణయించాలనే యోచనలో ఉన్నాం

- ఏలూరులో రాష్ట్ర సదస్సులో మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, ఏలూరు: ఆయిల్‌పామ్ మాదిరి కోకో పంటకూ నిర్దేశిత ధర నిర్ణయించాలనే యోచనలో ప్రభుత్వం ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. 'నిపుణుల కమిటీ దీనిపై అధ్యయనం చేస్తోంది. నివేదిక రాగానే ముఖ్యమంత్రి ముందు పెట్టి నిర్ణయం తీసుకుంటాం. కోకో ధరలు తగ్గితే గతేడాది కిలోకు రూ.50 చొప్పున ప్రభుత్వమే చెల్లించింది. మామిడి, అరటి ఏ ధరలు తగ్గినా ప్రభుత్వం చొరవ తీసుకుని రైతులకు అండగా నిలిచింది. ఒక్క ఏడాదిలో రూ.1,200 కోట్లు మద్దతు ధరల రూపేణా చెల్లింపులు చేశాం' అని మంత్రి పేర్కొన్నారు. ఏలూరులో రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి కోకో సదస్సుకు శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

అన్నం ముద్ద అడ్డుపడి చిన్నారి మృతి


జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: అన్నం తినిపిస్తుండగా ముద్ద అడ్డుపడి చిన్నారి మృతి చెందిన ఘటన ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పట్టణ శివారు మార్కండేయపురం జగనన్న ఎల్-3 లేఅవుట్ కాలనీకి చెందిన ర్యాలీ అభయ ఆంజనేయకుమార్, భానుశిరీష దంపతులకు రెండేళ్ల కుమార్తె జెస్సీదీవెన ఉంది. బాలికకు ఎదుగుదల సరిగా లేకపోవడంతో వైద్యం చేయిస్తున్నారు. శుక్రవారం ఉదయం బాలికను తండ్రి వద్ద వదిలి తల్లి భానుశిరీష, నాయనమ్మ వెంకటరమణలు పనిమీద జంగారెడ్డిగూడెం వెళ్లారు. భోజన సమయంలో చిన్నారికి ముద్దపప్పుతో కలిపిన అన్నాన్ని తండ్రి తినిపించాడు. ఈ క్రమంలో గొంతులో అన్నం ముద్ద ఇరుక్కుపోవడంతో ఉక్కిరిబిక్కిరయ్యింది. స్పృహకోల్పోయిన చిన్నారిని వెంటనే జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు బాలిక మృతిచెందినట్లు ధ్రువీకరించారు.



చిన్నారి మృతదేహంతో నాయనమ్మ

నిర్మలమ్మా.. మొర వినుమా!

కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులు ఏం కోరుకుంటున్నారంటే..



బడ్జెట్ అంటే కేవలం ఆర్థిక లెక్కలు కాదు.. దేశ ప్రాథమ్యాల ప్రకటన! బడ్జెట్‌తో దేశ ఆర్థిక పరిస్థితిని తెలుసుకోవచ్చు. విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి.. ఇలా ఆయా రంగాల్లో భవిష్యత్తు అవకాశాలు ఎలా ఉండబోతున్నాయో అంచనా వేసుకోవచ్చు. అందుబాటులో ఉన్న వనరులను పద్దుల్లో తెలివిగా కేటాయించుకుంటే.. దీర్ఘకాలిక మానవాభివృద్ధి లక్ష్యాల సాధన సులువవుతుంది. ఈ నేపథ్యంలో- 2047 కల్లా భారత్‌ను 'అభివృద్ధి చెందిన దేశం'గా నిలపాలన్న సంకల్పం తీసుకున్న మోదీ సర్కారు ఆదివారం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో ఎలాంటి ప్రాధాన్యాలు అనుసరించబోతోందన్నది కీలకంగా మారింది. సామాన్యులు ఈ పద్దు నుంచి ప్రధానంగా ఏం కోరుకుంటున్నారన్నది పరిశీలిస్తే..

విద్య: డిజిటల్ బాట పట్టాలి



నిరుటి కేటాయింపులు రూ.1,28,650 కోట్లు

ప్రపంచంతో పోటీపడే సామర్థ్యాలను భారతీయులు పొందడానికి 'విద్య' పునాదిలా పనిచేస్తుంది. నిరుటి బడ్జెట్‌లో 2.54% నిధులను ఈ రంగానికి కేంద్రం కేటాయించింది. జీడీపీలో 6% నిధులను ఏటా విద్యారంగానికి కేటాయించాలని జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ)-2020లో కేంద్రం నిర్దేశించుకుంది. కానీ వాస్తవ వ్యయం అంతకంటే చాలా తక్కువగా ఉంటోంది. అమెరికా, బ్రిటన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలు తమ జీడీపీలో ఏటా 5-7% మొత్తాన్ని విద్యారంగానికి కేటాయిస్తుంటాయి. ప్రస్తుతం మన విద్యాసంస్థల్లో డిజిటల్ మౌలిక వసతులను మెరుగుపర్చాలి. తరగతి గదుల్లో ఆధునిక కృత్రిమ మేధ (ఏఐ) సౌలభ్యాలతో బలోపేతం చేయాలి. నేటితరం అవసరాలకు తగ్గట్టు ఉపాధ్యాయుల్లో నైపుణ్యాల పెంపునకు చర్యలు చేపట్టాలి. డిజిటల్ లెర్నింగ్ టూల్స్‌పై పన్ను భారాన్ని తగ్గించాలి.

ఆరోగ్యం: వేగంగా వ్యాధి నిర్ధారణ




నిరుటి కేటాయింపులు రూ.99,858 కోట్లు

ఇప్పటికీ దేశవ్యాప్తంగా చాలా గ్రామీణ/గిరిజన ప్రాంతాల్లో తగిన స్థాయిలో వైద్య సదుపాయాలు అందుబాటులో లేవు. పోషకాహార లోపం, మాతా-శిశు మరణాల వంటి సమస్యలు వేధిస్తూనే ఉన్నాయి. జీడీపీలో 2% కంటే తక్కువ మొత్తాన్నే నిరుడు ప్రజారోగ్య రంగానికి కేటాయించారు. జపాన్, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలు ఏటా జీడీపీలో 11% వరకూ నిధులను ఈ రంగానికి వ్యయం చేస్తుంటాయి. ఈ ఏడాదైనా వైద్య రంగానికి నిధులను కేంద్రం గణనీయంగా పెంచాలి. దేశంలో ప్రధానంగా గుండెపోటు, పక్షవాతం, క్యాన్సర్, మధుమేహం, కిడ్నీ వైఫల్యం వంటి కేసులు ఏటేటా భారీగా పెరుగుతున్నాయి. ఈ వ్యాధులను తొలి దశల్లోనే గుర్తించి మెరుగైన చికిత్స అందించగలిగితే చాలామంది ప్రాణాలను కాపాడవచ్చు. ఆర్థిక వ్యవస్థపై భారాన్ని తగ్గించవచ్చు. అందుకు తగ్గట్టు ఆసుపత్రుల్లో మౌలిక వసతులను పెంచాలి. అత్యవసర సేవలను మెరుగుపర్చాలి. అత్యాధునిక వ్యాధి నిర్ధారణ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలి. రేబిస్ టీకాలు, పాము విషం విరుగుడు మందుల కొరత లేకుండా చూడాలి.

గ్రామీణాభివృద్ధి: 'జీ రామ్ జీ' వైపే అందరి చూపు

గ్రామీణులకు ఏటా 100 రోజుల ఉపాధి కల్పనకు హామీ ఇచ్చే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీ నరేగా) పథకం స్థానంలో 'వికసిత్ భారత్- గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) (వీబీ- జీ రామ్ జీ)' పథకాన్ని మోదీ సర్కారు గత డిసెంబరులో తీసుకొచ్చింది. ఇది ఏటా 125 రోజుల ఉపాధికి హామీ ఇస్తుంది. ఇందుకోసం కేంద్రం-రాష్ట్రాలు 60%-40% చొప్పున నిధులు సమకూరుస్తాయి. ఈ పథకానికి కొత్త బడ్జెట్‌లో రికార్డుస్థాయి కేటాయింపులు దక్కుతాయని అంచనా. తగినన్ని నిధులు కేటాయించి, ఈ పథకాన్ని పక్కాగా అమలు చేయగలిగితే.. గ్రామీణ ఆదాయం పెరుగుతుంది. మౌలిక వసతులు, జీవన నాణ్యత మెరుగవుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. పట్టణాలకు వలసలు తగ్గుతాయి.

నిరుటి కేటాయింపులు రూ.1,90,406 కోట్లు. ఇందులో ఎంజీ నరేగాకు రూ.85,640 కోట్లు



రక్షణ: ఆధునికీకరణకు అగ్రతాంబూలం



నిరుటి కేటాయింపులు రూ.6.81 లక్షల కోట్లు

కొన్నేళ్లుగా రక్షణ రంగంలో దిగుమతుల భారాన్ని తగ్గించుకోవడంపై, సైనిక బలగాల ఆధునికీకరణపై ప్రభుత్వం దృష్టి పెడుతోంది. భవిష్యత్తు తరాల అవసరాలకు తగ్గట్టు ఏఐ ఆధారిత వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవడం, ఆత్మనిర్భరతకు ఊతమిస్తూ దేశీయ డ్రోన్ల ఉత్పత్తి, డ్రోన్ నిరోధక సాంకేతికతల రూపకల్పన వంటివి ప్రస్తుతం అత్యావశ్యకం. ఇందుకు తగ్గట్టు బడ్జెట్ కేటాయింపులు ఉండాలి.

పరిశోధన-అభివృద్ధి: నిధులు పెరగాలి



జాతీయ భద్రత, ప్రస్తుత పోటీ ప్రపంచంలో దూసుకెళ్లేందుకు 'పరిశోధన-అభివృద్ధి' చాలా అవసరం. ఈ రంగానికి ఏటా మన దేశం జీడీపీలో కేవలం 0.64-0.66% నిధులనే కేటాయిస్తోంది. ఈ విషయంలో దక్షిణ కొరియా (5.2%), జపాన్ (3.4%), చైనా (2.5-2.8%) వంటి దేశాలు మనకంటే చాలా ముందంజలో ఉంటున్నాయి. ఏఐ, శుద్ధ ఇంధనం, డీప్ టెక్నాలజీ వంటి సాంకేతికతల్లో పరిశోధనలను ముమ్మరం చేసేలా ఈ రంగానికి కేటాయింపులు భారీగా పెంచాలి.


మౌలిక వసతులు: దీర్ఘకాలిక వృద్ధికి దన్ను



నిరుటి కేటాయింపులు రూ.11.21 లక్షల కోట్లు

దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి మౌలిక వసతులు దన్నుగా నిలుస్తాయి. ఎక్స్‌ప్రెస్ మార్గాలు, హైవేలు, వంతెనలు, సొరంగాలు, రైల్వే, జల వనరుల వంటి ప్రాజెక్టులపై కేంద్రం మరింతగా దృష్టిపెట్టాలి. ప్రాజెక్టుల పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. వికసిత్ భారత్‌ను సాకారం చేసుకునేందుకు మెరుగైన మౌలిక వసతుల కల్పన అనివార్యం.

వ్యవసాయం: ఆ వ్యత్యాసాన్ని తగ్గించాలి



నిరుటి కేటాయింపులు రూ.1,37,757 కోట్లు

భారత మొత్తం కార్మిక శక్తిలో దాదాపు 46% మంది వ్యవసాయ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. అయితే జీడీపీలో దీని వాటా 20% కంటే తక్కువగానే ఉంటోంది. ఈ వ్యత్యాసాన్ని గణనీయంగా తగ్గించడంపై దృష్టిసారించాలి. వాతావరణ మార్పులను సమర్థంగా తట్టుకునే వంగడాలను అందుబాటులోకి తీసుకురావాలి. అత్యాధునిక సాగు విధానాలను అనుసరిస్తూ అధిక దిగుబడులు పొందేలా రైతులను ప్రోత్సహించాలి. కోతల అనంతర నష్టాలను తగ్గించాలి.

ఆదాయపు పన్ను: మరింత ఉపశమనం!



వేతనజీవులకు నిరుటి బడ్జెట్ పెద్ద తీపికబురు వినిపించింది. కొత్త పన్ను విధానంలో రూ.12 లక్షల ఆదాయం వరకూ ఆదాయపు పన్నును మినహాయించింది. రూ.75 వేల ప్రామాణిక తగ్గింపు దీనికి అదనం. ఈసారి బడ్జెట్‌లో ప్రామాణిక తగ్గింపును కనీసం రూ.లక్షకు పెంచాలని, పన్ను చెల్లించాల్సిన అవసరంలేని ఆదాయ పరిమితిని రూ.20 లక్షలకు పెంచాలని ఉద్యోగులు విజ్ఞప్తిచేస్తున్నారు. ఆరోగ్య బీమా ప్రీమియంలపై కొత్త పన్ను విధానంలో ఆదాయపు పన్ను తగ్గింపును అనుమతించాలనీ కోరుతున్నారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

ఫిబ్రవరి మొదటి వారం నుంచి సెట్స్ దరఖాస్తుల స్వీకరణ

ఈనాడు, అమరావతి: 2026-27 ఉమ్మడి ప్రవేశ పరీక్ష(సెట్)లకు సంబంధించి దరఖాస్తులను ఒకేసారి స్వీకరించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. సెట్స్ కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుంది. రిజిస్ట్రేషన్, దరఖాస్తుల స్వీకరణ, ప్రవేశ పరీక్షలు, ఫలితాలు, అడ్మిషన్స్‌ను మే నెల చివరి నాటికి పూర్తి చేయనున్నారు. అందుకు అనుగుణంగా షెడ్యూల్‌ను ఇంటర్మీడియట్ విద్యామండలి, ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్, విశ్వవిద్యాలయాలకు.. ఉన్నత విద్యామండలి నోట్ పంపింది.

మౌంట్ అకాంకగువాను అధిరోహించిన ప్రవాసాంధ్రుడు జనార్దన్



ఈనాడు, అమరావతి: అర్జెంటీనాలోని మౌంట్ అకాంకగువా(6,961 మీ)ను తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం మిర్తిపాడుకు చెందిన ప్రవాసాంధ్రుడు జనార్దన్ నిమ్మలపూడి అధిరోహించారు. 54 ఏళ్ల వయసులో ఆ పర్వతాన్ని అధిరోహించి ఏపీ నుంచి ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తిగా నిలిచారు. గతంలో ఆయన ఆఫ్రికాలోని కిలిమంజారోనూ అధిరోహించారు. బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, ఎన్టీఆర్ ట్రస్టులకు పర్వతారోహణతో నిధులు సమీకరిస్తున్నారు. ప్రస్తుతం ఆయన తానా బోర్డు ఆఫ్ డైరెక్టర్‌గా ఉన్నారు.

ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో అందరూ పాల్గొనాలి

పార్టీ శ్రేణులకు షర్మిల పిలుపు



ఈనాడు, అమరావతి: వచ్చే నెల 2న ప్రారంభించనున్న ఉపాధి హామీ పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీలోని అన్ని విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని సూచించారు. అనంతపురం జిల్లా బండ్లపల్లిలో సోమవారం యాత్ర ప్రారంభించనున్న నేపథ్యంలో విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో జిల్లాల అధ్యక్షులు, ఇన్‌ఛార్జులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ విభాగాల ప్రతినిధులతో షర్మిల శుక్రవారం సమావేశమయ్యారు. ఉపాధి హామీ పథకంతో కలిగే లబ్ధి, కేంద్రం తాజాగా తెచ్చిన వీబీ జీ రామ్‌జీ ద్వారా జరిగే నష్టాన్ని యాత్రలో ప్రజలకు వివరించాలని ఆమె సూచించారు. కొత్త చట్టాన్ని రద్దు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిద్దామని పేర్కొన్నారు. అప్పటి యూపీఏ ప్రభుత్వం పేదల కోసం తీసుకొచ్చిన పథకాలను ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం కక్షపూరితంగా తొలగిస్తోందని షర్మిల మండిపడ్డారు. రాష్ట్రాలకు సైతం భారంగా మారిన వీబీ జీ రామ్ జీ విషయంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీనియర్ నేతలు కొప్పుల రాజు, జేడీ శీలం, ఏపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తో చెవిరెడ్డి కుటుంబ సభ్యుల భేటీ

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి బెయిల్‌పై గురువారం బయటకొచ్చిన మాజీ ఎమ్మెల్యే, వైకాపా ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కరరెడ్డి శుక్రవారం ఉదయం ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను కలిశారు. భాస్కరరెడ్డి తన కుమారులు మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డిలతో తాడేపల్లిలో జగన్ నివాసానికి వెళ్లి ఆయన్ను కలిసి మాట్లాడారు. తనపైన, తన కుమారులిద్దరిపైనా తెదేపా ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని జగన్‌కు వివరించారు. 'కేసుల గురించి ఆందోళన అవసరం లేదు. ప్రజల పక్షాన చేస్తున్న పోరాటంలో ఎదురయ్యే ఆటంకాలు, వేధింపులను చట్టపరంగా, దీటుగా ఎదుర్కొందాం' అని జగన్ వారితో చెప్పారు.

మళ్లీ బెంగళూరుకు జగన్

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం బెంగళూరుకు బయల్దేరి వెళ్లారు. సోమవారం సాయంత్రం ఆయన బెంగళూరు నుంచి తాడేపల్లికి వచ్చారు. శుక్రవారం తిరిగి బెంగళూరుకు వెళ్లారు.



రాత్రిపూట ఈ ప్రశ్నలు వేసుకోండి

ఈరోజు మీ పనిని మీరు ఆస్వాదించారా? మీ పని మీకు సంతృప్తినిచ్చిందా? దాన్ని పూర్తి చేసినప్పుడు మిమ్మల్ని మీరు అభినందించుకున్నారా? ఆ పని మీ భవిష్యత్తుపై ఆశను పెంచిందా? రాత్రి నిద్రపోయే ముందు ఈ ప్రశ్నలు వేసుకోండి. ఆ తర్వాత మీకు సుఖంగా నిద్రపట్టిందంటే మీరు సరైన దిశలోనే వెళ్తున్నారని అర్థం. లేకపోతే మీ జీవితాన్ని పునర్నిర్మించుకోవడంపై దృష్టి పెట్టండి.

– జోడీ ఫోస్టర్, నటి

జులై నుంచి నకిలీ మద్యం తయారీ

- జనవరి నుంచే సన్నాహాలు చేసినట్లు వాంగ్మూలం

ఈనాడు, అన్నమయ్య; న్యూస్‌టుడే-ములకలచెరువు: ములకలచెరువులో నకిలీ మద్యం తయారీకి 2025 జనవరి నుంచే సన్నాహాలు చేసినట్లు నిందితులు వాంగ్మూలం ఇచ్చారు. ఇందులో కీలక పాత్రధారి కేసులో ఏ1గా ఉన్న జనార్దన్‌రావేనని స్పష్టం చేశారు. నకిలీ మద్యం తయారీకి పరికరాలు, ముడి సరకులు, నకిలీ లేబుళ్ల సరఫరా ఆలస్యం కావడంతో జులై నుంచి తయారీ ప్రారంభించినట్లు ఒప్పుకొన్నారు. నకిలీ మద్యం కేసులో నిందితులైన జయచంద్రారెడ్డి పీఏ రాజేష్, ఎకౌంటెంట్ అన్బురసును కస్టడీలో భాగంగా శుక్రవారం మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయంలో రెండో రోజు అధికారులు విచారించారు. జనార్దన్‌రావుకు ములకలచెరువులో రాజకీయ నేతలతో పరిచయాలు ఉండటంతో ఇబ్రహీంపట్నం తరహాలో నకిలీ మద్యం తయారీ చేపట్టినట్లు తెలిపారు. మొదట ములకలచెరువు, పీటీఎం మండలాల్లోని రెండు మద్యం దుకాణాలను తన పరిధిలోకి ఆయన తీసుకున్నారని వివరించారు. ములకలచెరువు సమీపంలో నకిలీ మద్యం తయారీ ప్రారంభానికి ఓ గోదామును అద్దెకు తీసుకుని బయట ప్రాంతాల వ్యక్తులతో తయారీ ప్రారంభించారని చెప్పారు. తయారు చేసిన నకిలీ మద్యాన్ని దుకాణాలకు తరలించకుండా గ్రామాల్లోని బెల్టుషాపులకు తరలించేవారని తెలిపారు. తయారీ కేంద్రంపై జరిగిన దాడుల తర్వాతే తమకు కుట్ర విషయం సమగ్రంగా తెలిసిందని చెప్పారు. తమకు వ్యవహారాలు తెలియకుండా జనార్దన్‌రావు అనుచరుడు రాజు అన్ని లావాదేవీలు నడిపారని విచారణాధికారులకు తెలిపారు. ఈ కేసులో ఇప్పటి వరకు 29 మందిని కస్టడీకి తీసుకుని విచారించారు. ఇంకా జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డిలు అరెస్టు కావాల్సి ఉంది. కస్టడీ అనంతరం నిందితులను మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు రెండు రోజుల కస్టడీ ముగియడంతో వారిని మదనపల్లె జైలుకు తిరిగి తరలించారు.



వైద్య పరీక్షల నిమిత్తం నిందితులను మదనపల్లె ఆసుపత్రికి తీసుకెళ్లిన ఎక్సైజ్ పోలీసులు

శ్రీవారి డాలర్ల విక్రయ కేంద్రం తాత్కాలికంగా మూత

మార్కెట్‌కు అనుగుణంగా ధరల్లేక తితిదే నిర్ణయం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో తితిదే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవారి బంగారు, వెండి డాలర్ల విక్రయ కేంద్రాన్ని శుక్రవారం మధ్యాహ్నం నుంచి తాత్కాలికంగా మూసివేశారు. స్వామివారి చిత్రంతో కూడిన ఈ డాలర్లను తితిదే తయారుచేసి ఇక్కడ భక్తులకు అమ్ముతుంది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఏర్పాటుచేసిన ఈ ఔట్‌లెట్‌ను పేష్కార్ కార్యాలయం పర్యవేక్షిస్తోంది. కొన్ని నెలలుగా బంగారం ధరలు పెరుగుతుండగా, ఆ మేరకు డాలర్ల ధరల్లో తితిదే మార్పు చేయడం లేదు. మార్కెట్‌లో నిత్యం భారీగా హెచ్చుతగ్గులు నమోదవుతుండగా, ఇక్కడ మాత్రం ప్రతి మంగళవారం సాయంత్రం ధరలు మార్చుతోంది. ఈ క్రమంలో తితిదే నష్టపోతోంది. ఈ కేంద్రంలో 5, 10 గ్రాముల బంగారు డాలర్లు విక్రయిస్తుండగా, ప్రస్తుతం ఇవి అందుబాటులో లేవు. కేవలం వెండి డాలర్లు మాత్రమే ఉన్నాయి. రాగి డాలర్లు కొన్నేళ్లుగా నిండుకున్నాయి.

★ ప్రస్తుతం ఉత్పన్నమవుతున్న సమస్యల దృష్ట్యా తితిదే ఉన్నతాధికారులు స్వామివారి డాలర్ల విక్రయ పద్ధతుల్లో మార్పులు చేయనున్నట్లు తెలిసింది. సంబంధిత విభాగంతో సమావేశమై.. తిరుపతి బులియన్ మార్కెట్‌కు అనుగుణంగా రోజువారీగా ధరలు ప్రకటించి అమ్మాలని ప్రణాళిక రచిస్తున్నారు. దర్శనం టికెట్ కలిగిన భక్తులకు మాత్రమే డాలర్లు అమ్మాలని, అదీ, ఒకరికి ఒక డాలర్ మాత్రమే ఇవ్వాలని, రూ.50 వేల విలువ దాటిన విక్రయాలపై పాన్‌కార్డ్ నంబర్‌ను బిల్లులో నమోదు చేయాలని నిర్దేశించినట్లు తెలిసింది. మరో రెండు రోజుల్లో ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు.



తిరుమలలో శ్రీవారి డాలర్ల విక్రయ కేంద్రం

తిరుపతిలో ప్రపంచస్థాయి బస్‌స్టేషన్

- రూ.500 కోట్ల వ్యయం.. త్వరలో శంకుస్థాపన
- రాష్ట్రంలో క్రీడాకారులకు అస్మిత పథకం అమలు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వెల్లడి

ఈనాడు, దిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా భక్తులున్న పుణ్యక్షేత్రం తిరుపతిలో పెరిగిన అవసరాలకు తగ్గట్టు రూ.500 కోట్లతో అత్యాధునిక బస్ స్టేషన్ నిర్మించబోతున్నట్లు రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. దీనికి డీపీఆర్ సిద్ధమైందని, త్వరలోనే శంకుస్థాపన చేయబోతున్నట్లు చెప్పారు. నిర్మాణంపై ఎన్‌హెచ్‌ఎల్‌ఎంఎల్ ప్రతినిధులతో చర్చించామన్నారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తన శాఖలకు సంబంధించిన అంశాలపై శుక్రవారం దిల్లీలో కేంద్ర రవాణా, క్రీడా శాఖల అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం ఏపీ భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న రాయచోటి- కడప మధ్య ఉన్న ఎన్‌హెచ్-40ని నాలుగు వరుసలుగా విస్తరించడంపై రవాణా శాఖ అధికారులతో చర్చించినట్లు వెల్లడించారు. దీని విస్తరణ అంశం డీపీఆర్ స్థాయిలో ఉందని, ఆరు నెలల్లో టెండర్లు పిలవబోతున్నట్లు అధికారులు చెప్పారని మంత్రి తెలిపారు. 'మహిళా క్రీడాకారుల కోసం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా పరిధిలోని అస్మిత పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. మార్చి నుంచి అన్ని జిల్లా ప్రధాన కేంద్రాల్లో సండే ఆన్ సైకిల్ కార్యక్రమం నిర్వహిస్తాం. ఖేలో ఇండియా పథకం కింద గత నెలలో రూ.67 కోట్లు మంజూరు అయ్యాయి' అని మంత్రి వివరించారు. మంగళగిరిలో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం నిర్మాణంపై మంత్రి లోకేశ్ ఇప్పటికే బీసీసీఐ అధ్యక్షుడితో మాట్లాడారని, త్వరలో ఆ పనులు ప్రారంభిస్తామన్నారు.



దిల్లీలో ఖేలో ఇండియా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మయాంక్ శ్రీవాస్తవతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

పదవీ విరమణ వయసు పెంపు ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం

- మేము జోక్యం చేసుకోలేం
- అప్పీళ్లను కొట్టేసిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62కు పెంచే విషయంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. పదవీ విరమణ వయసు పెంపు వ్యవహారం ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. విరమణ వయసు పెంచాలంటే సర్వీసు నిబంధనలు అందుకు అనుగుణంగా సవరించాలని గుర్తుచేసింది. పదవీ విరమణ వయసు పెంపునకు కార్పొరేషన్లు, సొసైటీల పాలకమండళ్లు తీర్మానాలు చేసినా.. వాటిని ప్రభుత్వం ఆమోదించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచేందుకు నిరాకరిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ధర్మాసనం సమర్థించింది. ఉద్యోగులు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు తీర్పు చెప్పింది.

★ పదవీ విమరణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచేలా ఆదేశాలివ్వాలని కోరుతూ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఉద్యోగి డి.మాధవరావు, ఏపీ కోపరేటివ్ ఆయిల్ గ్రోయర్స్ ఫెడరేషన్ ఉద్యోగి వి.విల్సన్‌రాజు హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద వ్యాజ్యాలు వేశారు. వీటిని కొట్టేస్తూ గతేడాది నవంబర్ 18న న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ తీర్పును సవాలు చేస్తూ విల్సన్‌రాజు, మాధవరావు ధర్మాసనం ముందు అప్పీళ్లు వేశారు. వీటిపై విచారణ జరిపిన ధర్మాసనం.. పిటిషనర్లు రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు కాదని గుర్తుచేసింది. అప్పీళ్లను కొట్టేసింది.

దేశం ఎదుగుతుంటే అడ్డుకునే కుట్రలు

- సమాజం మారితేనే వ్యవస్థల్లో మార్పు
- 'భవిష్య భారతం' సదస్సులో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్

ఈనాడు, అమరావతి: 'తమ స్వార్థ ప్రయోజనాలు దెబ్బతింటాయని భయపడే శక్తులు.. దేశం ఎదుగుతుంటే అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. సమాజం అంతా ఏకమైతే భారత్ ఆ అడ్డంకుల్ని దాటుతుంది. దేశం కోసం అందరూ నిజాయతీగా పనిచేయండి' అని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది వేడుకల్లో భాగంగా విజయవాడలో శుక్రవారం నిర్వహించిన 'భవిష్య భారతం - దృష్టి, దిశ' సదస్సు ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'వేల మైళ్ల దూరం నుంచి వచ్చినవారు సంఖ్యలో తక్కువగానే ఉన్నా.. సమాజంలోని లోపాల వల్లే గతంలో వారితో మనం ఓడిపోయి బానిసలయ్యాం. భవిష్యత్తులో అలాంటి పరిస్థితి రాకూడదనుకుంటే.. అంతా ఏకతాటిపై ఉండాలి. సమాజంలో ఉన్న విభేదాలు, బలహీనతలపై నిజాయతీగా చర్చ జరగాలి. దేశ భవితవ్యాన్ని మార్చాలంటే ముందు సమాజాన్ని మార్చాల్సిందే' అని స్పష్టం చేశారు. 'మన దేశంలో తయారయ్యే వస్తువుల్ని ప్రోత్సహించాలి. ఇలా చేస్తే దేశం స్వయం సమృద్ధిగా మారుతుంది. సనాతన ధర్మం విలువలు విద్యా వ్యవస్థలోనే కాదు.. కుటుంబంలోనూ అలవడాలి' అని పేర్కొన్నారు.

★ సదస్సుకు 52 రంగాల్లో అనుభవజ్ఞులైన 45 ఏళ్లలోపు వారు హాజరయ్యారు. వీరి ప్రశ్నలకు ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ సమాధానాలిస్తూ.. సందేహాలను నివృత్తి చేశారు. ఏపీ ప్రాంత సహ సంపర్క ప్రముఖ్ రాఘవేంద్ర అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య క్షేత్ర సహ సంఘ చాలక్ డి.రామకృష్ణ, ప్రాంత సంఘ సంచాలక్ ఎన్.హరికుమార్‌రెడ్డి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న మోహన్ భాగవత్

రాజధాని ప్రాంతంలో మైనర్లకూ పింఛన్ల చెల్లింపులకు అనుమతి

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి ప్రాంతంలో భూమిలేని పేద కుటుంబాల్లో తల్లిదండ్రులిద్దరూ మరణించినట్లయితే పిల్లల్లో మైనర్లకూ పింఛన్ల చెల్లింపునకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజధాని ప్రాంతంలో భూమిలేని పేద కుటుంబాలకు ప్రభుత్వం ప్రతి నెలా పింఛన్లు అందిస్తోంది. కుటుంబంలో తల్లిదండ్రులిద్దరూ మరణించినప్పుడు పిల్లల్లో మైనర్లకు చెల్లింపులు చేయడానికి నిబంధనలు అడ్డొస్తున్నాయి. ఇదే విషయాన్ని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో మైనర్లకూ పింఛన్ల జారీకి సీఆర్‌డీఏకి అనుమతించింది.

హత్య చేసి.. ఇంట్లోనే పూడ్చిపెట్టి!

- తల్లిదండ్రులతో పాటు చెల్లెలిని చంపిన వ్యక్తి
- కర్ణాటకలోని విజయనగర జిల్లాలో దారుణం

హొసపేటె, న్యూస్‌టుడే: కర్ణాటకలో దారుణం చోటుచేసుకుంది. తల్లిదండ్రులతో పాటు సొంత చెల్లెలిని హత్య చేసి ఇంట్లోనే పూడ్చిపెట్టాడో అన్న. విజయనగర జిల్లా కొట్టూరులో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్రదుర్గ జిల్లా హొసదుర్గ తాలూకా కిట్టిహళ్లికి చెందిన అక్షయ్‌కుమార్(24).. రెండేళ్ల కిందట కొట్టూరుకు వచ్చి తల్లిదండ్రులు జయలక్ష్మీ (45), భీమరాజ్ (50), సోదరి అమృత (17)తో కలిసి ఉంటున్నాడు. ఇదే గ్రామంలో టైర్ల దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్న అక్షయ్‌కుమార్ ఈ నెల 27న తల్లిదండ్రులు, చెల్లెలిని దారుణంగా హత్య చేసి ఇంట్లోనే పూడ్చిపెట్టాడు. అనంతరం గురువారం బెంగళూరుకు వెళ్లిన నిందితుడు అక్షయ్‌కుమార్ తన తల్లిదండ్రులు, సోదరి అదృశ్యమయ్యారని అక్కడి తిలక్‌నగర్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. అతని ప్రవర్తనపై అనుమానం రావడంతో అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా.. ముగ్గురిని తానే హత్య చేసినట్లు అక్షయ్‌కుమార్ ఒప్పుకొన్నాడు. వెంటనే కొట్టూరు ఠాణాకు సమాచారం ఇచ్చి, నిందితుడిని వారికి అప్పగించారు. అదే రోజు రాత్రి అతడిని కొట్టూరుకు తీసుకొచ్చారు. విజయనగర ఎస్పీ జాహ్నవి, డీఎస్పీ మల్లేశ్ దొడ్డమని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్యకు గల కారణాలు తెలియరాలేదని, నిందితుడిని అరెస్టు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్పీ జాహ్నవి తెలిపారు.



భీమరాజ్, జయలక్ష్మీ దంపతులు



చెల్లెలు అమృత



నిందితుడు అక్షయ్‌కుమార్

పుర కార్మికుల సమ్మె కాలం సెలవుగా పరిగణన

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 13 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో 2024 డిసెంబరు 9 నుంచి 18 వరకు ప్రజారోగ్య, ప్రజారోగ్యేతర విభాగాల్లో పొరుగు సేవల కార్మికులు చేసిన సమ్మె కాలాన్ని సెలవుగా(లీవ్) పరిగణించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని పురపాలకశాఖను ఆదేశిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సమ్మె కాలానికి సెలవు రోజుల్లో కార్మికులు విధులకు హాజరు కావాలన్న అధికారుల షరతుపై కార్మిక సంఘాలు అభ్యంతరం తెలిపాయి. సమ్మె కాలాన్ని సెలవు కింద పరిగణించాలన్న వారి విజ్ఞప్తిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

EENADU Vol: 52, Issue: 171 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈతరం

youthpage@eenadu.in

హరేరామ హరేకృష్ణ



**అక్కడ భక్తిపారవశ్యంతో సంగీతం పరవళ్లు తొక్కుతుంది
ఆ గానామృతానికి మనసు మైమరచిపోతుంది
పాదం తానూ కదులుతానంటుంది
గుడి కాదు కానీ భజనలుంటాయి
కాన్సర్ట్ కాదు కానీ మ్యూజిక్ ఉంటుంది
ఇలా కొత్త తరహాలో జెన్‌జీల వీకెండ్స్‌ని
ఆనందమయం చేస్తున్నాయి భజన్ క్లబ్స్!**

క్లబ్స్ సంస్కృతి మనకు తెలుసు. ఏ పార్టీ అన్నా అక్కడికే వెళ్లాలి అనుకునే యువతను.. భజన్ క్లబ్స్ సరికొత్తగా ఆకర్షిస్తున్నాయి. భజన, క్లబ్ అనేవి రెండు భిన్నమైన అంశాలు. వీటిని ఏకం చేస్తూ జెన్‌జీకు ఆధ్యాత్మికత రుచి చూపిస్తున్నారు ఈవెంట్ ఆర్గనైజర్లు. పబ్స్ వెంట పరిగెత్తే వారితో భక్తిపాటలు పాడిస్తున్నారు. ఆరోగ్యానికి హానికారకమైన మద్యాన్ని.. అందరికీ నచ్చే చాయ్, నిమ్మరసంతో రీప్లేస్ చేస్తున్నారు. అచ్చమైన దేశీ స్నాక్స్ రుచులతో ఈ భజన్ క్లబ్స్ వినూత్నమైన ట్రెండ్‌గా మారిపోయాయి.

స్టేజ్, దాని ఎదురుగా వచ్చిన వారు నిలుచునేందుకు చోటుతో, చూడటానికి కాన్సర్ట్‌లా ఉంటుంది ఈ భజన్ క్లబ్. ఒక్కసారి సంగీతం మొదలైతే.. ఆ ఆనందడోలికల్లో తేలియాడటమే తరువాయి. విభిన్న సంస్కృతుల నుంచి పాటలు, భజనలు, సంగీతాన్ని తీసుకుని.. ఫ్యూజన్‌గా ఆహూతులను అలరిస్తారు. కళాప్రదర్శనలు సైతం ఉంటాయి. చూడటానికి వచ్చినవారు కూడా నృత్యం చేయొచ్చు. సంప్రదాయ భజనలు, మంత్రాలను రీమిక్స్ చేసే ప్రొఫెషనల్ డీజేలు ఉంటారు. ప్రోగ్రామ్‌కు తగ్గట్లుగా డ్రెస్సింగ్ స్టైల్ ఎలా రావాలో ముందే చెప్తారు. ఎలాంటి నిబంధనలు లేని, నచ్చినట్టు వచ్చేలాంటి షోలు కూడా ఉన్నాయి. సాధారణంగా ఇవి సాయంత్రం నుంచి మొదలవుతాయి.

'క్లీన్ హై' అనే ఉద్దేశంతో మన దేశంలో ఈ ట్రెండ్ 2021లో ముంబయిలో ప్రారంభమైంది. మద్యం, పొగతాగడం, ఇతర ఎటువంటి ఆరోగ్యానికి చేటుచేసే అంశాలు లేకపోవడంతో వీటిని అలా పిలుస్తున్నారు. ఈవెంట్ ఆర్గనైజింగ్ సంస్థలు దీన్ని అందిపుచ్చుకోవడంతో ఈ ట్రెండ్ ఇతర ప్రధాన నగరాలకు విస్తరించింది. నైట్‌క్లబ్ వాతావరణం ఉంటూ మానసిక సాంత్వన పొందేలాంటి భజనలు చేస్తుండటంతో రోజువారీ ఒత్తిళ్ల నుంచి ఉపశమనం లభిస్తున్నట్టుగా యువత ఫీలవుతున్నారు. కొందరు నిర్వాహకులు భజన్ క్లబ్స్‌తోపాటు సామూహికంగా జపం, ధ్యానం, యోగా కార్యక్రమాలనూ చేపడుతున్నారు. కొత్త వ్యక్తులను పరిచయం చేసుకోవడానికి, సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను తెలుసుకోవడానికి, ఇదో మంచి వేదికగా యువత చూస్తున్నారు. అందుకే వీకెండ్స్‌లో భజనలతో గడిపేస్తున్నారు!

వారే ఎక్కువ



మీకు తెలుసా?

జుట్టును కాపాడుకోవడానికి మనం పడే కష్టాలు అన్నీఇన్నీ కావు. కానీ కొందరు ఏం కాదులే అన్న ధీమాతో ఉంటారు. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా అడ్డదిడ్డంగా మెయింటెయిన్ చేస్తుంటారు. కానీ టీనేజ్‌లో ఇలా చేయడం వల్ల జుట్టు ఊడే స్పీడు మరింత పెరుగుతోందట. 100 మంది జుట్టు ఊడుతున్న అబ్బాయిలను తీసుకుంటే ఇందులో 52 మందికి 25 ఏళ్లలోపే వెంట్రుకలు రాలిపోవడం మొదలవుతోందని ఇటీవల ఓ అధ్యయనం తెలిపింది. దీనికి ప్రధాన కారణం ఒత్తిడి, విటమిన్స్ లోపంతోపాటు నిరంతరం స్క్రీన్లకు అతుక్కుపోవడం కూడా.. మరికొంత మందికి జన్యువుల వల్ల ఇలా అవుతోంది. కానీ చిన్న వయసులో జుట్టు పట్ల శ్రద్ధ తీసుకుంటే కొన్నాళ్లు నిలకడగా ఉంటుంది అనేది గమనించాల్సిన విషయమంటుందీ అధ్యయనం.

మెయిల్ పంపండి

ఈతరం పేజీలో వస్తున్న కథనాలు, శీర్షికలపై మీ విలువైన సలహాలు, సూచనలు మాకు పంపండి. మా మెయిల్ అడ్రస్ youthpage@eenadu.in



ఐస్‌క్రీమ్.. ఐస్‌క్రీమ్..



90లోకి వెళ్దామా..

చిన్నప్పుడు ఒకసారి మా వీధిలోకి ఐస్ అమ్మే వ్యక్తి వచ్చాడు. అప్పట్లో అది చాలా మామూలే కదా! గంట కొట్టుకుంటూ, బండి నెట్టుకుంటూ.. 'ఐస్ ఐస్.. పుల్ల ఐస్, సేమ్యా ఐస్, పాల ఐస్, మ్యాంగో ఐస్..' అంటూ వాళ్లు వీధుల్లో తిరుగుతుంటే.. ఆ పిలుపు విని అల్లంతదూరం నుంచి పరుగెత్తుకొచ్చేవాళ్లం. నేనూ అలాగే గంట శబ్దం విని తాతయ్య దగ్గర 'ప్లీజ్ తాతయ్యా' అన్నట్టు ముద్దుగా మొహం పెట్టా. ఆయన చిరునవ్వు నవ్వి, జేబులోంచి వంద కాగితం పైకి తీశారు. అది చటుక్కున లాక్కుని గబాలున వీధిగుమ్మంలోకి వచ్చి చూశాను. తీరా బండి అప్పటికే పక్క సందులోకి వెళ్లిపోతోంది. ఎలాగైనా ఐస్‌క్రీమ్ అందుకోవాలన్న దృఢనిశ్చయంతో దాని వెంటే పరుగు మొదలుపెట్టా. నా చేతిలో నోటు, నా రూటు చూసిన పక్కింటి ఈశ్వర్‌గాడు కూడా నాకు జతకలిశాడు. మొత్తానికి రెండు సందుల అవతల ఆ బండినాపి రెండు పుల్ల ఐస్‌లు కొనుక్కున్నాం. ఐస్‌క్రీమ్ చిక్కిన ఆనందంలో చీక్కుంటూ ఇంటికొచ్చేశాం. కాసేపటికి ఆ వ్యక్తి వచ్చి.. 'మీ పాప చిల్లర తీసుకోలేదండీ' అని తాతయ్య చేతిలో డబ్బులు పెట్టాడు. అప్పుడు నాకర్థమైంది ఏంటంటే.. రెండే రెండు పుల్ల ఐస్‌లకు వంద రూపాయలు ఇచ్చేసి వచ్చేశానని! ఆ విషయం మా అమ్మకు కూడా అదే సమయానికి అర్థమైంది. అందుబాటులో ఉన్న చీపురుకట్ట అందేసుకుంది. అది చూసిన నేను బావి చుట్టూ పరుగో పరుగు! ఇప్పుడు తలుచుకుంటే నవ్వాగదు.

– మిట్టపల్లి శ్రీవర్షిణి

ఏఐ టూల్.. వేరే లెవెల్

గూగుల్ డెవలపర్స్ ఏజెంటాథాన్‌లో అసాధారణ ప్రతిభ కనబరిచి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించాడు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం మల్లారానికి చెందిన సంగం సుమిత్ రెడ్డి. 36 గంటలు నిద్ర లేకుండా నిరంతరాయంగా పని చేసి.. ఆరు సరికొత్త ఏఐ టూల్ ఏజెంట్స్ రూపొందించాడు. ఇవి ఎలా ఉపయోగపడతాయో, ఇందుకు తానెంత శ్రమించాడో మనమూ తెలుసుకుందాం.



'మా అమ్మానాన్న సంగం వీరారెడ్డి, అర్పితలది వ్యవసాయ కుటుంబం. ప్రస్తుతం వరంగల్ ఎస్సార్ యూనివర్సిటీలో బీటెక్ (సీఎస్‌సీ) చివరి సంవత్సరం చదువుతున్నాను. రోజువారీగా ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారాలు అందించే ఏఐ పరిశోధన, ప్రాక్టికల్ ప్రాజెక్టుల కోసం పని చేస్తున్నాను. ఈ క్రమంలోనే గూగుల్ డెవలపర్స్ నిర్వహించే పోటీల గురించి తెలిసి దరఖాస్తు చేశాను. 36 గంటలు ఆగకుండా పని చేసి టూల్స్ రూపొందించడంతో రికార్డు దక్కింది. అంతకుముందు అమెరికాకు చెందిన విద్యార్థులు 30 గంటలు పనిచేశారు. వారు మధ్యలో విశ్రాంతి తీసుకోవడంతోపాటు నిద్రపోయారు. వారి రికార్డును అధిగమించడం నాకు చాలా ఆనందంగా ఉంది. ప్రస్తుతం ఏ సమాచారం కావాలన్నా ఇంటర్నెట్ కావాల్సిందే. అయితే నేను అభివృద్ధి చేసిన టూల్స్‌కు దాని అవసరమే ఉండదు. క్లౌడ్ లేదా ఇంటర్నెట్‌పై ఆధారపడకుండా పూర్తిగా లోకల్ సిస్టంలో ఆఫ్‌లైన్‌లోనే పనిచేసే సురక్షిత ఏఐ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. జస్టిస్, ట్రాన్స్‌పరెన్సీ, ప్రిడిక్ట్, సోషల్, ఈక్విటీ, స్కోర్.. ఇలా ఆరు టూల్స్‌ను రూపొందించాను.

ఉపయోగమిలా..: నేను రూపొందించిన లోకల్ ఏఐ టూల్స్ ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, విద్యాసంస్థలు, కార్పొరేట్ సంస్థలకు అత్యంత ఉపయోగకరమైనవి. ప్రభుత్వ యంత్రాంగాలు నూతన విధానాలను తయారు చేయడం, లీగల్ కంప్లయింట్స్ వంటి అంశాల్లో ఇవి వేగంగా, కచ్చితమైన నిర్ణయాలు తీసుకునేందుకు సహాయపడతాయి. క్లౌడ్‌పై ఆధారపడకుండా పూర్తిగా లోకల్ సిస్టమ్‌లో పని చేయడం వల్ల పౌరుల డేటా భద్రత, గోప్యతకు ఎలాంటి భంగం వాటిల్లదు. పారదర్శకత, చట్టాల అనుసరణ, బాధ్యత, సామాజిక న్యాయం, సమానత్వం అనే అంశాల ప్రాతిపదికన వీటిని రూపొందించాను.

మన దేశానికి సొంతమైన, సురక్షితమైన లోకల్ ఏఐ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేసి సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడమే నా లక్ష్యం. ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా, డేటా బయటకు వెళ్లకుండా పనిచేసే ఏఐ సిస్టమ్‌లను దేశవ్యాప్తంగా తీసుకొచ్చేలా కృషి చేస్తాను. యువతకు ఏఐ, మల్టీ ఏజెంట్ సిస్టమ్, సెక్యూర్ కంప్యూటింగ్‌పై శిక్షణ ఇచ్చి 'మేక్ ఇన్ ఇండియా' దిశగా పని చేయాలనుకుంటున్నాను.

– శ్రీనివాస్ నలిగేటి, రాజన్న సిరిసిల్ల

మెరవాలంటే..



మిలమిలా మెరిసే చర్మం కావాలని ఎవరికి ఉండదు చెప్పండి? అందులోనూ కొరియన్ సిరీస్‌లతో కాలక్షేపం చేసే మన కుర్రకారుకు వారిలా అద్దం లాంటి ముఖం కావాలని ఆశపడుతూ ఉంటారు. అందుకే కొత్తగా 4–2–4 స్కిన్ కేర్ రొటీన్ రూల్ పాటించేస్తున్నారు. ఇదెలా చేస్తున్నారంటే..

మొదట నాలుగు నిమిషాలు పొడి చర్మంపై ఆయిల్ క్లెన్సర్‌ను మేకప్, సన్‌స్క్రీన్ వంటివి తొలగించడానికి మసాజ్ చేయాలి.


- తర్వాత మరో రెండు నిమిషాలు నీటి ఆధారిత ఫోమ్, క్రీమ్ క్లెన్సర్‌ను వాడాలి. దీంతో మరికొంత మేరకు మలినాలు తొలగిపోతాయి.
- చివరి నాలుగు నిమిషాల్లో రెండు నిమిషాలపాటు గోరువెచ్చని నీటితో.. మిగిలిన రెండు నిమిషాలు చల్లటి నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మం ఎంతో చక్కగా మెరుస్తుందట!

అహాన్ని జయిద్దాం

నేనే లీడర్

పని చేసే చోట చుట్టూ ఉన్నవారు కొన్నిసార్లు మనకంటే ముందుంటారు. ఇలాంటి సందర్భాల్లో 'వారి కంటే నాకేం తక్కువ' అనే ఆలోచన కలగడం సహజం. మెల్లగా అది అహంభావానికి దారితీస్తుంది. యుక్తవయసులో, ఆరోగ్యకరమైన పోటీ ఉండాల్సిన చోట.. అహం పనికిరాదు. దీన్ని అదుపులో ఉంచుకునేందుకు మనం ఇలా చేయొచ్చు.

1 **అవగాహన:** ఇతరులతో పోల్చుకున్నప్పుడు అహం మొదలవుతుంది. 'వారికంటే నేనే ముందు' అనే ఫీలింగ్‌తో ఇది బలపడుతుంది. కానీ మనమంతా ఎవరి దారిలో వారు ప్రత్యేకం అనే విషయాన్ని గుర్తించాలి. మనతోపాటు ఇతరుల గురించి అవగాహన పెంచుకోవాలి. వారి బలాలను అభినందించగలగాలి.



2 **ఆలోచన:** 'నాకు అన్నీ తెలుసు, నేర్చుకోవడానికి ఏం లేద'ని అనుకున్నప్పుడు అహంకారం మనపై ఆధిపత్యం చెలాయిస్తుంది. మన ఆలోచన విధానమే దాన్ని పెంచిపోషిస్తుంది. అందుకే అలా జరగకుండా ఎప్పుడూ కొత్త కొత్త విషయాలను అనుభవం ఉన్నవారి నుంచి నేర్చుకోవాలి. నిరంతర అభ్యాసానికి సిద్ధంగా ఉండటం ద్వారా అహం తగ్గడం, మనం అభివృద్ధి చెందడం జరుగుతాయి.

3 **సహాయం:** ఎవరికైనా సరే అవసరంలో ఉన్నారు అనుకుంటే సహాయపడాలి. ఆపైన వారి నుంచి వచ్చే స్పందన మనసుకు హాయి గొల్పి మనమంతా సమానమే అనే భావన కల్పిస్తుంది. ఆఫీసులో మంచి సంబంధాలను, ప్రశాంతమైన పని వాతావరణాన్ని కల్పిస్తుంది.

కృషి, పట్టుదల ఉంటే మనకు ఆకాశమే హద్దు అని నిరూపిస్తున్నాడు విజయనగరం జిల్లా కొత్తవలస మండలానికి చెందిన కునుకు శ్రీనివాసరావు. రెండేళ్లలో అయిదు ప్రభుత్వ కొలువులు సాధించి ఆదర్శంగా నిలిచాడు. ప్రస్తుతం విశాఖపట్నంలో ఆదాయపు పన్ను శాఖలో టాక్స్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్న తను.. ఏపీపీఎస్సీ తాజాగా ప్రకటించిన గ్రూప్-2 ఫలితాల్లో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్ట్‌కు ఎంపికయ్యాడు.

రెండేళ్లలో అయిదు ఉద్యోగాలు!



శ్రీనివాసరావు ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తి చేశాడు. తండ్రి సూర్యనారాయణ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి రమణమ్మ గృహిణి. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నిరంతరం శ్రమించి పోటీ పరీక్షల్లో తనదైన ముద్ర వేస్తున్నాడీ కుర్రాడు. ఇప్పటివరకూ ఏడు ఉద్యోగాలు సాధించగా, గత రెండేళ్లలోనే అయిదు కొలువులు కొట్టాడు. 2018లో మొదటగా స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా ఎంటీఎస్(సీఏజీ) ఉద్యోగం సాధించి విజయవాడలో పని చేశాడు. తర్వాత 2019-20లో తపాలా శాఖలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (పోస్ట్‌మేన్)గా విశాఖలో ఉద్యోగం లభించడంతో మొదటి దానికి రాజీనామా చేసి, దీంట్లో చేరాడు. 2023లో ఆదాయపు పన్ను శాఖలో టాక్స్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికై చేరాడు.

ప్రస్తుతం విశాఖపట్నంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ ఉద్యోగంలో ఉన్న సమయంలోనే రైల్వే మెయిల్ సర్వీస్(ఆర్ఎంఎస్)లో ఎంటీఎస్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఆర్ఆర్‌బీ)లో సీనియర్ కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ)లో అసిస్టెంట్ గ్రేడ్-3 ఉద్యోగానికి ఎంపికయ్యాడు.. కానీ వాటిలో చేరలేదు. ఇటీవల గ్రూప్-2లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సంపాదించాడు. గ్రూప్-1లో ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమని చెబుతున్నాడు.. సక్సెస్ స్టోరీలు చదవడం, ప్రముఖుల సలహాలు పాటిస్తే సర్కారీ కొలువు కొట్టడం అంత కష్టమేం కాదంటున్నాడు.

– న్యూస్‌టుడే, కొత్తవలస

అబ్బాయి.. చాలా సాఫ్ట్



కొందరు అబ్బాయిలు ఉంటారు.. నచ్చిన అమ్మాయిని ఎలా అయినా ఇంప్రెస్ చేయాలని తమ సాఫ్ట్‌బాయ్ వేషాలన్నీ బయటకు తీస్తారు. చాలా డీసెంట్‌గా డ్రెస్ చేసుకుని, నెమ్మదిగా మాట్లాడుతూ, ఎప్పుడూ కోపం తెచ్చుకోకుండా.. 'అబ్బా తనెంత మంచోడో' అన్నట్టు కనిపిస్తారు. ఇలా అమ్మాయిలను పడేయడానికి తెచ్చిపెట్టుకున్న పర్సనాలిటీని 'పెర్ఫామేటివ్ మేల్' అంటున్నారు. ఎందుకంటే ఇదంతా ప్రదర్శనే. నిజంగా అంత సాఫ్ట్ ఏం కాదు వాళ్లు. ఒక్కసారి నచ్చిన అమ్మాయి గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. మెల్లగా వారి అసలు రంగు బయటకొస్తుంది. అందుకే సోషల్ మీడియాలో చాలా 'కూల్'గా కనిపించే కుర్రాళ్లను అంత సులభంగా నమ్మేయకూడదట.

మన మొదటి కవిత

నవ్వు బ్రో

కిటికీలో నుంచి చూశా
రోడ్డు మీద ఎవరూ లేరు
మళ్లీ కిటికీలో నుంచి చూశా
ఇప్పుడూ రోడ్డు మీద ఎవరూ లేరు
రోడ్డు మీదకెళ్లి చూశా
ఇప్పుడు కిటికీ దగ్గర
ఎవరూ లేరు.. – నందూ

కొంటె కొటేషన్



1. జిమ్‌లో చేయాలి కసరత్తు.. దానికి వదలాలి నిద్రమత్తు.
– పి.ఉమాదేవి

2. కుర్రాడి ప్రయాస తెచ్చింది ఆయాసం.
– కొండలరావు, దూసి

3. తగని కసరత్తులు.. తప్పని ఇక్కట్లు.
– పాంచజన్య, కాకినాడ

4. బాబుకి వచ్చింది అలసట.. ఎంచుకున్నాడు బాసట.
– గనివాడ సూర్య, విజయనగరం

5. కండలు తిప్పేందుకు వచ్చి.. కొండలా పడుకున్నాడు.
– శ్రీశైలం, దేవరకొండ

6. లిఫ్ట్ చేయాలని జిమ్‌కి వచ్చాడు.. షిఫ్ట్ అయి పడుకున్నాడు.
– తేజ

7. జిమ్‌లో హుషారు.. నీరుగారింది మాస్టారూ. – కె.అఖిల



ఈ ఫొటోకి సరదా వ్యాఖ్య రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

ఏమిటీ 11:11..

హే, 11:11 అయిందీ..
నీ మనసులో కోరిక ఎలా అయినా
తీరాలని గట్టిగా అనేసుకో..!

ఒక్కసారి బండి పక్కన ఆపరా,
11:11 అవుతోంది!

అసలేంటీ పదకొండు గంటల పదకొండు నిమిషాలు అనుకుంటున్నారా? ఈ మధ్య రీల్స్ తెరిస్తే చాలు.. లెవెన్ లెవెన్ విష్ అంటూ తెగ హడావుడి చేసేస్తున్నారు యూత్ జనాలు. కొంతమంది ఈ సంఖ్యను స్పిరిచ్యువల్‌గా పాజిటివ్ నంబర్ అని భావిస్తే.. మరి కొందరేమో అదృష్ట సంఖ్య అనుకుంటున్నారు. టైం పదకొండు గంటల పదకొండు నిమిషాలు అవుతున్నప్పుడు.. లేదంటే ఆ సంఖ్యని ఎక్కడైనా చూసినప్పుడైనా కోరిన కోరిక తప్పకుండా తీరుతుందని చాలామంది నమ్మకం. అది ఏంజెల్ నంబర్.. ఆ సమయంలో యూనివర్స్ అంతా పాజిటివిటీని స్ప్రెడ్ చేస్తుందని సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

నిజానికి దీనికి ఎటువంటి శాస్త్రీయ నిరూపణ లేదు. 'అయినా మనం చేస్తున్న పని మీద ఆసక్తి.. పూర్తి చేయగలమనే నమ్మకం, పాజిటివ్ ఆలోచనా విధానం ఉంటే కాస్త ముందో వెనకో ఆ కోరికలు తప్పకుండా తీరతాయి కదండీ.. దానికి ప్రత్యేకంగా కోరుకోవాలా' అని కొందరంటున్నారు. మరి మీరేమంటారు?

వైరల్ పాఠం

'ఎంత నిరాశ లేకపోతే అలా ఒంటరిగా వెళ్తుంది బాసూ' ఒక నిరుద్యోగి నిర్వేదం..

'గర్ల్‌ఫ్రెండ్ చేతిలో మోసపోయినట్టుంది నాలాగే' బ్రేకప్ అయిన కుర్రాడి వెటకారం..

'ఇదేదో అనారోగ్య సమస్య అయ్యుంటుంది' మరో అమ్మడి జోస్యం..

వెరసి.. 'ఒంటరి పెంగ్విన్' క్లిప్ సోషల్‌మీడియా మొత్తం నిండిపోయింది. ఎప్పుడో 2007లో తీసిన ఓ వీడియోలో భాగమైన ఈ క్లిప్ గురించి 2026లో యూత్ అందరూ మాట్లాడుకుంటున్నారు. ఎవరికి తోచిన భాష్యం వారు చెబుతున్నారు. ఎందుకంటే దీని వెనక ఆసక్తికరమైన కథ ఉంది.

'ఎన్‌కౌంటర్స్ ఎట్ ది ఎండ్ ఆఫ్ ది వరల్డ్' అనే డాక్యుమెంటరీ లోనిదీ వీడియో. జర్మనీ ఫిల్మ్ మేకర్ 'వెర్నర్ హెర్జోక్' ఈ చిత్రాన్ని షూట్ చేశాడు. అంటార్కిటికా ఖండంలోని మెక్‌ముర్డో స్టేషన్‌లో నిపుణుల జీవనశైలిని, అక్కడి వింతైన వాతావరణాన్ని వీడియో తీయడానికి వెళ్లిన హెర్జోక్ బృందానికి ఈ చిత్రమైన పెంగ్విన్ తారసపడింది. సాధారణంగా అక్కడ నివసించే పెంగ్విన్లు ప్రధానంగా రెండు దిశల్లో ప్రయాణిస్తాయి.. ఒకటి ఆహారం కోసం సముద్రం వైపు, రెండోది తిరిగి తమ గూటికి వెళ్లడానికి కాలనీకి. కానీ ఈ ఒక్క పెంగ్విన్ మాత్రం అందుకు భిన్నంగా ప్రమాదకరమైన మంచు పర్వతాల వైపు తన ప్రయాణాన్ని మొదలుపెట్టింది. అప్పుడు హెర్జోక్ తన పక్కనున్న వారిని 'పెంగ్విన్‌లు పిచ్చివి అవుతాయా? ఒంటరిగా తిరుగుతాయా?' అని అడిగాడు. అప్పుడు వారు.. 'అది దారి తప్పేం వెళ్లడం లేదు.. తన లక్ష్యం ఏంటో తెలుసుకొనే వెళ్తోంది. ఎన్నిసార్లు తిరిగి తీసుకొచ్చి కాలనీలో పెట్టినా అది మళ్లీ అలా ఒంటరిగానే వెళ్తుంది. కొన్నింటికి వాటి లోపలి నేవిగేషన్ సిస్టమ్ ఎలా చూపిస్తే అలా నడుచుకుంటాయి. మనకు జీపీఎస్ లొకేషన్‌లాగా వాటికి అలా, అది చెప్పినట్టు ప్రవర్తిస్తుంటాయ'ని సమాధానమిచ్చారు. ఆ పెంగ్విన్ వెళ్లే దారిలో జీవించడానికి అవసరమైన ఆహారం గానీ, నీళ్లు గానీ ఏమీ ఉండవు. అన్నీ వదిలేసి ఒంటరిగా శూన్యం వైపు ఎందుకెళ్తుందో ఎవరికీ అర్థం కాలేదు. సోషల్‌మీడియాలో చాలామంది యువత ఈ పెంగ్విన్ వీడియో చూసి వారి జీవితాలను దాంతో పోల్చుకుంటున్నారు. కొందరు దీనిని నిహిలిస్ట్ పెంగ్విన్ అనీ పిలుస్తున్నారు. కొందరేమో 'తను నమ్మిన దారిలో ఒంటరిగా అయినా వెళ్తున్న దాని గట్స్ మెచ్చుకోవాలి' అనుకుంటున్నారు. మరికొందరేమో డిప్రెస్ అయి ఇలా వెళ్లిపోతుంది అనుకుని 'మనుషుల్లాగే కదా' అంటున్నారు. తెగువగా కొత్త దారిలో వెళ్తుంటే దాని దారిలో మనమూ వెళ్దాం, బాధగా వెళ్లిపోతుంటే మాత్రం నిలబడి పోరాడదాం అని పాఠం నేర్చుకుంటున్నారు. మొత్తానికి ఇన్నేళ్ల తర్వాత ఒకే ఒక్క పెంగ్విన్ జెన్‌జీకి ఓ కొత్త పాఠం నేర్పించింది!



అంతా అబద్ధం



'నువ్వు లేకపోతే నేను బతకలేను, ఇద్దరం కలిసి ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించుకుందాం' అంటూ ఒకరికొకరు మాటలు చెప్పుకొంటారు.

కానీ నిజంగా భవిష్యత్తుకు సంబంధించిన ఎటువంటి ప్లానింగ్ వీరి మధ్య జరగదు. కేవలం మాటలు చెబుతూ టైమ్‌పాస్ చేస్తుంటారు. ఒకరితో మరొకరికి ఫ్యూచర్ ఉందని నమ్మిస్తుంటారు. దీన్నే 'ఫ్యూచర్ ఫేకింగ్ డేటింగ్' అంటున్నారు యూత్. నిజానికి వీరు కలిసిన సమయంలో కూడా సరిగ్గా ఉండరు, ఎప్పుడూ ఏదో ఒక విషయానికి గొడవ పడుతూనే ఉంటారు. సాధ్యం కాని ప్లానింగ్ చేస్తుంటారు. లేని భవిష్యత్తును ఆశ చూపి కాలం వెళ్లదీస్తుంటారు. ఒకవేళ మీతో ఉన్నవారు ఇలా చేస్తున్నారేమో.. గమనించండి!

పంచుకుందాం



నువ్వు లేని లోకంలో
శిలలా
నిదుర రాని కన్నుల్లో
కలలా

నువ్వు నడిచే దారంతా
నీ నవ్వుల పువ్వులే
వాటిపై మంచు
బిందువుల్లా
నా కన్నీటి చుక్కలు

లేస్తూ నిన్ను ధ్యానించడం
నిద్రపోతూ నిన్ను శ్వాసించడం
ఇదే నా దినచర్య
ఏ మాయ చేశావో

– లక్ష్మీనాయుడు, విశాఖపట్నం

ఈనాడు సినిమా

క్లాసూ... మాసూ


రామ్ చరణ్

ఒకవైపు 'పెద్ది' సినిమా చిత్రీకరణలో పాల్గొంటూనే... మరోవైపు కొత్త సినిమా కథకు సంబంధించిన పనులపై దృష్టి పెడుతున్నారు రామ్‌చరణ్. 'పెద్ది' తర్వాత ఆయన సుకుమార్ దర్శకత్వంలో సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా కోసం సుకుమార్ ఎప్పట్నుంచో కథని సిద్ధం చేస్తున్నారు. ఆయన తరహా ఓ క్లాస్ కథతోపాటు... అందుకు పూర్తి భిన్నంగా ఒక మాస్ కథనీ సిద్ధం చేసినట్టు సమాచారం. 'రంగస్థలం'లో రామ్‌చరణ్‌ని మాస్ పాత్రలోనే చూపించారు సుకుమార్. మరోసారి అలాంటి విభిన్నమైన పాత్రలోనే రామ్‌చరణ్‌ని చూపించాలని సుకుమార్ భావిస్తున్నట్టు సమాచారం. రామ్‌చరణ్ కూడా మాస్ కథకే పచ్చజెండా ఊపారని సమాచారం. అందులో లుక్ కూడా గత సినిమాలకు భిన్నంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ ఏడాది వేసవిలోనే ఈ సినిమా చిత్రీకరణని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. 'పుష్ప' చిత్రాల తర్వాత సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో 'పెద్ది' చిత్రీకరణ సాగుతోంది. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఓ సెట్‌లో పాటని చిత్రీకరిస్తున్నారు.

అదే రోజునే వారణాసి

మహేశ్‌బాబు కథానాయకుడిగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వారణాసి' విడుదల అధికారికంగా ఖరారైంది. కొన్ని రోజులుగా ప్రచారంలో ఉన్నట్టుగానే వచ్చే ఏడాది ఏప్రిల్ 7న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు శుక్రవారం చిత్రబృందం ఓ ప్రత్యేకమైన పోస్టర్‌తో ప్రకటించింది. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కొనసాగుతోంది. కథానాయిక ప్రియాంక చోప్రా సహా పలువురు నటీనటులు ఇందులో పాల్గొంటున్నారు. 'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి. ఐమాక్స్ ఫార్మేట్‌లో, అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ చిత్రం రూపుదిద్దుకొంటోంది. ఓ సాహసికుడి ప్రపంచ యాత్ర, పురాణాలు, కాలప్రయాణంతో ముడిపడిన కథ ఇది.


మహేశ్‌బాబు

జులైలో 'విశ్వంభర'


చిరంజీవి

'మన శంకరవరప్రసాద్‌గారు' విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్నారు కథానాయకుడు చిరంజీవి. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న తదుపరి సినిమా 'విశ్వంభర'పై ప్రేక్షకుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. వశిష్ఠ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. గతేడాదే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సోషియో ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్ వీఎఫ్ఎక్స్ పనుల వల్ల ఆలస్యమైంది. కాగా, ఇప్పుడీ పనులన్నీ ఓ కొలిక్కి వస్తుండటంతో జులై తొలివారంలో దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయంపై చిరు కూడా ఇటీవల జరిగిన విలేకర్ల భేటీలో స్పందించారు. ఇది జులై 9న తెరపైకి వచ్చే అవకాశముందని.. దీనికి సంబంధించిన వీఎఫ్ఎక్స్‌ని తానింకా చూడలేదని తెలియజేశారు. మరి ఇది చిరంజీవి చెప్పిన తేదీ నాటికి అన్ని పనుల్ని పూర్తి చేసుకుని తెరపైకి వస్తుందా? లేదా? చూడాలి.

నా జీవితాన్ని నీ ప్రేమతోనే గడిపేస్తున్నా!


శనయా కపూర్, ఆదర్శ్

గతేడాది 'ఆంఖోన్ కీ గుస్తాఖియాన్'తో సినిమాతో తెరపై మెరిసింది సంజయ్ కపూర్ కుమార్తె, యువకథానాయిక శనయా కపూర్. ఇప్పుడామె ఓ సర్వైవల్ థ్రిల్లర్‌తో అలరించడానికి సన్నద్ధమవుతోంది. ఆమె, ఆదర్శ్ గౌరవ్ జంటగా నటిస్తున్న చిత్రం 'తు యా మెయిన్'. బెజోయ్ నంబియార్ దర్శకత్వం వహిస్తున్నారు. కలర్ ఎల్లో బ్యానర్‌పై ఆనంద్ ఎల్.రాయ్‌తో పాటు హిమాన్షు శర్మ, వినోద్ భానుశాలి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 13న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్ని పరుగులు పెట్టిస్తోంది చిత్రబృందం. ఇందులో భాగంగానే 'జీ లియా..' అనే గీతాన్ని ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది. "నా జీవితాన్ని నీ ప్రేమతోనే గడిపేస్తున్నా.." అంటూ సాగుతున్న ఈ పాటలో ఆదర్శ్, శనయాల జోడీ ఆకట్టుకుంటోంది. అడవిలో ఓ యువ జంట చేసే సాహసాల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది.

నా వయసుపై చాలా చర్చలు

చిన్నప్పుడంటే ఇవన్నీ నాకు తెలీదు.. కానీ, ఇప్పుడు ఇండస్ట్రీలోకి వచ్చాక పేరుతో పాటు విమర్శలు కూడా ఉంటాయని తెలుసుకున్నా అంటోంది బాలీవుడ్ నటి సారా అర్జున్. 'ధురంధర్'తో వెండితెరకు కథానాయకురాలిగా పరిచయమైన సారా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొని. చిత్ర పరిశ్రమలో తన ప్రయాణం గురించి పలు విశేషాలను పంచుకుంది.


సారా అర్జున్

"ఇది నిజంగా జరగాలని నేను కోరుకున్నా. కానీ అది ఎలా, ఎప్పుడు అనేదే ఓ ప్రశ్న. ఆ ప్రశ్నలన్నింటికీ ఈ సినిమాతో నాకు సమాధానాలు దొరికినట్లు భావిస్తున్నా. నాపై నమ్మకం ఉంచి ఈ అవకాశం ఇచ్చిన అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూనే ఉన్నాను. చిన్నప్పుడు అమ్మానాన్నతో కలిసి ఓ షాపింగ్ మాల్‌కు వెళ్లినప్పుడు నన్ను చూసి ఓ బ్రాండ్‌లో నటించాలని సదరు ఉత్పత్తికి చెందిన ప్రతినిధులు కోరారు. అలా అప్పటి నుంచి చాలా ప్రకటనలలో కనిపిస్తూ సినిమాల్లోకి వచ్చాను. నేను నటించిన ప్రకటనలలో ఒక దానిని ముఖేశ్ చబ్రా చిత్రీకరించారు. తర్వాత ఆయన నన్ను ఓ ఆడిషన్‌కి రమ్మని పిలిచారు. అది 'ధురంధర్' సినిమా కోసమని నాకు తెలియదు. స్క్రిప్ట్ కూడా భిన్నంగా ఉంది. ఒక సాధారణ ఆడిషన్‌లా అదీ అనుకుని ఇచ్చేసి.. కొన్నాళ్ల తర్వాత దాని గురించి మర్చిపోయా. కానీ, ఒక నెల తర్వాత వేర్వేరు సన్నివేశాలలో ఆరు ఆడిషన్‌లు ఇచ్చాను. నా వయసు గురించి సినిమాకి ముందు చాలా స్పష్టంగా చర్చలు జరిగాయి".

ఐశ్వర్య నన్ను గుర్తుంచుకున్నారు

"ఓ తమిళ చిత్రంలో నటుడు విక్రమ్ కుమార్తెగా చాలా చిన్న వయసులో నటించాను. ఆ సినిమా అనుభవాలు నాకు గుర్తు లేవు కానీ, విక్రమ్‌ని అప్పా అని పిలిచేదాన్ని అదే గుర్తుంది. ఆ సినిమా తర్వాత ఇమ్రాన్ హష్మీ, సల్మాన్ ఖాన్, ఇర్ఫాన్ ఖాన్‌లతోను నటించాను. సల్మాన్ చిత్రం నాకు బాగా గుర్తుంది. కానీ ఆయనను కలిసే అవకాశం నాకు రాలేదు. దర్శక నిర్మాత మణిరత్నం 'పొన్నియిన్ సెల్వన్' సినిమా సెట్‌లో ఐశ్వర్య రాయ్‌ని చూశాను. ఆమె చాలా నిజాయతీగా ఉండేవారు. సెట్‌లో సహాయం చేస్తూనే నన్ను సొంత కూతురిలా చూసుకునేవారు. ఈ సినిమా సీక్వెల్ చిత్రీకరణలో మొదటిసారి కలిసినప్పుడు ఆమె నన్ను గుర్తుంచుకుంటారా లేదా అని ఆలోచిస్తూనే ఉన్నా. కానీ ఆమె నన్ను గుర్తుపట్టారు. వెనక్కి తిరిగి చూసుకుంటే బాలనటిగా పనిచేయడం చిత్రపరిశ్రమలోకి వచ్చాక కలిసొచ్చిందని అనిపిస్తుంది".

దాని గురించి తక్కువ మాట్లాడాలనుకుంటా..

"ఎవరైనా బాల్యంలో భావోద్వేగాలను స్వచ్ఛంగా అనుభవిస్తారు. బాధను బాధగా.. సంతోషాన్ని సంతోషంగానే. ఆ సమయంలో ఉన్న పెద్ద ప్రయోజనమేంటంటే.. ఎలాంటి అడ్డంకులు ఉండకపోవడం. మొదటి నుంచి నేను పనిచేసే విధానాలలో కూడా ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా ముందుకుసాగిపోవడానికి నావంతు ప్రయత్నిస్తాను. వృత్తి పరంగా ఏం జరిగినా దాని గురించి నేను నా తల్లిదండ్రులతో మాత్రమే పంచుకుంటాను. తర్వాత నా సోదరుడు. ఇండస్ట్రీలో పేరు వచ్చినప్పుడు విమర్శలు కూడా వస్తాయని నాకు తెలుసు. చిన్నప్పుడంటే ఇవన్నీ నాకు తెలియదు. నేను దేనికోసం పనిచేయాలో నాకు తెలుసు. నా వ్యక్తిగత జీవితాన్ని కాపాడుకోవడం నాకు చాలా ఇష్టం. దాని గురించి తక్కువ మాట్లాడటం ఉత్తమం అనుకుంటాను. అలా కాపాడుకుంటూనే.. ఏ అవకాశం వచ్చినా చేయడానికి సిద్ధంగా ఉన్నాను. చాలా కాలంగా ఇదే కోరుకుంటున్నాను".

ఆ అందమైన జ్ఞాపకాల్ని గుర్తు చేసే చిత్రం



మగేశ్, అనస్వర రాజన్, రానా, సౌందర్య రజనీకాంత్, అభిషన్

'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమాతో దర్శకుడిగా అందర్నీ మెప్పించారు అభిషన్ జీవింత్. ఇప్పుడాయన్ని హీరోగా పరిచయం చేస్తూ మదన్ తెరకెక్కించిన చిత్రం 'విత్ లవ్'. అనస్వర రాజన్ కథానాయిక. సౌందర్య రజనీకాంత్, మగేశ్ రాజ్ సమర్పిస్తున్నారు. ఈ సినిమా ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ద్వారా ఫిబ్రవరి 6న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే నటుడు, నిర్మాత రానా దగ్గుబాటి శుక్రవారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "తొలిసారి ఈ టీజర్ చూసినప్పుడు చాలా ఆనందంగా అనిపించింది. ఓ జంట మనసులోనే దాగి ఉండిపోయిన ప్రేమకథతో తెరకెక్కింది. తప్పకుండా అందరికీ కనెక్ట్ అవుతుంది" అన్నారు. "నా 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రాన్ని గొప్పగా ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఇప్పుడు నేను హీరోగా నటించిన ఈ సినిమాని అలాగే ఆదరిస్తారని నమ్ముతున్నా. ఇది మంచి ప్రేమకథతో రూపొందిన చిత్రం. మనందరి జీవితాల్లోని అందమైన జ్ఞాపకాల్ని తిరిగి గుర్తు చేసేలా ఉంటుంది" అన్నారు. నిర్మాత సౌందర్య రజనీకాంత్ మాట్లాడుతూ.. "అభిషన్‌ని మేము హీరోగా పరిచయం చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. బయటకు చెప్పలేక.. మనసుల్లోనే దాగుండిపోయిన ప్రేమకథతో రూపొందింది. ఇది చాలా వినూత్నంగా ఉంటుంది. దీంట్లోని స్కూల్ లైఫ్ ఎపిసోడ్స్ అందరికీ బాగా కనెక్ట్ అవుతాయి" అన్నారు. ఈ కార్యక్రమంలో మగేశ్, అనస్వర తదితరులు పాల్గొన్నారు.

చర్చల దశలో రజనీ - కమల్ సినిమా..

రజనీకాంత్ - కమల్‌హాసన్ కథానాయకులుగా త్వరలో ఓ సినిమా రానుందని.. దానికి నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తారని నెట్టింట వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై సౌందర్య రజనీకాంత్ 'విత్ లవ్' వేడుకలో స్పందించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌పై చర్చలు జరుగుతున్నాయని.. దానిపైన నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటిస్తేనే బాగుంటుందని సౌందర్య చెప్పారు.

అలా పిలిస్తే నాకేం ఇబ్బంది లేదు!


శ్రియ

దక్షిణాది ప్రేక్షకులు తనపై చూపించిన ప్రేమ వెలకట్టలేనిదని అంటోంది నటి శ్రియా శరణ్. 'సంతోషం', 'నువ్వే నువ్వే', 'ఎలా చెప్పను' లాంటి ఎన్నో ప్రేమకథా చిత్రాలతో అభిమానుల్ని ఆకట్టుకున్న కథానాయికీమె. ప్రస్తుతం భాషతో సంబంధం లేకుండా కథల్ని ఎంచుకుంటోన్న ఈమె.. ఇటీవలే 'స్పేస్ జెన్: చంద్రయాన్' అనే సిరీస్‌తో ఓటీటీ వేదికగా సందడి చేసింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రియ తన కెరీర్ ప్రారంభం రోజుల్ని గుర్తుచేసుకుంది. "బాల్యమంతా హరిద్వార్‌లోనే గడిచింది. ఆ తర్వాత కథక్ నేర్చుకోవడం కోసం దిల్లీకి వెళ్లి. . 17ఏళ్ల వయసులోనే నటించడం మొదలు పెట్టాను. అదే నా జీవితంలో మొదటి పెద్ద మలుపు. ఎందుకంటే మా నాన్న ఇంజనీర్, అమ్మ టీచర్. అలాంటి కుటుంబం నుంచి వచ్చి నేను నటిని అవుతానంటే అందరూ ఆశ్చర్యపోయారు. తర్వాత సినిమా సెట్‌లకు వెళ్లడం, కొత్త భాషలు నేర్చుకోవడం ఇవన్నీ నన్ను భవిష్యత్ జీవితానికి సిద్ధం చేశాయ"ని అంది. 'సౌత్ స్టార్' అని తనని అభిమానులు పిలవడం గురించి మాట్లాడుతూ "నన్ను అలా పిలవడం వల్ల నాకెప్పుడూ ఇబ్బందిగా అనిపించలేదు. దక్షిణాది అభిమానుల ప్రేమకు కృతజ్ఞతలు" అని చెప్పుకొచ్చింది శ్రియ.

అలియా నిర్మాణంలో డోంట్ బీ షై


అలియా భట్

తనదైన నటనతో సినీప్రియుల్ని ఆకట్టుకునే బాలీవుడ్ అందాల తార అలియా భట్.. 'డార్లింగ్స్', 'జిగ్రా' లాంటి చిత్రాలతో నిర్మాతగా కూడా నిరూపించుకుంది. ఇప్పుడామె ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియోతో కలిసి తన నిర్మాణ సంస్థ ఎటర్నల్ సన్‌షైన్ పతాకంపై మరో చిత్రాన్ని తీర్చిదిద్దుతుంది. తాజాగా దీనికి 'డోంట్ బీ షై' అనే పేరును ఖరారు చేసినట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఓ వీడియోను పంచుకుంది అమెజాన్ ప్రైమ్. "ఈ కథలో అన్నీ ఉంటాయి. ప్రేమ, అద్భుతం, పాటలు, అమ్మాయిలు, అబ్బాయిలు.. ఇంకా ఓ తాబేలు కూడా ఉంది" అనే వ్యాఖ్యను జోడించింది. శ్రీతి ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. నటీనటుల వివరాలు ఇంకా వెల్లడికానప్పటికీ.. ఈ చిత్రం శ్యామిలీ షై దాస్ అనే 20ఏళ్ల అమ్మాయి చుట్టూ తిరుగుతుందని చిత్రవర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా అలియా మాట్లాడుతూ.. "ఇది నాకు చాలా ప్రత్యేకమైన ప్రాజెక్ట్. మేము ఎప్పుడూ నిజాయతీగా అనిపించే కథలకే మద్దతు ఇవ్వాలని కోరుకుంటున్నామ"ని చెప్పింది.

శ్రీను ఆరాధించే మంగ


రషా థడానీ

'లక్షల సంఖ్యలో దేవతలు నన్ను దాటుకుంటూ వెళ్లిపోతున్నా సరే... నేను మాత్రం నిన్నే చూస్తుంటా' అంటున్నాడు శ్రీను. మంగ అంటే అతనికి అంత ఆరాధన. దేవతల కంటే ఆమే ఎక్కువనేది అతని భావన. ఇంతకీ ఆ మంగ ఎవరు? ఆమె కోసం శ్రీను ఏం చేశాడో తెలియాలంటే 'శ్రీనివాస మంగాపురం' విడుదల వరకూ ఎదురు చూడాల్సిందే. సూపర్‌స్టార్ కృష్ణ మనవడు జయకృష్ణ ఘట్టమనేని కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రమే 'శ్రీనివాస మంగాపురం'. అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నారు. 'చందమామ కథలు' పతాకంపై పి.కిరణ్ నిర్మిస్తున్నారు. సి.అశ్వనీదత్ సమర్పకులు. ఈ చిత్రంతో రవీనా టాండన్ కుమార్తె రషా థడానీ తెలుగు తెరకు పరిచయం అవుతోంది. ఈ సినిమాలో మంగ పాత్రలో సందడి చేయనున్న రషా థడానీ లుక్‌ని శుక్రవారం విడుదల చేసింది చిత్రబృందం. సంప్రదాయ దుస్తుల్లో హుందాగా ఆమె కనిపించింది. "ఆసక్తికరమైన కథా నేపథ్యం, మంచి సంగీతంతో దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్ని అలరించే చిత్రమిది. సూపర్‌స్టార్ కృష్ణ, రమేశ్‌బాబు, మహేశ్‌బాబు నట వారసత్వాన్ని ఈ చిత్రంతో కొనసాగించనున్నారు జయకృష్ణ ఘట్టమనేని. ఆయన తెరపై కనిపించే విధానం, నటన చాలా బాగుంటుంది. ఆయన, మంగ పాత్రతో తెలుగు తెరకు పరిచయం అవుతున్న రాషా థడానీ జోడీ ప్రేక్షకుల్ని కట్టిపడేస్తుంది. ఉన్నతమైన నిర్మాణ విలువలు, విజన్‌తో ఇప్పటికే 30 రోజులపాటు సాగిన తొలి షెడ్యూల్‌ని పూర్తి చేశాం. ప్రస్తుతం రెండో షెడ్యూల్ చిత్రీకరణ సాగుతోంద"ని సినీ వర్గాలు చెప్పాయి. ఈ చిత్రానికి సంగీతం: జి.వి.ప్రకాశ్, ఛాయాగ్రహణం: జయకృష్ణ, కూర్పు: మాధవ్ కుమార్ గుల్లపల్లి, ప్రొడక్షన్ డిజైన్: సాహి సురేశ్, యాక్షన్: రియల్ సతీశ్.

ఇకపై సహించం.. పోరాడతాం!


'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్'

"నేను కేరళకు చెందిన సురేఖా నాయర్. ఐఏఎస్ అధికారిణిగా ఉద్యోగం సాధించి.. నా దేశానికి ఏదైనా చేయాలనుకున్నా. నా పేరు నేహా సంత్. నేను ఒలింపిక్స్‌లో భారత జెండాను రెపరెపలాడించాలనుకున్నా. నేను రాజస్థాన్‌కు చెందిన దివ్యపలివాల్. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలనుకున్నా" అంటూ ఓ ముగ్గురు అమ్మాయిలు తమ కలల జీవితం గురించి చెప్తున్నారు. మరి వారు అనుకున్నట్లే జీవితం సాగిందా? లేదా? అనేది తెలుసుకోవాలంటే 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్' సినిమా చూడాల్సిందే. కామాఖ్య నారాయణ్ సింగ్ తెరకెక్కిస్తున్నారు. విపుల్ అమృత్‌లాల్ షా నిర్మాత. ఉల్కా గుప్తా, ఐశ్వర్య ఓజా, అదితి భాటియా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ముస్లిం అబ్బాయిలతో ప్రేమలో పడిన ముగ్గురు అమ్మాయిల జీవితం.. ప్రేమను ఆయుధంగా వారు మలుచుకున్న తీరును ఇందులో చూపించనున్నట్లు టీజర్‌తో స్పష్టమవుతోంది. ఆఖర్లో 'ఇకపై సహించము... పోరాడతాం' అనే సంభాషణ ఆకట్టుకునేలా ఉంది. 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా తీర్చిదిద్దిన ఈ చిత్రం ఫిబ్రవరి 27న రానుంది.

పల్నాడు నేపథ్యంలో సాగే రాజకీయ కథ


తిరువీర్, ఫరియా అబ్దుల్లా

'భగవంతుడు' చాలా గొప్ప సినిమా అవుతుందన్నారు హీరో తిరువీర్. ఈ చిత్రంలో అందరం పోటాపోటీగా నటించామని చెప్పారు. ఆయన.. ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన ఈ సినిమాని జి.జి. విహారి తెరకెక్కించారు. నారాయణదాస్ నారంగ్, పనస శంకరయ్య గౌడ్ సమర్పణలో రవి పనస నిర్మించారు. రిషి కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈ వేసవిలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే హీరోలు విష్వక్ సేన్, సందీప్ కిషన్ ఈ చిత్ర టీజర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో విష్వక్ మాట్లాడుతూ.. "టీజర్ బాగుంది. ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలని కోరుకుంటున్నా" అన్నారు. "దీన్ని మేము ఏప్రిల్‌లో విడుదల చేయాలని చూస్తున్నాం" అన్నారు నిర్మాత రవి పనస. దర్శకుడు విహారి మాట్లాడుతూ.. "తెలుగు వాళ్లు మర్చిపోయిన వైరుధ్యాలన్నీ పల్నాడులోనే పుట్టాయి. అందుకే ఆ యుద్ధాన్ని తెలుగు మహాభారతం అంటారు. మన సమాజంలోని అంతరాలకు సమాధానాన్ని వెయ్యేళ్ల క్రితమే దాంట్లో చెప్పారు. అందుకే దీన్ని పల్నాడు నేపథ్యంగా సాగే పొలిటికల్ యాక్షన్ డ్రామాగా రూపొందించా" అన్నారు. ఈ కార్యక్రమంలో వేణు ఊడుగుల, మధుర శ్రీధర్ రెడ్డి, కేపీ, రవీందర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు బిజినెస్

అమెరికా ఫెడ్ రిజర్వ్ కొత్త గవర్నర్ వార్ష్!

● నామినేట్ చేయనున్నట్లు ట్రంప్ ప్రకటన

● కేంద్ర బ్యాంకు వైట్ హౌస్ అధీనంలోకి వెళ్తుందా ?

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్ష పదవిని చేపట్టినప్పటి నుంచీ, కీలక రేట్లు తగ్గించమని, తమ కేంద్రబ్యాంక్ అయిన ఫెడరల్ రిజర్వ్‌కు చెబుతూనే వస్తున్నారు. ఫెడ్ ప్రస్తుత ఛైర్మన్ జెరోమ్ పావెల్ అంతగా పట్టించుకోలేదు. ఈ ఏడాది మేలో ఈయన పదవీ కాలం ముగియనుండగా, కొత్త గవర్నర్‌గా కెవిన్ వార్ష్‌ను నామినేట్ చేయనున్నట్లు ట్రంప్ శుక్రవారం ప్రకటించారు. 2017లో పావెల్‌ను ఎంచుకుందీ ట్రంపే.

ఎవరీ వార్ష్: ఫెడ్ బోర్డు సభ్యుడిగా 2006-11 మధ్య పనిచేసిన వార్ష్, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి అధిక వడ్డీ రేట్లకే మద్దతు ఇచ్చేవారు. తక్కువ వడ్డీ రేట్ల విధానాన్ని వ్యతిరేకించారు. 2008-09 మహా మాంద్యం సమయంలో ఫెడ్ విధానాలను ఆయన ఒప్పుకోలేదు. అప్పట్లో ఫెడ్ గవర్నర్‌గా ఎంపికైన అతి తక్కువ వయసున్న(35) వ్యక్తిగా వార్ష్ నిలిచారు. ఇటీవలి కాలంలో తక్కువ వడ్డీ రేట్లకు మద్దతు పలకడం, ట్రంప్ రెండో సారి అధ్యక్ష పదవిని చేపట్టాక, ఆయన విధానాలకు వార్ష్ మద్దతివ్వడమే తాజా ఎంపికకు కారణాలుగా చెబుతున్నారు. సెనేట్ కూడా సమర్థిస్తేనే ఫెడ్ ఛైర్‌గా వార్ష్ బాధ్యతలు స్వీకరిస్తారు.

గుప్పిట పెట్టుకోవడానికేనా: ట్రంప్ ప్రకారం.. అమెరికాలో కీలక రేట్లు 1% వద్ద ఉండాలి. ప్రస్తుత 3.5% ఆయన అంచనాకు చాలా దూరంగా ఉంది. అందుకే స్వతంత్ర సంస్థ అయిన ఫెడ్‌పై నియంత్రణ కోసమే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని అంచనా. అమెరికా ద్రవ్యోల్బణాన్ని తక్కువ స్థాయుల్లో ఉంచేందుకు, ఉద్యోగ నియామకాలకు మద్దతు పలకడంతో పాటు, బ్యాంకింగ్ నియంత్రణాధికార సంస్థగానూ ఫెడ్ వ్యవహరిస్తుంది. ఫెడ్ నిర్ణయాల వల్ల తనఖా, వాహన, క్రెడిట్ కార్డు వంటి అన్ని రుణాలపై ప్రభావం పడుతుంది. అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఇంత ప్రభావాన్ని చూపే ఫెడ్, ట్రంప్ చెప్పినట్లు వింటే, తలెత్తే పరిణామాలు ఎలా ఉంటాయో చూడాల్సి ఉంది.



'యాక్టివ్' టెక్నాలజీ పెట్రోలు ఆవిష్కరించిన జియో-బీపీ

ఏటా 100 కి.మీ. అదనపు ప్రయాణం

గోవా: ఇంధన రిటెయిలింగ్ సంస్థ, రిలయన్స్, బీపీల సంయుక్త సంస్థ అయిన జియో-బీపీ భారత్‌లో తన విప్లవాత్మక 'యాక్టివ్ టెక్నాలజీ పెట్రోల్‌'ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. 'ఇండియా ఎనర్జీ వీక్ - 2026' ఇందుకు వేదికైంది. ఈ పెట్రోలు వల్ల కీలక ఇంజిన్ విడిభాగాలు శుభ్రంగా మారి, పనితీరు మెరుగవుతుందని, ఎటువంటి అదనపు వ్యయాలు లేకుండానే వాహనాలు ఏటా 100 కి.మీ. వరకు అధికంగా ప్రయాణించగలవని తెలిపింది. కీలక ఇంజిన్ విడిభాగాల్లో ఉన్న అనవసర పదార్థాలను తొలగించడానికి ఈ ఇంధనాన్ని రూపొందించినట్లు తెలిపింది. ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల ఇంధన సామర్థ్యాన్ని పెంచడంతో పాటు నిర్వహణ ఖర్చులనూ ఇది తగ్గిస్తుందని కంపెనీ పేర్కొంది. కోయంబత్తూరులో ఒక మోటార్‌సైకిల్‌లో ఈ పెట్రోల్ నింపి, 4,000 కి.మీ. పైగా నడిపి పరీక్షించగా, ఏటా 100 కి.మీ. వరకు అదనపు ప్రయాణాన్ని ఇది అందించగలదని నిరూపితమైందని జియో-బీపీ సీఈఓ అక్షయ్ వాధ్వా పేర్కొన్నారు.

709 బి.డా. పైకి విదేశీ మారకపు నిల్వలు

మన విదేశీ మారకపు నిల్వలు జనవరి 23తో ముగిసిన వారంలో 8.053 బిలియన్ డాలర్లు పెరిగి 709.413 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది తాజా జీవన కాల గరిష్ఠ స్థాయి. ఇప్పటివరకు 2024 సెప్టెంబరులో నమోదైన 704.89 బిలియన్ డాలర్లే గరిష్ఠస్థాయి కాగా, ఇప్పుడు అధిగమించడం విశేషం. ఆర్‌బీఐ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. జనవరి 23తో ముగిసిన వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 2.367 బిలియన్ డాలర్లు పెరిగి 562.885 బిలియన్ డాలర్లకు చేరాయి. పసిడి నిల్వల విలువ 5.635 బిలియన్ డాలర్లు అధికమై 123.088 బిలియన్ డాలర్లుగా నమోదైంది. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 33 మిలియన్ డాలర్లు పెరిగి 18.737 బిలియన్ డాలర్లకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత నిల్వల స్థితి 18 మిలియన్ డాలర్లు పెరిగి 4.703 బిలియన్ డాలర్లకు చేరాయి.

10% పెరిగిన బజాజ్ ఆటో లాభం

దిల్లీ: వాహన సంస్థ బజాజ్ ఆటో, డిసెంబరు త్రైమాసికంలో రూ.2,750 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.2,196 కోట్లతో పోలిస్తే ఇది 10% ఎక్కువ. అన్ని మార్కెట్లలో విక్రయాలు వృద్ధి చెందడం ఇందుకు కలిసొచ్చింది. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.13,169 కోట్ల నుంచి రూ.16,204 కోట్లకు పెరిగింది. మొత్తం వాహన విక్రయాలు 12,24,472 నుంచి 10% అధికమై 13,41,252కు చేరాయి. దేశీయ వాహన విక్రయాలు 7,07,105 నుంచి 3% వృద్ధితో 7,31,037కు చేరాయి. ఎగుమతులు 5,17,367 నుంచి 18% పెరిగి 6,10,215గా ఉన్నాయి.

కోడి గుడ్డు

31న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100 గుడ్లు రూపాయల్లో)

హైదరాబాద్	515
వరంగల్	517
విజయవాడ	550
తూ/ప గోదావరి	515
విశాఖపట్నం	515
చిత్తూరు	573

ఎన్‌టీపీసీ లాభం రూ.5,597 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ రంగ సంస్థ ఎన్‌టీపీసీ, డిసెంబరు త్రైమాసికంలో రూ.46,304.77 కోట్ల ఆదాయంపై రూ.5,597.05 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.45,697 కోట్లు, నికర లాభం రూ.5,169.69 కోట్లుగా ఉన్నాయి. రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.2.75 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను సంస్థ ప్రకటించింది.

20% తగ్గిన వెండి ఈటీఎఫ్‌లు

లాభాల స్వీకరణతో భారీగా దిద్దుబాటు

ఈనాడు – హైదరాబాద్

అంతర్జాతీయ మార్కెట్లో రికార్డు స్థాయిల వద్ద ట్రేడవుతున్న బంగారం, వెండి ధరలు శుక్రవారం ఒక్కసారిగా కుప్పకూలాయి. ఈ పరిణామంతో వెండి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు కూడా 20 శాతానికి మించి పతనం అయ్యాయి.

✦ దేశీయ మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో పసిడి ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.33,113 (18%) తగ్గి 10 గ్రాములకు రూ.1,50,849కు పడిపోయింది. గురువారం ఈ కాంట్రాక్టు రూ.1,93,096 వద్ద జీవితకాల గరిష్ఠాన్ని తాకింది.

✦ వెండి మార్చి కాంట్రాక్టు రూ.1,07,971 (27%) తగ్గి కిలోకు రూ.2,91,922కి పడిపోయింది. గురువారం ఇది రూ.4,20,048 వద్ద జీవన కాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. వెండి మే, జులై కాంట్రాక్టులు కూడా వరుసగా 27%, 24% క్షీణించాయి. ఈ ప్రభావం గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌లపై పడింది. దీంతో మదుపరులు భారీగా నష్టపోయారు.

✦ ఎస్‌బీఐ సిల్వర్ ఈటీఎఫ్ 20.50%, యాక్సిస్ సిల్వర్ ఈటీఎఫ్ 20.16%, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ సిల్వర్ ఈటీఎఫ్ 20.14% క్షీణతను నమోదు చేశాయి. కోటక్, డీఎస్‌పీ, ఎడిల్‌వీజ్, యూటీఐ, మోతీలాల్ సిల్వర్ ఈటీఎఫ్‌లూ 19% వరకు పతనం అయ్యాయి.

✦ బంగారం విషయంలోనూ గత ఏడాది కాలంగా 104% భారీ రాబడిని అందించిన నిప్పాన్ ఇండియా ఈటీఎఫ్ గోల్డ్ బీఈఎస్ శుక్రవారం 10.52% పతనం అయ్యింది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, యాక్సిస్, కోటక్, మిరే అసెట్‌ల గోల్డ్ ఈటీఎఫ్‌లూ 9-12% పతనం అయ్యాయి.

ఎందుకీ పతనం..

అమెరికా ఫెడరల్ రిజర్వ్ కొత్త ఛైర్మన్‌గా కఠిన నిర్ణయాలు తీసుకునే కెవిన్ వార్ష్‌ను నియమితులు కానుండటం మార్కెట్‌ను కలవరపెడుతున్నాయి. మే నెలలో జెరోమ్ పావెల్ పదవీకాలం ముగియనుండటంతో, ఆ స్థానంలో కెవిన్ వస్తారు. ఈ పరిణామంతో డాలర్ పుంజుకుని, బంగారం ధరలపై ఒత్తిడి పెరగడానికి కారణం అయ్యింది.



మదుపరులు ఏం చేయాలి?

ఈ భారీ పతనాన్ని కొనుగోలు అవకాశంగా భావించాలా? లేక మార్కెట్ స్థిరపడే వరకూ వేచి చూడాలా అనే విషయంలో 'జాగ్రత్తగా ఉండాలని' నిపుణులు సూచిస్తున్నారు.

సోలార్ ప్యానెల్స్, విద్యుత్ వాహనాలు (ఈవీ), కృత్రిమ మేధ మౌలిక వసతుల రంగాల నుంచి వెండికి గిరాకీ బలంగా ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో మార్కెట్ తీవ్ర హెచ్చుతగ్గులకు లోనయ్యే అవకాశం కనిపిస్తోందని పేర్కొంటున్నారు. 2025లో భారీ లాభాల తర్వాత, ఇప్పుడు ఒకేసారి మొత్తం పెట్టుబడిని వెండికే కేటాయించడం ప్రమాదకరమని అంటున్నారు.

✦ ఈ లోహాల ధరలు బాగా తగ్గినా కూడా, జాగ్రత్తగా గమనించాలని.. వారాలు/నెలల్లో విడతలవారీగా కొనుగోలు చేయడం ఉత్తమమని చెబుతున్నారు. సురక్షిత పెట్టుబడి కోసం పోర్ట్‌ఫోలియోలో 10-15% వరకు ఈ లోహాలకు కేటాయించొచ్చని మార్కెట్ నిపుణులు అంటున్నారు. ఆకాశాన్నంటిన ధరల కారణంగా భారత్‌లో పసిడికి గిరాకీ గణనీయంగా తగ్గింది.

ఎన్‌ఎస్‌ఈ పబ్లిక్ ఇష్యూకు సెబీ పచ్చజెండా




దశాబ్దకాల నిరీక్షణకు తెరపడబోతోంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) మరికొన్ని నెలల్లోనే పబ్లిక్ ఇష్యూకు వచ్చే అవకాశం ఉంది. తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) నిమిత్తం ఎన్ఎస్ఈకి నిరభ్యంతర ధ్రువీకరణపత్రాన్ని (ఎన్ఓసీ) మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ జారీ చేసిందని ఎన్ఎస్ఈ ఛైర్‌పర్సన్ శ్రీనివాస్ ఇంజెటి శుక్రవారం తెలిపారు. నియంత్రణపరమైన ఆందోళన, కో-లొకేషన్ కేసు వ్యవహారం కారణంగా 2016 నుంచి ఎన్ఎస్ఈ ఐపీఓకు అనుమతులను సెబీ ఆపుతూ వస్తున్న సంగతి తెలిసిందే. ప్రతిపాదిత ఎన్ఎస్ఈ ఐపీఓ.. దేశంలోని అతిపెద్ద ఐపీఓల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది. 2016లో సెబీకి ముసాయిదా పత్రాలను సమర్పించినప్పుడే.. రూ.10,000 కోట్లు సమీకరించేందుకు ఎన్ఎస్ఈ ప్రతిపాదించింది. ఇప్పుడు 1.77 లక్షల మంది వాటాదార్లున్న ఎన్ఎస్ఈ మార్కెట్ విలువ రూ.5 లక్షల కోట్లుగా గ్రేమార్కెట్ భావిస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు.

✦ సెబీ అనుమతులపై ఎన్ఎస్ఈ మేనేజింగ్ డైరెక్టరు, సీఈఓ ఆశిశ్ కుమార్ చౌహాన్ స్పందిస్తూ.. ఎన్ఎస్ఈ ఐపీఓకి సూత్రప్రాయ అనుమతులు లభించడం సానుకూల పరిణామం అన్నారు. 'సెబీ ఎన్ఓసీ లభించాక, ఐపీఓ కోసం ముసాయిదా పత్రాల సమర్పణకు 4 నెలల సమయం పడుతుంది. ఆ తర్వాత నియంత్రణపరమైన అనుమతులు లభిస్తాయి. ఇవన్నీ పూర్తయి.. ఐపీఓ ప్రారంభమయ్యేందుకు సుమారు 7-8 నెలల సమయం పడుతుందని' చౌహాన్ తెలిపారు.

శామ్‌సంగ్ నుంచి ఏఐ ఏసీలు

30% వరకు విద్యుత్ ఆదా



దిల్లీ: ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల దిగ్గజం శామ్‌సంగ్ ఇండియా, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత విండ్‌ఫ్రీ ఎయిర్ కండీషనర్లను (ఏసీలు) అందుబాటులోకి తేనుంది. వీటి ద్వారా వినియోగదార్లకు 30% వరకు విద్యుత్ ఆదా అవుతుందని కంపెనీ తెలిపింది. భారత్‌లో రూమ్ ఏసీల విభాగం మొత్తానికి ఏఐ సాంకేతికతను అనుసంధానం చేసిన తొలి కంపెనీగా శామ్‌సంగ్ నిలవనుంది. 2026లో 23 కొత్త విండ్‌ఫ్రీ ఏసీల మోడళ్లను కంపెనీ తీసుకొని రానుంది. బీస్పోక్ ఏఐ సాంకేతికతను వీటికి అమర్చింది. ఇప్పటికే ఇలాంటి సాంకేతికతను రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, డ్రైయర్లు లాంటి గృహోపకరణాలకు శామ్‌సంగ్ ఉపయోగించింది. ఏఐ ఎనర్జీ మోడ్, స్మార్ట్ థింగ్స్ హోమ్‌కేర్ ద్వారా వినియోగదార్లు విద్యుత్తును 30% వరకు ఆదా చేసుకోవచ్చని శామ్‌సంగ్ తెలిపింది.

సికింద్రాబాద్‌లో 2.25 ఎకరాలు కొనుగోలు: బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్

ఈనాడు, హైదరాబాద్: ప్రముఖ స్థిరాస్తి సంస్థ బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్, సికింద్రాబాద్‌లో భారీ గృహ నిర్మాణ ప్రాజెక్టు ప్రారంభించేందుకు సిద్ధమయ్యింది. ఇందుకోసం కీలక ప్రాంతంలో 2.25 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసినట్లు శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. ఈ భూమిని ఎంత ధరకు కొనుగోలు చేశారన్న విషయాన్ని వెల్లడించలేదు. ఈ స్థలంలో చేపట్టబోయే గృహ నిర్మాణ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.650 కోట్ల ఆదాయం (జీడీవీ) లభించే అవకాశం ఉందని కంపెనీ అంచనా వేస్తోంది.

గూగుల్ ఇండియా లాభం రూ.1437 కోట్లు

దిల్లీ: గూగుల్ ఇండియా 2024-25 ఆర్థిక సంవత్సరంలో స్టాండలోన్ ఖాతాల ప్రకారం రూ.1436.9 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2023-24లోని రూ.1,425 కోట్ల లాభంతో పోలిస్తే స్వల్పంగానే పెరిగింది. ఆదాయం తగ్గడం, ఉద్యోగుల వ్యయాలు, పన్ను మొత్తం పెరగడం ఇందుకు కారణం. ఇదే సమయంలో కార్యకలాపాల ఆదాయం రూ.5,518 కోట్ల నుంచి 3.2% తగ్గి రూ.5,340 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం రూ.5,921 కోట్ల నుంచి 3.2% పెరిగి రూ.6,116 కోట్లకు చేరింది. ఇతరాదాయం రూ.776 కోట్లుగా ఉంది. నికర మార్జిన్ 24.06% నుంచి 23.49 శాతానికి పరిమితమైంది. మొత్తం వ్యయాలు రూ.4,136 కోట్లకు చేరాయి.

ఫేస్‌బుక్ ఇండియా లాభంలో 28% వృద్ధి

దిల్లీ: 2025 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఫేస్‌బుక్ ఇండియా స్టాండలోన్ నికర లాభం రూ.647.45 కోట్లుగా నమోదైంది. 2023-24 లాభం రూ.504.93 కోట్లతో పోలిస్తే ఇది 28% అధికం. కార్యకలాపాల ఆదాయం 25% పెరిగి రూ.3,792.91 కోట్లకు చేరుకుంది. కంపెనీ మొత్తం వ్యయాలు రూ.2,881 కోట్లకు చేరుకున్నాయి. ఇందులో ఉద్యోగుల వ్యయాలు 36% అధికంగా రూ.648.57 కోట్లకు; పన్ను వ్యయాలు 46% పెరిగి రూ.305.18 కోట్లకు చేరాయి. నికర మార్జిన్ 16.9 శాతానికి చేరింది.

ఇ-కామర్స్‌లో ఐటీసీ ప్యాకేజ్డ్ ఫుడ్!

కుకీల నుంచి కేకులు, చట్నీలు, నమ్కీన్లు, సాంబార్ వరకు తన ప్యాకేజ్డ్ ఆహారాన్ని ఇ-కామర్స్ ద్వారా అందించడానికి ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం ప్రయత్నాలు మొదలుపెట్టింది. తన ఫుడ్-టెక్ క్లౌడ్ కిచెన్ల ద్వారా తక్కువ కాలం నిల్వ ఉండే పలు ఆహార పదార్థాలను తయారు చేసి, ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా వినియోగదార్లకు విక్రయించేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా బెంగళూరులో అమ్మకాలు నిర్వహిస్తోంది. క్రమంగా ఇతర ప్రాంతాలకూ విస్తరించనున్నట్లు కంపెనీ ఈడీ హేమంత్ మాలిక్ తెలిపారు. ఐటీసీ తీసుకొస్తున్న తాజా ఆహార శ్రేణిని బ్లింకిట్, స్విగ్గీ వంటి ఇ-కామర్స్ ప్లాట్‌ఫారాల ద్వారా విక్రయిస్తున్నట్లు మాలిక్ అన్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పుణె, ముంబయిలలో 68కి పైగా క్లౌడ్ కిచెన్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ద్రవ్యలోటు రూ.8.55 లక్షల కోట్లు

బడ్జెట్ అంచనాతో పోలిస్తే 54.5%

దిల్లీ: దేశ ద్రవ్యలోటు 2025 డిసెంబరు చివరకు రూ.8.55 లక్షల కోట్లుగా నమోదైంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు, జీడీపీలో 4.4% లేదా రూ.15.69 లక్షల కోట్లుగా ఉండొచ్చని కేంద్రం అంచనా వేసింది. ఈ అంచనాల్లో తాజా గణాంకాలు 54.5 శాతానికి సమానం. 2024-25 ఇదే సమయంలో ద్రవ్యలోటు బడ్జెట్ లక్ష్యంలో 56.7 శాతంగా ఉంది. ప్రభుత్వ ఆదాయ, వ్యయాల వ్యత్యాసాన్ని ద్రవ్యలోటుగా పరిగణిస్తారు. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) గణాంకాల ప్రకారం..

✦ డిసెంబరు చివరకు ప్రభుత్వానికి రూ.25.25 లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. బడ్జెట్ అంచనాల్లో ఈ మొత్తం 72.2 శాతానికి సమానం. ఇందులో రూ.19.39 లక్షల కోట్లు పన్నుల రూపేణ, రూ.5.39 లక్షల కోట్లు పన్నేతర ఆదాయంగా లభించింది. రుణ రహిత పెట్టుబడి సాధనాల్లో రూ.46,047 కోట్లు సమకూరాయి.



✦ ఏప్రిల్- డిసెంబరు నెలల్లో పన్ను ఆదాయంలో వాటా రూపేణ రాష్ట్రాలకు రూ.10.38 లక్షల కోట్లు బదిలీ చేశారు. 2024-25 ఇదే కాలంలో బదిలీ చేసిన మొత్తం కంటే ఇది రూ.1.37 లక్షల కోట్లు అధికం.

✦ ఏప్రిల్-డిసెంబరులో మొత్తం ప్రభుత్వ వ్యయాలు రూ.33.8 లక్షల కోట్లకు చేరాయి. బడ్జెట్ అంచనాల్లో ఇవి 66.7 శాతానికి సమానం. ఇందులో రూ.25.93 లక్షల కోట్లు రెవెన్యూ వ్యయాలు కాగా.. రూ.7.87 లక్షల కోట్లు పెట్టుబడి వ్యయాలు. రెవెన్యూ వ్యయాల్లో రూ.9.11 లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకు, రూ.3.17 లక్షల కోట్లు ప్రధాన రాయితీలకు వెచ్చించారు.

భారత్‌కు ఏటా 8–10 బి. డాలర్ల ప్రపంచ బ్యాంకు రుణాలు



దిల్లీ: వచ్చే అయిదేళ్ల పాటు ఏటా 8-10 బి. డాలర్ల (దాదాపు రూ.72,800-91,000 కోట్ల) మేర రుణాలు ఇవ్వడానికి ప్రపంచబ్యాంకు అంగీకరించింది. ఆ మేరకు కొత్త కంట్రీ పార్ట్‌నర్‌షిప్ ఫ్రేమ్‌వర్క్ (సీపీఎఫ్)ను ప్రపంచ బ్యాంక్ గ్రూప్, భారత్ ప్రకటించాయి. ఒక అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారాలన్న మనదేశ లక్ష్యానికి అనుగుణంగా, తదుపరి వృద్ధి దశను వేగవంతం చేసేందుకు ఈ రుణాలు సహాయపడతాయి. 'వికసిత్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా సీపీఎఫ్ ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. ప్రైవేటు పెట్టుబడులకు ప్రభుత్వ నిధులను జత చేసి గ్రామీణ, పట్టణ భారత్‌లో మరిన్ని ఉద్యోగాలను సృష్టించడంపై సీపీఎఫ్ దృష్టి సారిస్తుందని ఆమె అన్నారు. ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ అజయ్ బంగా నేతృత్వంలోని బృందంతో చర్చలు జరిపిన అనంతరం, ఆర్థిక మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.

నెస్లే లాభం రూ.998 కోట్లు

దిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజ సంస్థ నెస్లే ఇండియా, డిసెంబరు త్రైమాసికంలో రూ.998.42 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.688.01 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 45.12% ఎక్కువ. మొత్తం విక్రయాలు 18.5% పెరిగి రూ.5,643.5 కోట్లుగా నమోదయ్యాయి. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.4,779.73 కోట్ల నుంచి 8.56% పెరిగి రూ.5,667.04 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 20.86% అధికమై రూ.4,667.63 కోట్లుగా ఉన్నాయి. రూ.1 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.7 మధ్యంతర డివిడెండ్ ఇచ్చేందుకు నెస్లే బోర్డు ఆమోదం తెలిపింది.

బీఓబీ లాభంలో 4% వృద్ధి

ముంబయి: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), డిసెంబరు త్రైమాసికంలో రూ.5,443 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.5213 కోట్లతో పోలిస్తే ఇది 4.39% అధికం. తక్కువ కేటాయింపులు ఇందుకు కలిసొచ్చాయి. స్టాండలోన్ ప్రాతిపదికన.. బ్యాంక్ నికర లాభం రూ.4,837 కోట్ల నుంచి రూ.5,055 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం 0.1% పెరిగి రూ.11,800 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్ మాత్రం 0.25% తగ్గి 2.79 శాతానికి పరిమితమైంది. వడ్డీయేతర ఆదాయం 6% పెరిగి రూ.3,600 కోట్లకు చేరింది.

ఎయిర్‌బస్ హెచ్130 హెలికాప్టర్ కొనుగోలు చేయనున్న హెరిటేజ్ ఏవియేషన్



ఈనాడు, హైదరాబాద్: ప్రాంతీయ విమానయాన సంస్థ హెరిటేజ్ ఏవియేషన్, సేవల విస్తరణ కోసం కొత్తగా ఒక ఎయిర్‌బస్ హెచ్130 హెలికాప్టర్ కొనుగోలు చేయనుంది. హైదరాబాద్‌లో జరుగుతున్న వింగ్స్ ఇండియా 2026 వేదికగా ఈ ఒప్పందం కుదిరింది. ఈ ఏడాది సెప్టెంబరుకు ఈ హెలికాప్టర్ అందుబాటులోకి రానుంది. కేంద్ర ప్రభుత్వ ఉడాన్ పథకం కింద ఆధ్యాత్మిక పర్యాటకం.. ఈశాన్య భారతంలో రవాణా సేవలు విస్తరించేందుకు దీన్ని వినియోగించనున్నారు. ఈ అత్యాధునిక హెలికాప్టర్‌లో పైలట్‌తో పాటు ఏడుగురు ప్రయాణించేందుకు వీలుంటుంది. పర్వత ప్రాంతాలకు ఇది అత్యంత అనుకూలమని హెరిటేజ్ ఏవియేషన్ వ్యవస్థాపకుడు, సీఈఓ రోహిత్ మాథుర్ తెలిపారు.

హైదరాబాద్‌లో యాపిల్ విస్తరణ

యాపిల్ ఇండియా, హైదరాబాద్‌లోని వేవ్‌రాక్ ఐటీ పార్క్‌లో 57,343 చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని కొత్తగా లీజుకు తీసుకుంది. తద్వారా సంస్థ ఆధీనంలోని మొత్తం కార్యాలయ స్థల పరిమాణం 6.34 లక్షల చ.అ.కు చేరిందని స్థిరాస్తి విశ్లేషణా సంస్థ ప్రాప్‌స్టాక్ తెలిపింది. అయిదేళ్ల కాలానికి లీజుకు తీసుకున్న ఈ స్థలానికి, చ.అ.కు నెలకు రూ.125 చొప్పున అద్దెను యాపిల్ చెల్లించనుందని సమాచారం.

బడ్జెట్‌కు ముందు అప్రమత్తత

సెన్సెక్స్ ▼297 82270 | నిఫ్టీ ▼98 25321

సూచీలు మళ్లీ నష్టాల బాట

ఎఫ్ఐఐ కొనుగోళ్లు.. రూ.2251.37 కోట్లు

డీఐఐ అమ్మకాలు.. రూ.601.03 కోట్లు

సమీక్ష

కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న (ఆదివారం) వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండటంతో... ముందుజాగ్రత్తగా మదుపర్లు శుక్రవారం లాభాలు స్వీకరించారు. దీంతో వరుసగా మూడు రోజుల పాటు లాభాల్లో కొనసాగిన సూచీలు.. శుక్రవారం నష్టాలతో ముగిశాయి. లోహ, ఐటీ, కమొడిటీ షేర్లలో అమ్మకాలు, రూపాయి బలహీనతలు కూడా ఇందుకు కారణమయ్యాయి. అయితే కొన్ని బ్లూచిప్ షేర్ల రాణింపుతో సూచీల నష్టాలు పరిమితమయ్యాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 6 పైసలు పెరిగి 91.93 వద్ద ముగిసింది. ఒక దశలో డాలర్ విలువ రూ.92.02 వద్ద తాజా రికార్డు గరిష్ఠాన్ని తాకింది కూడా. బ్రెంట్ ముడి చమురు 0.16% నష్టంతో 70.57 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా మినహా మిగతా దేశాల సూచీలన్నీ నష్టాల్లో ముగిశాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.6000 కోట్లు పెరిగి, రూ.460.02 లక్షల కోట్ల (5.01 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

ఆద్యంతం నష్టాల్లోనే

ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 81,947.31 పాయింట్ల వద్ద నష్టాల్లో (క్రితం ముగింపు 82,566.37) ప్రారంభమైంది. ఆ తర్వాత స్వల్ప శ్రేణికి పరిమితమై కదలాడుతూ, చివరకు 296.59 పాయింట్ల నష్టంతో 82,269.78 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 98.25 పాయింట్లు కోల్పోయి 25,320.65 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,213.65 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని; 25,370.70 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని ఈ సూచీ నమోదు చేసింది.



సగం అటు.. సగం ఇటు..

సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో సగం కంపెనీలు లాభాల్లో.. మిగతావి నష్టాల్లో ముగిశాయి. టాటా స్టీల్ 4.57%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.10%, పవర్‌గ్రిడ్ 1.61%, హెచ్‌సీఎల్ టెక్ 1.55%, టెక్ మహీంద్రా 1.39%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.05% తగ్గాయి. మహీంద్రా అండ్ మహీంద్రా 1.38%, ఎస్‌బీఐ 1.23%, ఐటీసీ 1.11%, భెల్ 1.01%, టైటన్ 0.99%, హిందుస్థాన్ యునిలీవర్ 0.94% పెరిగాయి.

లోహ షేర్లకు నష్టాలు

ఇటీవలి ర్యాలీ అనంతరం లాభాల స్వీకరణ కారణంగా, లోహ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. హిందుస్థాన్ జింక్ 12.12%, వేదాంతా 10.89%, నేషనల్ అల్యూమినియం కంపెనీ 10.32%, హిందాల్కో ఇండస్ట్రీస్ 6.12%, టాటా స్టీల్ 4.57%, ఎన్ఎండీసీ 4.19%, సెయిల్ 3.94%, జిందాల్ స్టీల్ 2.12%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 1.97% చొప్పున నష్టపోయాయి.

వివర్క్ ఇండియా రూ.100 కోట్ల పెట్టుబడి


హైదరాబాద్‌లో మరో 3,300 డెస్కులు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా అదనపు సామర్థ్యాన్ని సమకూర్చుకుంటున్నట్లు వివర్క్ ఇండియా మేనేజ్‌మెంట్ ప్రకటించింది. ఇందుకోసం రూ.100 కోట్ల పెట్టుబడి పెడతామంది. ఈ ఏడాది జూన్‌కు ఈ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపింది. ఈ సంస్థకు ప్రస్తుతం 1,21,638 డెస్కుల సామర్థ్యం ఉంది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్	281	239	944	798
బీఎండబ్ల్యూ ఇండస్ట్రీస్	17.61	17.23	163.78	148.80
క్యాప్రి గ్లోబల్ క్యాపిటల్	255	128	1,225	822
కేఈసీ ఇంటర్నేషనల్	127.46	129.56	6,011.58	5,350.29
అంబుజా సిమెంట్స్	366.97	2,662.97	10,180.52	8,498.10
గాడ్‌ఫ్రే ఫిలిప్స్	343.29	315.84	2,189.93	1,893.08
ఎక్సైడ్ ఇండస్ట్రీస్	194.97	158.44	4,200.59	4,016.72
వెల్‌స్పన్ కార్ప్	456.36	672.19	4,562.04	3,656.57
నాల్కో[1]	1,595.15	1,566.32	4,730.95	4,662.22
ఇన్‌సెక్టిసైడ్స్	10.48	17.36	385.67	357.85
అరవింద్	100.97	106.24	2,372.64	2,089.21
ఎన్ఐఐటీ	3.9	13.3	101.36	98.11
స్ట్రైడ్స్ ఫార్మా సైన్స్	208.12	90.04	1,194.65	1,153.67
బ్రూక్‌ఫీల్డ్ ఇండియా	201.22	23.42	727.86	635.38
కోల్గేట్ పామోలివ్	323.86	322.78	1,472.92	---
యాక్మే సోలార్[2]	114	112	617	401
సెయిల్	374.03	141.89	27,545.93	24,723.43
బ్లూడార్ట్	70	79	1,616	1,512
ఆర్‌పవర్	25.11	41.95	1,949.78	2,159.44

1) మధ్యంతర డివిడెండ్ రూ.4.50 2) డివిడెండ్ రూ.0.20

భారతదేశంలో ఆంగ్లేయుల ఆర్థిక విధానాలు కాలానుగుణంగా మారుతూ వచ్చాయి. 1600లో స్థాపించిన ఈస్ట్ ఇండియా కంపెనీ 1750 వరకు ఉభయ లాభదాయక వ్యాపారం కొనసాగించింది. భారతదేశంలోని సుగంధ ద్రవ్యాలు, చేనేత వస్త్రాలను కొని, వాటిని ఐరోపా మార్కెట్లలో అమ్మి లాభాలు గడించింది. ఇందుకోసం భారత్‌లోని వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను ఆంగ్లేయులు పరోక్షంగా అభివృద్ధి చేశారు. అయితే 1750 తర్వాత కంపెనీ ఆర్థిక విధానాల్లో సమూల మార్పులు చోటుచేసుకున్నాయి.



ద్వంద్వ పన్నుల విధానంతో
దేశీ పరిశ్రమలకు శరాఘాతం

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

బ్రిటిష్ ఆర్థిక విధానాలు

ఇంగ్లండ్‌లో ప్రారంభమైన పారిశ్రామిక విప్లవంతో అక్కడ అనేక పరిశ్రమలు పుట్టుకొచ్చాయి. ఈ పరిశ్రమలకు కావాల్సిన ముడిసరుకులు, మార్కెట్లు ఇంగ్లండ్‌లో అందుబాటులో లేవు. దీంతో ఆంగ్లేయులు భారతదేశంపై ఆధారపడాల్సి వచ్చింది. భారత హస్తకళా పరిశ్రమలను నిర్వీర్యం చేసి, భారతదేశాన్ని ముడిసరుకులు ఎగుమతి చేసేదిగా మార్చారు. ఆంగ్లేయుల పాలన, వారి ఆర్థిక విధానాలు భారతదేశానికి నష్టం చేకూర్చగా, మరోవైపు కొంత మేలు చేశాయని కార్ల్ మార్క్స్ అభిప్రాయపడ్డారు. ఆంగ్లేయులు భారతదేశంలో సాగించిన వలసవాద దోపిడీని ఈయన మూడు దశలుగా వివరించారు. అవి:

మొదటి దశ: వర్తక పెట్టుబడి దశ (1757-1813)
రెండో దశ: పారిశ్రామిక పెట్టుబడి దశ (1813-1858)
మూడో దశ: ద్రవ్య పెట్టుబడి దశ (1858-1947)

✦ ఒక్కో దశలో ఒక్కో విధమైన దోపిడీ కొనసాగి, భారతదేశం ఆర్థికంగా కుదేలైందని కార్ల్ మార్క్స్ పేర్కొన్నారు.

ఆర్థిక విధానాల ప్రభావం

హస్తకళా పరిశ్రమల అంతం

1750 తర్వాత ఇంగ్లండ్‌లో పారిశ్రామిక విప్లవం మొదలై, వేల సంఖ్యలో ఆధునిక పరిశ్రమలు స్థాపించడంతో ఉత్పత్తి అనేక రెట్లు పెరిగింది. దీంతో ఆంగ్లేయులకు భారత వస్తువుల అవసరం లేకుండా పోయింది. భారతదేశాన్ని ముడిసరుకులు ఎగుమతి చేసే దేశంగా, ఇంగ్లండ్‌లో తయారైన వస్తువులను దిగుమతి చేసుకునే దేశంగా మార్చేశారు. భారీ యంత్రాలతో తక్కువ ధరకు ఉత్పత్తి అయ్యే వస్తువులను భారతదేశంలోకి ప్రవేశపెట్టడంతో సంప్రదాయ హస్తకళా పరిశ్రమలు అంతమయ్యాయి.

- ఆంగ్లేయులు అవలంబించిన ద్వంద్వ పన్నుల విధానం భారత పరిశ్రమలకు శరాఘాతమైంది. భారతదేశం నుంచి ఎగుమతి అయ్యే వస్తువులపై అధిక పన్ను విధించి, ఇంగ్లండ్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అత్యల్ప పన్నులు విధించేవారు.
- 1813 చట్టం ప్రకారం భారత వ్యాపారంపై ఇంగ్లిష్ ఈస్టిండియా కంపెనీ గుత్తాధిపత్యం పాక్షికంగా అంతమవడం (కేవలం చైనా, తేయాకు వ్యాపారానికి మాత్రమే ఈస్టిండియా కంపెనీ గుత్తాధిపత్యం పరిమితమైంది), 1833 చట్టం ద్వారా కంపెనీ గుత్తాధిపత్యం సంపూర్ణంగా అంతమవడం భారతీయ పరిశ్రమలను దెబ్బతీశాయి.
- 1813 వరకు ఈస్టిండియా కంపెనీ మాత్రమే భారతదేశాన్ని దోపిడీ చేసేది. కానీ కంపెనీ గుత్తాధిపత్యం అంతమవడంతో వేల సంఖ్యలో బ్రిటిష్ వ్యాపారులు మార్కెట్‌లోకి తమ వస్తువులను ప్రవేశపెట్టడంతో భారత పరిశ్రమలు పోటీని తట్టుకోలేకపోయాయి.
- 1853లో ప్రవేశపెట్టిన రైల్వే వ్యవస్థతో బ్రిటిష్ వస్తువులు దేశంలోని నలుమూలలకు విస్తరించి, గ్రామీణ పరిశ్రమలను మరింత దెబ్బతీశాయి.
- 1901 జనాభా లెక్కల ప్రకారం పరిశ్రమలపై ఆధారపడే ప్రజల శాతం 8 నుంచి 6కి తగ్గడం దేశ పారిశ్రామిక తిరోగమనాన్ని సూచిస్తుంది.
- ఆంగ్లేయులు తమ దేశంలో తయారైన నూలు వస్త్రాలను ప్రవేశపెట్టి, నూలు వస్త్రాలకు మాతృదేశమైన భారతదేశాన్ని నాశనం చేశారని కార్ల్ మార్క్స్ పేర్కొన్నారు.
- భారత హస్తకళా పరిశ్రమలు ఇంగ్లండ్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులతో పోటీపడలేక అదృశ్యమయ్యాయని బిపిన్‌చంద్ర అనే చరిత్రకారుడు తెలియజేశారు.

వ్యవసాయ వ్యాపారీకరణ

ఆంగ్లేయులు రాకముందు భారతదేశంలో వ్యవసాయం ఒక జీవన విధానంగానే ఉండేది. ఎప్పుడూ వ్యాపారంగా భావించలేదు. ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన నూతన వ్యవసాయ విధానాలతో వ్యవసాయంలో వ్యాపార దృక్పథం ప్రారంభమైంది. పంటను సొంత వినియోగానికి మాత్రమే కాకుండా మార్కెట్లకు తరలించేవారు.

దోహదపడిన అంశాలు:

☛ ఆంగ్లేయులు వాణిజ్య పంటల కోసం రైతులపై ఒత్తిడి పెంచడం.
☛ నగదు రూపంలో భూమిశిస్తు చెల్లించేందుకు రైతులు పంటను అమ్మాల్సిన పరిస్థితి తలెత్తడం.
☛ అంతర్జాతీయ మార్కెట్లలో ధరల పెరుగుదలతో రైతులు వాణిజ్య పంటల వైపు దృష్టి మళ్లించడం.
☛ ఆధునిక రవాణా, సమాచార వ్యవస్థల అభివృద్ధి, మార్కెట్లతో ఉత్పత్తి కేంద్రాల అనుసంధానం మొదలైనవి.
☛ వ్యవసాయ వ్యాపారీకరణ ఆర్థిక రంగంపై తీవ్ర ప్రభావం చూపింది. వాణిజ్య పంటలను ఎక్కువగా పండించడంతో ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గి క్షామాలు నిత్యకృత్యమయ్యాయి. దీనికితోడు అంతర్జాతీయ మార్కెట్లలో వచ్చిన ఒడిదొడుకులు రైతులపై తీవ్ర ప్రభావం చూపాయి.
☛ గ్రామీణ స్వయం సమృద్ధి ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. రైతులకు మార్కెట్ పరిజ్ఞానం లేకపోవడంతో దళారుల మోసానికి గురయ్యారు. వాణిజ్య పంటలకు అధిక పెట్టుబడి అవసరం కావడంతో రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలయ్యారు.

సంపద తరలింపు

బ్రిటిష్ ఆర్థిక విధానాలతో భారత సంపదంతా ఇంగ్లండ్‌కు తరలడంతో దేశం మరింత పేదరికంలోకి దిగజారింది. భారతీయ మేధావులు ఈ దోపిడీని తమ రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపే ప్రయత్నం చేసినప్పటికీ లాభం లేకుండాపోయింది.

❖ భారత సంపద ప్రధానంగా హోంఛార్జీల రూపంలో ఇంగ్లండ్‌కు తరలివెళ్లేది. హోంఛార్జీలు అంటే, భారతదేశ బడ్జెట్ నుంచి ఇంగ్లండ్‌లో ఉన్నవారికి కేటాయింపులు చేయడం. ఇందులో రుణాలకు చెల్లించే వడ్డీలు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించే పెన్షన్లు, ఈస్ట్ ఇండియా కంపెనీ షేర్ హోల్డర్లకు చెల్లించే డివిడెంట్లు, సెక్రటరీ ఆఫ్ స్టేట్ కార్యాలయానికి అయ్యే ఖర్చులు మొదలైనవి. ఈ చెల్లింపులతో భారతదేశానికి ఎలాంటి ప్రయోజనం లేకున్నా ఆర్థిక భారం మోయాల్సి వచ్చింది.



రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

క్షామాలు

ఆంగ్లేయుల దోపిడీ పర్యవసానాల్లో నిరంతర క్షామాలు అత్యంత ముఖ్యమైనవి. భారతదేశంలో ప్రాచీనకాలం నుంచి ప్రకృతి వైపరీత్యాల కారణంగా క్షామాలు సంభవించేవి. కానీ ఆధునిక భారతదేశంలో క్షామాలకు ఆంగ్లేయుల ఆర్థిక దోపిడీ కూడా ప్రధాన కారణమని చెప్పవచ్చు.

◆ 1854-1901 మధ్య కాలంలో 24 ప్రధాన క్షామాలు సంభవించగా, సుమారు 2.9 కోట్ల మంది మరణించారు.

ప్రధాన క్షామాలు:

- 1770లోని బెంగాల్ క్షామం వల్ల 1/3వ వంతు జనాభా అంతరించింది.
- 1833 గుంటూరు క్షామంతో జిల్లాలోని 1/2వ వంతు ప్రజలు మరణించారు.
- 1866 ఒరిస్సా క్షామంలో లక్షలాది మంది మరణించారు.
- 1876-1880 క్షామంలో 50 లక్షల మంది మరణించారు.
- 1896-1900 క్షామంలో మృతుల సంఖ్య 90 లక్షలు దాటింది.
- 1943 బెంగాల్ క్షామంలో 30 లక్షల మంది మృతి చెందారు.
- ఆంగ్లేయుల ఒత్తిడితో బెంగాల్‌లో వరికి బదులు నీలిమందు పండించాల్సిన పరిస్థితి తలెత్తడంతో తీవ్రమైన ఆహార కొరత ఏర్పడింది. ఎలాంటి ప్రతిఫలం లేకుండానే భారతదేశ సంపదను ఇంగ్లండ్‌కు తరలించడంతో భారతీయులు దారిద్ర్యం అనుభవించాల్సి వచ్చేది.
- ఆంగ్లేయుల రెవెన్యూ విధానాలు కూడా క్షామాలకు కారణంగా చెప్పవచ్చు. అధిక భూమిశిస్తుతో పాటు, పంటలు పండని సమయంలోనూ పూర్తి శిస్తు వసూలు చేయడంతో రైతుల పరిస్థితి దుర్భరమైంది.
- రెండో ప్రపంచ యుద్ధంలో ఆంగ్లేయులు అవలంబించిన విధానాలు 1943లో బెంగాల్ క్షామానికి కారణమై లక్షలాది మంది మరణించారు. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న మిత్రదేశాల సైన్యానికి ఆంగ్లేయులు భారతదేశం నుంచే ఆహార ధాన్యాలను సరఫరా చేసి ఆహార నిల్వలను ఖాళీ చేశారు. ఫలితంగా బెంగాల్‌లో ఏర్పడిన కరవు 1943లో క్షామంగా మారింది.
- ఇంగ్లండ్‌లో సంభవించిన పారిశ్రామిక విప్లవం తర్వాత భారత పరిశ్రమలు కనుమరుగయ్యాయి. చేతివృత్తులవారు జీవనోపాధి కోల్పోయి ఆకలితో ప్రాణాలు కోల్పోయారు.
- 19-20వ శతాబ్దాల్లో ప్రారంభమైన ఆధునిక పరిశ్రమలు కొన్ని ప్రాంతాలకే పరిమితమై ప్రజలందరికీ జీవనోపాధి అందించలేకపోయాయి. క్షామాలు సంభవించినప్పుడు ఆంగ్లేయ పాలకులు సత్వర చర్యలు చేపట్టకపోవడంతో అధిక ప్రాణనష్టం జరిగింది.

907 Word of the Day

Prohibit

Telugu meaning: నిషేధించు, నిరోధించు
English meaning: The word prohibit (ప్రొహిబిట్) is a verb that means to officially forbid or disallow something by law, rule, or authority.
Synonyms: Ban, Forbid; ***Antonyms:*** Permit, Allow
Usage: **1.** The government decided to prohibit the sale of unsafe products to protect consumer interests.
2. Smoking is strictly prohibited in public places to ensure a healthier environment.

కరెంట్ అఫైర్స్



2025-26 ఆర్థిక సర్వేను 2026, జనవరి 29న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సర్వే రూపొందింది. అంతర్జాతీయంగా ఒడిదొడుకులు, వాణిజ్య ముప్పులు వెంటాడుతున్నా భారత్‌లో వచ్చే ఏడాది (2027) ఆర్థిక వృద్ధి రేటు పరుగులు తీయనుందని ఆర్థిక సర్వే వెల్లడించింది. 2026-27 ఏడాదిలో ఆర్థిక వృద్ధి రేటు 6.8% నుంచి 7.2% మధ్య ఉండవచ్చని తెలిపింది. అయితే వినియోగం, పెట్టుబడుల్లో స్వల్ప తగ్గుదల కారణంగా ప్రస్తుత ఆర్థిక ఏడాది (2025-26) వృద్ధి రేటైన 7.4% కంటే వచ్చే ఏడాది స్వల్పంగా నెమ్మదించనుంది.



మహారాష్ట్రలో జరిగిన విమాన ప్రమాదంలో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ (66) 2026, జనవరి 28న దుర్మరణం పాలయ్యారు. ఆయనతోపాటు మరో నలుగురు చనిపోయారు. బారామతి విమానాశ్రయం సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది.

❖ 1959, జులై 22న అజిత్ పవార్ జన్మించారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శరద్‌పవార్ ఆయనకు బాబాయి. ఆరుసార్లు మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి పదవిని చేపట్టి అజిత్ పవార్ రికార్డు సృష్టించారు.

❖ 1991 నుంచి అజిత్ పవార్ బారామతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. 8 పర్యాయాలు ఇక్కడి నుంచే శాసనసభకు ఎన్నికయ్యారు.

ఇంధన రంగంలోని ప్రభుత్వ, ప్రైవేటు దిగ్గజ సంస్థలు ఓఎన్‌జీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ జట్టు కట్టాయి. చమురు-గ్యాస్ అన్వేషణ, వెలికితీత కోసం ఉపయోగించే రిగ్‌లు, సరఫరా నౌకలు, లాజిస్టిక్స్, ప్రత్యేక సముద్రగర్భ సామగ్రి లాంటి వనరులను సంయుక్తంగా పంచుకునే ఒప్పందంపై రెండు కంపెనీలు సంతకాలు చేశాయి.

గణతంత్ర దినోత్సవం నాడు దిల్లీలోని కర్తవ్యపథ్‌లో నిర్వహించిన కవాతులు, ఊరేగించిన శకటాల్లో అత్యుత్తమమైన వాటికి కేంద్ర ప్రభుత్వం 2026, జనవరి 28న అవార్డులు ప్రకటించింది. మూడు సైనిక విభాగాల కవాతులో నేవీ దళం; రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వచ్చిన శకటాల్లో గణేశ్ నిమజ్జనం ఇతివృత్తంతో రూపొందించిన మహారాష్ట్ర శకటం ఉత్తమ బహుమతికి ఎంపికయ్యాయి.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

స్టడీ జోన్

జాతీయ పక్షి - నెమలి



భారతీయ సంస్కృతిలో నెమలికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. పూర్వకాలం నుంచే ఇది మన చరిత్ర, సంప్రదాయాలతో ముడిపడి ఉంది. ఈ పక్షిని సౌందర్యం, సొగసుకు ప్రతీకగా పేర్కొంటారు. దీని రంగుల ఈకలు, పింఛం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఇవి దాదాపు దేశంలోని అన్ని ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. పెద్దల నుంచి పిల్లల దాకా దీన్ని తేలిగ్గా గుర్తించగలుగుతారు. ఇంతటి ప్రత్యేకతలు ఉన్న నెమలిని భారత ప్రభుత్వం 1963, జనవరి 31న జాతీయ పక్షిగా ప్రకటించింది. పోటీ పరీక్షల నేపథ్యంలో దీనికి సంబంధించిన ముఖ్య విషయాలు తెలుసుకుందాం..!

జాతీయ పక్షిగా..

నెమలి శాస్త్రీయ నామం పావో క్రిస్టాటస్. ఇది పురాణాల్లో దేవతలకు వాహనంగా, వివిధ రాజవంశాలకు చిహ్నంగా ఉంది.

◆ నెమలికి ఉండే అందం, హుందాతనం, ఆకర్షణ శక్తి దాన్ని ఇతర పక్షుల కంటే భిన్నంగా ఉంచుతుంది. ఈ లక్షణాలు భారతీయ విలువలు, స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయి.
◆ దీనికి ఉండే వివిధ రంగుల ఈకలు మన దేశ జీవ, సాంస్కృతిక వైవిధ్య సమృద్ధికి సూచికగా నిలుస్తాయి.
◆ దీనికి ఉండే సహజ సౌందర్యం, ఆధ్యాత్మిక వారసత్వం, తేలిగ్గా గుర్తించగలగడం, ఏ ఇతర పక్షులతోనూ పోలిక లేకపోవడం లాంటివన్నీ నెమలిని మన జాతీయ పక్షిగా చేశాయి.

ఇతర ముఖ్యాంశాలు


వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1972లోని షెడ్యూల్ 1 ద్వారా మన దేశంలో నెమళ్లకు అత్యంత కఠినమైన రక్షణ లభిస్తోంది. వీటిని పట్టుకోవడం, వ్యాపారం చేయడం, వాటి పింఛాలు సేకరించడం నిషేధం. వీటిని అతిక్రమిస్తే 3 నుంచి ఏడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.25 వేలు లేదా అంతకంటే ఎక్కువ మొత్తంలో జరిమానా విధిస్తారు.

◆ నెమళ్లు సర్వభక్షకాలు. ఇవి తక్కువ ఎత్తులో ఉండే గడ్డి భూములు, అడవులు, మానవ ఆవాసాల్లోనూ నివసిస్తాయి.
◆ ఇవి భారత్‌తోపాటు శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్‌లోనూ ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి.
◆ జైన మత గ్రంథాల ప్రకారం, మౌర్య వంశ స్థాపకుడైన చంద్రగుప్తుడి తండ్రి నెమళ్లను పెంచేవాడు (మయూర పోషకుడు).

నెమళ్ల లక్షణాలు, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

వైరస్‌లు



వైరస్ అనే పదం లాటిన్ భాష నుంచి వచ్చింది. దీని అర్థం 'విషం' లేదా 'వీనమ్'. వీటిని జీవ రసాయనికంగా వ్యాధిని కలిగించే న్యూక్లియోప్రొటీన్లుగా పేర్కొంటారు. వైరస్‌ల గురించి అధ్యయనం చేసే జీవశాస్త్ర శాఖను 'వైరాలజీ' అంటారు. ఇవి సాధారణంగా జీవకణాల్లో ఉండే అవికల్ప పరాన్నజీవులుగా మాత్రమే జీవిస్తాయి. ఇవి స్వేచ్ఛగా జీవి లక్షణాలను ప్రదర్శిస్తూ జీవించలేవు. ఇవి అతిథేయి లేదా హోస్ట్ సమక్షంలో మాత్రమే ప్రత్యుత్పత్తి జరుపుకుంటాయి.

లక్షణాలు

వైరస్‌లలో జన్యుపదార్థంగా RNA లేదా DNA ఏదో ఒకటి మాత్రమే వ్యవస్థితమవుతుంది. సందర్భానుసారం వైరస్‌లు నిర్జీవ, సజీవ లక్షణాలు ప్రదర్శిస్తాయి. నిర్జీవులకు, సజీవులకు మధ్య సంధానసేతువులుగా వైరస్‌లను పేర్కొంటారు.

- వైరస్‌లు నిర్మాణరీత్యా బాహ్య కవచం, కాప్సిడ్, జన్యు పదార్థాలను కలిగి ఉంటాయి. అయితే బాహ్యకవచం కొన్ని వైరస్‌లలో మాత్రమే కనిపిస్తుంది. ఇది ప్రొటీన్లు, లిపిడ్లు, కార్బోహైడ్రేట్లతో నిర్మితమై ఉంటుంది. ఈ బాహ్య కవచ ప్రమాణాలను పెప్లోమియర్లు అంటారు. ఈ బాహ్యకవచం లోపించిన వైరస్‌లను నగ్నవైరస్‌లు అంటారు.

వైరస్‌ల ఆకారాలు, జన్యుపదార్థాలు - రకాలు, హానికర వైరస్‌లు మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

మేనేజర్ ఉద్యోగాలు

కర్ణాటకలోని ఉడుపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (యూసీఎస్ఎల్) శాశ్వత ప్రాతిపదికన వివిధ విభాగాల్లో మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 13. దరఖాస్తు ఫీజు రూ.1000. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ 2026 ఫిబ్రవరి 17.

5వ తరగతి ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 31 గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి అయిదో తరగతి ప్రవేశాల సీట్ల భర్తీకి ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (గురుకులం) నోటిఫికేషన్‌ను జారీ చేసింది. అర్హులైన అభ్యర్థులు 2026, ఫిబ్రవరి 5 నుంచి 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (జనవరి 31) చివరి తేదీ

- జిల్లా కేంద్రాల్లో 282 ఆధార్ సూపర్‌వైజర్/ఆపరేటర్ ఉద్యోగాలు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో 97 ఉద్యోగాలు. టెన్త్/ఇంటర్/డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో 10 ఎక్స్‌పర్ట్ పోస్టులు. డిప్లొమా/గ్రాడ్యుయేట్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.
- శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీలో 61 టీచింగ్ పోస్టులు. పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams
Mathematics
Ratio & Proportion

1. The monthly incomes of two persons are in the ratio 2 : 3 and their monthly expenditures are in the ratio 1 : 2. If each of them saves Rs.100 per month, then what are their monthly incomes?
A) Rs.200; Rs.300 B) Rs.300; Rs.450
C) Rs.400; Rs.600 D) Rs.500; Rs.750

2. One cup contains milk and water in the ratio 3 : 2, while another cup of the same capacity contains them in the ratio 5 : 3, respectively. If the contents of both cups (when full) are poured into a vessel, then what will be the final ratio of water to milk in the vessel?
A) 7 : 11 B) 5 : 8
C) 8 : 13 D) 31 : 49

3. The ratio of the present ages of a father and his son is 5 : 2. Six years ago, the ratio of their ages was 7 : 2. Find the age of the father after 15 years.
A) 52.5 years B) 55 years
C) 60 years D) 65 years

4. The fourth proportional to 8, 12 and 6 is equal to the third proportional to 4 and k. Find the value of k.
A) 6 B) 8 C) 12 D) 16

5. The ratio of boys to girls in a group is 5 : 4. If 10 boys join the group and 2 girls leave the group, the ratio of boys to girls becomes 3 : 2. What was the total number of students initially in the group?
A) 72 B) 81 C) 90 D) 117

6. Eight years ago, the average age of Amit, Rohit and Suresh was 32 years. If Vikas joins them now, the present average age of all four becomes 36 years. What is the present age of Vikas?
A) 38 years B) 40 years
C) 42 years D) 24 years

7. If a : b = 4 : 5, then find the value of (3a + 2b) : (5a + b)
A) 22 : 25 B) 23 : 25
C) 26 : 29 D) 29 : 26

8. The length and breadth of a rectangle are in the ratio 7 : 4. If the length is 9 m more than the breadth, find the area (in m^2) of the rectangle.
A) 252 B) 324 C) 252 D) 378

9. A household has 4 humans, along with cats and dogs in the ratio 2 : 3. If the total number of legs in the household is 88, then what is the number of cats in the household?
A) 4 B) 6 C) 8 D) 10

10. The monthly incomes of two persons are in the ratio 5 : 7 and their monthly expenditures are in the ratio 3 : 5. If each of them saves Rs.200 per month, then what are their monthly incomes?
A) Rs.400; Rs.560 B) Rs.500; Rs.700
C) Rs.600; Rs.840 D) Rs.700; Rs.980

11. Between two consecutive years, a person's income is in the ratio 3 : 5 and his expenses are in the ratio 2 : 3.
If his income in the second year is Rs.50,000 and his expenses in the first year are Rs.18,000, then what are his total savings in the two years together?
A) Rs.30,000 B) Rs.32,000
C) Rs.35,000 D) Rs.38,000

12. The ratio of the present ages of a father and son is 4 : 1. Six years ago, the ratio of their ages was 10 : 1. Find the age of the father after 20 years.
A) 48 years B) 52 years
C) 56 years D) 60 years

13. Five years ago, the ratio of the ages of P and Q was 3 : 4. Ten years hence, the ratio of their ages will be 5 : 6. What is the sum of their present ages (in years)?
A) 62.5 B) 56 C) 54 D) 64.5

14. The ratio of the present ages of a father and son is 5 : 2. Four years ago, the ratio of their ages was 3 : 1. Find the age of the father after 18 years.
A) 48 years B) 52 years
C) 56 years D) 58 years

15. The ratio of boys to girls in a group is 2 : 3. If 4 boys join the group, the ratio of boys to girls becomes 3 : 4. What is the total number of students initially in the group?
A) 60 B) 70 C) 80 D) 90

16. The ratio of the present ages of a father and son is 4 : 1. Five years ago, the ratio of their ages was 7 : 1. Find the age of the father after 25 years.
A) 55 B) 60 C) 65 D) 70

17. The ratio of the monthly incomes of P and Q is 7 : 9 and the ratio of their monthly expenditures is 4 : 7. If each of them saves .1,300 per month, then find the difference (in Rs.) between their monthly incomes.
A) Rs.400 B) Rs.500
C) Rs.600 D) Rs.700

18. A varies jointly with B and C. If A = 12 when B = 3 and C = 2, find A when B = 5 and C = 7.
A) 35 B) 70
C) 84 D) 140

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

కరెంట్ అఫైర్స్ - మాదిరి ప్రశ్నలు

◆ గ్లోబల్ హ్యూమన్ సొసైటీ ఇటీవల ఎవరికి జంతు సంక్షేమానికి చేసిన కృషికి గ్లోబల్ హ్యూమానిటేరియన్ అవార్డును ప్రదానం చేసింది? (ఈయన గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో వంతారా పేరిట 3 వేల ఎకరాల్లో అతిపెద్ద వన్యమృగ సంరక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 2 వేల జాతులకు చెందిన లక్షా యాభై వేల జంతువులకు చికిత్స, ఆవాసం లక్ష్యంగా దీనిని ఏర్పాటు చేశారు. ఈ పురస్కారం పొందిన అతిపిన్న వయస్కుడిగా తొలి ఆసియన్‌గా ఈయన చరిత్ర సృష్టించారు.)

జ: అనంత్ అంబానీ

◆ అధికారికంగా ఫిడే (FIDE) రేటింగ్ పొందిన ప్రపంచంలోనే అతిపిన్న వయస్కుడైన చెస్ ఆటగాడిగా చరిత్ర సృష్టించిన భారత బాలుడు ఎవరు? (మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ మూడేళ్ల ఏడు నెలల 20 రోజుల వయసున్న బాలుడు 1572 రేటింగ్‌తో అంతర్జాతీయ చెస్ సమాఖ్య (FIDE) రికార్డుల్లోకి ప్రవేశించాడు.)

జ: సర్వాగ్య సింగ్ కుష్వాహ


◆ అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (2025లో ఈ దినోత్సవాన్ని 'యునైటింగ్ విత్ యూత్ ఎగైనెస్ట్ కరప్షన్: షేపింగ్ టుమారోస్ ఇంటిగ్రిటీ' అనే థీమ్‌తో నిర్వహించారు.)

జ: డిసెంబరు 9

మరింత సమాచారం

మిస్సింగ్ నంబర్స్


ప్రశ్నలో భాగంగా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పటాలు ఇస్తారు. వీటిలో ఉన్న సంఖ్యలు ఒక నిర్దిష్ట నియమాన్ని పాటిస్తాయి. ఆ నియమాన్ని గుర్తించి ప్రశ్నార్థకం స్థానంలో రావాల్సిన సంఖ్య లేదా సంఖ్యలను గుర్తించాల్సి ఉంటుంది. ఇందుకు కింది సందర్భాలు ఉపయోగపడతాయి.



పై పటం నుంచి x విలువను కింది విధంగా కనుక్కోవచ్చు.

- ★ $x = a + b + c$ ★ $x = a + b - c$
- ★ $x = a \pm b \pm c$ ★ $x = \frac{a + b + c}{2}$
- ★ $x = \frac{a + b + c}{n}$, $n = 2, 3, 4, ...$ ★ $x = a \times b \times c$
- ★ $x = a + b \times c$ ★ $x = a - b \times c$
- ★ $x = (a + b + c)^2$ ★ $x = (a + b + c)^3$
- ★ $x = a^2 + b^2 + c^2$ ★ $x = a^3 + b^3 + c^3$
- ★ $x = a^2 \times b^2 \times c^2$ ★ $x = a^2 \pm b^2 \pm c^2$
- ★ $x = a^2 + b^2 = c^2$

వెతికితే అదే దొరుకుతుంది!




వరుసగా మూడు నెలల ఇంటి ఖర్చుల మొత్తాలను గమనిస్తే, నాలుగో నెల ఎంత ఖర్చు కావచ్చో చెప్పవచ్చు. ట్రాఫిక్ సిగ్నల్స్ నిర్దిష్ట కాల వ్యవధుల్లో మారుతుంటాయి కాబట్టి, తర్వాత పడే కలర్ ఏదో ఊహించవచ్చు. అంటే లేని లేదా తప్పిపోయిన సంఖ్యను లేదా వరుసలో తర్వాతి సంఖ్యను కొన్ని గణిత సూత్రాలను ఉపయోగించి కనుక్కోవచ్చని తెలుస్తోంది. క్రమాన్ని పట్టుకుని వెతికితే ప్రశ్నార్థకం స్థానంలో సంఖ్య అదే దొరుకుతుందని అర్థమవుతోంది. గణితశాస్త్ర నియమాలను, తర్కాన్ని కలిపి ఒక క్రమంలో అమర్చిన సంఖ్యల మధ్య సంబంధాన్ని గుర్తించడమే 'మిస్సింగ్ నంబర్స్' ప్రధాన ఉద్దేశం. అభ్యర్థుల విశ్లేషణ సామర్థ్యాన్ని, తార్కిక ఆలోచనా శక్తిని అంచనా వేయడానికి ఈ అధ్యాయం నుంచి ప్రశ్నలు అడుగుతారు. వాటికి వేగంగా సమాధానాలను రాయాలంటే ఎక్కాలు, వర్గాలు, ఘనాలు, ప్రధాన సంఖ్యలు తదితరాలను నేర్చుకుని, కంఠస్థం చేయాలి. సంకలన వ్యవకలనాలు, గుణకార భాగహారాలు మొదలైన గణిత పరిక్రియలపై పట్టు పెంచుకోవాలి.

జనరల్ స్టడీస్ - రీజనింగ్

మాదిరి ప్రశ్నలు


1. కింది పటాల్లో లోపించిన సంఖ్యను కనుక్కోండి.



1) 92 2) 91 3) 94 4) 96

సాధన: 5, 4 → 54 − 3 = 51
7, 8 → 78 − 3 = 75
9, 5 → 95 − 4 = 91 **జ: 2**


2.



1) 27 2) 32 3) 34 4) 29

సాధన: $(2 \times 4) + (3 \times 5) = 8 + 15 = 23$
$(5 \times 2) + (6 \times 1) = 10 + 6 = 16$
$(7 \times 3) + (4 \times 2) = 21 + 8 = 29$ **జ: 4**


3.



1) 3600 2) 8100 3) 6400 4) 4900

సాధన: $(5 \times 3) + (6 + 2) = 15 + 8 = 23 = (23)^2 = 529$
$(8 \times 7) + (2 + 4) = 56 + 6 = 62 = (62)^2 = 3844$
$(7 \times 9) + (8 + 9) = 63 + 17 = 80 = (80)^2 = 6400$ **జ: 3**


4.



1) 22 2) 44 3) 33 4) 32

సాధన: 12, 17, 19 = 1 + 2 + 1 + 7 + 1 + 9 = 21
16, 15, 14 = 1 + 6 + 1 + 5 + 1 + 4 = 18
19, 18, 12 = 1 + 9 + 1 + 8 + 1 + 2 = 22 **జ: 1**


5.



1) 105 2) 88 3) 98 4) 102

సాధన: $7, 8, 6 = 7^2 + 8^2 + 6^2$
$= 49 + 64 + 36 = 149$
$5, 6, 3 = 5^2 + 6^2 + 3^2 = 25 + 36 + 9 = 70$
$4, 1, 9 = 4^2 + 1^2 + 9^2 = 16 + 1 + 81 = 98$ **జ: 3**


6.



1) 231 2) 201 3) 206 4) 261

సాధన: 16, 23, 18 = 16 × 18 − 23 = 288 − 23 = 265
19, 24, 12 = 19 × 12 − 24 = 228 − 24 = 204
18, 15, 12 = 18 × 12 − 15 = 216 − 15 = 201 **జ: 2**

7.






1) 45 2) 34 3) 42 4) 38

సాధన: 15, 18, 12, 20 = 15 + 18 + 12 + 20 = 65
16, 19, 18, 24 = 16 + 19 + 18 + 24 = 77
23, 21, 14, x = 23 + 21 + 14 + x = 58 + x = 100
⇒ x = 100 − 58 = 42 **జ: 3**


8.



1) 227 2) 277
3) 327 4) 272

సాధన: 145 → 1 + 4 + 5 = 10
145 + 10 = 155
155 → 1 + 5 + 5 = 11
155 + 11 = 166
166 → 1 + 6 + 6 = 13
166 + 13 = 179
179 → 1 + 7 + 9 = 17
179 + 17 = 196
196 → 1 + 9 + 6 = 16
196 + 16 = 212
212 → 2 + 1 + 2 = 5
212 + 5 = 217
217 → 2 + 1 + 7 = 10
217 + 10 = 227 **జ: 1**

9.





1) 24 2) 83 3) 59 4) 64

సాధన: 62 + 26 = 88
88 ని కుడి నుంచి ఎడమకు రాస్తే = 88 ⇒ 42 + 24 = 66
66 ని కుడి నుంచి ఎడమకు రాస్తే = 66 ⇒ 73 + 22 = 95
95ని కుడి నుంచి ఎడమకు రాస్తే = 59 **జ: 3**



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

SENIOR INTER Botany - Principles of Inheritance and Variations



Final Exams-2026 IMPORTANT Q & A

2 Marks

1. **What is the genetic nature of wrinkled phenotype of pea seeds?**

A: rrY, rrYy, rryy.

2. **Explain the terms phenotype and genotype?**

A: **Phenotype:** Physical appearance of an organism, **e.g.:** Tall, dwarf.

Genotype: Genetic makeup of an organism. **e.g.:** Tall plant is represented by genotype TT, Tt and dwarf plant is represented by tt.

3. **What is point mutation? Give an example?**

A: Mutation occurs due to change in a single base pair of DNA. It is also called as gene mutation. **e.g.:** sickle cell anaemia.

Molecular basis of Inheritance

1. **What is the difference between exons and introns?**

A: The functional genes present in mRNA are called exons, where as non functional genes present in h-RNA are called introns. Due to splicing, h-RNA is changed into mRNA.

2. **What is meant by capping and tailing?**

A: Capping and tailing occurs in heterogeneous RNA (h-RNA). In capping, methyl guanosine triphosphate or poly G is added to 5' end and in tailing, adenylate residues or poly A (200-300) is added to 3' end of mRNA.

3. **Distinguish between heterochromatin and euchromatin. Which of the two is transcriptionally active?**

A: Dark coloured chromatin is hetero chromatin, and light coloured chromatin is euchromatin. Genetically, hetero chromatin is inactive, and euchromatin is active.

4. **Define stop codon? Write the codons?**

A: The codons which do not codes any amino acid or stop protein synthesis are called stop codons.
e.g.: UAA, UAG, UGA..

More Imp Q & Ans



Writer: M. Chenna Kesavulu


ప్రకృతి విధ్వంసాలపై ప్రజాచైతన్య సమరాలు!

అభివృద్ధి పేరుతో జరుగుతున్న ప్రకృతి విధ్వంసం, సహజవనరుల దోపిడీ, ఆదివాసీల తరలింపు తదితర పరిణామాలు దేశంలో పర్యావరణ ఉద్యమాలకు ప్రధాన కారణాలు. మితిమీరిన పారిశ్రామికీకరణతో కాలుష్యం, ప్రాజెక్టుల నిర్మాణం కోసం అడవుల నిర్మూలన, ఫలితంగా ఏర్పడిన వాతావరణ మార్పులతో ప్రజల్లో పర్యావరణ స్పృహ పెరిగింది. దాంతో ఈ ఉద్యమాలకు మద్దతు ఎక్కువైంది. చిప్కో, సైలెంట్ వ్యాలీ, నర్మదా బచావో మొదలైన ప్రజా ఉద్యమాలు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి, ప్రభుత్వాలను కదిలించాయి. దేశంలో పర్యావరణ విధ్వంసకర చర్యలను అడ్డుకోవడానికి నిర్వహించిన ముఖ్యమైన ఉద్యమాలు, వాటి ఉద్దేశాలు, నడిపించిన నాయకులు, ప్రభావాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. సుస్థిర అభివృద్ధికి, సామాజిక న్యాయానికి, జీవివైవిధ్య పరిరక్షణకు ప్రభుత్వాలు వ్యవస్థాగతంగా చేసిన ఏర్పాట్లనూ తెలుసుకోవాలి.

జనరల్ స్టడీస్ - పర్యావరణ అంశాలు

పర్యావరణ ఉద్యమాలు

1. 'వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా'ను ఎప్పుడు స్థాపించారు?



1) 1984 2) 1982
3) 1985 4) 1986

2. 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ అండ్ ఎడ్యుకేషన్'ను ఎక్కడ ఏర్పాటు చేశారు?
1) న్యూదిల్లీ 2) జహీరాబాద్
3) డెహ్రాడూన్ 4) బెంగళూరు

3. 'ఇందిరా గాంధీ నేషనల్ ఫారెస్ట్ అకాడమీ'ను ఎప్పుడు స్థాపించారు?
1) 1987 2) 1988
3) 1989 4) 1990

4. 'ఇందిరా గాంధీ నేషనల్ ఫారెస్ట్ అకాడమీ' ఎక్కడ ఉంది?
1) దిల్లీ 2) డెహ్రాడూన్
3) కోల్‌కతా 4) రాజస్థాన్

5. 'సలీం అలీ సెంటర్ ఫర్ ఆర్నిథాలజీ అండ్ నేచురల్ హిస్టరీ'ను ఎప్పుడు స్థాపించారు?
1) 1990 2) 1991
3) 1992 4) 1993

6. ఇటీవల కాలంలో పర్యావరణ అంశాల పట్ల ప్రజలకు అవగాహన పెరిగి అనేక పర్యావరణ ఉద్యమాలకు నాంది పలుకుతోంది. దీనికి కారణం?
1) ఓజోన్ క్షీణత 2) గ్లోబల్ వార్మింగ్
3) ఆమ్ల వర్షాలు 4) పైవన్నీ

7. 'సైలెంట్ స్ప్రింగ్' పుస్తక రచయిత?
1) రేచల్ కార్సన్ 2) గిల్లి బోట్స్
3) రిచర్డ్ పాల్ 4) పాల్ బీటిల్

8. 'దశోలి గ్రామ స్వరాజ్య మండల్'ను ఏ రాష్ట్రంలో ఏర్పాటు చేశారు?
1) కేరళ 2) ఉత్తరాఖండ్
3) బిహార్ 4) ఒడిశా

9. 'దశోలి గ్రామ స్వరాజ్య మండల్'ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1964 2) 1965
3) 1966 4) 1967

10. 'చిప్కో' ఉద్యమ స్థాపకులు?
1) సుందర్‌లాల్ బహుగుణ
2) మేధా పాట్కర్ 3) బృందా కారత్
4) పైవారందరూ

11. చిప్కో ఉద్యమం ఎప్పుడు మొదలైంది?
1) 1974 2) 1973
3) 1976 4) 1979

12. హిందీలో 'చిప్కో' అంటే...
1) కౌగిలించుకోవడం 2) ముద్దు పెట్టుకోవడం
3) పరిరక్షించడం 4) కాపాడటం

13. చిప్కో ఉద్యమం ఏ రాష్ట్రంలో ప్రారంభించారు?



1) ఒడిశా 2) ఉత్తరాఖండ్
3) బిహార్ 4) కర్ణాటక

14. 'సైలెంట్ వ్యాలీ ఉద్యమం' ఎప్పుడు జరిగింది?
1) 1979 2) 1978
3) 1977 4) 1976

15. 'సైలెంట్ వ్యాలీ ఉద్యమం' ఏ నదిపై కడుతున్న హైడ్రో ఎలక్ట్రిక్ రిజర్వాయర్ కారణంగా జరిగింది?
1) కావేరి 2) కుంతీపూజ
3) నర్మదా 4) మహానది

16. 'సైలెంట్ వ్యాలీ నేషనల్ పార్కు'ను ఎప్పుడు ప్రకటించారు?
1) 1985 2) 1986
3) 1987 4) 1988

17. 'సైలెంట్ వ్యాలీ ఉద్యమం' వల్ల దానిపై వేసిన కమిటీ?
1) జి.కె. అబ్బాస్ కమిటీ
2) ఎం.జి.కె. మీనన్ కమిటీ
3) ఆర్.జి. భట్టాచార్య కమిటీ
4) నికిల్ ఘోష్ కమిటీ

18. 'నర్మదా బచావో' ఆందోళన ఎప్పుడు ప్రారంభమైంది?



1) 1985 2) 1986
3) 1987 4) 1988

19. 'నర్మదా బచావో' ఆందోళన ఎవరి నాయకత్వంలో ప్రారంభమైంది?
1) మేధా పాట్కర్ 2) సుందర్‌లాల్ బహుగుణ
3) జి.కె. మీనన్ 4) పాండురంగ హెగ్డే

20. 'జంగిల్ బచావో' ఆందోళన ఎప్పుడు జరిగింది?
1) 1981 2) 1982
3) 1983 4) 1984

21. 'జంగిల్ బచావో' ఆందోళన ఏ రాష్ట్రంలో జరిగింది?



1) బిహార్ 2) కేరళ
3) ఒడిశా 4) కర్ణాటక

22. సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ – అహ్మదాబాద్‌ను ఎప్పుడు స్థాపించారు?
1) 1989 2) 1990
3) 1991 4) 1992

23. 'నవ్‌ధాన్య' అనే ఎన్జీఓ స్థాపకురాలు?
1) వందనా శివ 2) బృందా కారత్
3) సుందర్‌లాల్ బహుగుణ 4) రాజేష్ బాబు

24. 'అప్పికో చలువాలి ఉద్యమం' ఎక్కడ జరిగింది?
1) కర్ణాటక 2) ఒడిశా
3) కేరళ 4) ఉత్తర్‌ప్రదేశ్

25. 'అప్పికో చలువాలి ఉద్యమం' ఎప్పుడు జరిగింది?
1) 1984 2) 1983
3) 1982 4) 1987

26. 'అప్పికో చలువాలి ఉద్యమాన్ని' ఎవరు ప్రారంభించారు?
1) సుందర్‌లాల్ బహుగుణ 2) మేధా పాట్కర్
3) పాండురంగ హెగ్డే 4) పైవారందరూ

27. 'డెవలప్‌మెంట్ ఆల్టర్‌నేటివ్స్' ఎవరి ఆధ్వర్యంలో స్థాపించారు?
1) పాండురంగ హెగ్డే 2) అశోక్ కోస్లా
3) సుందర్‌లాల్ బహుగుణ 4) మేధా పాట్కర్

28. 'అవతార్ ఉద్యమం' ఏ కంపెనీకి వ్యతిరేకంగా జరిగింది?
1) వేదాంత 2) టాటా
3) రిలయన్స్ 4) విప్రో

29. 'అవతార్ ఉద్యమం' ఎక్కడ జరిగింది?
1) ఒడిశా 2) కేరళ
3) కర్ణాటక 4) తెలంగాణ

30. 'గోండు' తెగ కుల దైవం?
1) పెద్దమ్మ తల్లి 2) బరాదియో
3) ఉప్పలమ్మ తల్లి 4) అమ్మోరు

31. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా 'వన్‌రాయ్' ఎక్కడ ఏర్పాటైంది?
1) ముంబయి 2) పుణె
3) బెంగళూరు 4) విజయవాడ

32. 'బీస్–నౌ' ఉద్యమనాయకురాలు?
1) అమృతాదేవి
2) బిందేశ్వర్ పాఠక్
3) అశోక్ చావ్లా
4) మేధా పాట్కర్



అమృతాదేవి

33. 'బీస్–నౌ ఉద్యమం' ఎక్కడ జరిగింది?
1) రాయ్‌గఢ్ 2) జోధ్‌పుర్
3) బీదర్ 4) విజయవాడ

34. సింగూరులో టాటా నానో ఫ్యాక్టరీ వివాదం ఏ రాష్ట్రంలో జరిగింది?
1) ఒడిశా 2) పశ్చిమ బెంగాల్
3) కర్ణాటక 4) కేరళ

35. నందిగ్రామ్ రసాయన ఫ్యాక్టరీ ఆందోళన ఎక్కడ జరిగింది?
1) కోల్‌కతా 2) ముంబయి
3) మద్రాసు 4) జోధ్‌పుర్

36. భారతదేశంలో తొలి పర్యావరణ ఉద్యమం?
1) బలియాపాల్ ఉద్యమం 2) బిష్ణోయ్ ఉద్యమం
3) అవతార్ ఉద్యమం 4) పైవన్నీ

37. 'బిష్ణోయ్ ఉద్యమం' ఏ వృక్షాలను రక్షించుకోవాలని జరిగింది?
1) ఖేజ్రి 2) టేకు
3) సాల్ 4) వెదురు

38. 'బిష్ణోయ్ ఉద్యమం' ఎప్పుడు జరిగింది?
1) 1730 2) 1740
3) 1750 4) 1760

39. 'బలియాపాల్ ఉద్యమం' ఎక్కడ జరిగింది?
1) ఒడిశా 2) కర్ణాటక
3) ఆంధ్రప్రదేశ్ 4) కేరళ

40. 'బలియాపాల్ ఉద్యమం' ఏ కారణం వల్ల జరిగింది?
1) క్షిపణి పరీక్షా కేంద్రానికి వ్యతిరేకంగా
2) పక్షుల సంరక్షణ కోసం
3) సాల్ వృక్షాల నరికివేతకు వ్యతిరేకంగా
4) నది కాలుష్య కారణంగా

41. 'బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ' ఎప్పుడు ఏర్పడింది?
1) 1883 2) 1884
3) 1885 4) 1886

42. 'బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ' ప్రచురించే జర్నల్స్?
1) హార్న్‌బిల్ అనే పత్రిక 2) నేచురల్ హిస్టరీ
3) 1, 2 4) ఏదీకాదు

43. 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్'ను ఎక్కడ ఏర్పాటు చేశారు?
1) న్యూదిల్లీ
2) హైదరాబాద్
3) వరంగల్
4) చెన్నై



44. 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' వ్యవస్థాపకులు?
1) అమృతాదేవి 2) అనిల్ అగర్వాల్
3) సునీతా నారాయణ్ 4) పైవారందరూ

45. 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' ప్రచురించే పత్రిక?
1) డౌన్ టు ఎర్త్ 2) హార్న్‌బిల్
3) నేచురల్ హిస్టరీ
4) దైనిక్ జాగరణ్

సమాధానాలు

1-2, 2-3, 3-1, 4-2, 5-1, 6-4, 7-1, 8-2, 9-1, 10-1, 11-2, 12-1, 13-2, 14-2, 15-2, 16-1, 17-2, 18-1, 19-1, 20-2, 21-1, 22-1, 23-1, 24-1, 25-2, 26-3, 27-2, 28-1, 29-1, 30-2, 31-2, 32-1, 33-2, 34-2, 35-1, 36-2, 37-1, 38-1, 39-1, 40-1, 41-1, 42-3, 43-1, 44-2, 45-1.

ఇమ్మిగ్రేషన్ అధికారుల వైఖరిని నిరసిస్తూ.. అమెరికాలో విస్తృత సమ్మె

వాషింగ్టన్: మినియాపొలిస్‌లో ట్రంప్ యంత్రాంగం ఆదేశాల మేరకు ఇమ్మిగ్రేషన్ అధికారులు వలసదారులపై అనుసరిస్తున్న కఠిన వైఖరికి వ్యతిరేకంగా శుక్రవారం దేశవ్యాప్త సమ్మె జరిగింది. ఇందులో భాగంగా పనిప్రదేశాలను, పాఠశాలలను, వాణిజ్య కార్యకలాపాలను నిలిపివేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ప్రవాసులకు వ్యతిరేకంగా కఠిన చర్యలు చేపట్టిన సరిహద్దు వ్యవహారాల అధికారులు కొందరు వారి కార్యకలాపాలపై వీడియో చిత్రీకరించేందుకు ప్రయత్నించిన అలెక్స్ ప్రెట్టి అనే వైద్య సహాయకుణ్ని కాల్చిచంపిన నేపథ్యంలో ఈ సమ్మె జరిగింది. పలువురు వ్యాపారులు ఈ సమ్మెలో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారి ఒకరు ఈ నెల 7న రెనీ గుడ్ అనే మహిళను కాల్చివేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమైంది.




'నిఫా'తో ప్రమాదం లేదు

ప్రపంచ ఆరోగ్య సంస్థ

ఇంటర్నెట్ డెస్క్: భారత్‌లోని పశ్చిమబెంగాల్‌లో ఇటీవల ఇద్దరికి 'నిఫా' వైరస్ సోకడంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం వైరస్ వ్యాప్తి కట్టడికి చర్యలు తీసుకుంటోంది. అయితే ఈ వైరస్ వ్యాప్తిపై భయంతో చైనా థాయ్‌లాండ్, నేపాల్, మలేసియా, తైవాన్ వంటి దేశాలు తమ దేశంలోకి వచ్చే భారతీయులకు స్క్రీనింగ్ టెస్టులు ప్రారంభించాయి. దీనిపై ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్ల్యూహెచ్‌వో) స్పందిస్తూ.. భారత్‌లో నిఫా ప్రభావం తక్కువగానే ఉందని.. దానితో ప్రమాదమేమీ లేదని ప్రపంచ దేశాలకు తెలిపింది. వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి భారత్ వేగవంతమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొంది. ఈ వైరస్ వల్ల భారత్‌పై ప్రయాణ, వాణిజ్య పరిమితులు విధించాల్సిన అవసరం లేదని డబ్ల్యూహెచ్‌వో ఆయా దేశాలకు సూచించింది. ఈ నిఫా వైరస్ ఒకరి నుంచి ఒకరికి వేగంగా వ్యాపిస్తున్నట్లు ఆధారాలు ఏమీ లేవని.. దీనివల్ల ప్రమాదం తక్కువేనని తెలిపింది. వ్యాధి బారిన పడిన ఇద్దరు వ్యక్తులు ఎటువంటి ప్రయాణాలు చేయలేదని భారత ప్రభుత్వం తెలిపినట్లు పేర్కొంది. అందువల్ల ఇది భారత్‌లోని ఇతర రాష్ట్రాలకు కూడా వ్యాపించే అవకాశం లేదని పేర్కొంది. మరోవైపు.. భారత్‌లో నిఫా వైరస్ వ్యాప్తి వేళ చైనా అప్రమత్తమైంది. భారత్ సహా వైరస్ ప్రభావిత ప్రాంతాల నుంచి వస్తున్న ప్రయాణికులకు చైనా విమానాశ్రయాల్లో స్క్రీనింగ్ ప్రక్రియ ప్రారంభించింది.

ఎప్‌స్టీన్ వివాదం.. 30 లక్షల పేజీల సమాచారం విడుదల

న్యూయార్క్: జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం ఉదంతంపై విచారణకు సంబంధించిన మరిన్ని ఫైళ్లను, పత్రాలను అమెరికా న్యాయ శాఖ శుక్రవారం విడుదల చేసింది. తాజాగా 30 లక్షల పేజీలకు పైగా పత్రాలను విడుదల చేసినట్లు డిప్యూటీ అటార్నీ జనరల్ టాడ్ బ్లాంష్ వెల్లడించారు. గత డిసెంబరులో విడుదల చేయకుండా ఆపేసిన కొన్ని లక్షల పేజీల సమాచారాన్ని కూడా దీంతో పాటే బహిర్గతం చేశామని ఆయన తెలిపారు. పలుకుబడి కలిగిన బడాబాబులకు ఎప్‌స్టీన్ బాలికల్ని లైంగిక ఎరగా వేయడం వంటి వివరాలతో కూడిన సమాచారాన్ని బహిర్గతం చేసేందుకు అమెరికా ప్రభుత్వం ఎప్‌స్టీన్ ఫైల్స్ ట్రాన్స్‌పరెన్సీ యాక్ట్ అనే చట్టాన్ని రూపొందించింది. దీని గురించిన సమాచారం తెలిపే ఫైళ్లు అన్నిటినీ గత డిసెంబరు 19న విడుదల చేయాలని అమెరికా పార్లమెంటు నిర్దేశించింది. అయితే వివాదంలో బాధితులైన బాలికల గోప్యతను పరిరక్షించేందుకు ఏ పత్రాలు విడుదల చేయాలి, ఏవి వదిలి వేయాలి అన్నది న్యాయవాదుల సాయంతో సమీక్షించిన అనంతరమే పత్రాలు విడుదల చేసినట్లు న్యాయశాఖ స్పష్టం చేసింది.



పిట్ట కొంచెం యోగా ఘనం

పన్నెండేళ్లకే దేశవ్యాప్తంగా శిక్షణ తరగతులు

ఈటీవీ భారత్: రాజస్థాన్‌లోని లూని ప్రాంత భక్రాసాని గ్రామానికి చెందిన ఓ సాధారణ కుటుంబం నుంచి వచ్చిన పరిణీతి బిష్ణోయ్ పన్నెండేళ్ల వయసుకే యోగాలో నిష్ణాతగా ఎదిగింది. సోమవారం జరిగిన గణతంత్ర దిన వేడుకల్లో రాజస్థాన్ సర్కారు ఆమెను రాష్ట్రస్థాయి పురస్కారంతో సత్కరించింది. ఈ చిరు ప్రాయంలో ఇప్పటికే దేశవ్యాప్తంగా దాదాపు 200 శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి లక్షలాది మందికి యోగా నేర్పింది. కొవిడ్ సమయంలోనూ ఇంకా చిన్నవయసులో ఆన్‌లైన్ తరగతులతో పలువురికి శిక్షణ ఇచ్చింది. అతి క్లిష్టమైన ఆసనాలను సునాయాసంగా వేసే పరిణీతి ఆసియా క్రీడలు, ఒలింపిక్స్ లాంటి అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాల్లో యోగాను చేర్చాలని, భారత్ తరపున పాల్గొని స్వర్ణపతకం సాధించాలన్నది తన కలగా తెలిపింది. తండ్రి రామచంద్ర బిష్ణోయ్ శిక్షణలో యోగా మెళకువలు నేర్చుకొన్న పరిణీతి జోధ్‌పుర్‌లో 'ఈటీవీ భారత్'తో మాట్లాడుతూ.. అయిదేళ్ల వయసు నుంచే యోగా ప్రారంభించినట్లు పేర్కొంది. ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర సామాజిక మాధ్యమాల్లో ఈమె వీడియోలను షేర్ చేయడంతో మరింత ప్రాచుర్యం లభించింది. యోగా గురువు బాబా రామ్‌దేవ్, క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ వంటి ప్రముఖులు పరిణీతి ప్రతిభను ప్రశంసించారు.

అమెరికా ఆర్థికశాఖపై ట్రంప్ దావా

- వెయ్యి కోట్ల డాలర్ల పరిహారం కోరిన అధ్యక్షుడు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశ అంతర్గత రెవెన్యూ సేవలు (ఐఆర్‌ఎస్), ఆర్థిక (ట్రెజరీ) విభాగాలపై కోర్టులో దావా వేశారు. ట్రంప్‌తో పాటు ఆయన ఇద్దరు కుమారులకు సంబంధించిన వ్యాపార, వ్యక్తిగత పన్ను రిటర్నుల సమాచారం లీక్ కాకుండా నిరోధించడంలో ఈ రెండు విభాగాలూ విఫలమయ్యాయని అందుకు వెయ్యి కోట్ల డాలర్ల నష్ట పరిహారం చెల్లించాలని ఫ్లోరిడా ఫెడరల్ కోర్టులో దాఖలు చేసిన దావాలో పేర్కొన్నారు. ట్రంప్ కుమారులు ఎరిక్ ట్రంప్, డొనాల్డ్ ట్రంప్ జూని యర్లు, వారి కుటుంబానికి చెందిన ట్రంప్ సంస్థలో ఈ కేసులో ఫిర్యాదుదారులు. 2024లో ట్రంప్‌నకు సంబంధించిన పన్నుల సమాచారాన్ని లీక్ చేశారన్న ఆరోపణపై ఐఆర్‌ఎస్ మాజీ కాంట్రాక్టర్ చార్లెస్ ఎడ్వర్డ్ లిటిల్ జాన్ అనే వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష విధించారు. ఈ సమాచారాన్ని లిటిల్‌జాన్ 2018, 2020 మధ్య కాలంలో "ద న్యూయార్క్ టైమ్స్", "ప్రో పబ్లికా" మీడియా సంస్థలకు అందించారని ప్రాసిక్యూషన్ అభియోగం. లిటిల్‌జాన్ చర్యలు ఓటర్లపై ప్రభావం చూపి 2020 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓటమికి కారణమైందని దావాలో పేర్కొన్నారు. లిటిల్ జాన్ లీక్ చేసిన సమాచారం తన ప్రతిష్ఠను దెబ్బతీయడంతోపాటు ఆర్థిక నష్టాన్ని కలిగించిందని ట్రంప్ పేర్కొన్నారు. లిటిల్ జాన్‌కు జైలు శిక్ష విధించిన నేపథ్యంలో ఆయన పని చేసిన బూజ్ అలెన్ హ్యామిల్టన్ సంస్థతో అమెరికా ఆర్థిక శాఖ ఈ వారం తెగతెంపులు చేసుకుంది. శిక్షకు గురైన లిటిల్ జాన్ ట్రంప్‌తో పాటు అమెరికాకు చెందిన వేల మంది ధనికుల పన్ను సమాచారాన్ని కూడా మీడియా సంస్థలకు ఉప్పందించాడు. ఈ సమాచారం లీక్ కావడాన్ని నిలువరించడంలో రెండు ప్రభుత్వ విభాగాలూ విఫలమయ్యాయని తాజా దావాలో ఫిర్యాదుదారులు ఆరోపించారు.

సోషల్‌మీడియా ఖాతా తెరవాలంటే.. అనుమతి ఉండాల్సిందే

- ప్రభుత్వ ఉద్యోగులకు బిహార్ ఆంక్షలు

పట్నా: ప్రభుత్వ ఉద్యోగుల సోషల్ మీడియా వినియోగానికి సంబంధించి బిహార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాతో పాటు యూట్యూబ్ వంటి ఆన్‌లైన్ వేదికల్లో ప్రవర్తనపై మార్గదర్శకాలను రూపొందించింది. ఉన్నతస్థాయి నుంచి కిందిస్థాయి ఉద్యోగులందరికీ ఇవి వర్తిస్తాయని స్పష్టం చేసింది. దీనికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఉద్యోగుల సోషల్ మీడియా వినియోగంపై నిషేధం విధించే ఉద్దేశం లేదని, డిజిటల్ వేదికల్లో హుందాగా వ్యవహరించేలా చూడడమే తమ ఉద్దేశమని బిహార్ ప్రభుత్వం పేర్కొంది.



మార్గదర్శకాలు ఇలా..

✦ ప్రభుత్వ ఉద్యోగి సోషల్ మీడియా ఖాతా తెరవాలంటే సంబంధిత శాఖ ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాల్సిందే. నకిలీ ఖాతాలు అనుమతించే ప్రసక్తే లేదు.

✦ అధికారిక హోదా, ప్రభుత్వ లోగో లేదా హోదాకు సంబంధించి ఎటువంటి పోస్టులూ ఆన్‌లైన్‌లో పెట్టకూడదు. ✦ వ్యక్తిగత సోషల్ మీడియా ఖాతాలకు ప్రభుత్వ ఈ-మెయిల్ ఐడీలు లేదా ప్రభుత్వ ఫోన్ నంబర్లను వాడొద్దు. ఉద్యోగుల వ్యక్తిగత అభిప్రాయాలకు ప్రభుత్వ హోదాతో సంబంధం లేదని స్పష్టంగా చెప్పడమే దీని ఉద్దేశం.

✦ అశ్లీలతో పాటు సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే సమాచారం.. కుల, మతాలను లక్ష్యంగా చేసుకొని చేసే పోస్టులపై నిషేధం.

✦ అధికారిక కార్యక్రమాలు, సమావేశాల వీడియోలు, ఫొటోలు కూడా ఆన్‌లైన్‌లో షేర్ చేయొద్దు.

✦ ఎటువంటి సమాచారాన్ని పోస్టు చేయాలి, షేర్ చేయవచ్చనే విషయంపై నిబంధనలను స్పష్టంగా పేర్కొన్నట్లు బిహార్ ప్రభుత్వం చెప్పింది.



అరుణాచల్‌ప్రదేశ్‌లోని లోహిత్ లోయలో చెలరేగిన కార్చిచ్చును నియంత్రించేందుకు వాయుసేనకు చెందిన ఎంఐ-17బి5 హెలికాప్టర్ నుంచి నీటిని వెదజల్లుతున్న దృశ్యం



భారతీయ రైల్వేలో.. ఎల్‌ఎన్‌జీ-డీజిల్ డెమూ రైలు

ఈటీవీ భారత్: భారతీయ రైల్వే కార్యకలాపాలకు సంబంధించి మరో కీలక ముందడుగు పడింది. పర్యావరణహిత రైల్వే సేవల్లో భాగంగా ద్రవరూప సహజ వాయువు డీజిల్ ఇంధన వ్యవస్థ కలిగిన డెమూ రైళ్లను విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఇప్పటికే ప్రయాణికులకు ఇవి సేవలు అందిస్తున్నాయని గుజరాత్‌లోని అహ్మదాబాద్ రైల్వే అధికారులు పేర్కొన్నారు. పర్యావరణ అనుకూలమైనవే కాకుండా తక్కువ ఖర్చుతో ప్రయాణించే ఈ తరహా రైలు దేశంలోనే మొదటిది కావడం గమనార్హం. ఈ ప్రాజెక్టు కింద 1,400 హెచ్‌పీ డెమూ రైలును రెండు ఇంధన వ్యవస్థలకు మార్చారు. తద్వారా ఇందులో వినియోగించే సంప్రదాయ ఇంధనంలో నలభై శాతాన్ని ద్రవరూప సహజ వాయువుతో భర్తీ చేస్తారు. ఇలా రూపొందించిన రైళ్లకు క్షేత్రస్థాయిలో 2వేల కి.మీ మేర ట్రయల్స్ నిర్వహించామని, ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయని అధికారులు తెలిపారు.

'సంచార్ సాథీ'తో కోటిన్నర మొబైల్ నంబర్లు బ్లాక్

వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం



ఇంటర్నెట్‌డెస్క్: సైబర్ నేరాలు, చోరీలను అరికట్టడానికి తీసుకొచ్చిన 'సంచార్ సాథీ' యాప్‌నకు వినియోగదారుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని కేంద్రం వెల్లడించింది. ఇప్పటివరకు 2 కోట్ల మందికి పైగా 'సంచార్ సాథీ'ని డౌన్‌లోడ్ చేసుకున్నట్లు కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. ఈ యాప్ సాయంతో చట్టవ్యతిరేక, అనుమానాస్పద కార్యకలాపాలతో సంబంధం ఉన్న 1.52 కోట్ల మొబైల్ నంబర్లను బ్లాక్ చేశామన్నారు. మోసపూరిత సిమ్‌లతో ముడిపడి ఉన్న 27 లక్షల వాట్సప్ ఖాతాలతో పాటు ఇతర డిజిటల్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్‌లను కూడా బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు.

400 మీటర్ల ప్రయాణం.. రూ.18వేలు వసూలు చేసిన ట్యాక్సీ డ్రైవర్

ముంబయిలో అమెరికన్ పర్యాటకురాలికి చేదు అనుభవం..

ముంబయి: భారత పర్యటనకు వచ్చిన ఓ అమెరికన్ పర్యాటకురాలికి చేదు అనుభవం ఎదురైంది. మహారాష్ట్ర రాజధాని ముంబయిలో కేవలం 400 మీటర్ల ప్రయాణానికి ఓ ట్యాక్సీ డ్రైవర్ ఏకంగా ఆమె నుంచి రూ.18వేలు వసూలు చేశాడు. ఈ మేరకు పర్యాటకురాలు 'ఎక్స్'లో పెట్టిన పోస్టుకు స్పందించిన పోలీసులు ఆ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అర్జెంటీనా అరియానో అనే ఎక్స్ ఖాతా వినియోగదారు బాధితురాలు. 'జనవరి ముంబయి విమానాశ్రయంలో దిగి స్టార్ హోటల్‌కు వెళ్లేందుకు ఓ ట్యాక్సీని మాట్లాడుకున్నాం. డ్రైవర్, మరో వ్యక్తి తెలియని ప్రదేశానికి తీసుకెళ్లారు. ఆ తర్వాత 400 మీటర్ల దూరంలోని ఓ హోటల్ వద్ద దింపారు. దీనికి నా నుంచి రూ.18,000 (200డాలర్లు) వసూలు చేశారు' అని 'ఎక్స్'లో రాసుకొచ్చారు. ఈ క్రమంలోనే ఆ ట్యాక్సీకి సంబంధించిన వివరాలు కూడా యూజర్ వెల్లడించారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ముంబయి పోలీసు విభాగానికి ట్యాగ్ చేయగా, ఎఫ్ఐఆర్ నమోదు చేసి ముంబయి పోలీసులు ట్యాక్సీ డ్రైవర్ దేశ్‌రాజ్ యాదవ్‌ను అరెస్టు చేశారు. ఆ పర్యాటకురాలిని సంప్రదించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ ఆమె సాధ్యం కాలేదని అధికారులు తెలిపారు. దేశ్‌రాజ్‌ను విచారించగా.. ఆ మహిళను అంధేరి ఈస్ట్ చుట్టూ 20 నిమిషాలు తిప్పి ఆ తర్వాత ఆమె ప్రాంతానికి తిరిగి తీసుకెళ్లి పక్కనే ఉన్న హోటల్ వద్ద దింపినట్లు అతడు అంగీకరించాడని అధికారులు తెలిపారు.

నికోబార్ ప్రాజెక్టులోకి ప్రయివేటు సంస్థలా!

కేంద్రంపై కాంగ్రెస్ విమర్శ

దిల్లీ: గ్రేట్ నికోబార్ ప్రాజెక్టులోకి ప్రయివేటు సంస్థలను తీసుకురావడమే గాక, జాతీయ భద్రత పేరుతో ఇందులోని కీలక వివరాలను ప్రజలకు వెల్లడించకుండా మోదీ సర్కారు బుల్డోజ్ చేయాలని చూస్తోందని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. అండమాన్ నికోబార్ దీవుల్లోని 'గలథియా బే' ఇంటర్నేషనల్ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ టెర్మినల్ (ఐసీటీటీ) ప్రాజెక్టును ప్రభుత్వ - ప్రయివేటు భాగస్వామ్యం (పీపీపీ)తో అభివృద్ధి చేయాలన్న ప్రతిష్ఠాత్మక ప్రణాళికతో కేంద్రం ముందుకు వెళుతోందన్న మీడియా నివేదికను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో షేర్ చేశారు. పర్యావరణపరంగా ఇది వినాశకరమైన ప్రభావం చూపుతుందన్న ఆధారాలు పుష్కలంగా ఉన్నట్లు పర్యావరణ శాఖ మాజీ మంత్రి అయిన జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ చట్టాలను ఉల్లంఘించేలా ఉన్న ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా కలకత్తా హైకోర్టులో, జాతీయ హరిత ట్రైబ్యునల్‌లో పిటిషన్లు పెండింగులో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు.

వింగో యాప్‌పై కేంద్రం నిషేధం

దిల్లీ: ఎస్ఎంఎస్ ఆధారిత వింగో యాండ్రాయిడ్ యాప్‌ను కేంద్ర హోంమంత్రిత్వశాఖ బ్లాక్ చేసింది. ఈ యాప్ ద్వారా వినియోగదారుల ఫోన్‌ల నుంచి మోసపూరిత ఎస్ఎంఎస్‌లు పంపుతున్నారని, వారిని మోసానికి సహాయకారులుగా వినియోగించుకుని పెద్ద ఎత్తున సైబర్ మోసాలు చేస్తున్నారని శుక్రవారం తెలిపారు. వినియోగదారులు తమకు తెలియకుండానే, ఈ ఎస్ఎంఎస్ మోసంలో భాగస్వాములవుతున్నారని చెప్పారు. దీనిపై పలు ఫిర్యాదులు అందడంతో యాప్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని, నాలుగు టెలిగ్రాం ఛానళ్లను, యాప్‌నకు ప్రచారం కల్పిస్తున్న 50 యూట్యూబ్ వీడియోలను కూడా నిషేధించామని వెల్లడించారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న వాడకందారుల ఫోన్ నంబర్ల నుంచి అసంఖ్యాక సందేశాలను ప్రసారం చేస్తూ ఆ నంబర్లను మ్యూల్ సాధనాలుగా వాడుకుంటున్నారని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ (ఐ4సీ) పేర్కొంది. దీని నుంచి ప్రసారమవుతున్న సందేశాలు 1.53 ఓట్ల మందికి ప్రతి రోజూ చేరుతున్నాయని తెలిపింది. దాదాపు 1.53 లక్షల మంది యాప్ వాడకందారుల్ని చిన్నచిన్న చెల్లింపుల సాయంతో ఆకట్టుకొని, తెలీకుండానే వారిని సైబర్ నేరాల్లో భాగస్వాముల్ని చేస్తున్నారని వివరించింది. "తమ ఎస్ఎమ్ఎస్ సందేశాలు ప్రసారం చేస్తే లాభాలు గడించవచ్చన్న ఆశ చూపి ఈ యాప్ వాడకందారుల్ని తన సైబర్ మోసాలకు వాడుకుంటోంది'' అని అదనపు డీసీపీ (సైబర) శవ్య గోయల్ తెలిపారు.

పాక్‌లో 52 మంది ఉగ్రవాదుల హతం

ఇస్లామాబాద్: బలూచిస్థాన్, పంజాబ్, ఖైబర్ పంఖ్తుఖ్వా, ప్రావిన్స్‌ల్లో జరిగిన వేర్వేరు ఆపరేషన్లలో 52 మంది ఉగ్రవాదులను భద్రతా దళాలు హతమార్చినట్లు పాక్ సైన్యం శుక్రవారం వెల్లడించింది. ఇందులో ఎక్కువ మంది పాకిస్థాన్ తెహ్రీకే తాలిబాన్ (టీపీపీ)కు చెందిన వారే ఉన్నారని పేర్కొంది.

కేసులెత్తేస్తున్నారు...కాసులివ్వండి!

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌లో

కొందరు నేతల అక్రమ వసూళ్లు

ఈనాడు, అమరావతి: గత వైకాపా ప్రభుత్వంలో పంచాయతీరాజ్ ఇంజినీర్లపై నమోదు చేసిన విజిలెన్స్ కేసులు కూటమి ప్రభుత్వం ఎత్తివేస్తోందని చెబుతూ ఇంజినీర్ల సంఘాల పేరుతో కొందరు నాయకులు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఒక్కో ఇంజినీర్ నుంచి రూ.లక్ష చొప్పున బలవంతంగా వసూలు చేస్తున్నారన్నది అభియోగం. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ నిధులతో చేపట్టిన రహదారుల పనులపై ఆ తర్వాత ఏర్పడిన వైకాపా ప్రభుత్వం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంతో విచారణ చేయించి, నాణ్యత లోపించినట్లు పలువురు ఇంజినీర్లపై కేసులు నమోదు చేయించింది. అకారణంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని ఇంజినీర్లు అప్పట్లో ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇంజినీర్ల విజ్ఞప్తులపై విజిలెన్స్ కేసుల విషయాన్ని కూటమి ప్రభుత్వం ఇటీవల పరిశీలనకు తీసుకుంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించింది. క్షేత్రస్థాయిలో పరిశీలన తర్వాత అక్రమ కేసులు ఎత్తి వేయాలన్న యోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకొని ఇంజినీర్ల సంఘాల నాయకులు కొందరు బాధితుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు వస్తున్నాయి. కేసులు ఎత్తి వేయించేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ఉన్నతాధికారులకు ముడుపులు ఇవ్వాల్సి ఉందని చెబుతున్నారని బాధిత ఇంజినీర్లు అంటున్నారు.

ఆరెస్సెస్ చీఫ్‌తో భాజపా అధ్యక్షుడి భేటీ

ఈనాడు, అమరావతి: ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్‌తో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శుక్రవారం భేటీ అయ్యారు. ఆరెస్సెస్ శతాబ్ది వేడుకల్లో భాగంగా రెండు రోజుల పర్యటన నిమిత్తం విజయవాడ వచ్చిన భాగవత్‌ను మాధవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై చర్చించారు. మరోవైపు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ముఖ్య ప్రతినిధులతోనూ భాగవత్ సమావేశమయ్యారు.

ఈశాన్య భారతీయులను అవమానించిన రాహుల్

- రాష్ట్రపతి ఇచ్చిన కండువా ధరించలేదు: అమిత్ షా

దిబ్రూగఢ్: గణతంత్ర దినోత్సవంనాడు 'ఎట్ హోమ్' కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇచ్చిన కండువా(గమోసా)ను ధరించడానికి నిరాకరించడం ద్వారా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈశాన్య భారత ప్రజల్ని అవమానించారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. విదేశీ అతిథులు సహా ప్రముఖులు అందరూ గౌరవపూర్వకంగా ఆ కండువాను ధరించారని, రాహుల్ ఒక్కరే తిరస్కరించారని పేర్కొన్నారు. దిబ్రూగఢ్‌లోని ఖనికర్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు. అస్సాం రాష్ట్ర సంస్కృతీ సంప్రదాయాలను రాహుల్ గాంధీ పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. అస్సాం అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ గతంలో చేసిందేమీ లేదన్నారు. 'తుపాకులు, బుల్లెట్లు, ఘర్షణలు, యువత మరణాలు మినహా అస్సాంకి కాంగ్రెస్ పార్టీ ఏమిచ్చిందని రాహుల్ గాంధీని ప్రశ్నిస్తున్నా. ఓటు బ్యాంకు రాజకీయాలకు చొరబాట్లను ఆయుధంగా కాంగ్రెస్ పార్టీ ఉపయోగించుకుంది. ఈ రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి చొరబాట్లు నిలిచిపోయాయి. అక్రమంగా భారత్‌కు వచ్చిన వారిని గుర్తించి వెనక్కి పంపించాం' అని అమిత్ షా తెలిపారు. అనంతరం ధెమాజీ జిల్లా కరెంగ్ చపోరీలో నిర్వహించిన మరో కార్యక్రమంలోనూ అమిత్ షా ప్రసంగించారు. అస్సాం జనాభా కూర్పును మార్చివేసిన చొరబాట్ల సమస్యను పరిష్కరించడానికి ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని తెలిపారు. చొరబాటుదారుల చెర నుంచి 1.26లక్షల ఎకరాల భూమిని విడిపించినట్లు చెప్పారు. భాజపా మాత్రమే అస్సాం ప్రయోజనాలను పరిరక్షించగలదని స్పష్టం చేశారు.

ఐరోపా దేశాలకు అస్సాం తేయాకు

ఈయూతో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాన్ని భారత దేశం కుదుర్చుకున్నందున అస్సాం తేయాకు సుంకాల చెల్లింపుల్లేకుండానే ఐరోపా దేశాలకు ఎగుమతి అవుతుందని అమిత్ తెలిపారు. ప్రధాని మోదీ చొరవతో అస్సాం టీ... పారిస్, బెర్లిన్ నగరాలకూ చేరుకుంటుందన్నారు.

ఆటిజం రుగ్మతకు మూలకణ చికిత్సలను అనామోదిత క్లినికల్ ప్రయోగాల్లో భాగం చేయొద్దు: సుప్రీం

దిల్లీ: ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ (ఏఎస్‌డీ)కి మూలకణ చికిత్సలను అనుమతుల్లేని, వ్యాపార ధోరణితో కొనసాగే క్లినికల్ ప్రయోగాల్లో భాగం చేయవద్దని సుప్రీంకోర్టు పేర్కొంది. ఎవరైనా వైద్యులు అలాంటి సేవలను అందిస్తున్నారంటే అనైతికానికి, దుష్ప్రవర్తనకు పాల్పడినట్లుగానే భావించాల్సి వస్తుందని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం శుక్రవారం స్పష్టం చేసింది. మూలకణ చికిత్స ద్వారా ఏఎస్‌డీ కచ్చితంగా నయమవుతుందనే శాస్త్రీయ ఆధారాలేవీ ప్రస్తుతం లేవని తెలిపింది. ఇటువంటి పరిస్థితుల్లో ఆటిజానికి మూలకణ చికిత్సలను వ్యాపార ధోరణితో క్లినికల్ ట్రయల్స్‌గా అందిస్తామనడాన్ని సమర్థించలేమంది. అయితే, ఇప్పటికే అలాంటి చికిత్సలు పొందుతున్న వారిని దాని నుంచి బయటకు వచ్చేయాలని తాము చెప్పడంలేదని ధర్మాసనం పేర్కొంది. అర్ధంతరంగా చికిత్స నుంచి బయటకు వస్తే రోగికి హానికలుగుతుందనే భయాందోళనలు ఉంటాయని ధర్మాసనం అభిప్రాయపడింది. సక్రమమైన విధానాల్లోనే బాధితులకు మూలకణ చికిత్స అందేలా చేయడానికి ఎయిమ్స్, జాతీయ మెడికల్ కౌన్సిల్ అధికారులను సంప్రదించి తగు పరిష్కారమార్గాన్ని కనుగొనాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శిని ఆదేశించింది. ఆటిజానికి మూలకణ చికిత్సలు, క్లినికల్ ప్రయోగాల విషయంలో చట్టపరమైన అస్పష్టతలు, లోపాలున్నాయని, వాటిని తొలగించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. మూలకణ చికిత్సతో ఆటిజం రుగ్మతను నయం చేస్తామంటూ పలు ఆసుపత్రులు ప్రచారం చేసుకుంటున్నాయని ఆరోపిస్తూ ముంబయికి చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణలో భాగంగానే ధర్మాసనం శుక్రవారం కీలకమైన వ్యాఖ్యలు చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

అర్టెమిస్-2 చంద్రమండల యాత్ర వాయిదా

- తీవ్ర శీతల వాతావరణమే కారణం

కేప్ కెనావెరాల్: ఐదు దశాబ్దాల తర్వాత చందమామ వద్దకు మానవులను పంపేందుకు అమెరికా అంతరిక్ష సంస్థ- నాసా తలపెట్టిన అర్టెమిస్-2 మిషన్‌లో జాప్యం చోటుచేసుకుంది. ప్రయోగ వేదిక అయిన ఫ్లోరిడాలోని కెనడీ అంతరిక్ష కేంద్రం వద్ద తీవ్రస్థాయి శీతల ఉష్ణోగ్రతలు నెలకొనే అవకాశం ఉందన్న సూచనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో రెండు రోజులు ఆలస్యంగా.. ఫిబ్రవరి 8 సమయంలో దీని ప్రయోగం జరిగే అవకాశం ఉంది.

అర్టెమిస్-2 యాత్ర కోసం ఉపయోగిస్తున్న 98 మీటర్ల పొడవైన స్పేస్ లాంచ్ సిస్టమ్ (ఎస్ఎల్ఎస్) రాకెట్‌కు శనివారం ఇంధనాన్ని నింపే పరీక్ష జరగాల్సి ఉంది. అయితే వాతావరణ పరిస్థితులపై ముందస్తు అంచనాల కారణంగా దాన్ని నిలిపివేయాల్సి వచ్చింది. పరిస్థితులు అనుకూలిస్తే అది సోమవారం జరిగే అవకాశం ఉంది. ఈ మార్పు నేపథ్యంలో వ్యోమగాములను చంద్రుడి దగ్గరకు పంపడానికి నాసాకు ఫిబ్రవరిలో 3 రోజుల అవకాశం మాత్రమే ఉంది. లేకుంటే యాత్రను మార్చికి వాయిదా వేయాల్సి ఉంటుంది. ఎస్ఎల్ఎస్ రాకెట్ పైభాగంలో ఉన్న ఒరాయన్ క్యాప్సూల్‌ను వేడిగా ఉంచడానికి హీటర్లను ఏర్పాటు చేశారు. మరోవైపు ఈ యాత్రలో పయనం కావాల్సిన కమాండర్ రీడ్ వైజ్‌మన్, పైలట్ విక్టర్ గ్లోవర్, మిషన్ స్పెషలిస్టు క్రిస్టీనా కోచ్, కెనడా వ్యోమగామి జెరీమీ హాన్సెన్‌లు హ్యూస్టన్‌లో క్వారంటైన్‌లో ఉన్నారు. వారు కెనెడీ అంతరిక్ష కేంద్రం వద్దకు ఎప్పుడు వస్తారన్నదానిపై స్పష్టత లేదు.

నాసా చివరిసారిగా 1972లో చందమామపైకి వ్యోమగాములను పంపింది. తాజా యాత్రలో వ్యోమగాములు 10 రోజుల పాటు రోదసియానం చేస్తారు. అందులో భాగంగా చందమామను చుట్టి వస్తారు. జాబిల్లిపై వ్యోమనౌక దిగదు. భవిష్యత్‌లో చేపట్టబోయే అర్టెమిస్ యాత్రలకు సన్నద్ధంగా వ్యోమనౌకకు సంబంధించిన అన్ని అంశాలనూ క్షుణ్నంగా పరిశీలించడం తాజా మిషన్ ఉద్దేశం. 2027లో చేపట్టే యాత్రలో వ్యోమగాములను చందమామ ఉపరితలంపై దించుతారు.

మామోగ్రఫీలో ఏఐ వినియోగం మేలు

రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు ఇది మెరుగైన విధానం

దిల్లీ: రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం వినియోగించే మామోగ్రఫీలో కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగిస్తే ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయని స్వీడన్‌లో నిర్వహించిన ఒక పరిశీలనలో వెల్లడైంది. సాధారణ మామోగ్రఫీ కన్నా ఇది ఉత్తమమని తేలింది. ఏఐ తోడ్పాటు వల్ల 20 శాతం మేర ఎక్కువగా క్యాన్సర్ బాధితులను గుర్తించొచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ తరహా స్క్రీనింగ్ చేయించుకున్నవారు తదుపరి రెండేళ్లలో.. వేగంగా వ్యాపించే లేదా ముదిరిపోయిన దశలో ఉన్న రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించే అవకాశం తక్కువని వివరించారు. అలాగే రేడియాలజిస్టులపై స్క్రీన్ రీడింగ్ పనిభారం 44 శాతం మేర తగ్గుతున్నట్లు తేల్చారు. ఈ ఏఐ వ్యవస్థకు 10 దేశాల్లోని అనేక సంస్థలు అందించిన రెండు లక్షల పరీక్షల ఫలితాలపై శిక్షణ ఇచ్చారు.

ఇజ్రాయెల్ దౌత్యాధికారిని బహిష్కరించిన దక్షిణాఫ్రికా

కేప్‌టౌన్ (దక్షిణాఫ్రికా): ఇజ్రాయెల్ ఉపరాయబారి ఏరియల్ సెయిడ్‌మన్‌పై దక్షిణాఫ్రికా ప్రభుత్వం బహిష్కరణ వేటు వేసింది. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసాకు వ్యతిరేకంగా సోషల్ మీడియా పోస్టులు పెట్టి అవమానపరచడం ద్వారా దౌత్య మర్యాదను అతిక్రమించిన కారణంగాఉపరాయబారికి వ్యతిరేకంగా ఈ నిర్ణయం తీసుకున్నామని, ఆయన 72 గంటల్లో దేశం విడిచి వెళ్లాలని స్పష్టం చేసింది. ఇజ్రాయెల్ తన దక్షిణాఫ్రికా రాయబారిని 2023లో ఉపసంహరించుకుంది. అప్పటి నుంచీ ఉపరాయబారి అయిన సెయిడ్‌మన్ రాయబార కార్యాలయ వ్యవహారాలకు నేతృత్వం వహిస్తున్నారు. తాజా పరిణామం నేపథ్యంలో ఇజ్రాయెల్ కూడా తమ దేశంలోని దక్షిణాఫ్రికా దౌత్యవేత్త షావున్ ఎడ్వర్డ్ బైనెవెల్డ్‌ను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించింది. 72 గంటల్లోగా దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. దక్షిణాఫ్రికా దీర్ఘకాలంగా పాలస్తీనా ప్రజలకు మద్దతు తెలుపుతుండటంతో ఇజ్రాయెల్‌తో దాని సంబంధాలు దెబ్బతిన్నాయి. గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడుతోందని దక్షిణాఫ్రికా ప్రకటించడంతో పరిస్థితులు మరింత దిగజారాయి.





రూ.31 వేల ఖర్చుతో పెళ్లి.. మధ్యతరగతికి ఊరట

ఈటీవీ భారత్: గుజరాత్‌లోని మెహసాణా జిల్లాలో ఒక సామాజిక సంస్థ తీసుకున్న నిర్ణయం పెళ్లిళ్ల ఖర్చు తలకు మించిన భారంగా మారిన ఎన్నో మధ్యతరగతి కుటుంబాలకు ఊరటనిస్తోంది. స్థానిక పటన్వాడా గజ్జర్ సుతార్ సమాజం అందరికీ అందుబాటులో ఉండేలా 'డైలీ మ్యారేజ్ స్కీం' ప్రారంభించి, కేవలం రూ.31 వేల ఖర్చుతో పెళ్లిళ్లు చేసుకునే అవకాశం కల్పిస్తోంది. "జంటలు తమ పెళ్లికి అనుకూలమైన రోజును వారే ఎంపిక చేసుకోవచ్చు. సమాజానికి చెందిన ఫంక్షన్ హాలు అందుబాటులో ఉంటుంది. పెళ్లి చేసుకునే కుటుంబం నుంచి రూ.31 వేలు విరాళంగా తీసుకుంటాం. మిగతా ఖర్చులన్నీ మేమే భరిస్తాం" అని సమాజం అధ్యక్షుడు దినేశ్‌భాయ్ సుతార్ తెలిపారు. పెళ్లిళ్ల పేరుతో వృథా ఖర్చులు పెరుగుతున్న ఈ రోజుల్లో సాదాసీదా జీవనశైలికి ప్రాధాన్యం ఇస్తూ, సామాజిక బాధ్యతతో ముందడుగు వేసిన పటన్వాడా గజ్జర్ సుతార్ సమాజం ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలుస్తోంది.

గాంధీజీ ఆశయ సాధనకు చిత్తశుద్ధితో పనిచేద్దాం

● సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి : స్వదేశీ, మహిళా సాధికారత, గ్రామ స్వరాజ్యం, పేదరిక నిర్మూలన వంటి గాంధీజీ ఆశయాల సాధనకు చిత్తుశుద్ధితో పనిచేద్దామని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఉండవల్లి నివాసంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. "ప్రజల్ని ఒక్కతాటిపైకి తెచ్చి దేశానికి స్వాతంత్ర్యం సాధించారు. సత్యం, అహింస, శాంతి, సేవ.. అనే బోధనలు ప్రతి ఒక్కరూ నిత్యం పాటించాలి" అని చంద్రబాబు ఎక్స్‌లో పేర్కొన్నారు.

● జాతి సమగ్రత, ఐక్యతను నిలబెట్టేందుకు మహాత్మాగాంధీ అనుసరించిన మార్గం అందరికీ ఆదర్శమని మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

● తెదేపా కేంద్ర కార్యాలయంలో పర్చూరి అశోక్ బాబు, మంతెన సత్యనారాయణరాజు తదితరులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గాంధీ కలలుగన్న ప్రజాస్వామ్య విలువలకు తెదేపా కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

సత్యం ఎప్పటికీ ఓడిపోదని చెప్పిన మహనీయుడు గాంధీజీ : జగన్

'సత్యం తాత్కాలికంగా ఓడినట్లుగా కనిపించవచ్చు.. కానీ, ఎప్పటికీ ఓడిపోదు అని చెప్పడమే కాక, తన చివరి శ్వాస వరకు సత్యానికి అంకితమై జీవితాన్ని గడిపిన మహనీయుడు మహాత్మాగాంధీ. జాతిపిత వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పిస్తున్నా' అని మాజీ ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

ఐజీఓటీ కర్మయోగి వేదికపై ఏపీ చరిత్ర సృష్టించింది

● సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి : కేంద్ర ప్రభుత్వ మిషన్ కర్మయోగి కార్యక్రమంలో భాగంగా నడుస్తున్న ఐజీఓటీ కర్మయోగి డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫాంను సద్వినియోగం చేసుకోవడంలో రాష్ట్రం ముందుండటంపై సీఎం హర్షం వ్యక్తం చేశారు. ఐజీఓటీలోని 2,400 కోర్సులను ఉద్యోగులు 80 లక్షల సార్లు పూర్తి చేసి రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపారని ఎక్స్ వేదికగా తెలిపారు. నైపుణ్యంతో కూడిన భవిష్యత్తు పరిపాలనకు రాష్ట్రం సిద్ధమవుతోందన్నారు. ఏపీ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సంఘం(ఏపీఎస్‌డీపీఎస్)ను అభినందించారు.

జైళ్ల అభివృద్ధికి నిధుల మంజూరు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని నాలుగు జైళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూ.54.39 కోట్ల నిధుల మంజూరుకు పరిపాలన అనుమతులు ఇచ్చింది. రాజమహేంద్రవరం, విశాఖలోని సెంట్రల్ జైళ్లు, రేపల్లెలోని సబ్ జైలు, కడపలోని మహిళా కారాగారంలో మౌలిక సదుపాయాలకు ఈ నిధులు మంజూరు చేసింది. రాజమహేంద్రవరం జైలు అభివృద్ధికి రూ.33.47 కోట్లు, విశాఖట్నం జైలుకు రూ.15కోట్లు, రేపల్లె సబ్ జైలుకు రూ.50లక్షలు, కడపలోని మహిళా కారాగారానికి రూ.5.42 కోట్లు మంజూరు చేసింది.

జైళ్ల శాఖ డీజీగా బాలసుబ్రమణ్యం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్‌గా ఎన్.బాలసుబ్రమణ్యం, రాష్ట్ర ఫోరెన్సిక్ ప్రయోగశాల డైరెక్టర్‌గా పీహెచ్‌డీ రామకృష్ణకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ అంజనీ కుమార్, ఫోరెన్సిక్ ప్రయోగశాల డైరెక్టర్ పాలరాజు శుక్రవారం పదవీ విరమణ చేశారు. దీంతో ఇప్పటివరకూ వారు నిర్వహిస్తున్న పోస్టులకు సంబంధించిన పూర్తి అదనపు బాధ్యతలను బాలసుబ్రమణ్యం, రామకృష్ణకు అప్పగించారు. బాలసుబ్రమణ్యం ప్రస్తుతం పోలీసు ఆర్గనైజేషన్ డీజీగా, రామకృష్ణ నిఘా విభాగం ఐజీగా బాధ్యతలు చూస్తున్నారు.

వైద్య ఆరోగ్య శాఖ ఒప్పంద ఉద్యోగులకు ఊరట

● 1,560 మందికి 100 శాతం గ్రాస్ శాలరీ వర్తింపు

ఈనాడు, అమరావతి: వైద్య ఆరోగ్య - కుటుంబ సంక్షేమ శాఖలో 2001-02 మధ్య నియమితులైన 1,560 మంది ఒప్పంద ఉద్యోగులకు 100 శాతం గ్రాస్ శాలరీ (జీతం, డీఏ, హెచ్ఆర్ఏతో కలిపి) అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిబంధన 2023 సెప్టెంబరు 14 నుంచి అమల్లోకి వచ్చేలా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వానికి ఏటా రూ.21.51 కోట్ల అదనపు భారం పడనుంది. 2023 సెప్టెంబరు 14 నుంచి 2024 మార్చి 31 వరకు బకాయిలు రూ.16.51 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. దీనిపై ఏపీ పారామెడికల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీపీఎంఎస్‌ఈడబ్ల్యూఏ) హర్షం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు సంఘం అధ్యక్షుడు లంకా మణికాంత్, ప్రధాన కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, కోశాధికారి ఎస్.రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ ఎండీగా కృష్ణబాబుకు అదనపు బాధ్యతలు

ఈనాడు, అమరావతి: రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుకు ఏపీఎస్ఆర్టీసీ ఎండీ, ప్రజారవాణా శాఖ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఆర్టీసీ ఎండీగా ఉన్న ద్వారకా తిరుమలరావు పదవీకాలం శనివారంతో ముగుస్తుండడంతో ఆయన స్థానంలో కృష్ణబాబుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

జ్యోతి యర్రాజీకి గ్రూప్-I ఉద్యోగం, 500 గజాల ఇంటి స్థలం

● ప్రభుత్వ ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత జ్యోతి యర్రాజీకి విశాఖలో 500 గజాల ఇంటి స్థలం, ఏపీ బిజినెస్ రూల్స్‌కు అనుగుణంగా గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చేలా ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా శాప్ ఎండీని ఆదేశించింది. ఆమె జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు భూమి కేటాయింపు

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు-అమరావతి: రాష్ట్రంలో వివిధ విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, విద్యా సంస్థ దేవాలయాల నిర్మాణానికి వేర్వేరు జిల్లాల్లో భూములు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం తూముకుంట, వెలిగల్లులో 1,240.57 ఎకరాలను 600 మెగావాట్ల అల్ట్రా సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్‌కు 33 ఏళ్ల కాలానికి లీజుపై కేటాయించింది. ఎకరానికి తూముకుంటలో రూ.20 వేలు, వెలిగల్లులో రూ.25 వేల చొప్పున లీజుపై కేటాయిస్తారు. ప్రతి ఐదేళ్లకు 10 శాతం చొప్పున లీజు మొత్తాన్ని పెంచుతారు. గాలివీడులో 52.99 ఎకరాలను 30 ఏళ్లకు, ఎకరా రూ.31 వేల చొప్పున లీజు నిర్ణయించారు. రెండేళ్లకోసారి లీజు మొత్తాన్ని 5% చొప్పున పెంచుతారు.

● అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం తలారి చెరువు, ఆలూరు గ్రామాల్లోని వేర్వేరు సర్వే నంబర్లలో 2,648.08 ఎకరాలను సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్‌కు బదలాయించారు. తలారిచెరువులో ఎకరానికి రూ.31,500, ఆలూరులో ఎకరానికి రూ.25,000 చొప్పున 33 ఏళ్ల కాలానికి కేటాయించారు.

● ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం వాగెమడుగులో 1,069.15 ఎకరాలను, పీసీపల్లి మండలం పెదఇర్లపాడులో 475.57 ఎకరాల్ని, రిలయన్స్ ఆధ్వర్యంలో నిర్మించే కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి ఎకరానికి రూ.15 వేల చొప్పున లీజు పద్ధతిపై 30 ఏళ్ల కాలానికి నెడ్‌క్యాప్ పేరుతో కేటాయించారు. రెండేళ్లకోసారి 5% చొప్పున లీజు మొత్తాన్ని పెంచాలని నిర్దేశించారు.

● నంద్యాల జిల్లా గడివేముల మండలం గనిలో 1,000 మెగావాట్ల అల్ట్రామెగా సోలార్ పార్కు ఏర్పాటుకు 542.27 ఎకరాలను ఎకరానికి రూ.20 వేల లీజుపై 33 ఏళ్లకు కేటాయించారు. లీజు మొత్తం ఐదేళ్లకోసారి 10% పెరుగుతుంది.

● ప్రకాశం జిల్లా గుడ్లూరు మండలం రాపూరులో మారిటైమ్ బోర్డుకు 70.61 ఎకరాలను ఎకరా రూ.15 లక్షల చొప్పున మొత్తం రూ.10.59 కోట్లకు కేటాయించారు. చేవూరులో 16.46 ఎకరాలను ఎకరానికి రూ.20.12 లక్షల చొప్పున లీజుకు కేటాయిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

● కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం బనవాసిలో మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు కోసం 77.37 ఎకరాల్ని ఏపీఐఐసీకి కేటాయించారు.

● అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం నందకోటలో ఐదు నక్షత్రాల హోటల్, కన్వెన్షన్ కేంద్రం, ఎమ్యూజ్‌మెంట్ థీమ్‌పార్కు నిర్మాణానికి ఏపీ టూరిజం కార్పొరేషన్‌కు వేర్వేరు సర్వే నంబర్లలో 12.59 ఎకరాలను..ఎకరానికి రూ.7 లక్షల చొప్పున కేటాయించారు.

● ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం రాఘవాపురం గ్రామ పరిధిలోని ఐఎస్ జగన్నాథపురంలో సాయిబాబా దేవస్థాన నిర్మాణం కోసం ఎకరం రూ.30 లక్షల చొప్పున కొచ్చెర్లకోట లలితమ్మకు కేటాయించారు.

● అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం వలసపల్లెలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం ఉచితంగా 6.09 ఎకరాలు కేటాయించింది.

పాపాలు చేసి దుష్ప్రచారాలకు దిగారు

● తిరుమల ప్రతిష్ఠకు వైకాపా నేతలు భంగం కలిగించారు

● కూటమిని విడదీయడం ఎవరితరం కాదు

● కార్యకర్తల శిక్షణలో మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: గత వైకాపా ప్రభుత్వ పెద్దలు తితిదేలో చేయకూడని పాపాలన్నీ చేసి, ఇప్పుడు తప్పుడు ప్రచారాలతో ప్రజల్ని మభ్యపెట్టాలని చూస్తున్నారని మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. శ్రీవారి ప్రతిష్ఠకు, తితిదే గౌరవానికి వైకాపా నేతలు భంగం కలిగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ నాయకులు దుష్ప్రచారాలకు దిగారని, వాటిని వాస్తవాలతో తిప్పికొట్టాలని తెదేపా కార్యకర్తలకు లోకేశ్ పిలుపునిచ్చారు. ఉండవల్లి నివాసంలో పట్టణ, వార్డు, మండల స్థాయి తెదేపా అధ్యక్షులు, ప్రధానకార్యదర్శుల శిక్షణలో శుక్రవారం ఆయన మాట్లాడారు. 'కూటమిని చీల్చేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయి. కూటమిని విడదీయటం ఎవరితరం కాదు. గ్రామ స్థాయి నుంచి మూడు పార్టీల నేతలు కలిసి పనిచేయాలి. తెదేపా కార్యకర్తలు ఇందుకు చొరవ తీసుకోవాలి. తప్పుడు ప్రచారాలతో రాజకీయాలు చేసే శక్తుల్ని ఐకమత్యంతో దీటుగా ఎదుర్కోవాలి' అని సూచించారు.

అలకలొద్దు.. కష్టపడే వారిని పార్టీ గుర్తిస్తుంది

'నాయకులు, కార్యకర్తలు అలగడం తగదు. ప్రతి ఒక్కరి కష్టాన్ని తప్పకుండా పార్టీ గుర్తిస్తుంది. కూర్చొని మాట్లాడుకుంటే ప్రతి సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లాలి. 2014-19లో మనం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశాం. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వెనుకబడ్డాం. 2019లో అదే మన ఓటమికి ప్రధాన కారణంగా నిలిచింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని ఇంటింటికీ వెళ్లి చెప్పాలి' అని లోకేశ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తెదేపా మానవవనరుల విభాగం ఛైర్మన్ వేపాడ చిరంజీవిరావు పాల్గొన్నారు.

38 ప్రైవేటు జూనియర్ కళాశాలల ఏర్పాటుకు అనుమతి

ఈనాడు, అమరావతి: కొత్తగా 38 ప్రైవేటు జూనియర్ కళాశాలల ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త ప్రైవేటు కళాశాలల ఏర్పాటుకు ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రకటన విడుదల చేస్తుంది. 26 మండలాల్లో 32, రెండు పురపాలికల్లో 6 కళాశాలల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. వచ్చే విద్యా సంవత్సరం 2026-27 నుంచి వీటిని ప్రారంభించేందుకు అనుమతిస్తూ, తదుపరి చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శిని ఆదేశించింది.

విద్యా హక్కు చట్టం కింద ప్రవేశాలకు అనుమతి

విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలు నిర్వహించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే విద్యా సంవత్సరం ప్రవేశాలు నిర్వహించేందుకు రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని పేర్కొంది. ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం చెల్లించాల్సిన వ్యయాన్ని నిర్ధారించేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించింది.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి నిధుల విడుదల

ఇంటర్మీడియట్ విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. గతంలో ఇచ్చిన పరిపాలన అనుమతులను సవరించింది. విద్యార్థుల సంఖ్య పెరగడంతో గతంలో అనుమతించిన రూ.85.84 కోట్లను రూ.91.33 కోట్లకు పెంచింది. రాష్ట్ర వ్యాప్తంగా 475 ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు.

ఉచిత పాఠ్యపుస్తకాల ముద్రణ టెండర్లు ఖరారు

గతేడాదితో పోలిస్తే రూ.11.50 కోట్ల తగ్గుదల

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాల ముద్రణ టెండర్లను పాఠశాల విద్యాశాఖ ఖరారు చేసింది. జాతీయస్థాయిలో పిలిచిన ఈ టెండర్లలో మహారాష్ట్రలోని కొల్హాపూర్, ముంబయికి చెందిన ప్రింటర్లు ఎల్1గా నిలిచారు. మల్టీకలర్ 128 పేజీల పుస్తకాలకు ఒక్కో పేజీకి రూ.0.05.8 పైసలకు అస్తవినాయక్ కోట్ చేయగా.. 128 పేజీల కంటే ఎక్కువ ఉండే పుస్తకాలకు ముంబయి ప్రింటర్స్ షఫ్రాన్ ఒక్కో పేజీ ముద్రణకు రూ.0.06పైసలకు కోట్ చేసింది. గతేడాదితో పోలిస్తే ధర తగ్గింది. జాతీయస్థాయిలో టెండర్లు పిలిచి, మహారాష్ట్రకు చెందిన సంస్థలకు ప్రింటింగ్ ఆర్డర్లు రావడంపై స్థానిక చిన్న ప్రింటర్లు తమకు పని లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ తరహాలో రాష్ట్రంలోని ప్రింటర్లకే పనులు అప్పగించేలా టెండర్లు పిలిస్తే చిన్న ప్రింటర్లకు ఉపాధి లభిస్తుందని పేర్కొంటున్నారు. పుస్తకాల ప్రింటింగ్‌కు పేపర్ సరఫరా టెండర్ కిలో పేపర్‌కు జీఎస్టీతో కలిపి రూ.96.70కు టెండర్లు ఇవ్వగా.. గతేడాది కిలో పేపర్‌కు రూ.101 చొప్పున చెల్లించారు. ఉచిత పాఠ్యపుస్తకాల ముద్రణ, పేపర్ సరఫరా టెండర్లలో ఈ ఏడాది సుమారు రూ.11.50 కోట్లు మిగిలాయని, ధర తగ్గడంతో ప్రజాధనం ఆదా అయ్యిందని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది.

అన్నా..ఎటూ దారి లేదు..మేం చనిపోతున్నాం!

● నాంపల్లి అగ్నిప్రమాదంలో మృతుడు ఇంతియాజ్ చివరి మాటలు

● అమ్మా అమ్మా అంటూ చిన్నారుల ఆర్తనాదాలు

● చనిపోయేముందు మాట్లాడిన కాల్ రికార్డింగ్ వెలుగులోకి..



ఇంతియాజ్

అబిడ్స్, న్యూస్‌టుడే: మృత్యుముఖంలో ఉన్నట్లు అతనికి అర్థమైపోయింది.. ఏంచేయాలో తెలియని నిస్సహాయ స్థితి.. అగ్ని ప్రమాదంలో చిక్కుకుని విలవిలలాడుతున్న అలాంటి స్థితిలో అతను తన పరిస్థితిని స్నేహితుడికి ఫోన్‌లో వివరించారు. ఇటీవల హైదరాబాద్ నాంపల్లిలోని బచ్చాస్ ఫర్నిచర్ దుకాణంలో జరిగిన అగ్నిప్రమాదంలో మృత్యువాత పడిన ఇంతియాజ్ హృదయవిదారక పరిస్థితి ఇది. అతను చివరిసారిగా చేసిన ఫోన్ కాల్ రికార్డింగ్ శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఈ అగ్నిప్రమాదంలో మొత్తం ఐదుగురు మరణించిన సంగతి తెలిసిందే. షార్ట్‌సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటల్లో చిక్కుకున్న ఇద్దరు చిన్నారులు, వృద్ధురాలిని కాపాడేందుకు లోపలకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులూ మృతిచెందారు. వారిలో ఒకరైన ఇంతియాజ్ బయట ఉన్న స్నేహితుడితో ఫోన్‌లో మాట్లాడిన చివరి మాటలు ఇవి...

ఇంతియాజ్: అన్నా..ఇక్కడి నుంచి వెనక్కి వచ్చేందుకు ప్లేస్ లేదు. మేం చనిపోతున్నాం అన్నా..

స్నేహితుడు: వెనుక వైపు ఉన్న తలుపు నుంచి రా..

ఇంతియాజ్: అన్నా ఎటూ దారిలేదు..దర్వాజాలన్నీ మూసి ఉన్నాయి. ఇద్దరు పిల్లలున్నారు, మేం చనిపోతాం.

స్నేహితుడు: గ్రిల్ గేట్ గుండా సెకండ్ సెల్లార్ నుంచి పో..

ఇంతియాజ్: ఇక్కడ తలుపు తెరుచుకోవట్లేదు అన్నా..

స్నేహితుడు: నేనూ ఏం చెయ్యలేని పరిస్థితి. సెకండ్ సెల్లార్ నుంచి రా..

ఇంతియాజ్: లేదు అన్నా ఏదీ కనిపించడం లేదు. పిల్లలు కూడా ఉన్నారు నాతో..అన్నా అటువైపు తలుపులు తెరవమని సమీర్‌తో చెప్పు..

స్నేహితుడు: సెకండ్ సెల్లార్‌లోకి పిల్లల్ని తీసుకొని దూకు..

ఇంతియాజ్: అన్నా ఏమీ తెలియట్లేదు. పిల్లలు ఎక్కడున్నారో తెలియట్లేదు. మేము వెళ్లలేం అన్నా..

స్నేహితుడు: టార్చి తీసుకొని చూడు.. అక్కడ ఎవరెవరు ఉన్నారు..

ఇంతియాజ్: అన్నా మేం ముగ్గురం ఉన్నాం(ఊపిరాడని స్థితిలో హృదయవిదారకంగా పిల్లల ఆర్తనాదాలు వినిపించాయి)

స్నేహితుడు: ఆగు..నేను పంపిస్తున్నా..(ఈ మాట పూర్తవ్వగానే రికార్డింగ్ ఆగిపోయింది)

ఈహెచ్‌ఎస్ కమిటీలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు చోటు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్‌ఎస్) సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీలో ఇద్దరు ఉద్యోగ సంఘాల అధ్యక్షులను ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రభుత్వం చేర్చింది. ఈ మేరకు ఏపీ సెక్రటేరియట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రామకృష్ణ, ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణలకు చోటు కల్పిస్తూ వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన అభ్యర్థనలు పరిశీలించిన అనంతరం వీరిని చేర్చింది. గతంలోనే ఈ కమిటీలో సభ్యులుగా ఏపీ నాన్ గెజిటెడ్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుకు చోటు కల్పించింది.

ఈహెచ్‌ఎస్ సమస్యలపై చర్చ

తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్న ఆహ్వానితులు, ఈహెచ్‌ఎస్ కమిటీ సభ్యులతో సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. పథకం అమలు తీరు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. ఉద్యోగులు, ప్రభుత్వం ద్వారా చెల్లించే సొమ్ము నేరుగా ట్రస్ట్ ఖాతాలో జమ, ప్యాకేజీ ధరల పెంపు, విశ్రాంత సీపీఎస్ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ కార్డుల మంజూరు, వార్షిక ఆరోగ్య తనిఖీలు, 25 దీర్ఘకాలిక వ్యాధులకు ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్యం, మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిమితి రూ.5 లక్షలకు పెంపు తదితర అంశాలు చర్చకు వచ్చాయి. వీటిని అమలు చేస్తే ఎంత ఖర్చవుతుందో వచ్చే సమావేశంలోగా కమిటీ ముందు ఉంచాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 2017లో నిర్ణయించిన 1,850 ప్రొసీజర్ల టారిఫ్ ధరలు నేటికీ పెంచకపోవడం, బకాయిలు చెల్లించకపోవడం వల్ల పథకం అమలుకు ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యం పూర్తి సహకారం అందించట్లేదని పేర్కొన్నారు.

నాపై కేసును కొట్టేయండి

● హైకోర్టులో పేర్ని నాని వ్యాజ్యం

ఈనాడు, అమరావతి: మచిలీపట్నం-ఇనగుదురుపేట పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ వైకాపా నేత, మాజీ మంత్రి పేర్ని నాని శుక్రవారం హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసు ఆధారంగా తనపై తదుపరి చర్యలన్నింటినీ నిలిపివేయాలని కోరారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లను దూషించడంతోపాటు అవమానించేలా పేర్ని నాని వ్యాఖ్యలు చేశారంటూ తెదేపా నాయకుడు పిప్పళ్ల వెంకట కాంతారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఈ నెల 27న ఇనగుదురుపేట పోలీసులు పేర్ని నానిపై కేసు నమోదు చేశారు.

ఏపీఎంఈఆర్‌సీ ఎండీగా చక్రధర్‌బాబు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ కార్పొరేషన్ (ఏపీఎంఈఆర్‌సీ) వీసీ-ఎండీగా సెకండరీ హెల్త్ డైరెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబుకు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. గతంలో ఈ బాధ్యతలు చూసే ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ గిరీశా బెంగళూరులోని కేంద్ర సిల్క్ బోర్డుకు బదిలీపై వెళ్లడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

730 మంది ఎంపీహెచ్‌ఏల పునర్నియామకానికి అనుమతి

ఈనాడు, అమరావతి: సుప్రీంకోర్టు ఆదేశాల అమలులో భాగంగా 730 మంది మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల(పురుష) పునర్నియామకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీరిని ఒప్పంద ప్రాతిపదికన విధుల్లోకి తీసుకోవాలని పేర్కొంది.

పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా దామోదరనాయుడి నియామకం చెల్లదు

● జీవోను రద్దు చేసిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా డాక్టర్ టి. దామోదరనాయుడిని పునర్నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం గతేడాది ఆగస్టు 6న జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. ఆయన నియామకం నిబంధనలకు విరుద్ధంగా ఉందని స్పష్టంచేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ గురువారం ఈ మేరకు తీర్పు ఇచ్చారు. పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన దామోదరనాయుడిని తిరిగి నియమిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గతేడాది ఆగస్టు 6న జీవో 285 జారీచేశారని, దానిని రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఏపీ పశుసంవర్ధక గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం అధ్యక్షుడు సీహెచ్ ఎస్ కృష్ణారావు, ఏపీ పశుసంవర్ధక ఆఫీసర్స్ సర్వీసు అసోసియేషన్ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, ఏపీ పశువైద్యుల అసిస్టెంట్ సర్జన్స్ సర్వీసు అసోసియేషన్ అధ్యక్షుడు టి.జయప్రకాశ్, పశుసంవర్ధకశాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ పాముల సత్యకుమారి ఈ వ్యాజ్యాలు దాఖలు చేశారు. వారి తరఫున న్యాయవాదులు పి.దుర్గాప్రసాద్, జీవీఎస్ కిశోర్‌కుమార్ వాదనలు వినిపించారు. దామోదరనాయుడిని డైరెక్టర్‌గా రెగ్యులర్ పోస్టులో నియమించడం వల్ల సీనియార్టీ ప్రకారం డైరెక్టర్ పోస్టుకు అర్హత ఉన్న అధికారులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఆయన నియామకం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఇటీవల జరిగిన విచారణలో ఈ వ్యాజ్యాలపై వాదనలు పూర్తి కావడంతో తీర్పును రిజర్వు చేసిన న్యాయమూర్తి గురువారం నిర్ణయాన్ని ప్రకటించారు.



నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు. చిత్రంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్ కుమార్, ఆదిత్య బిర్లా కంపెనీ ప్రతినిధులు తదితరులు

రాష్ట్రంలో తొలి కో-వర్కింగ్ స్పేస్ సెంటర్

● ప్రారంభించిన సీఎం చంద్రబాబు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పం స్వర్ణ నవ దిశ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శుక్రవారం కుప్పంలో ప్రారంభించారు. ఈ భవనంలోనే ఏర్పాటుచేసిన.. రాష్ట్రంలో తొలి కో-వర్కింగ్ స్పేస్ సెంటర్‌ను ఆయన ఆరంభించారు. 50 మంది ఒకేచోట పని చేసేలా ఈ కేంద్రాన్ని రూపొందించినట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో రూ.కోటి వ్యయంతో అదే భవనంలో డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు చేశారు. మల్టీ స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 2500 కుటుంబాలు లబ్ధి పొందనున్నాయని, 20 వేల మంది యువతకు నైపుణ్యం, సాధికారత లభించేలా ఈ కేంద్రం పనిచేయనుందని వివరించారు. ఆదిత్య బిర్లా మల్టీ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ద్వారా.. వచ్చే మూడేళ్లలో వెయ్యి మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్ తదితరులు పాల్గొన్నారు.

ట్రైబ్యునల్ సభ్యుడిగా దేవాదాయశాఖ కార్యదర్శికి అదనపు బాధ్యతలు

ఈనాడు, అమరావతి: దేవాదాయశాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి హరిజవహర్‌లాల్‌కు దేవాదాయ ట్రైబ్యునల్ సభ్యుడిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఆ శాఖ అదనపు కమిషనర్ టి.చంద్రకుమార్ ట్రైబ్యునల్ సభ్యుడిగా కొనసాగారు. శనివారం ఆయన పదవీ విరమణ చేస్తుండటంతో ఆ బాధ్యతలు దేవాదాయశాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శికి అదనంగా అప్పగించారు. మరోవైపు దేవాదాయశాఖ కమిషనరేట్‌లో ఉపకమిషనర్‌గా ఉన్న రత్నరాజుకి తాత్కాలికంగా సంయుక్త కమిషనర్‌గా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది.

పొగాకు రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోండి

● సిగరెట్లపై పన్ను పెంపును తాత్కాలికంగా నిలిపేయండి

● ప్రధాని మోదీకి ఎంపీ పురందేశ్వరి లేఖ

ఈనాడు, దిల్లీ: సిగరెట్లపై పన్ను పెంపు ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్నందున పొగాకు సాగుపై ఆధారపడి జీవిస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఈ అంశం రైతుల ఆదాయాలను తీవ్రంగా తగ్గించే ప్రమాదం ఉన్నందున సిగరెట్లపై పన్ను పెంపును తాత్కాలికంగా నిలిపివేయాలని ఆమె ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం లేఖ రాశారు. లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలు లేకపోవడంతో తూర్పుగోదావరి జిల్లాలోని రైతులు దశాబ్దాలుగా ఎఫ్‌సీవీ పొగాకు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సిగరెట్లపై పన్ను పెంచడం వల్ల వాటికి డిమాండ్ తగ్గి రైతుల ఆదాయం పడిపోయే అవకాశం ఉందన్నారు. రైతులు, పరిశ్రమ ప్రయోజనాల మధ్య సమతుల్యం పాటించే విధంగా పన్ను విధానాన్ని ఖరారు చేయడానికి నిపుణుల కమిటీని ఏర్పాటుచేసి, అందరితో చర్చించి ఒక నిర్ణయానికి రావాలని కోరారు.

సిట్ క్లీన్‌చిట్ ఇచ్చినట్లు వైకాపా వాళ్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటు

● మంత్రి వాసంశెట్టి సుభాష్

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వినియోగించిన వ్యవహారంలో సిట్ తమకు క్లీన్‌చిట్ ఇచ్చినట్లు సాక్షి మీడియాలో వైకాపా వాళ్లు తప్పుడు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని మంత్రి వాసంశెట్టి సుభాష్ ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి సప్తగిరుల్ని ఐదు కొండలంటూ భక్తుల మనోభావాల్ని దెబ్బతీశారు. డిక్లరేషన్ ఇవ్వకుండా జగన్ శ్రీవారి ఆలయానికి వెళ్లడం, ప్రసాదాన్ని తక్కువ చేసి మాట్లాడటం, ఇంట్లోనే ఆలయ సెట్టింగ్‌లు వేసుకోవడం అలవాటుగా పెట్టుకున్నారు" అని గుర్తుచేశారు.

19 నుంచి తెలంగాణ ఎప్‌సెట్ దరఖాస్తులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని బీటెక్, బీఫార్మసీతోపాటు బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశానికి ఈఏపీసెట్ (ఎప్‌సెట్)కు దరఖాస్తుల స్వీకరణ ఫిబ్రవరి 19వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పీజీఈసెట్‌కు ఫిబ్రవరి 27 నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలవుతుంది. ఎప్‌సెట్‌తోపాటు పీజీఈసెట్ తొలి కమిటీ సమావేశాలు శుక్రవారం జేఎన్‌టీయూ-హెచ్‌లో నిర్వహించారు. దరఖాస్తుల షెడ్యూల్‌ను ఖరారు చేశారు.

పూర్తి షెడ్యూల్

విషయం	ఎప్‌సెట్	పీజీఈసెట్
నోటిఫికేషన్ విడుదల	ఫిబ్రవరి 14	ఫిబ్రవరి 23
దరఖాస్తులు ప్రారంభం	ఫిబ్రవరి 19	ఫిబ్రవరి 27
ఆలస్య రుసుం లేకుండా గడువు	ఏప్రిల్ 4	మే 6
పరీక్ష తేదీలు	అగ్రికల్చర్ మే 4, 5	మే 28-31 వరకు
	ఇంజినీరింగ్	మే 9-11

ఇలా పరీక్ష పూర్తి.. అవిగో మార్కులు!

ఎప్‌సెట్, పీజీఈసెట్ అంటే తెలుగు రాష్ట్రాల్లోని లక్షలమంది విద్యార్థుల జీవితాల్లో కీలకమైన పరీక్షలు. దరఖాస్తు చేసుకుంది మొదలు ఫలితాలు వచ్చేవరకు రోజులు, నెలలు ఉత్కంఠగా ఎదురు చూస్తుంటారు. కానీ ఇకపై ఆ పరిస్థితి ఉండదు. ఈ ఏడాది నుంచి పలు విప్లవాత్మక మార్పులు ప్రవేశపెట్టనుండటంతో విద్యార్థుల పరీక్ష పూర్తవగానే అప్పటికప్పుడే ఎన్ని మార్కులు వచ్చాయో తెలుసుకోవచ్చు. ఎంత ర్యాంకు వస్తుందో అంచనాకు రావొచ్చు. ఈ ఏడాది నుంచే ఈ విధానం అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. జేఎన్‌టీయూ-హెచ్‌లో శుక్రవారం జరిగిన ఉమ్మడి ప్రవేశ పరీక్షల (సెట్) కమిటీ సమావేశాల్లో చర్చించి పలు వినూత్న సంస్కరణల అమలుకు ఆమోదం తెలిపారు.

తెరపైనే మార్కులు: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)గా పిలిచే ఆన్‌లైన్ పరీక్ష సమయం ముగియగానే విద్యార్థి ఏమీ చేయకుండానే కంప్యూటర్ ఆగిపోతుంది. తెరపై పరీక్ష ప్రశ్నాపత్రం కనిపించదు. సబ్జెక్టుల వారీగా ఎన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు గుర్తించారు.. ప్రాథమిక కీ ఆధారంగా మొత్తం ఎన్ని మార్కులు వచ్చాయో.. కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపిస్తాయి. తుది ర్యాంకు మాత్రం చివరి కీతోపాటు పలు విడతలుగా ఆన్‌లైన్ పరీక్షలు జరుగుతున్నందున నార్మలైజేషన్ విధానాన్ని అమలు చేసి వెల్లడిస్తారు.

మరికొన్ని నిర్ణయాలు: ఎప్‌సెట్, పీజీఈసెట్‌కు ల్యాప్‌టాప్, కంప్యూటర్ల ద్వారానే దరఖాస్తు చేసుకునే విధానం ఉండేది. ఈసారి స్మార్ట్‌ఫోన్ల నుంచి కూడా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాలని నిర్ణయించారు.